భారతి

సాహిత్య మాసపత్రిక
అక్టోబరు 1980

ఎవరు అన్నమాచార్యులు?
వేంకట సుబ్రహ్మణ్యము

గ్రేహమ్ గ్రీన్
రామారావు

చాసో కథలు
సుదర్శనం

వైరుధ్యం
లీలామోహనరావు

నిర్వాణగీతి
నరసింహమూర్తి

అపూర్వ కాకలి
జోగారావు

ఆనందగజపతి దుర్గాస్తుతి

ఇంకా సంపత్కుమారాచార్య, దినకర్, ప్రత్యూష, శివకుమారశర్మ, సోమరాజు, శ్రీనివాసులు, కాంతారావు, రంగస్వామి, పురుషోత్తం, ఆనందనరసింహులు, శాస్త్రి, సూర్యనారాయణ, మిరాశీ, సుబ్బారావు, రఘునాథరెడ్డి, మూర్తి, హన్మంత్రావ్ ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

అక్టోబరు 1980

సంపుటము : 57 సంచిక : 10

విడిపత్రిక వెల రెండు రూపాయలు

విషయానుక్రమణిక

అక్టోబరు 1980

నిర్యాణ గీతి

డాక్టర్ యం. ఎ. నరసింహమూర్తి

కవులు కొందరు పాటలు కట్టినారు
జన నెదలోపలి యెదవై యాంధ్ర జనత
కెల్ల వదలని కోరిక లల్లిన కవి
కృష్ణశాస్త్రి—దేవులపల్లి కృష్ణశాస్త్రి
అనుచు నాబాల గోపాల మందురయ్య!

అర్థమైనను కాకున్న హాయిగూర్చు
భావగీతము లన్నంత బాపిరాజు
వేదుల బసవరాజును విశ్వనాథ
నీవు నండూరి నాయని నిలువగలరు
తెలుగు గుండెల నిండిన వెలుగు లగుచు.

అపుడు పుట్టియున్న నదియె గొప్పయనుచు
కృష్ణరాయల స్మృతుల కాంక్షించినావు
అపుడు గాకున్న నీవున్న యప్పుడైన
పుట్టినామని గర్వమ్ము నందగలము.

మోయలేని తీయదనపు హాయిమాకు
విడచి, ఎనుబది రెండేళ్ల విడిది మఱచి
ఎడతెగని యాత్ర యుంచూరకే విసిగి వి
సిగి పరుగులెత్తి నటరాజు చేరినావు.

ఒక్క నయనమ్ముకాదు మహోగ్రదుఃఖ
వాహినులు పొంగి పొరలాడ వాడవాడ
చెమ్మగిల్లిన మా రోదనమ్ములకిక
నీవె యవనిక వైతివి నేటి కకట!

నీకు గలవన్న దుఃఖంపు నిధుల నన్ని
తెలుగు గుండెల పాతరల్ తీసిపోసి
తిమిరలోకాల నానంద తీర్థమాడు
కొత్త యనుభూతి సంకెలల్ గూర్చినావు.

కలలు సెలయేళ్ల చుక్కలు కమ్మవిరులు
అలలు వెన్నెలలు మురళికా లహరులు
మావిగున్నలు మధుమాస మంత్ర ఝురులు
చిన్నబోయినవయ్య మాకన్న నేడు.

"ఏది మరియొకమారు"* నీ ఇరుల గుసగు
సలు నిదుర తొణకుటలు అలల గల గల
లు కలల కదలికలు చవులూర కవిత
లూది కృష్ణగానామృతా లొద్దుమయ్య.

ఇచటనే ఆగిపోదును ఇటనె దాగి
పోదును కలకాల మనుచు బూటకములు
పలికి మాయమయ్యెద నను పలుకె ఖాయి
పరచి వెడలిపోతివి దూరతీరములకు.

మూగ నయ్యెద నేనంచు మురిసినావు
ఒక్క గొంతుక లేకున్న లెక్కయేమి?
కోటి గొంతుల నీపాట లుట్టలూరి
తేనె జడివాన లాయెను తెలుగు నేల

వంత కథలకు రాణివై తిమిరపు
కోట దుఃఖాగ్ని కేతన కోటి నిలిపి
ప్రేమ నీరేడు లోకాల పిలిచి పిలిచి
అచ్చరల చిరునవ్వు నీవైతివయ్య.

---

* "కరుణశ్రీ"కి కృతజ్ఞతలతో.

ఇదే సమైక్య భావన!
ఇదే సమరస జీవనం!!

డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తం

ఆర్ష భారతీయుడెప్పుడు
అల్ప మనస్కుడు కాడు;

నా ఇల్లు నా ఊరు
నా భార్య నా బిడ్డలని
నాల్గు గోడలమధ్య
నలిగేవాడు కాడు

పిపీల విహాయసం కన్న
విస్తృత మనసి భావ వీధి

ఏ నదిలో స్నానం చేసినా
ఏ తీర్థంలో క్రుంకులిడినా
ఏ కూపోదకాలు పోసుకున్నా
గంగలోనో! యమునలోనో!!
గోదావరిలోనో! సరస్వతిలోనో!!
నర్మదలోనో! సింధువులోనో!!
స్నానమాడినట్లు భావిస్తాడు.

'గంగేచ యమునే చైవ
గోదావరి సరస్వతీ
నర్మదా సింధు కావేరీ
జలేస్మిన్ సన్నిధిం కురు'
అనే శ్లోకం పఠించందే
స్నానమాడే వాడు కాడు.

దేవతాకోటిని తాను
అనంతంగా సృష్టించుకొన్నా
తాను చేసే నమస్కారం
ఆ నారాయణుడికే

అందుకు ప్రకృతిలోని
అందమైన సాదృశ్యం అందుకొంటాడు;
'ఆకాశంనుండి పడే తోయం
సాగరానికి చేరినట్లే' అంటాడు

''ఆకాశాత్పతితం తోయం
యథా గచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారః
కేశవం ప్రతిగచ్ఛతి''

తానే పుణ్య నగరాలు చూచినా
అయోధ్యను కాశిని
కంచిని అవంతికను
కాంచినంత సంతృప్తి

ఇదే సమైక్య భావన!
ఇదే సమరస జీవనం!!

సంధ్య వార్చడం ప్రారంభిస్తూ
మొట్ట మొదటగా తాను
జంబూద్వీప వాసుడ్నంటాడు
ఆమీదనే భారత వర్షానికి,
మేరుపర్వతం దక్షిణ దిక్కుకో
ఉత్తర దిక్కుకో చెందుతానని
తన ఉనికిని పేర్కొంటాడు.

ఎప్పుడూ తన్ను ఒంటరిగా
కూపస్థ మండూకంగా ఉండనీదు;
నిరంతరం బ్రాహ్మణ హరిహర
సన్నిధిలో వర్తించే, ఉన్నత జిజ్ఞాసువుగా
ఉట్టంకించు కొంటాడు.

ఇదే సమైక్య భావన! ఇదే సమరస జీవనం!!

విశాలమయిం దాతని
మానస మందిరం;
ఎన్నో కవాటాలు దానికి
ఎన్నడూ మూత పడవ్

ఉదాత్త భావా లేదిక్కునుండి వీస్తున్నా
హాయిగా ఆనందంగా
ఆహ్వానించే వ్యక్తి కాబట్టే
"ఆనో భద్రాః క్రతవోయంతు విశ్వత"
అని ఉద్గ్రీవుడై ఉద్ఘాటించాడు.

"మిత్రస్యాహం చక్షుషా సర్వాణి భూతాని సమీక్షే
మిత్రస్య చక్షుషా సమీక్షామహే" అంటే

మిత్ర చక్షువుతో తాను విశ్వాన్ని
విలోకించే శక్తినిమ్మని
విశ్వేశ్వరునకు వినతి చేస్తాడు
ఆరీతిగానే సకల విశ్వం
తన్ను సందర్శించాలని
ఆరాట పడ్డాడు ఆనాటి ఆర్యుడు.

"సర్వేషాం స్వస్తిర్భవతు
సర్వేషాం శాంతిర్భవతు
సర్వేషాం పూర్ణం భవతు"
అనేదే ఆ ఆర్యుని ఆకాంక్ష

"లోకాస్సమస్తా సుఖినో భవన్తు"
అనేదే ఆతని అకలంక లక్ష్యం.

పాశ్చాత్య ప్రమేయం చేతనే
పాశ్చాత్య విద్యోన్నతి చేతనే
మనకి విభేద దృష్టి, విచ్ఛిత్తి
నత భావన, హత్తుకొన్నాయి.

స్వరాజ్యం వచ్చి ముప్పైయేండ్లయినా
మనమీ ముప్పునుండి తప్పుకోలేదు

ఇంకా నానాటికి ఈ మార్గంలో
ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నావ్.

త్రికరణశుద్ధికి తిలోదకాలిచ్చావ్
ఆచరణానికి స్వస్తి చెప్పేవ్
వేదికలమీదమాత్రం
వల్లిస్తాం ఆదర్శాలెన్నో!

భారతీయులంతా ఒకజాతివారని
ప్రలాపిస్తూనే
కులమేమిటి? గోత్రమేమిటని?
గుసగుసలాడుకొంటావ్
వాటినిచూచే ఓటువేస్తాం.

దేశమాత వక్షస్థలం
తీవ్రంగా వక్కలు చేస్తూ
వసుధైక కుటుంబమని
వాదిస్తాం వేదికలమీద

ఎన్నో ఉగాదులు గడిచాయి
ఎన్నో ఉగాదులు గడుస్తాయి
మార్పులేని ఉగాది
మార్పురాని ఉగాది
ఎన్ని వస్తేనేం? ఎన్ని పోతేనేం?

"గతాను గతికో లోకః
నలోకః పారమార్థికః"

ఎప్పటికో మనకు సమైక్య దృష్టి!
ఎప్పటికో మనకు అకలంక చరిత్ర!!

ఆశతో జీవించడానికే
అలవాటుపడ్డ జీవులం
అందుకే నిరీక్షిద్దావ్
వచ్చే ఉగాది దాకా!!

(భారత ప్రభుత్వ ప్రచారశాఖ 15–3–80 వ తేది గుంటూరులో నిర్వహించిన కవి సమ్మేళనంలో చదివినది)

మళ్ళీ పాతపాటే

శ్రీ రామగిరి శివకుమార శర్మ

ఎన్నిమార్లు పాడనూ పాతపాట
  అరిగిన రికార్డుపై విరిగిన ముల్లు
నువ్వొస్తున్నావనీ, ఏదో తెస్తున్నావనీ
కల్పవృక్షానివనీ, వరాలిచ్చే దేవతవనీ
ఎన్నిమార్లు పాడనూ పాతపాట.

తమయింటి బూజు దులుపుకోలేనివాళ్ళు
మా యిళ్ళకు వెల్లవేస్తారంటే
నవ్వుతూ,
శైశవంలోనే
ఈ దేశానికి మమ్మల్నిచ్చి
పెళ్ళిచేసినందుకు, ఆ దేవుడిపై
ఏడుస్తూ
బ్రతికే పిచ్చివాళ్ళం.

ఆ బాధలోనే జారిపోతాం
నిరాశా సుషుప్తిలోకి.
ఏనాడో, ఎవరో వ్రాసిన వ్రాతలన్నీ -
నీటిమీద వ్రాసిన వ్రాతలయ్యాయని తెల్సి,
కలల వలలు విసరుతూ,
పెడబొబ్బల కలవరింతలు పెడ్తూ,
అందరికీ మేం
''నర్వస్ సిక్‌నెస్'' రోగిలా అగుపడ్తూ,
వెళ్ళబుచ్చుతాం కాలాన్ని.

ఇలా నువ్వొచ్చి
మమ్మల్ని మేల్కొలిపితే
నీకోసం ముడుపుగట్టి పెట్టిన
సంధులను, ఛందాలను,
సమాసాలను, ప్రాసలనూ
మూటగట్టి నీకిచ్చేస్తాము.

నీమీది ఆశతో మేం
ఎన్నిమార్లు,
ఉదయాలను ఉచ్ఛిష్టం చేయలేదూ ?
సూర్యులను ఎన్నిమార్లు ''రేప్'' చేయలేదూ ?
ఇపుడు నువ్వొచ్చావ్.
పెడబొబ్బలతో బొంగురు పోయింది కంఠం.
ఈ బొంగురు కంఠంతో
ఎన్నిమార్లు పాడనూ పాతపాట
ఈ వంధిమాగధత్వాన్ని ఎన్నిమార్లు
స్వీకరించనూ ?
జీర్ణమైన శ్రీముఖంపై
శిలాక్షరాల నెలా నిలుపనూ ?

అదుగో
అటు చూడు
ఆ ''ఫుట్‌పాత్'' పై
ఒంటేకున్న ఒంటిచిరను,
దబ్బనంలాంటి సూదితో,
కుట్టుకుంటున్న
అస్తినాస్తి విచికిత్సా శాతోదరి.
ఇదుగో
ఇటు
చైతన్యాన్ని చెప్పుల్లో అరగదీస్తున్న యువకులు.
ఇంకెన్నో
గుడిసెలల్లో, ఎదకు అభిషేకం చేస్తున్న
మలినాశ్రువులు ఎన్నో ?

అయినా, మేం మానవులం
ఆశ మా సహజగుణం.
రేపటి కొండలను ''బైనాక్యులర్స్''తో
నేటి ఇసుకరాళ్ళను ''మైక్రోస్కోప్''తో
చూడడం మా గుణం.
అందుకే ఎంత పంతంఉన్నా,
మళ్ళీ పాతపాటే ఎదురైనా,
మళ్ళీ పాతపాటే పాడుతా
నీకు విన్పించకుండా.

శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము

ఎవరు తాళ్ళపాక అన్నమాచార్యులు?

పెద్దల నిర్ణయం - ఆనాడు

తాళ్ళపాక అన్నమాచార్యుల సాహితీ విశేషాలు తెలిసికోవలెనన్న జిజ్ఞాసతో అజ్ఞాతంగా శ్రమించుకొనుచున్న శ్రామికుడను మాత్రమే నేను. తిరుపతిలో అన్నమాచార్య కళామందిరంలో జరిగే కార్యక్రమాలు నేను తిరుపతికి వెళ్ళినపుడు చూడడం అలవాటు. అందు వేదికపై ఎదురుగోడకు నిలువెత్తు నిల్పిన చిత్రపటాన్ని చూచినపుడు దాన్నిగూర్చి నాకు కల్గిన సందేహం, అచ్చట పెద్దలైన కొందరితో ముచ్చటించాను. వారిలో కొందరు "అది అంతేనేమో!" అన్నారు మరికొందరు "అదికాదు" అన్నారు. ఆ చిత్రంపై కొంత పరిశీలనాత్మకమైన వివరణము అవసరమని తోచి నా సందియము, అభిప్రాయము, ప్రాజ్ఞలోకానికి వినయంతో విన్నవిస్తున్నాను. మన్నింతురుగాక!

ఆ శిల్ప చిత్రాన్ని బోలిన రూపకల్పనచేసి ఆ కళామందిర ముఖద్వారంపై నిల్పిన కొన్నయిని దేవస్థానమువారు అన్నమాచార్య ప్రాజెక్టు క్రింద ప్రచార సాధనంగా వెలువర్చే ముద్రణాల్లో ఆ శిల్ప చిత్రకల్పనే కన్పిస్తూండడంవల్ల, ఆ మూర్తి కల్పనను గూర్చిన జిజ్ఞాసతో అదెందుకు ఆలాచేశారో అర్థం కాదు. కొందరు పెద్దల మనస్సుల్లో మెదలిన భావం అలా చేయించిందేమో! అదే నిజమైతే ఆ రూపకల్పన సరియైనది కాదనే నా అభిప్రాయమూ, దృఢ విశ్వాసము. ఆ మూర్తి రూపకల్పనకుగల చరిత్ర తెలిసికోవడం నా జిజ్ఞాసలోని భాగం. సత్యమును విజ్ఞులన్వేషింతురుగాక!

తాళ్ళపాక వారి వాఙ్మయం తిరుపతిలో బయల్పడుటకు తి. తి. దేవస్థానంవారి సహకారంతో శ్రమించిన — శ్రమించుచున్న మహనీయులు — శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ మానవల్లి రామకృష్ణకవి, శ్రీవేటూరు ప్రభాకరశాస్త్రి, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, శ్రీ గౌరి పెద్ది రామ సుబ్బశర్మగారలు ముఖ్యులు.

తాళ్ళపాక వారికి శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామికి గల అవినాభావ సంబంధమగు చరిత్రమంతయు తమ అమూల్య పరిశోధనా ఫలితముగా వెలువడిన దానిని తి తి. దేవస్థానము వారి ఆధ్వర్యాన ప్రకాశింపజేశారు. వారి పరిశ్రమ ఒక వాఙ్మయమువరకే పరిమితము కాలేదు. ఆనాటి దేశ చరిత్రను, దేవుని మహిమా విశేషాలను, సంగీత, సాహిత్య శిల్ప నాట్యాది విశేషాలను బయల్పరచేందుకు ఉపయోగపడిన దనుటలో సందేహంలేదు. ఆనాటి శాసనాలు, సంగీత స్వరావళి కూర్చినవియు, సాహిత్య రూపాన్ని చూపినవియు, పెను శిలలు రాగిరేకులు, మూర్తులను చూపెడు విగ్రహాలు, శిల్పాలు వెలువడుట వారి కృషి ఫలితమే! వారు పొదిగిన పునాదుల పైన నేడు వారాశించిన రమణీయ సౌధ నిర్మాణము చేయుచుండుట ముదావహము.

తిరుమలలో తాళ్ళపాకవారి సంకీర్తన భండారమునకు (తాళ్ళపాక వారి అర) ఇరువైపులలో కుడివైపున తాళ్ళపాక అన్నమాచార్యుని పెద్ద కుమారుడు పెద తిరుమలాచార్యులమూర్తి, ఎడమ వైపున తాళ్ళపాక అన్నమాచార్యుల మూర్తి శిల్పములు, ఆ రూపాలకు ప్రతి రూపాలుగా ఒత్తిన రాగిరేకు సందటి మూర్తి బింబము లున్నవి. శ్రీనివాస మంగాపురం ప్రధాన గోపుర ద్వారాని కిరు వైపులనున్న మూర్తి శిల్పములు వారివే. పెద తిరుమలాచార్యుడు చేయించి ప్రతిష్ఠించిన తాతగారి విగ్రహం నేడచ్చటలేదు. ఏమైనదో! ఆ ఆలయ ప్రాంతంలో భూగర్భాన శిథిల శిల్పాలతోపాటు కూరుకొని యుండునేమో పరిశోధింపవలయు.*

వీని నిర్మాణములో కాల భేదాన్నిబట్టీ, అనాడు చెక్కిన శిల్పాచార్యుల మనోభావ బింబముల మెదలిన వారి మూర్తులను బట్టీ, పరస్పరము వానిలో భేదము గోచరించుచున్నది. వీనిలోని మూర్తి కల్పనము కొన్నిట కొంత అస్పష్టముగా గోచరించుచున్నది. తిరుమలలోని మూర్తులు, రాగిరేకున ఉబ్బెత్తున తీర్చిన మూర్తులు కొంత బాగున్నవి. ఈ ప్రకటించిన చిత్రములు శిల్పమూర్తులనుండి తీసి తి. తి. దేవస్థానమువారు ప్రకటించిన ఛాయా చిత్రములే. (చూడుడు — చిత్రాలు)

ఆ చిత్రాలలో కుడివైపునున్నది పెద తిరుమలాచార్యుడు — ఎడమ వైపున మన్నది అన్నమాచార్యులు (?) అని పైని పేర్కొన్న పెద్దలు పరిశీలించి నిర్ణయించారు. అట్లే ప్రచురించి ప్రకటించారు (చూ. అన్నమాచార్య జీవిత చరిత్ర - శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రిగారి పీఠిక పుటలు 73 నుండి76 వరకు) అది ఇది—

"సంకీర్తనభండారమనీ, తాళ్ళపాకవారి అరయనీ, పేర్కొనబడుచుండు కొట్టు సరిగా భాష్యకారుల సన్నిధికి ప్రక్కగానున్నది. స్వామి దర్శనము చేయువారు బంగారు వాకిలికడ నిలిచి ముందు చూచిన స్వామి దివ్య విగ్రహమును, గుడిచేతి ప్రక్కకేసి చూచిన భాష్యకారుల విగ్రహమును గాన గల్గుదురు. భాష్యకారులతోపాటు దర్శనీయులుగా నన్నమాచార్యుల విగ్రహము సంకీర్తన భండారము

* ఈ ఆలయ విశేషాలు మరో వ్యాసంలో సూచింపగలను.

ద్వారము ఎడమ ప్రక్కనున్నది. ఆ ద్వారమునకు గుడిప్రక్కను పెద తిరుమలాచార్యుల విగ్రహమును గానవగును. బంగారు వాకిలి దగ్గర నుండి ఒక కంట స్వామిని, ఇంకొక కంట భాష్యకారులను (చిదంబరమున కనకసభాపతిని వరదరాజులను దర్శించినట్లే) అన్నమాచార్యుని తత్పుత్రుని దర్శింపవగును. సరిగా నీ యర్థమును నిరూపించునదిగా చిన తిరుమలాచార్యుడు రచించిన సంకీర్తనమున్నది.

'అటు ముటఁ జూడబోతే నజ్ఞాని నేను
మఱుగు సొచ్చితి మీకు మహిలో నారాయణా ॥పల్లవి

నిన్ను ధ్యానముచేసి నిచ్చ నిచ్చఁ దాళపాక
అన్నమయ్య గారెదుట నదిగోనయ్యా
వన్ని ంచాతని వే చూచి పాతకులమైన మమ్ము
మన్నించవయ్యా వో మధుసూదనా ॥అ

సంకీర్తనలు చేసీ సారెఁ దాళ్ళపాకన్నయ్య
అంకెల నీ సన్నిధినే అదిగోవయ్యా
అంకించి నేవారి వాడనని దుష్టుడనైనా నా
సంకె దీఱఁ గానవయ్య సర్వేశ్వరా ॥అ

పాదాలందున్నాడు తాళ్ళపాక అన్నమయ్య మీకు
ఆదరాన ముక్తుడై అదిగోవయ్యా
ఈ దెస శ్రీ వేంకటేశ ఈ సంబంధానవే నన్ను
నీదయవెట్టి రక్షించు నెమ్మది భూరమణా' ॥అ

(అన్న – అధ్యా – 223 రేకు)

ఇట్టి మగి రెండు సంకీర్తనలు – అన్న అధ్యా. 232, 117 రే. పున్నవి.

భాష్యకారులకు వలె నన్నమాచార్యులకును విగ్రహము వెలయించి తాళ్ళపాక యరలో ప్రతిష్ఠయే జరుపవచ్చునుగాని, యీనాడన్నమాచార్యుని నట్లు పూజించుటకు స్థానపతుల సమ్మతి దొరకవలెను. ఆయన గోడమీద వారి విగ్రహము చెక్కించుటకే దొరకెనేమో! అన్నమాచార్యుని వలె గొప్ప విద్వాంసుడు, సంకీర్తనాది కర్త, మహాభక్తుడు, స్వామికగ్రహారము అనేకములు సమర్పించిన వాడునగు, పెద తిరుమలాచార్యుని మూర్తికూడ నుండ వలసినదయ్యెను. చిన తిరుమలాచార్యుడీ కొఱత తీరుటకు మంగాపురమున గుడి కట్టించి మరొక వేంకటేశ్వరస్వామినే వెలయించి ప్రతిష్ఠించి యక్కడ నాళ్వార్లతో, భాష్యకార్లతో, దేశికులతో సహా అన్నమాచార్యుని విగ్రహమును గూడఁ బ్రతిష్ఠించి పూజాపురస్కారములు కల్పించెను. తాళ్ళపాక యర ద్వారమున కిరు ప్రక్కల నున్న విగ్రహములలో నొకటి ముదివయసుది. ఇంకొకటి లేవయసుదిగా నున్నది. తాళ్ళపాక చిన్నన్న అన్నమాచార్య చరిత్ర 35 వ పుటలోనున్న వర్ణనమున కనుగుణముగానే ఆ రూప కల్పనమున్నది. ఆ వర్ణనము –

'కెలనఁ జూపట్టు సంకీర్తన పరులఁ
బిలిచి లెస్సగ వినిపించఁగా నలయు
నిపు డన్నవారలు నెడఁ బాఱఁ బాఱఁ
దిపిరి దండెలు శ్రుతుల్ తిన్నగా గూర్చి
దండిమై వెలుగొను దండెయు వాద్య
దండెయుఁ దాన నంతానంబు చూప
స్థాయి షడ్జమును బంచమమును జేసి
తాయముల్ కడు వింత డాలుగఁ జూపఁ...'

'కనకాంబరుని గుణ గణమణుల్ శ్రుతులు
గని చిక్కగొను రీతిగను కపోలములు
నత్తఱి మదిలోని హరికీర్తి మొలక
లొత్తిన గతిమన్న యూర్ధ్వ పుండ్రములు
లాలితాచ్యుత భక్తి లలన వరించు
మాలికగతి తిరుమణి కడంబులును
తలవిడు విష్ణు పాదపుఁ గప్పునప్పు
మెలుపైని కెంబట్టు మేలు కుళ్ళాయి
నరవింద నయన కృపామృత ధార
కరణిఁ జూపట్టెడు కంఠ మాలికయు
నరహరికై కంకణము గట్టియున్న
సరణిఁ జూపట్టు వచ్చల కడియములు
ధవళనేత్రుని శారదా విలాసంబు
నివసించునట్లున్న నిలువు ప్రేంఖణము
వాసుదేవుని యాజ్ఞ వడిఁ జుట్టుగొన్న
యీ సత్త్వ గుణమును నెలయు దుప్పటము'

– అ. చ. పుట 33 మరియు 35

ఈ ఆధారములతో పెద్దగా తిరుమలలోని తాళ్ళపాక వారి అర ఎడమవైపున నిల్చి కుడిచేత స్వామిని దర్శింపుడని సూచించుచు ఎడమచేత వాద్య దండెమును (ఏకనాదము) ధరించి మీటుచు సంకీర్తన మొనర్చు చిరునవ్వునున్న మూర్తినిబట్టి వయసున పెద్ద అనుటకు తగిన వాలకము శిల్పరేఖా విన్యాసమున గన్పట్టుటచే అతడు అన్నమాచార్యుడని నిర్ణయించి నిశ్చయమును ప్రకటించి ప్రచురించినారు. కుడివైపున నుండు మూర్తి లేవయసు గలదని నిర్ణయించి అతడు అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడని నిశ్చయమును ప్రకటించి ప్రచురించినారు. వారి అభిప్రాయము ననుసరించియే తి. తి. దేవస్థానముఁవారు తాము ప్రచురించిన తాళ్ళపాక అన్నమాచార్యులవారి వాఙ్మయ గ్రంథము లందు నన్నిటి యందును కుడిచేత స్వామిని చూపుమూర్తినే ముద్రించి ప్రకటించుచుండేవారు.

(మద్రాసు) తెలుగు భాషాసమితి వారి విజ్ఞాన సర్వస్వం తెలుగు సంస్కృతి–2 భాగం4లో 715 పుటయందు ఆమూర్తినే స్వీకరించి ప్రచురించారు. మా గురువర్యులు శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రి గారు తొలుత అన్నమాచార్య వర్ధంతి చేయతలపెట్టి

తిరుమల తిరుపతి దేవస్థానము వారిని ప్రోత్సహించి ఆ మహాసభలు జరిపించినపుడు ఆనాటి ఉత్సవానికై వ్రాయించి వేదికపై ఉంచిన అన్నమాచార్య చిత్రం కుడిచేయి చాచి చూపెడు చిత్రమే. (అది ఎవరు వ్రాసిరో? నేను అదేమైందో తెలియదు) ఆ చిత్రం సన్నిధినే తర్వాత వర్ధంతి సభలు జరుగుట పరిపాటియైనది. ఈ ఉత్సవాలు ఆనాడు తిరుపతిలోనున్న శ్రీ త్యాగరాజస్వామి వారి కళామండపంలో జరిగెడివి.

పెద్దల నిరయం - ఈనాడు

ఇపుడు దేవస్థానమువారి శ్రద్ధాభక్తుల ప్రేరణమున ప్రత్యేకంగా అన్నమాచార్య కళామందిరం శోభాయమానంగా వెలసివుంది. అందు వేదికపైనున్న నీలవర్ణ మూర్తి చిత్రమూ, మందిర ముఖద్వారంపై నిల్పిన సిమెంటుబొమ్మ, తత్సంబంధమై వెలువడు నేటి ప్రచార ప్రచురణంలోను — పెద్దలు సూచించిన అన్నమాచార్య మూర్తికి భిన్నమైన మూర్తి వెలసియుండుట ఆశ్చర్యము! అదేల మార్చవలసి వచ్చెనో అనూహ్యము! అన్నమయ్య పెద్ద కుమారుడు పెద తిరుమలాచార్యుని మూర్తియే అన్నమాచార్యులమూర్తి అనుట విడ్డూరమే కావచ్చు. మూల శిల్పమూర్తులను పరిశీలనగా గమనించిన తండ్రీ కొడుకుల భేదము ముదిమి లేవయసులు తెలియగలవు. అన్నమయ్యమూర్తి పొడవు, ముదివయసు — పెద తిరుమలయ్య మూర్తి కొంత పొట్టి, లేవయసు. దీనివల్లనే పెద్దలు పూర్వం తమ నిశ్చయాన్ని ప్రకటించారు.

ఇటీవల ఒకనాడు అన్నమాచార్య ప్రాజక్టునందు ప్రచార విభాగపు స్పెషల్ ఆఫీసరుగారైన శ్రీ శ్రీనివాసులు శెట్టిగారిని దర్శించి క్రింది మూర్తుల విషయం ప్రస్తావించాను. వారు చెప్పిన అంశము లివి. అది తమ నిర్ణయమేనట. ఒకనాడు తిరుమలలో స్వామిసన్నిధిని తమకైన ఆత్మోద్బోధన మనుసరించి కుడిప్రక్కనున్న మూర్తియే అన్నమాచార్యుడని నిశ్చయించి మార్పుచేయబడినదట! అదే నేటి ప్రచురణాలన్నిటా ప్రచురింపబడుచున్నదని సెలవిచ్చారు.

పూర్వులైన పెద్దల అభిప్రాయమును త్రోసిపుచ్చి ఆ విధంగా భావించి ప్రచురింపకముందే తమ అభిప్రాయం లోకానికి తెల్పి మరికొందరు విజ్ఞులైన వారి అభిప్రాయములను సేకరించి యున్నచో బాగుండెడిది. ఒకరి ఊహా నిర్ణయమే (ఆత్మోద్బోధనమే) సత్యమనుట సాహసము! లోకమున శాస్త్ర, ధర్మ దృష్టిగల పదుగురి ఊహలనుండి వెలువడిన సత్యాన్వేషణలోనిదే పరమార్థమౌనుగదా! అదే ప్రమాణమగును.

విచిత్రమైన విషయమేమనగా అన్నమాచార్య ప్రాజక్టు ప్రచార శాఖలో వెలువడు ప్రచురణలలో, ఒక విధమైన మూర్తి చిత్రము (ఎడమచేయి చాచినది)—అన్నమాచార్య సంకీర్తనల ప్రచురణ శాఖలో మరొక విధమైన మూర్తి చిత్రము (కుడిచేయి చాచినది) అన్నమాచార్యులమూర్తిగా ప్రచురిస్తున్నారు. ఆ రెండు శాఖలకు పొత్తు కుదరకున్నదేమో! ఈ విరుద్ధ ప్రచురణము లోకమున హాస్యాస్పదమనుటకు చోటగుచున్నది.

ఇటీవల 1978 సం॥న పెద తిరుమలాచార్యులు వ్రాసిన భగవద్గీత—తొలి తెలుగు భావానువాద గ్రంథం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధనాలయంవారు వెలువరించినారు. ఆ గ్రంథంలో ఎడమచేయి చాచియున్న మూర్తి చిత్రం పెద తిరుమలాచార్యులుగా గుర్తించి ప్రకటించియున్నారుగదా! ఒక మూర్తి చిత్రాన్ని ఒకచో [illegible] ఇట్లా గుర్తించుటా!



తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు



తాళ్ళపాక అన్నమాచార్యులు

పరిశీలనము - నా అవసరము

ఆ అన్నమాచార్య మూర్తి పరిశీలనమునందు నాకేమి అవసరమో మనవి చేస్తాను.

1967వ సంవత్సరమందు శ్రీ జానుమద్ది హనుమచ్ఛాస్త్రిగారి ప్రోత్సాహమున తాళ్ళపాక గ్రామస్థులు అన్నమాచార్యుల తైలవర్ణ చిత్రాన్ని వ్రాసి ఇమ్మని నన్ను కోరారు. ఆ చిత్ర రచనకై నేను యత్నించడంలో అన్నమాచార్య మూర్తి నిరూపణం చేసికోవలసిన అవసరం కలిగింది. మా మిత్రులు శ్రీమాన్ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగా రిచ్చినవి శిలామూర్తులనుండి తీసిన అన్నమాచార్య—పెద తిరుమలాచార్యుల ఛాయా చిత్రాలు రాగి రేకులోని మూర్తులు, తిరుమలలో శిలలపై తీర్చిన శిల్పాలు, మంగాపురం గోపురద్వార పార్శ్వమునన్న శిల్పాలు (చక్కగాలేవు) పరిశీలించాను. వానిలో ఒక్కొక్క దానియందు భిన్న భిన్న మూర్తుల

రూపురేఖల విన్యాసం గోచరించింది. శిల్ప ధర్మదృష్టితో చూడగా పై కనుపరచిన శిల్ప ఛాయాచిత్రాలే వాస్తవ మూర్తులుగా గోచరిస్తుంది. అవి ఆనాడున్న శిల్పాచార్యులు వారిని ప్రత్యక్షంగా చూసియున్నవారగుటచే తన్మూర్తులకు తగిన మూర్తి బింబాలను శిలలో తీర్చి దిద్దుటకు అవకాశమేర్పడి యుంటుందనుకొంటాను. ఆ కాలంలో రాళ్ళపై చెక్కిన, గీచిన, వ్రాసిన రూప చిత్రాలే నేటి కాలంలోని (Photo) ఛాయా చిత్రాలవంటివి. కనీసం వాని రూపాలనుబట్టి ఆయా వ్యక్తుల నిజరూపాలు నూటికి యాభై పాళ్ళు గ్రహించవచ్చు. దానికి శిల్పజ్ఞానంతో సూక్ష్మ పరిశీలన అవసరం.

దేవతా, పౌరాణిక సంబంధములైన స్త్రీ పురుష రూపాలకు శిల్ప, చిత్ర కల్పనలో కొన్ని నిర్దిష్టమైన నియమాలను శాస్త్రం నిర్వచించి నిర్ణయించి యున్నది. ఇవి శిల, దారు, లోహ, మృత్తికాదులలో తీర్చవచ్చు. కానీ చారిత్రక, సామాన్య జనుల విషయంలో ఆ శిల్ప, చిత్ర కల్పనాచార్యుని ప్రతిభా విశేషాలతో ఆయా స్త్రీ పురుషుల రూపకల్పనం చేయబడుతుంది. అవి కొంత భేదమాత్రంగా నిజరూపాల్ని పొందగలవు.

నేడు మనకు లభించిన చారిత్రక, సామాన్య వ్యక్తుల మూర్తి చిత్రణములెన్నో వున్నవి. అవి: శిల్పాల్లో (లోహ, శిలా, దారు) చిత్రపటములలో వున్నవి. వీనిలో రాళ్ళపై రంగులతో దిద్దినవి వున్నవి. ఇవి ఆనాటి వ్యక్తులకు సంబంధించినవని మనం విశ్వసిస్తున్నాము. ఆ రూపమూర్తులవలెనే ఆ వ్యక్తులున్నారన్నచో సత్యము కదా! ఆ వ్యక్తి రూపమూర్తిని శిల్పంలో, చిత్రంలో దిద్ది తీర్చిన ఆ కళాచార్యుని రూప నామాలు మనకు తెలియకపోయినా, అతని ప్రతిభ ఆ తీర్చిన మూర్తులలోనే వుందనుట జగమెరిగిన సత్యం. ఆనాడు కళాకారులు తమ ఊహలో తీర్చినవి దేవతలను. ఆ సంబంధులైన పౌరాణిక కథావిశేషాలలోని వ్యక్తులను మాత్రమేనని నా అభిప్రాయము. చారిత్రక పురుషులను, సామాన్య జనులను తీర్చుటలో ఆ కళాకారునికి ఊహ ఆధారమై—తాను తన కండ్లతో దర్శించిన వాడై వారియందుగల భక్తి, ప్రేమ, అభిమానము, ఇష్టములతో వారికి రూపమిచ్చి కళాజీవులుగ నిల్పినాడు. కొందరు పండితులై, కవులై తమ గ్రంథాల్లో వర్ణనాక్షర మూర్తులుగా దిద్దితీర్చినారు.

అన్నమాచార్యుల మనుమడు చిన్నన్న వ్రాసిన ద్విపద కావ్యం అన్నమాచార్య చరిత్రలో తన తాతగారి రూపురేఖలు వర్ణించి యున్నాడుగదా! ఆ సాహితీ రూపకల్పన కూడా ఆ శిల్పమూర్తులకు అనుగుణ్యంగానే వుండడం విశేషం! నా యత్నానికి అది దోహదమైందెంతో! నా చిత్రరచనకు అడుగడుగున అనేక సంశయములేర్పడినవి. అప్పుడు (1969) తి. తి. దేవస్థానమువారి ప్రాచ్య పరిశోధనాలయంలో అన్నమాచార్య సంకీర్తనలకు స్వరావళి కూర్చుచున్న సహృదయులు, సంగీత సాహితీమూర్తులు- శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఓపికతో నా సంశయములను తీర్చిన మహనీయులు!

ఆ తర్వాత నేను రచించెడు అన్నమాచార్య చిత్రాన్ని పూర్తిచేసి తాళ్ళపాక గ్రామస్థులకిచ్చాను. 13-12-1972వ తేదినాడు శ్రీ సాధుకృష్ణమూర్తి, శ్రీ బి. కృష్ణంరాజా, శ్రీ జం. గ. వేంకటసుబ్బయ్య, శ్రీ గూడూరు రంగరాజు, శ్రీ గూడూరు పెంచలరాజు, శ్రీ తాళపాక సుబ్బరావు మున్నగువారి కార్యనిర్వహకత్వంలో ఆ వూరిలో జరిగిన మహోత్సవమునందు తాళ్ళపాకలో తి. తి. దేవస్థానముల కార్యనిర్వహణాధికారులైన శ్రీ యం. చంద్రమౌళిరెడ్డిగారి అధ్యక్షతలో, శ్రీ బాబూరాం ఐ. ఎ. ఎస్. (సబ్ కలెక్టరు)గారు ఆ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అంతవరకు ఉదాసీన వైఖరితో చూడబడిన తాళ్ళపాక గ్రామం ఆనాటినుండి ప్రభుత్వము, తి. తి. దేవస్థానమువారి దృష్టిలో పడింది. అన్నమయ్య పేర ఆ గ్రామానికి కొన్ని అభివృద్ధి పనులు ప్రణాళికలు సిద్ధం చేశారట! కానీ ఏ పనీ రూపుదిద్దుకోలేదన్నచో విచారకరమేగదా! ఆ గ్రామాన్ని తి. తి. దేవస్థానమువారు దత్తత చేసికొన్నారట! సంతోషం!

కుడిచేయి చాచి చూపే ఆ అన్నమయ్య తైలవర్ణ చిత్రం మూర్తి పెద్దల అభిప్రాయం మేరకు శిల్పధర్మ రూపక్రియా భేదాలను పరిశీలించి దిద్ది తీర్చుకొన్నాను. తాళ్ళపాక వంశీయులై నేడున్న వారిలోకూడా పూర్వుల మూర్తి వికాసం కొంతవరకుండడం విశేషం! చామన చాయలో నల్లదనము, శరీరసౌష్ఠవం, విశాలమైన కనుదమ్ములు, గుండ్రని గంభీర ముద్రలో ప్రసన్నతగల ముఖం నేటి వారిలోనూ ఉన్న సహజ లక్షణాలను ఆ చిత్ర రచనకు స్వీకరించాను. స్వామికి ఎడమవైపు నిల్చి ఆ భక్తుడు స్వామిని కుడిచేత చూపి 'అదివో అల్లదివో హరివాసము' అనునట్లు రూపించుటకు నిదర్శనంగా రచించాను. ఆ చిత్రం—

పెద్దల నిర్ణయం - శాస్త్ర ధర్మదృష్టి

ఇక—అన్నమాచార్యుడు కుడిచేయి చాచి ఎడమ ప్రక్కగా నిల్చినవాడు అనుటకు కొన్ని శాస్త్ర ధర్మ విహితమైన అంశములను మనవి చేస్తాను. ఆ మూర్తులను నిల్పిన ఆనాటి పెద్దలు ఆ శాస్త్ర ధర్మవిహిత రీతి నెరుగక గ్రుడ్డిగా నిల్పినవారు కారు అనుటకు అదెంత సమంజసమగునో ప్రాజ్ఞు లెరుగుదురుగాక!

ఆ స్వామి నా స్వామి అని తన నాయకుని చూపి చెప్పడం నాయికామూర్తి సహజ స్వభావం కదా! శ్రీనివాసుని నాయకుడుగా తాను నాయికగా భావించి—

'అనుగ్రహాయ భూతానాం మానుషం దేహమాశ్రితః
భజతే తాదృశీః క్రీడాః యశ్శ్రుత్వాతత్పరో భవేత్॥'

అను భాగవత వాక్యానికి—'శృంగార రసకృష్ట చేతసః బహిర్ముఖానపి స్వపరాన్ కర్తుమితి భావః' అన్న శ్రీధరుని వ్యాఖ్యను బట్టి ఈ శృంగారము బాహ్యమైనప్పటికిని అంతర భావమున భగవత్పరమైనందున పూజనీయమే గదా! భక్తి రసాయనమున మధుసూదన సరస్వతి పేర్కొన్న నిసర్గ, సంసర్గ, ఔపమ్య, ఆధ్యాత్మ, అభి

యోగ, సంప్రయోగ, అభిమాన, సమారోప, భక్త్యుపాయముల నెన్నింటిలో క్రమంగా కడపటిదైన సమారోప భక్తిని పొందవలెను. అనగా తనయందు నాయికాత్వము, స్వామియందు నాయకత్వము ఆరోపించుకొని కామోప భోగరీతిని భావించు భక్తితో స్వామి సన్నిధి న దవలెను. ఈభక్తితత్త్వమునకు చెందినవాడు అన్నమయ్య. (చూ - అ. శృం. సంకీ. సం 26) ఆ తత్త్వమును నిరూపించు కీర్తన అతనిదే —

'కామయోగము చేసెఁ గరికి తన
ప్రేమయే దేవతా ప్రీతిగాను ॥పల్లవి

పొలుపలర సురత తాంబూల రసపానంబు
సరినాక్షి సోమపానంబుగాను
కలకలంబుల మంచి గళరసంబుల మోత
తలకొన్న వేద మంత్రముల గాను ॥కామ

పడతి తివ విరహ తాపమునఁ బుట్టిన యగ్ని
అడరి దరికొన్న హోమాగ్నిగాను
ఒడబడిక సమరతుల నుదయించిన చెమట
దడియుటే యది యవభృథంబుగాను ॥కామ

తనరఁ గుచముల రుచులు దంతాక్షత క్రీడ
నమువైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీ తిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను ॥కామ

—అ. శృం. సం. సం 12-223 రే (223 కీర్తన)

చతుర్విధ పురుషార్థములలో కామము మూడవది. పవిత్రమైనది. అందు స్త్రీ పురుషుల సంయోగమువలన యోగసిద్ధి. అది యజ్ఞము! ఆ అంశాన్నే బృహదారణ్యకోపనిషత్తు వివరిస్తున్నది.

—"యోషావా అగ్నిః। గౌతమ। తస్యా ఉపస్థ ఏవ సమిత్।
లోమాని ధూమః। యోనిరర్చిః। యదంతః కరోతితేఽం
గారా అభినందా విస్ఫులింగాస్తస్మిన్నే తస్మిన్ అగ్నౌ
వారేతో జుహ్వతి"—6-2-13

స్త్రీ పురుష సంయోగము జగత్తునకవసరము. వారే జగన్మాతా పితరులు. అది శ్రుతి విహితమై, యోగప్రదమైనది. నందికేశ్వరుడు చెప్పిన మహాంసాత్మకమగు శివా శివయోగము అదే. స్త్రీ పురుషులలో స్త్రీ పురుషుని వామభాగయని పెద్దలన్నారు. వైదిక కార్యకలాపాల్లో స్త్రీ, పురుషుని సరసను ఎక్కువగా ఎడమవైపుననే ఉండవలసినదే అను నియమముంది. వైష్ణవ వివాహ కార్యమునందు కన్యాదానంవరకు జరుగు కార్యకలాపంలో వరునకు కన్య కుడివైపున తరువాత ఎడమవైపున నుండే ఆచారమున్నదని వైష్ణవ సంప్రదాయులైన పెద్దలు చెప్పారు. కానీ, ఆ విషయం వైష్ణవాగమవేత్తలు పరిశీలించాలి. శ్రీ వేంకటేశ్వరస్వామికి పద్మావతీదేవి కుడివైపున నున్నట్లు చిత్రాలు ముద్రించారు. ఈలా వుంటే స్త్రీ కెప్పుడూ పురుషుడు లోబడి యుండువాడు అనే భావం అని కొందరంటారు

పునస్సంధానమనే కార్యకలాపంలో—

'వధూం ఉత్తరతః ఉపవేశ్య, స్వయం దక్షిణతః ఆసీనతః' —స్త్రీ ఉత్తరముగను అంటే ఎడమవైపునను, పురుషుడు దక్షిణమున అంటే కుడివైపున కూర్చుండవలెనని భావం.

క్షిప్ర పుంసవనంలో అనగా లఘువుగా చేసే పుంసవనంలో 'వధూం దక్షిణతః ఉపవేశ్య స్వయం ఉత్తరతః ఉపవేశ్య'—స్త్రీ కుడివైపు పురుషుడు ఎడమవైపు నుండవలెనట.

పత్నీ కుమారోపవేశనము:ఃగూర్చి ప్రయోగ పారిజాతంలో

'సంస్కార్యః పురుషోవాపి స్త్రీవా దక్షిణతో భవేత్।
సంస్కారస్తు సర్వత్ర తిష్ఠే దుత్తర తస్సదా॥'

స్మృత్యంతరే—

'జాతకే నామకే చైవ హ్యాన్నప్రాశన కర్మణి।
నిష్క్రమే చైవ చౌళే చ పత్నీ పుత్రస్తు దక్షిణే।
గర్భాదానే పుంసవనే సీమంతోన్నయనే తథా।
వధూ ప్రవేశ నేచ్చైవ పునస్సంధాన ఏవచ।
పూజనే మధుపర్కస్య కన్యాదానే తథైవచ।
కర్మస్వేతేషునై భార్యాం దక్షిణే తూపవేశయత్।
కన్యాపుత్ర వివాహేచ గోదానే వ్రతబంధనే।
ఆశీర్వాదేఽభిషేకేచ పత్నీతూత్తరతో భవేత్।
వాపీకూప తటాకానాం ప్రతిష్ఠానాం మహోత్సవే।
వ్రతాదౌ శాంతికే చైవ పత్నీస్యా దుత్తరే సదా।
శాంతికేషు చ సర్వేషు ప్రతిష్ఠోద్యాపనేషు చ।
వామే తూ పరిశే తృప్తి వ్యాఘస్య వచనం తథా'॥

—సంస్కరింపదగినది పురుషుడైనను, స్త్రీ యైనను, దక్షిణ భాగమున నుండవలెను. సంస్కారకుడు ఉత్తర దిక్కున నుండవలెనని ప్రయోగ పారిజాతమున చెప్పబడినది.. స్మృత్యంతరమునందు జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం, నిష్క్రమణం, చౌలం, అను కర్మలందు పత్నీపుత్రులు దక్షిణ భాగమున నుండవలెను. గర్భాదానము, పుంసవనము, సీమంతోన్నయనము వధూప్రవేశము, పునస్సంధానము, మధుపర్కపూజనము, కన్యాదానము అనెడి కర్మలందు దక్షిణ దిక్కున భార్య కూర్చుండవలెను. కన్యాపుత్రుల వివాహములందు, వ్రత బంధనమునందు, ఆశీర్వాదమునందు, అభిషేకమునందు, భార్య ఉత్తర దిక్కునం దుండవలెను. వ్రతాదులందును, శాంతిక వ్రతమునందును, భార్య ఉత్తరమున నుండవలెను. సర్వవిధములైన శాంతికములందును, ప్రతిష్ఠోద్యాపనములందు భార్య వామభాగమున కూర్చుండవలెను.

అన్ని వర్ణములవారియందును, మతములవారియందును స్త్రీ పురుషునికి ఎడమవైపుననే నుండు సంప్రదాయము సహజంగా

వుందని తెలియుచున్నది. కొన్నింట తప్ప ఎక్కువగా ఆ సంప్రదాయాన్నే నియమంగా పేర్కొంటున్నవి.

ఏకశయ్యాగతులైనపుడు స్త్రీ పురుషులలో స్త్రీ పురుషునకు ఎడమవైపుననే శయనింపవలెననీ, అది ప్రేయాధర్మమని, అట్లాయినపుడు కామోద్దీపనం ఇరువురియందు ఎక్కువయనీ కామశాస్త్రాదులు తెల్పుచున్నవి.

'వామాంకే రతికేళి సంకుల రణారంభే తయా సాహస
ప్రాయం కాంత జయా యుకించి దుపరి ప్రారంభియన్సం
భ్రమాత్,
నిష్పందా జఘనస్థలీ శిథిలితా దోర్వల్లి రుత్కంపితం
వక్షోమీలిత మక్షిపౌరుష రసః స్త్రీణాం కుతస్సిధ్యతి?'
—జయదేవ గీతాగోవిందం

—రాధ శ్రీకృష్ణుని వామాంకము పై వసించి తటాలున రతి కేళియనెడి మహా సమరమునందు కృష్ణుని జయింపవలెనని, సాహసంతో లేచి ఉపరిసురత మారంభించెను. కానీ అపుడు రాధ జఘన ప్రదేశము చలింపకుండెను. బాహులంతయు కదలలేకపోయెను. రొమ్ము అదిరెను. కన్నులు మూతవడెను. అది అంతేకదా! స్త్రీలకు పౌరుష రసమెట్లు లభించును ?

'వామాంకే (స్థితయా) తయా'—రతి క్రీడయందు స్త్రీ పురుషుని వామాంకమునందున్నచో పురుషునకు కామము మిక్కుటమట! యోగసిద్ధాంతము ననుసరించియు, స్త్రీ పురుషుని వామాంకమునుండి పరస్పర సుఖములు అభిముఖముగ సమీపగతమైనపుడు సూర్యనాడీ ప్రభావమున వారిలో కామోద్దీపనశక్తి అతిశయించునట !

శారదా తనయుడు సెలవిచ్చినట్లు 'సౌఖ్యాభిమాన సంకల్ప ఫలవాన్ కామయిష్యతే' — కామమొక మహాసంకల్పము. కామము మూలంగా మోక్షమనుటలో శివశక్తి సామరస్యము భావించుట తగును.

'శక్తి సంగమ సంక్షుబ్ధ శక్త్యావేశావసానికం
యత్సుఖం బ్రహ్మతత్త్వస్య తత్సుఖం స్వాక్యముచ్యతే'

అని విజ్ఞాన భైరవుని తంత్రవాక్యం. పురుషుడు స్త్రీ సంగానందమును పొందిననే పర్యంకితంగా పరబ్రహ్మానంద మనుభవింపకుండునా? ఆ ఆనందము ఆత్మీయమే అగు. శివశక్త్యాత్మకమైన సముల్లాసమే కామసిద్ధికి సంవిధానము.

'వ్యక్తా వ్యక్త స్వరూపనా—వ్యాప్యకృత్స్నం జగత్ప్రితా'
అని కదా ఆర్యుల మాట! ఆ భావమునకు ఈ చరాచర జగత్తు సాక్ష్యము. శివశక్తుల అద్వయమైన సామరస్యమే అంతటా అన్నిటా గోచరించును. వారి అఖండానందానుభూతి సత్యము, నిత్యము, సుందరమై కామపురుషార్థమున కాధారపీఠమైయున్నది పురుషుని ఆనందమయాత్మ ప్రకృతి సౌందర్యాభిలాషియై యుపాసించి ఏకమైనట్లే ప్రకృతియు తదానందానుభూతికై పురుషుని చేరుట స్వభావ సిద్ధమగుగదా! వైదిక తత్త్వవిహితము కాని శైవ, వైష్ణవ తంత్రములందును, వామాచారములందును, స్త్రీ పురుషుని ఎడమవైపున నుండవలెనని సూచింపబడియున్నది.

'వామే రామా, రమణ కుశలా దక్షిణే పానపాత్రం।
మధ్యేన్యస్తం మరిచ సహితం సూకర స్యోష్ణమాంసమ్...'

అని కౌలావలీవాక్యం—'కామేశ్వరాంక నిలయా' —అని కామకలా విలాసం.

భాగవత సంప్రదాయాను బద్ధమైన వైష్ణవ భక్తిసిద్ధాంతములలో-శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అను తొమ్మిది విధాలుగా భక్తి నిర్వచింపబడియున్నది. తన్మయం, పరమవిరహం అనునవి రెండు చేర్చి పదకొండు విధాలని కొన్నిట చెప్పబడినది.

కామపురుషార్థాత్మకమైన శృంగార రసావలంబనము గు భక్తి భావంలో భగవంతుని ఆరాధించే విధంలో స్త్రీ స్వభావాన్ని పురుషుడు ప్రకటించడంలో, స్త్రీ పురుష భావాన్ని ప్రకటించడంలో దోషంలేదు అది జితేంద్రియుత్వాన్ని ప్రసాదించి త్రివర్గ సాధనమై అలరారునది. లోక ధర్మంలో అది అనివార్యమైనా భక్తి పారమ్యంలో భక్తుడు భగవత్సాంనిధ్యమున బ్రహ్మానంద మనుభవించుచు అందు లీనమై ముక్తినొందుటే ముఖ్యం.

భక్తి ప్రక్రియలలో ఆత్మార్పణ ప్రక్రియ శ్రేష్ఠతమమను వైష్ణవ భక్తిసంప్రదాయబద్ధుడైనవాడై ఆ తత్త్వమునకే అన్నమాచార్యుడు నాయికాభావంతో శ్రీ వేంకటేశ్వరుని శృంగార కళా సామ్రాజ్యాభిషిక్తుని చేసి తాను బ్రహ్మానందమున నోలలాడ భక్తి కాంతయై ముక్తిధామమందుట కొఱకు అతని వామ భాగమున నిల్చి సంకీర్తన చేయుటాతని నిత్యకృత్యము.

భార్య ఎడమవైపునముండుట కుమారుడు కుడివైపున నుండుట మన పురాణేతిహాసములలో తెలియుచున్నది. శ్రీరామ పట్టాభిషేక వర్ణనము—

'వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్సుమిత్రాసుతః
శత్రుఘ్నోభరతశ్చ పార్శ్వ దళయో ర్వాయ్వాది కోణే
గుచు। సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో
జాంబవాన్। మధ్యే నీల సరోజ కోమల రుచింరామం
భజే శ్యామలమ్॥'—''దక్షిణే లక్ష్మణో ధన్వీవామతో
జానకీ శుభా। పురతో మారుతి ర్యస్యతన్నమామి
రఘూత్తమమ్॥''—'పశ్యన్నిష్టాంగి దీప్త్య జనక
తనయయా వామ భాగోపసేవ్యః'— ఈలా ఎన్నో!

ఈ విధానాన్నే గృహ్యసూత్రాలు సూచిస్తున్నవి. ప్రేయసి ఎడమవైపు—పుత్రుడు కుడివైపు నుండుట లోకంలో సహజ ధర్మంగా వుంది. పురుషుడు వాత్సల్యముకోరి తన కుమారుని, కుమార్తెను, కుడి తొడపై నుంచుకొనవలెనట. భార్యను చను

ర్విధ పురుషార్థము కోరి ఎడమ తొడపై నుంచుకొనవలెనట! స్త్రీ తన పుత్రీ పుత్రులను తన వామాంకమునందుంచుకొనవలెనట! సామాన్యముగు లోకధర్మమున ఇవి సహజాతములైన నియమాలుగా భాసించుట విశేషం!

నామనవి

మరొక అంశమేమన పెదతిరుమలయ్యంగారు తిరుమలలోని సంకీర్తన భండారమును పెంపు వెలుగించిన వాడుగదా! (చూ— అ. చ. పీఠిక 38 పుట, అన్న. అధ్యా. సంకీ—169 రేకు) అపుడు అనగా తన తండ్రిగారుండగనే అతనిపైగల పితృ భక్తి తత్పరతచే పెదతిరుమలయ్య తన కడనున్న శిల్పులచే తన తండ్రిగారి మూర్తిని శిల్పంలో తీర్చి దిద్దించి తమ సంకీర్తన భండారమునందే ప్రతిష్ఠించి యుండువా! శ్రీ వేంకటేశ్వరునకు ఎన్నో దానములు చేసి ఉత్సవాలు నెలకొల్పిన ఆ మహనీయునికి అచ్చట అడ్డు చెప్పువారుండరుగదా! ఆనాడు రాజాదరణలో అతనికి కొదువలేదు. కాని అతడు పెద్ద భూస్వామి. స్వయంగా కలము హలము పట్టిన కర్షకుడు. ధన ధాన్యాదులకు స్వజనులకు అతనికి కొదువలేదు. అనాథలనుండి స్వామి అర్చకులవరకు ఆయన్ను ఆశ్రయించినవారే అన్నచో అతిశయోక్తి కాదుగదా!

అన్నమయ్య క్రీ. శ. 1408-1503 వరకు జీవించి యుండినాడు. పెదతిరుమలయ్య క్రీ. శ. 1468 – 1553 వరకున్నాడు. చిన తిరుమలయ్య క్రీ. శ. 1495— వరకున్నాడు. ఇతడు తాత అన్నమయ్యచే బ్రహ్మోపదేశం పొందినాడు. అన్నమయ్య చరిత్ర వ్రాసిన చిన్నన్న అతని అన్న పెద తిరువెంగళనాథుడు క్రీ. శ. 1565 ముందుకాలం వరకుండినారు. వీరందరు క్రీ. శ. 1565 తర్వాత జీవించి యుండినవారు కారని చరిత్ర తెలుపుచున్నది.

కావున సమకాలికుడైన తండ్రిగారి విగ్రహప్రతిష్ఠ సంకల్పం కలగడం విడ్డూరంకాదు. దానికి అన్నమాచార్యుడే విముఖుడై యుండవచ్చు. దైవసన్నిధిలో జీవించియున్న భక్తుని మూర్తివిగ్రహం తన భండారమున నిల్పుట ధర్మము, భావ్యము కాదనియు, మరియు గురువర్యులైన భాష్యకారుల ఎదుట శిష్యుడనే నేని, వారిసాటియా? మనమెంతవారము? అనియు భావించి అన్నమయ్య అందుల కంగీకరించి యుండడని నేను ఊహింతును. అయినను పెదతిరుమలాచార్యుడు భండారముద్ధరించు తలంపు, తండ్రిపై భక్తి, పట్టుదల, దృఢసంకల్పము, ప్రేరణమేరకు భండారమున ముఖమునందు అతని అనుమతితో శాస్త్రధర్మమెరిగి ఎడమవైపున అన్నమయ్య శిల్పమూర్తిని శిల్పులు తీర్చిదిద్ది, తమ కాశ్రిత కల్పభూరుహమైన పెద తిరుమలయ్య మూర్తిని కూడ అభిమానము చొప్పడ కుడివైపున శిల్పమున తీర్చిదిద్ది యుంచురనుకొందును. పెద తిరుమలయ్యయే అన్నమయ్య సంకీర్తనలు తాటియాకులమండి ఆ శిల్పులచే రాగిరేకుల కెక్కించినవాడుగదా! అన్నమయ్య అలుపు నిలుపు లేక సమకూర్చిన సంగీత సాహిత్య భండారమును పెద తిరుమలయ్య తనకు కలుగు బలమున కూర్చిన భాగ్య భండారమును వెచ్చించి నిలువరింప చేసినాడు. విజ్ఞానవంతుడై శాస్త్రధర్మ విహితరీతిని స్వామిప్రియుడైన తండ్రి మూర్తిని ఎడమవైపున, స్వామికి తండ్రికి తాను వాత్సల్యమునొప్పిన వాడగుటచే తన మూర్తిని తండ్రికెదురుగా కుడివైపున నుండునట్లు నిల్పియుండనోపు. ఎట్లయిననేమి! తండ్రీ కొడుకులు తమ సంగీత భండారమున కిరువైపుల నిల్చి నిరాకారుడు, నిర్గుణుడు, నిరంజనుడునై లీలావిలాస బంధుర గుణాభివర్ణనాత్మకమైన సంకీర్తన సంపుటాలలో సంగీత సాహిత్య మాలికయందు అక్షరరూపుడై భండారమున వెలసియున్న శ్రీ శ్రీనివాసుని తమ రచనా వైదుష్యమునను, గాన కళావిలాసమునను, నాట్యవిలాసమునను సేవించి మెప్పించి మనకు నిత్యము ప్రత్యక్షముగానున్న పూజనీయులగు సజీవ శిల్పమూర్తులు!

కుడిచేయి చాచి చూపుచు ఎడమవైపు నాయికా స్థానమున మన్న అన్నమాచార్యులు—ఎడమచేయి చాచి చూపుచు వాత్సల్య స్థానమునన్న పెదతిరుమలాచార్యులు, అని పెద్దలవలె నేడు మనము భావించుటలో విపర్యయములేదు. అది సత్సంప్రదాయము.

సద్భావమున వివరింపబడిన నా ఈ అంశములను పరిశీలించి, పునరాలోచించి, తి. తి. దేవస్థానములోని పెద్దలు మన పూర్వులు చెప్పిన విధంగా ఎప్పటివలె అన్నిటా కుడిచేత స్వామిని దర్శింపుడని సూచించు దివ్యమూర్తిని అన్నమాచార్యులుగను, ఎడమ చేత స్వామిని, మా తండ్రిని దర్శింపుడని సూచించు దివ్యమూర్తిని పెద తిరుమలాచార్యులుగను ప్రకటించి, ప్రచురించి, సంప్రదాయ విరుద్ధముగా నేడున్న హానిని తొలగించి, చక్కని మూర్తులనుంచి, భక్తులకు ఎవరు తాళ్ళపాక అన్నమాచార్యులు? అను సందేహము కలుగకుండునట్లు చేయుట తమకు విధ్యుక్తధర్మము. కర్తవ్యము. కావున అటుల చేయుదురుగాక!

ఈ అంశమునుగూర్చి శాస్త్ర ధర్మాభిజ్ఞులైన పెద్దలు పరిశీలించి విశేషాంశములు లోకమునకు తెలుపవలెనని వినయమున మనవి చేయుచున్నాను.

శ్రీ కొలూరు సూర్యనారాయణ

విష్ణువర్ధనుని పెద చెఱుకూరు శిలా శాసనము

తెలుగు జాతి చరిత్ర క్షుణ్ణంగా పరిశీలించటానికి శాసనాలు ప్రముఖాధారాలనే విషయం నిర్వివాదాంశం. అందునా యీ భూభాగాన్ని సుమారు వెయ్యి సంవత్సరాలకు పైగా పాలించిన చాళుక్యుల విషయ సేకరణకి అసంఖ్యాకమైన వారి శాసనాలే మనకి ప్రమాణం. అటువంటి శాసనాల్లో అవకతవకలు కన్పిస్తే నిరాఘాటంగా సాగవల్సిన చరిత్ర రచనలో అవరోధాలేర్పడి చరిత్రకారులకొక విధమైన సంకటస్థితి కలుగుతుంది. ఈ దోషాలైనా మూలములోనివి గాక మధ్యలో నేర్పడినవైనప్పుడు చరిత్ర స్వరూపం విలక్షణాల్తో మార్పుచెందీ, వికృత సిద్ధాంతాల్కి దారితీస్తుంది. అలాంటి వివాదాస్పదఅంశాలు మిళితమైన చాళుక్య శాసనాల్లో ముఖ్యమైనది – విష్ణువర్ధనుని పెద చెఱుకూరు శిలా శాసనము.[1]

ఇది గుంటూరు జిల్లా, బాపట్ల తాలూకాలోని పెద చెఱుకూరు గ్రామము నందలి త్రివిక్రమస్వామి ఆలయపు గరుడ స్తంభమున చెక్కబడిన శాసనము. స్తంభమునకు నాలుగు ప్రక్కల విస్తరించి నూట డెబ్బైఆరు పంక్తులలో వ్రాయబడిన సుదీర్ఘపాఠము. శాసన రచయిత విష్ణువర్ధనుని విద్యాధికారియైన శ్రీపతి. ఈతడు కూర్చిన యీ శాసనమున పాఠ మంతయు సంస్కృత భాషయందే వున్నను దత్త గ్రామముల సరిహద్దులు మాత్రము తెనుగుననే చెప్పబడినవి.

1972 సెప్టెంబరు 'భారతి'లో శ్రీయుతులు ఖండవల్లి లక్ష్మీరంజనం, కొమండూరి వెంకటాచార్యులుగార్లచే యీ శాసనమందలి యంశములు, అందున్న చిక్కులు చర్చింపబడి వ్యాఖ్యానింపబడినవి. ఉద్దేశ్యపూర్వకముగనో, యాదృచ్ఛికముగనో శాసన రచయిత దీనిలో కొన్ని చిక్కులు కల్పించినట్లును, ఇందలి చిక్కులను బట్టి యిది చారిత్రకులనంతగా యాకర్షించినట్లు కన్పట్టదనియు వారి యభిప్రాయము.

ఆ శాసనము నందలి వివరము లివి :

(i) శాసనకర్త విష్ణువర్ధన బిరుదనామము ధరించిన కుముదవర్ధనుడను చాళుక్య రాజు. ఈతని తాతగారి నామముకూడ విష్ణువర్ధనుడే.

(ii) ఈతని రాజధాని రాజమహేంద్రవరము.

(iii) పూర్వ వైరమువలన కల్యాణి ప్రభువు పైనను తదాశ్రిత రాజుల పైనను జైత్రయాత్ర నిర్వహించి యుద్ధలబ్ధ పరాక్రముడైన యీతడు మార్గ మధ్యమున 'యిక్షుపురి' యగు చెఱుకూరునందు విడిసి అందలి త్రివిక్రమస్వామికి పురత్రయమును ఆచంద్రతారకముగా సమర్పించెను.

(iv) ఈ దాన శాసనము 'కల్యాద్యబ్ద గణేష్ట నేత్ర రసద [స్స]ంఖ్య' సంవత్సరమున దత్తపఱుపబడెను.

ఈ శాసనాంశముల నన్నింటిని విశదీకరించుచు, పైన పేర్కొనిన 'భారతి'లో ఒక పరిశీలక వ్యాసమున –

(i) ఇందు ప్రస్తూయమానుడైన విష్ణువర్ధను డెవ్వరు? రాజ్యకాలమేది ?

(ii) 'పూర్వ వైర మనుస్మృత్య జిత్వా కల్యాణ భూపతిం' అను శ్లోకమందలి శత్రువెవరు? కల్యాణిపుర మెక్కడిది?

(iii) శాసన కాలమేది ?

మున్నగునవి చర్చింపబడి సమాధానము లీయబడినవి. కాని ఆ విషయములలో చాల వరకు పునరాలోచనార్హములగుటయే యీ వ్యాసము వ్రాయుటకు గల కారణము.

ఈ శాసన మిచ్చిన చాళుక్య రాజు విష్ణువర్ధనుడు.

శాసనమున కన్పడు ప్రళయాదిత్యుడు, విష్ణువర్ధనుడు – అను రెండు విశేషణములను బట్టి పై పరిశోధకు లీతనిని రెండవ విష్ణువర్ధనునిగా గుర్తించిరి. క్రీ॥ శ॥ 973–1077ల నడుమ పాలన చేసిన వేంగి రాజు లెవ్వరును అంత సమర్థులు కాకపోవుటచే "జిత్వా కళ్యాణ భూపతిమ్" అని ప్రకటించుకొను ప్రతిభ రెండవ విష్ణువర్ధనునికి మాత్రమే కలదనియు, కాని యీతని కాలమునకు కల్యాణి చాళుక్య రాజ్యము లేకపోవుటచే యిందలి 'కల్యాణ' శబ్దమునకు 'కాంచి' అని యర్థము చెప్పుకొనవలెననియు, యీ శాసన రచయితకు ప్రౌఢముగా చెప్పుట, చమత్కారము ఆసక్తి యగుటచే నీ విధముగా నిగూఢముగా చెప్పియుండునని యభిప్రాయపడిరి. చాళుక్యులకు పల్లవులకు గల పూర్వ వైర మనుసరించి పల్లవులపై పగ దీర్చుకొనుటలో రెండవ విష్ణువర్ధనుడు బాదామి చాళుక్యులకు బాసటగా నిల్చి పోరాడి యుండెననుకొనుటలో పొరపాటు లేదు.

కాని శాసనమందలి యితర వివరములను బట్టి చూచినచో నీతడు రెండవ విష్ణువర్ధనుడనుట కెట్టి అవకాశమును లేదు.

రెండవ విష్ణువర్ధనుడు క్రీ॥ శ॥ 673 నుండి 682 వరకు రాజ్యపాలన చేసినట్లు శాసనాల వలన తెలుస్తోంది.[2] అతని కాలమున యివ్వబడిన ఆరుంతకూరు, చేయూరు శాసనాల్లోని ప్రశస్తులకు యీ శాసనపు ప్రశస్తికి చాల వ్యత్యాసముంది. దీనికి తోడుగా యీ శాసన మందున్న లిపి ఏడవ శతాబ్దిది కాదు. పదమూడు, పదునాల్గు శతాబ్దులలో తెలుగు దేశమందలి శాసనము లందుపయోగించిన లిపి. ఏడవ శతాబ్దపు ద్వితీయార్ధమందలి విష్ణువర్ధనునికి దీని కర్తృత్వ మూహించుట సాధ్యపడదు.

రాజమహేంద్రవరము యీ కాలమునకు లేదనుట నమ్మదగినది కాదని వీరి సంశయము. కాని మనకున్న నమ్మకములకన్న చారిత్రకాధారములు సూచించు నిర్ధారణలే చరిత్ర రచనలో ననుసరింపదగినవని భావించినచో, మొదటి అమ్మరాజు కన్న ముందు రాజమహేంద్రవర మను నగరమున్నట్లు మనకెట్టి ఆధారమును లేదు. చారిత్రక పరిశోధకులు కొందరు రాజమహేంద్ర బిరుదాంకితుడైన మొదటి అమ్మరాజే దీనిని నిర్మించినట్లు చెప్పిరి.[3] మరి కొందరి వాదములో 'కావ్యాలంకార చూడామణి' యాధారముగా రాజ రాజ నరేంద్రుడే రాజమహేంద్రవర నిర్మాత.[4] ఈ రెండు వాదములకే ఆధారమున్నది గాని మొదటి అమ్మరాజుకన్న ముందు రెండవ విష్ణువర్ధనుని కాలమునకే యిది వుండి వుండుననుకొనుట కుదరదు. అందునా రాజధానిగా యుండెననుకొనుట కసలు సాధ్యపడదు.

ఇక శాసనములో చెప్పబడిన ప్రళయాదిత్యుడు, విష్ణువర్ధనుడు అను రెండు బిరుదముల విషయము. ఇవియే యీ విష్ణువర్ధనుని రెండవ విష్ణువర్ధనుడని పొరబడుటకు కారణమైనవి. ప్రళయాదిత్యుడను బిరుదనామము రెండవ విష్ణువర్ధనునకున్న విషయము యదార్థమే అయినను అంత మాత్రమున యీ శాసన కర్త నాతడని చెప్పరాదు. పూర్వీకుల బిరుదములు వారి వంశస్థులు ఆనువంశికముగా ధరించుట విచిత్రము గాదు. గుణగ విజయాదిత్యుని కాలపు ప్రఖ్యాతిగన్న దండనాథుడు పండరంగడు కిరణ పురమును దహన మొనర్చి 'కిరణపుర దహనకర' బిరుదము దాల్పగా కొన్ని వందల సంవత్సరముల తర్వాత కూడ ఆ వంశీయులా బిరుదము దాల్చినట్లు పన్నెండవ శతాబ్దిలో అద్దంకి సీమలను పాలించిన యాతని వంశస్థుని శాసనంలో కన్పిస్తుంది.[5] ఇటువంటి వుదాహరణలు చరిత్రలో కోకొల్లలు. అందువలన ప్రళయాదిత్య నామమును బట్టి మనము నిర్ధారణ సేయుట పొసగదు. ఇక విష్ణువర్ధనుడన్న బిరుదమన్ననో యింతకన్నను బాహుళ్యమైనది. ఇదికుబ్జ విష్ణువర్ధనుని కాలము నుండి పదహారవ శతాబ్ది యనంతరమువరకు కూడ చాళుక్య పాలకులు ధరించిన వంశానుగత బిరుదమే. కనుక ఎట్టి సమాధానములతో నన్వయించి సరిపుచ్చుకొన్నను రాజధానిగా రాజమహేంద్రవరము చెప్పబడుట, దాన వస్తువు కొలతలో 'కేసరి పాటి గడ' వుపయోగింపబడుట, శత్రువుగా కల్యాణి చాళుక్యరాజు ప్రస్తావింపబడుట యీ విష్ణువర్ధనుడు రెండవ విష్ణువర్ధనుడు కాడనియు తర్వాత చాలకాలమునకు చెందినవాడై యుండవలెననియు నొక్కిచెప్పుచున్నవి. ఈతడెవ్వరిని గుర్తించుట కాస్కారముండునో పరిశీలింతము.

వేంగీ చాళుక్య సామ్రాజ్య మంతరించుటలో తెలుగు నేలలో చాళుక్య పాలన యంతమొందలేదు. మీదుమిక్కిలి శాఖోపశాఖలై చిన్న చిన్న రాజ్య భాగాను ల్యాక్రమించు కొనుచు ఆంధ్రావని నాలుగు చెరగులా విస్తరించినది. చాళుక్య చోళ, వెలనాటి చోళ ప్రాబల్యములకు లొంగియు, పరిస్థితులనుబట్టి స్వతంత్రించియు వీరి రాచరికము వర్ధిల్లెడిది. పిఠాపురము, ఎలమంచిలి, రాజమహేంద్రవరము, నిరవద్యప్రోలు మున్నగునవి కేంద్ర స్థానములుగ శాఖలు స్థాపించి వీరు పాలించినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. వీరందరును విష్ణువర్ధన బిరుదము ధరించినవారే. తమ స్వీయ నామమునకు తోడుగనో ప్రత్యేకముగనో తమ శాసనములన్నింటను విష్ణువర్ధనులమని ప్రకటించుకొన్నవారే. ఈ పెద చెఱుకూరు శాసనకర్తయైన విష్ణువర్ధనుడు కూడ నట్టివారిలో నొకడై యుండును.

ఈ శాసనమున పాఠము చాలవరకు సంస్కృతమునవేయుండి దత్త గ్రామముల సరిహద్దు వివరములు తెల్పునపుడు మాత్రము తెలుగు వాడబడినట్లు ముందే చెప్పబడినది. ఇది మధ్యయుగమున ఆంధ్రదేశపు శాసనము వ్రాయుటలోనున్న సంప్రదాయము. ఈశాసనము లిఖించుట కుపయోగింపబడిన లిపి కూడ సుస్పష్టముగా పదమూడు, పదునాల్గు శతాబ్దులకు చెందినదే. వీటన్నింటినిబట్టి యీ విష్ణువర్ధను డెవ్వరో యీ కాలమున రాజమహేంద్రవరము రాజధానిగా పాలించిన చాళుక్య వంశీయుడై యుండునని చెప్పగలము. అయినచో యీతడెవ్వరైనది తెలియవలెను.

పిఠాపుర చాళుక్యులకు పూర్వీకుడగునో కాదో చెప్పలేము గాని క్రీ॥ శ॥ 1124 ప్రాంతమున విష్ణువర్ధను డొకడు చాళుక్య చోళులకు, కల్యాణి చాళుక్యులకు మధ్య జరుగుచున్న పోరాటములలో అవకాశము చిక్కించుకొని సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజుగా రాజమహేంద్రవర ప్రాంతము ల్యాక్రమించినట్లు తెలుస్తోంది.[6] ఈతడు రాజమహేంద్రవరము రాజధానిగా చిన్న రాజ్య మేర్పరచుకొని వెలనాటి చోళుల, పశ్చిమ చాళుక్యుల కయ్యములలో తనపాత్ర నిర్వహించుచు చిరకాలము పాలించినట్లు క్రీ॥ శ॥ 1145 – 46 సంవత్సరమున యివ్వబడిన రాజమహేంద్రవర మందలి శాసనమొకటి తెల్పుచున్నది.[7] ఈ పెద చెఱుకూరు శాసనకర్త యీతడో,యీతని వంశస్థుడో యగుటకు హెచ్చు అవకాశమున్నది కనుకనే అప్పటి రాజకీయ రంగమున తమ విజయమును ఘనముగా చెప్పకొనుచు శాసనమున —

"... ... ...

88 సోపి దిగ్విజయ క్రీడాడంబరేణ క్షితీ —

89 శ్వరాన్। సకలా నపి విజిత్య ప్రత్యాగంతు

90 [ం] సముద్యతః॥ పూర్వ వైర మనుస్మృత్య జిత్వాక–
91 ల్యాణ భూపతిం। తస్య రాజ్య శ్రియం హృత్వా
92 యుద్ధే లబ్ధ పరాక్రమః॥ కిం ఛత్రై రుప శోభతే నృ
93 గపతిః కింభైరవస్యాంబరః కిం న్నందీ నతృణాం కు
94 రాపిన్త ముఖః కింనో మరుద్ధావతి చాళుా
95 క్యా న్వయ విష్ణువధన్న భవత్ప్ర త్యర్థిన్ ప్రిధ్వీ భుజాంహ్రి
96 ముద్రామప పారయంతి రహసి ప్రౌడా వరోధ
97 స్త్రియః॥ ... .

— అని పేర్కొని యుండును. ఆ సందర్భములలో నెపుడో యీ కర్మ రాష్ట్ర మందలి పెద చెఱుకూరు గ్రామమున త్రివిక్రమ స్వామిని సేవించి ఆచంద్ర తారకముగా గ్రామములు సమర్పించుట జరిగియుండును.

ఈ శాసనమున శాసన దత్త సంవత్సరము లీయబడినను అందు స్పష్టత లేకపోవుట చేతనే యింత చిక్కు కల్గినది. రాజ్యాభిషేక సంవత్సరములు గాని, శక సంవత్సరములు గాని చెప్పబడక కలి సంవత్సరము లీయబడినవి. అవియును స్పష్టముగా లేవు. ''కల్యాద్యబ్ద గణేష్ట నేత్ర రస దో [ప్ప]ంక్త్యే'' అని యున్నది. దీనిని బట్టి సంఖ్య దేల్చుట కవకాశము లేదు. చివరి స్థానములను గుణించుటకు వివరము చాలదు. అష్ట, నేత్ర, రస, దోః — సంఖ్యను స్వీకరించుటయే యుక్తమైనచో కలి సంవత్సరములు 2628 అగును. అట్లయిన యీ శాసనకర్త విష్ణువర్ధనుని కాలము క్రీ॥ పూ॥ 474నకు తేలును. ఇది అసందర్భమైన విషయము. డా॥ మారేమండ రామారావుగారీ శాసన కాలమును కలి సం॥ లలో 4928 గా భావించి పేర్కొనిరి.[8] ఇదియును సరిపడు అంశము కాదు. శ్రీమతి యశోదాదేవిగారు దీనిని క్రీ॥ శ॥ 1316 నకు చెందినదిగా భావించిరి.[9] కాని అట్లనుటకున్న ఆధారము తెలియదు. ఈ విధముగా శాసనస్థమైన విషయము సరిలేక చరిత్రకారులు వేర్వేరు విధములగు వాదము లేర్పరచిరి.

మరియొక సందర్భమున, విష్ణువర్ధనుని 'యిసు గ్రామ' తామ్ర శాసనమున కూడ కలి సంవత్సరము లిట్లే యీయబడి శాసన పరిశోధకశాఖవారిచే క్రీ॥శ॥ 1328గా గుర్తింపబడినది.[10] అది దీనికిని అన్వయించుకొనవచ్చును. ఆ సంవత్సరము, యీ శాసనము నందు చెప్పబడిన ప్రభవనామ సంవత్సరమునకు సరిపోయినది. కనుక సాధ్యమైనంతలో యీ శాసన దత్త కాలమును క్రీ॥ శ॥ 1328గా గ్రహించుట యుక్తముగనే యుండును. శాసనమందలి లిపి కూడ యీ కాలమునదే కనుక దీని కపవాదము కాదు.

తర్వాత చర్చింపదగినది శాసనమునకు సంబంధించిన మరియొక ముఖ్య విషయము. ఈ అంశమే కొంత వరకు శాసన మవకతవకగా కన్పించుటకును పరిశీలకులు పొరపాటు పడుటకును హెచ్చు అవకాశము కల్గించుచున్నది.

ఈ శాసనము 176 పంక్తుల సుదీర్ఘ పాఠము కల్గి గరుడారోహణ స్తంభమునకు నాలుగు ప్రక్కల చెక్కబడినది.

మొదటి ప్రక్క— ఒకటినుండి నలుబది యెనిమిది పంక్తుల వరకు శాసనము లిఖింపబడినది. ఈ భాగమున వంశప్రశస్తి, శాసనకర్త వివరము, అతని రాజధాని రాజమహేంద్రవరమను విషయమును తెల్పబడె ఆఖరి పంక్తులు రెండు మాత్రము శిథిలమైనవి.

రెండవ ప్రక్క — నలుబది తొమ్మిదవ పంక్తి నుండి ఎనుబది యేడవ పంక్తి వరకును వ్రాయబడినది. మొదటి పంక్తియు ఆఖరి పంక్తియు కొద్దిగా శిథిలమైనవి. ఇందున్న విషయమేదియు యీ శాసనమునకు సంబంధించినట్టిదిగా కన్పట్టదు. తీర్థ మహాత్మ్యము భగవత్ప్రశస్తియు మాత్రమిందున్నవి. మూల శాసనమున కీ భాగముతో అసలు సందర్భముగాని కలయికగాని లేదు.

మూడవ ప్రక్క - మిగిలిన శాసన భాగము మొదటి ప్రక్క శాసన భాగమునకు సందర్భోచితముగా సమరినది. ఎనభై ఎనిమిదవ పంక్తి నుండి నూట నలభైవ పంక్తి వరకు విస్తరించి శాసన రచయితను గురించియు, కలి సంవత్సరములు, క్షేత్రయాత్ర, దాన విషయము, న్యాసగీతి — మున్నగునవి చెప్పబడినవి.

నాల్గవ ప్రక్క — చివరి ఆరు పంక్తులను శిథిలమై మిగిలిన భాగమున దత్త గ్రామముల దిక్కులు, సరిహద్దులు వివరముగా వ్రాయబడినవి.

పై విషయములు పరిశీలించగా స్తంభమునకు రెండవప్రక్కనున్న శాసన భాగమునకు, అనగా నలభై తొమ్మిదవ పంక్తి నుండి ఎనభై ఏడవ పంక్తి వరకు ముప్పది తొమ్మిది పంక్తుల శాసన భాగమునకు మిగిలిన శాసనముతో సంబంధము లేనట్లును ఒకటి, మూడు, నాల్గు — ప్రక్కలనున్న శాసనము మాత్రము పై చాళుక్య విష్ణువర్ధనుని దనియు చెప్పవచ్చును. లిపి విషయమునుబట్టి గుర్తించుటకు ఒకటి, మూడు, నాల్గవ ప్రక్కలనున్న శాసన లిపి పదమూడు పదునాల్గు శతాబ్దులకు చెందినదే. కాని ప్రస్తుతనిరూపణ కావశ్యకమైన రెండవ ప్రక్క భాగము మాత్రము కాపీ తీయుటకు వీలుపడని పరిస్థితి యందున్నది. కనుక లిపి మూలకముగా యీ వ్యత్యాసము తెల్సుకొనుట సాధ్యపడదు అర్థమును పరిశీలించినచో మాత్రము రెండవ ప్రక్కనున్నది దీనికి సంబంధించని మరియొక శాసనము.

బహుశః విష్ణువర్ధనుని శాసన కాలమునాటికి ముందే అది యీ ప్రక్క నాక్రమించుకొని యుండుటతో మిగిలిన ప్రక్కలందు మాత్రమే యీ శాసనము లిఖించుట కవకాశ మేర్పడియుండును. కాక యీ పొరపాటు జరుగుటకు మరి యే యితర కారణములున్నవో తెలియదు. దీనికి సంబంధించని ఆ భాగమును కూడ యీ శాసన

మధ్య భాగముగా నిము ప్రటచే కల్గిన అస్పష్టత మాత్రము చరిత్ర పరిశీలకులకు తీవ్రమైన సమస్యగా పరిణమించు ననుటలో సందేహములేదు.

అధోజ్ఞాపికలు

1 S. I. I. vol. VI No. 202.
A. R. E. 239 of 1897.
'భారతి'. 1972 సెప్టెంబరు. పే. 13.

2 "History of the Eastern Chalukyas of vengi"– B. V. Krishna Rao.

3 "History of the Eastern Chalukyas of vengi"– B V. Krishna Rao.

4 "The Eastern Chalukyas of vengi" – Dr. N. Venkataramanayya

5 S. I. I. vol. VI No. 191.

6 "History of the Eastern Chalukyas of vengi"– B. V. Krishna Rao. p. 495.

7 A. R. E. No. 41 of 1912.

8 "Inscriptions of Andhra Desa" vol. II part I. p. 238.

9 "History of Andhra Country – Subsidiary dynasties. A. D. 1000 – 1500" Published in J. A. H. R. S. vols.

10 A. R. E. C. P. No. 13 of 1961–62.
C P. No. 1 of sewell. A. R. E. 1890 p. 2.

ఛాయస్

శ్రీ ఎస్. హనుమంతరావ్

ప్రేమ పుష్పం
  మాటున ...
నిజమే, సంఘం
ముల్లు వుంటుంది !
ఐనా... యువకా ! ...
నీకు దాని ఆలోచనా, భయం
అనవసరం –
పువ్వు నందుకునే ధ్యాసలే,
బతుకుని పరిమళ భరితం చేసుకునే దీక్షలో ...
ముల్లు గుచ్చుకునా,
రక్తం చిందించినా
నువ్ లెక్కచెయ్యవ్ ! ...
–అరె ! ... అప్పుడే
పువ్వు సంగతే మరచి,
..."అంత సూదిగా వుంటుందా
ముల్లు ? ...
అమ్మో ! ... రక్తం చిందిస్తుందా ?..."
అంటున్నావా ? ...
ఐతే,
వెళ్లు బాలకా ! ...
మీ నాన్నారు కూడా బజారు కెళ్లు !
ఆయన కొని పెట్టే ప్లాస్టిక్ ఫ్లవర్ని
నోరెత్తకుండా యింటికి తెచ్చుకుని
తృప్తిపడు !
నిజమే నీకప్పుడు
ముల్లు బాధుండదు !
...అయితే ఒక్క విషయం –
ఈ పువ్వుకి ముల్లేకాదు,
'పరిమళమూ' వుండదు మరి... !

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

చాసో కథలు: ఒక పరిశీలన

''ప్రభాతాన్నుద్దేశించి కోడి కూస్తుంది. కాకులరుస్తాయి. వర్షాగమనాన్ని సూచిస్తూ కోయిల పాడుతుంది. రేపు ఐదు గంటల ముప్ఫయ్యారు నిమిషాలకి కోడి కూయకపోయినా, కాకు లరవకపోయినా సూర్యోదయ మౌతుంది. నిబిడ నీరదాలంటూ వస్తే కోయిల పాడకండానే వర్షిస్తుంది. విప్లవబీజాలంటూ మనుషుల్లో ఉంటే కవులు వీరగేయాలు పాడాలా, వెర్రికేకలెయ్యాలా? కోళ్ళూ, కోయిలలూ, కవులూ, కాకులూ లేకపోతే ప్రపంచం ఆగిపోదు.''
('చిన్నాజీ' కథ)

ఈ వాక్యాలలో సాహిత్య ప్రయోజనాన్ని గూర్చి చాసోగారి అభిప్రాయం ఏమిటో స్పష్టంగా తెలుస్తున్నది. కళాసృష్టి, కావ్య సృష్టి ఆనందాన్ని యిచ్చినా అంతకంటే అచ్చంగా జీవించడంలోనే, క్షణ క్షణం మారే అస్తిత్వంలోనే ఆనందం ఉన్నదని ఆయన 'చిన్నాజీ' అనే కథలో తేటతెల్లం చేశారు

''రెండు రోజులు గడిస్తే చిన్నాజీ అమృతప్రాయంలో మధురక్షణాలు మళ్ళా లభిస్తాయా? రాక రాక చిన్నాజీ వొచ్చింది. కథా వొద్దు కావ్యం వొద్దు. చిన్నాజీతో ఐదు నిముషాలు షేక్స్పియరు కామెడీలో రసవంతమైన ఐదంకాల పాటి చెయ్యవూ?''

చాసో రాసిన కథల్లో చిన్న వయస్సులో పొందిన అనుభవాల ఆనందాన్ని గూర్చినవి ప్రముఖంగా ఉన్నాయి. అవి 1. బబ్బబ్బా 2. దుమ్ముల గొండి 3. బొమ్మల పెళ్ళి 4. రథయాత్ర 5. చిన్నాజీ. ఈ కథల్లో అభ్యుదయానికి సంబంధించిన సిద్ధాంతపు గొడవలూ, ఆర్థిక సూత్రాలూ కనిపించవు. ''ఎందుకు పారేస్తాను నాన్నా?'' అనే కథలో పిల్లవాడికి చదువుమీదఉన్న ఆకాంక్షే తండ్రి దారిద్ర్య పరిస్థితిని అధిగమించినట్లూ, చిట్టచివర జీవితమే ఆర్థిక సూత్రాలమీద విజయం సాధిస్తుందనీ తీర్పుయిస్తూ ముగించారు. ఇటీవలి అభ్యుదయవాదులు (విప్లవవాదులు) ఆర్థిక సూత్రాలకు పూర్తిగా దాసోహం అనేస్తున్నారు.

పై కథలో నిర్వేదంతో ఆ తండ్రి పిల్లవాణ్ణి చంపి మూట కట్టినట్టు కూడా చిత్రించడానికి పూనుకుని అటువంటి ముగింపే ''విప్లవానికి'' దోహదం చేస్తుంది అనే ధోరణిలో సమర్థించుకుంటారు నేటి విప్లవవాదులు. చాసో కథల్లో ఎటు చూచినా 'జీవితా'నికే ప్రాధాన్యం. జీవిత వాస్తవికతలో ఎంతవరకూ ఆర్థిక శక్తులకు స్థానం ఉన్నదో అంతవరకూ మాత్రమే వాటికి ప్రవేశం లభిస్తుంది.

సంప్రదాయం, సంస్కృతి, జీవితంలో అవసరమైన భాగాలు. అలంకరణా, దుస్తులూ, వగైరా మనిషికి అవసరం అయినట్లే సంస్కృతిపరమైన ఆచార వ్యవహారాలు సామాజిక జీవితానికి అందాన్నీ, అలంకరణనీ సమకూరుస్తాయి. మరోవిధంగా చెప్పాలంటే హేతుబద్ధమైన తర్కానికి అందని ఆచారాలు ఎందువలన నశింపు లేకుండా పరంపరగా వస్తూనే ఉన్నాయి? అనే ప్రశ్నకి సమాధానం : ప్రజల మూఢ విశ్వాసం, అజ్ఞానం మాత్రమే అనుకోవడం అది జీవితాన్ని గూర్చిన సమగ్ర భావన లేకపోవడమే! 'బొమ్మల పెళ్ళి' కథలో ముత్తవ్వ తన చిన్నతనంలో పెళ్ళి అనే తంతుకి చిన్నతనం మంచి ఆటల్లో ప్రారంభించి ఎలా రిహార్సలు జరిగేదో నవరిస్తుంది. ఇటువంటి 'రిట్యువల్' కోవకి సంబంధించినవే ఉత్సవం, తిరునాల వంటి సామూహిక సంరంభాలు. అవి లేకపోతే ప్రజల జీవితం లేదు. ఆనందంలేదు. నాస్తికవాదం పేరిట, మత వ్యతిరేకత పేరిట, ఇవన్నీ లేకుండా చెయ్యాలనుకోవడం, మనుష్యుల్ని కేవలం ఆర్థిక సూత్రాల మీదా, రాజకీయాలమీదా, వాణిజ్యం పరిశ్రమలు వగైరా అభివృద్ధిమీదా ఆధారపడిన ప్రగతి పథంలోనే నడిపించాలనుకోవడం, చీమల సమాజాన్ని రూపొందించాలనుకోవడం, ఈ యుగానికి చెందిన రాజకీయ విశ్వాసాలు. చాసోగారు అటువంటి విశ్వాసాలకు లోబడిన సూచన ఆయన రచనల్లో ఎక్కడా కనపడదు. బూర్జువా వ్యవస్థలో, లేక ఫ్యూడల్ వ్యవస్థలో 'దోపిడీ' (ఎక్స్ప్లాయిటేషన్) అంటే ఒకరి శ్రమను మరొకరు అనుభవించడం, ఒక వర్గాన్ని మరొకరు అణిచిపెట్టడం, లేదని కానీ, అటువంటి సిద్ధాంతం రాజకీయంగా సామాజికంగా అసందర్భం అని గానీ, అనుచితం అనిగానీ ఎవరూ అనరు. చాసోగారు కూడా సమాజంలో 'దోపిడీ'ని గురించి చక్కని కథలు వ్రాశారు. – 'కుంకుడాకు', 'పరబ్రహ్మం', 'కుక్కుటేశ్వరం', 'కొండగెడ్డ' వంటి కథలు. కాని ఈ కథల్లో కూడా పాత్రలకూ, సన్నివేశాలకూ, జీవనలీలకూ ఆయన యిచ్చిన ప్రాధాన్యం, కళాత్మకమైన విలువ, కేవలం వాటి రాజకీయ ప్రయోజనం కంటె ఎంతో ఎక్కువగా ఉన్నది. మానవ నిర్మిత సమాజంలో 'దోపిడీ'ని గుర్తించడం కంటె, ప్రకృతిలోనే అటువంటి సూత్రం యిమిడిఉన్నట్లు చాసో జీవిత దృక్పథంలో కీలకమైన నిగమనం (అబ్జర్వేషన్)గా భావించడానికి అవకాశమూ ఉన్నది. ఆయన వ్రాసిన 'మాతృ ధర్మం' గొప్ప కథ. ప్రకృతిలో దోపిడీ, హింస గొలుసుకట్టుగా ఎలా ఉన్నాయో చిత్రిస్తూనే ఏ జీవికా జీవి జీవితంలోని ఆనందాన్ని అనుభవించడంలో కూడా ఆ కథలో చూపించారు! ఇక్కడ మృత్యువు ప్రకృతి క్రమంలో ఒక అవస్థ మాత్రమే. కత్తెర గాయకుడు అనేపక్షి ముంగిసచేత చంపబడ్డాడు. అడకత్తెర

పెట్టిన గుడ్లలో రెండు గుడ్లు శత్రువులకి ఆహారం అయినా చివరిదైన మూడో గుడ్డు నుంచి మళ్ళీ జీవం బైటపడి, కొత్త కత్తెర పిల్ల పుట్టి, కాలం తిరగబడి, ఋతుధర్మంగా ఇంకో కత్తెర గాయకుడు ప్రకృతిలో విహరిస్తాడు. ఈ ఋతుక్రమానికి మూలాధారం ఆడకత్తెర నిర్వర్తించిన మాతృ ధర్మం. తిరిగీ ఆ ధర్మాన్ని నిర్వర్తించడానికి ఈ కత్తెర గాయకునితో ఆడకత్తెర విహారం మొదలవుతుంది. దోపిడీ, హింస, మృత్యువు — ఇందులో ఆనందించే ప్రాణి ఒకటైతే హింసను అనుభవించే ప్రాణి మరొకటిగా, ఒక స్థితిలో కనిపించినా, భిన్నపరిస్థితుల్లో, భిన్నసమయాల్లో హింసించే వాడే హింసింపబడేవాడూ అవుతున్నాడు. గొలుసుకట్టుగా 'దోపిడీ' సాగే ఈ ప్రకృతి లీలలో, మాతృధర్మం ఆధారభూతమై మానవ హృదయాన్ని ఆకట్టుకుంటున్నది. జీవితంపట్ల విశ్వాసానికీ అదే ఆధారం అవుతున్నది చాసోగారి జీవిత దృక్పథం మూల మట్టుగా ఈ ప్రకృతి కథలో కళా స్వరూపాన్ని దిద్దుకుంది. అన్నివిధాలా ఈ కథ చలంగారి 'ఓ పూవు పూసింది' కథతో సాటి వచ్చేలా కనిపిస్తుంది. చలంగారి కథలో సెక్సుప్రవృత్తి, మాతృత్వం, మృత్యువు ఈ మూడూ ప్రథమ స్థానాన్ని వహించాయి. జీవితాన్నీ మృత్యువునీ భిన్నంగాకాక వాటిని నిరంతర ప్రకృతిపరిణామంలో మజిలీలుగా ఆయన ఆ కథలో చిత్రించారు. చాసోగారి కథ కూడా తాత్త్వికమైన పరిపుష్టి కలిగి, ఆయన విశిష్ట దృష్టికి తార్కాణంగా నిలుస్తున్నది.

కథ, నవల వంటి ప్రక్రియల్లో నిర్మాణం (స్ట్రక్చర్), 'అల్లిక' లేక 'నేత' (టెక్స్చర్) — ఈ రెండూ ముఖ్యంగా రచనకి విశిష్టతను చేకూరుస్తాయి. ఈ రెండూ కేవలం సాదాగా ఉండే రచన పాఠకుల మనస్సుమీద ఏ విధమైనముద్రా వెయ్యలేదు చాసోగారి కథల్లో ఒక్కొక్క రచనా ఈనిశిత పరీక్షకు నిలుస్తుంది కాబట్టే అవిఅన్నీ మనస్సుకి హత్తుకుపోయేలా ఉన్నాయి. 'బొమ్మల పెళ్లి' కథ, నిర్మాణం దృష్ట్యా చాలా గొప్ప శిల్పం. ''ది గ్రేట్‌నెస్ ఆఫ్ ఆర్ట్ ఈస్ టు కన్సీల్ ఆర్ట్.''

ఈ కథలో వంద ఏళ్లనాటి జీవితవిధానాన్ని సాక్షాత్కరింపచెయ్యడమే కాదు; బాల్య స్మృతుల మధురానుభూతియేకాదు, పెళ్లి వంటి తంతు పరంపరంగా కుటుంబాల్లో ముఖ్యంగా ఆడపిల్లల ద్వారా తరం నుంచి తరానికి ఎలా అంది వచ్చేదో ఆ రహస్యాన్ని వ్యక్తం చెయ్యడమూ ఉన్నది; అంతకంటే బాల్య వివాహం ఆచారం కావడంవల్ల బాల వితంతువు అయిన ముత్తవ్వ తన వైధవ్యాన్ని ఏ దృష్టితో అనుభవించి జీవించిందో దాన్ని చెప్పడంలోనూ మన తరానికి ఆ తరానికీ గల దృష్టి భేదాన్ని ఎంతో గొప్పగా అభివ్యక్తం చెయ్యడమూ జరిగింది. ''ఆడదానికి అయిదోతనం లేకపోవడంచేత ఆడదాని బతుకంత హీనం మరొకటి లేదు'' అని ముత్తవ్వచెప్పినా, ఆవిడ డెబ్భై అయిదో ఏట పిల్లలకి కబుర్లు చెప్పడంలో కథలు చెప్పడంలో ఆమెకు జీవితంపట్ల ఎంతటి నిర్వ్యాజ ఎంతటి అపేక్ష ఉంటూ వచ్చాయో మనకి ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. ఇందులో కథ చెప్పమని అడిగే పిల్లల ఉత్కంఠ, ఒకటి చెప్పబోయి శాఖా చంక్రమణంగా ఏవేవో కబుర్లలోపడి మళ్లీ కథలోకి వచ్చే ముత్తవ్వధోరణీ చాలా సహజంగా అలవోకగా సాగే కథా కథనంవలె కనిపించినా పైచెప్పిన బహుళమైన యథాప్రవృత్తి విశేషాలవల్ల, దాని నిర్మాణశిల్పం యొక్క గొప్పతనం మనం ఊహించుకోవలసిందే !

'అల్లిక' లేక 'నేత' విషయం తీసుకుంటే చాసోగారి శైలిలో ఒక్కొక్క వాక్యం ఒక ఆణిముత్యంలా ఉంటుంది. 'కొండ గెడ్డ' కథలో చివర ''ఒళ్ళు తెలియక ఊరకుక్కలాగ మొరిగి, రేచుకుక్కలాగ పడి, జరిమానా చెల్లించుకున్నాను'' అన్న ఒక్క వాక్యంలో జరిగిన కథంతా ఇమిడి ఉంది. కాని అదే కథకు ముగింపు కాదు ! చివరి వాక్యం కథలో ఆ జరిమానా చెల్లించుకున్నవ్యక్తి విజయాన్నే నిరూపిస్తుంది. ''అయితేనేం? ఇప్పుడు జరుగుతున్నాది పబ్లిక్ ఎంక్వైరీ ... ...'' అని ముగిస్తాడు.

చాసో వ్రాసే వాక్యాల్లో సహజ కవిత్వం మెరుపులా మెరుస్తూ మనల్ని చకితుల్ని చేస్తూ ఉంటుంది.

''రథయాత్ర ఫెళ్లున విరిగిపడి సముద్రంలా పొంగిపోతోంది జనం తిరగబడి కెరటాల్లా ముందుకి కొట్టుకొనస్తూ వెనక్కివెనక్కి వెళుతున్నారు '' (రథయాత్ర)

కేవలం 'జనం సముద్రంలా ఉన్నారు' అంటే పై వాక్యాల్లోని నైశిత్యం, స్ఫూర్తి ఎలా వస్తుంది ?

''బొంగరం ముళ్ళి అంచులమీంచి కర్రని తిరిగి తికమకగా కొట్టుకుంటూ ఆగిపోయింది.'' (రథయాత్ర)

బొంగరం తిరగడంలో వేగం తగ్గి చిట్ట చివర ముళ్ళి అంచులమీదా, కర్రమీదా కొన్ని చుట్లు తిరిగి పడిపోవడం అలా వర్ణించడంలో ఆ దృశ్యం సూక్ష్మాతి సూక్ష్మంగా చెక్కడం చేసి చూపెట్టడమే కాక, ఆ అబ్బాయికి బొంగరం మీదగల మమకారం, అతని మనస్తత్త్వం - యివి కూడా పాఠకుల మనస్సుకి సన్నిహితమవుతున్నవి. ''మాతృ ధర్మం'' కథ మొదటి వాక్యాలు—''కత్తెర గాయకుడు ఏటి పొలాలకి ఎగిరాడు. నువ్వు చేలు వెన్నెల్లా పూసి వెండి గంటలు మోగిస్తున్నాయి. ఆ పువ్వుల మీది సీతాకోకను వెంటాడాడు గాయకుడు. స్త్రీ చంచల నేత్రాలలో దృష్టులు సీతాకోక ఎగురులు; కాని కత్తెర గాయకుని ఎగురులు కవి మనస్సులో ఊహించలాలు'' చివరి రెండు వాక్యాలూ చాసో సృజనాత్మక శైలికి ఉదాహరణ.

'కొండ గెడ్డ' కథా ప్రారంభం — "కనబడ్డాడా ఇంజనీరు. నాలుగు రోడ్లమధ్య నలుగురితో పంట పర్వనాశనం అయి మరి తగలబడి ఉన్నాను —" కథానాయకుడి ఆవేశం అంతా పొట్టివాక్యాల ఆ ప్రారంభంలోనే ఉన్నది. ఇంతకూ ఆ ఇంజనీరు కథానాయకుని చిన్ననాటి స్నేహితుడే! అందుకే ఆ ఆవేశం. ఇది తర్వాత తెలుస్తుంది. ఇలాగే ప్రతి కథ ప్రారంభ వాక్యాలుగాని, మధ్యలో సన్నివేశాల వర్ణన గాని, చివరి వాక్యాలు గాని, ఎక్కడ చూసినా అల్లసాని వాని 'అల్లిక జిగి బిగి'లాగ చాసోగారి శైలి అనల్ప శిల్పంతో దర్శనం యిస్తూ ఉంటుంది'

చాసో కథలు తెలుగు సాహిత్యానికి గొప్ప కానుక.

[చాసో కథల పునర్ముద్రణకు ఆ. ప్ర. సాహిత్య అకాడెమీ వారు పూనుకుంటే బావుంటుందని మనవి.]

అపూర్వ కాకలి

ఆచార్య డాక్టర్ యస్వీ. జోగారావు

ఏ యెల మావికొమ్మ నెలుగెత్తినదో యొక కోయిలమ్మ ఆ
హాయనిపించె కుహూకుహూ వా స్వర మశ్రుత పూర్వమై ననా
ప్యాయముగా పురాస్మృతి శుభాంతముగా రసరాగ భోగ సం
ధాయకమై రహించె కవితా లలితా కలమంత్ర హూతియై.

ఆ కూత సాకూతమై, నవపల్లవ
మమతా సనాతమై నవం న
వ తదీయ మధురానుభవ మహీయః కుతూ
హల రతి కూజితమై, వనేంది
రా వందన శ్లోకమై, వసంతాగమ
స్వాగత వాక్యమై, పట్టపగలు
గ్రుడ్లు గూటికివచ్చు గూబకు మేలుకొ
ల్పై తనతోడను వంతపాడ

గొంతు సవరించు కొనుచున్న గువ్వపిట్ట
కూనరాగమ్ములకు కోరి కోయిలమ్మ
యొరవడించిన వరుసయై పరిణమించె
కోకిలము పిట్ట కొంచెము కూత ఘనము.

"ఆమని నోము" నోచె నఖిలార్తవ శోభలతో నరణ్య మా
రామముగా; వనావన పరాయణ కోయిల గోలపెట్టగా
మామిడి కంటు గట్టిరట మాలి యొకొక్కడె, అల్లిపల్లవ
శ్రీ మహితాత్మ తత్ఫల రుచిం బ్రచురించె రసజ్ఞకోటికిన్.

ఆ కవితాన్వయామర మహావని కామని నామతించు నా
నా కలకంఠ శాబ నవనాయకుడై మధుపాక కాకలిన్
మ్రాకులు పల్లవింప రసరాజ్యము లేలిన తేడు నేడహో!
వాకొన నేర డూకొనడు వాక్పతి కేమి బెడంద వచ్చెనే!

కలికి పాటల కోయిల కాలము సామి
నేటికిటు మూగవోయిన నేమి వాని
గాత్ర గాంధర్వ సౌహార్ద గంధమెల్ల
పోసి యుంచిన పాటల పాటలుగలవు.

మూసలు ప్రాతలైనను అపూర్వ విధారసయోగ సిద్ధులా
పోసిన పోతలెల్ల నవి పోతలుగావు రసజ్ఞ చిత్తముల్
మోసులువారి మొగ్గతొడి పూచిన పూతలుగాని మూసినన్
వాసనలీను పొదుములు వాడని జాడయు దోచు వానికిన్.

[కృష్ణశాస్త్రి నుద్దేశించి]

డా. వి. వి. బి. రామారావు

గ్రేహమ్ గ్రీన్ - మోద తాత్త్విక దృష్టి

గ్రేహామ్ గ్రీన్ (1904 జననం) సమకాలీన ఆంగ్ల నవలా రచయితలలో ప్రముఖుడు. నోబెల్ బహుమతి నిర్ణయించవలసిన సమయాలలో ఇతని పేరు ఇటీవల వినపడుతోంది. అనతి కాలంలో గ్రీన్ ఈ బహుమానాన్ని అందుకుంటాడని విమర్శకులు ఆశిస్తున్నారు. ఆ బహుమతిని గ్రీన్‌కు ఇవ్వడం ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు నిచ్చినట్టు అవుతుంది. బ్రిటన్ ముఖ్య నిగుమతులుగా గ్రీన్ నవలలను సాహిత్యాభిమానులు, విమర్శకులు అభివర్ణించారు. అది ఆయన పొందిన ప్రాచుర్యానికీ, మూరగొన్న జనాదరణకీ నిదర్శనంగ తీసుకొనవచ్చును.

ప్రొటెస్టెంట్ మతస్థుడుగా పుట్టిన గ్రీన్ తన ఇరువది రెండవ యేట రోమన్ క్యాథలిక్ మతాన్ని పుచ్చుకున్నాడు. కొందరు విమర్శకులు ఆయనను క్యాథలిక్ రచయితగా పరిగణించినా, గ్రీన్ తనను తాను రచయిత అని క్యాథలిక్‌గా చెప్పుకున్నాడు. గ్రీన్ రచనా వైశిష్ట్యానికీ, ఆలోచనా సరళికీ, తాత్త్వికదృష్టికీ సరియైన న్యాయం చేకూర్చాలంటే అతన్ని క్యాథలిక్ రచయితగా కంటె మానవతావాది యైన భావుకునిగా, ద్రష్టగా పరిగణించడం సమంజసం. వెలుగు నిచ్చే అనేక గవాక్షాలతో ఆయన క్యాథలిసిజమ్‌నుకూడా తెరచి ఉంచాడని గుర్తించడం సముచితంగ ఉంటుంది. గ్రీన్ మత దృష్టి సంకుచిత సిద్ధాంతపరమైన మత దృష్టి కాదు. తెగలకు, జటిల సంకుచిత సిద్ధాంతాలకు అతీతమైన, విశ్వాత్మకమైన విలువలను ఇనుమడింపజేసే అవగాహనా శబలతే గ్రీన్ మతం అని చెప్పవలసి ఉంటుంది. మానవతావాదిగా ఈ మతంలోనే సంపూర్ణమైన విశ్వాసాన్నీ గాఢమైన సానుభూతితో కూడిన అవగాహనా నైశిత్యాన్నీ గ్రీన్ నవలలలో మనం చూడగల్గుతాం.

గ్రీన్ సాధించిన ఘన విజయం అతని నవలలలో ద్యోతకమయ్యే అమూల్యమైన మోద తాత్త్విక దృష్టి (కామిక్ విషన్) ఆంగ్ల సాహిత్యంలోని కామెడీ, ట్రాజెడీ అనే రెండు విభాగాలూ ముఖ్య సాహిత్య ప్రక్రియలు. కాని ఆ రెండు మాటలకూ రెండు భావాలుగా వివరణ అవసరం. కృతుల అంతం (ఎన్‌డింగ్) మాత్రమే దృష్టిలో ఉంచుకొని కాకుండా ఈ ప్రక్రియలను వాటి రసోత్పత్తి భేదాలవల్లనూ వానిలోని ప్రతిబింబించిన మౌలిక తాత్త్వికదృష్టినీ ఆధారంగా చేసుకొని ఈ మాటల వెనుకనున్న భావాలను సమగ్రంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అంతం (ఎండింగ్) రసోత్పత్తి (ఎమోటివ్ రెస్పాన్స్) మూల తాత్త్విక దృష్టి (విషన్) వీటన్నిటిని మనసులో ఉంచుకొని కామెడీ ట్రాజెడీల స్వభావాలను అర్థం చేసుకోవాలి. సంస్కృత రచనలలోను, తెలుగు రచనలలోనూ విషాదాంత ప్రక్రియ (ట్రాజెడీ) కంటే సుఖాంత ప్రక్రియకే (కామెడీ) ప్రాధాన్యత లభించింది. దీనికి కారణం సాహిత్యం మతంలోని మౌలికమైన విశ్వాసాలను ప్రతిబింబించడమే. హైందవ మతంలోని తాత్త్విక దృష్టి జీవితం ఎడల అవగాహననూ మౌలికమైన మోద దృష్టిగా రూపొందిస్తుంది. రోమన్ క్యాథలిసిజమ్ క్రైస్తవ మత శాఖలన్నింటిలోనికి ప్రాచీనమైనది. హైందవ మతానికీ ఖేదాంత దృష్టికీ ఎలా పొత్తు కుదరదో అలాగే క్యాథలిసిజమ్‌కూ ఖేదాంత దృష్టికినీ పొంతన కుదరదు. గ్రీన్ క్యాథలిక్ రచయితేనని అనుకొన్నా ఆ మతపరమైన నమ్మకములోనూ ఖేద దృష్టికి అవకాశం లేదు. ఖేదాంత తత్త్వం క్రైస్తవ మతతత్త్వానికి విరుద్ధమైనదని ఆ మతంలో విశ్వాసం ఉన్న వారికి ఏదీ ఖేదాంతం కాదని ట్రాజెడీ చనిపోయిందని విమర్శనా గ్రంథాలలో పేర్కొనడం జరిగింది. గ్రీన్ మోద తాత్త్వికదృష్టిలో లోతైన అవగాహన ద్యోతకమౌతుంది. ఖేదాంత కృతులలో మౌలికమైనది, మానవునిలోని మంచి చెడుల సంఘర్షణ, (కాన్‌ఫ్లిక్ట్) చెడు వ్యక్తిలోనిది కావచ్చు, పరిస్థితిలోనిది కావచ్చు లేదా క్యాథలిక్ సంప్రదాయాలలోని ఆది భౌతికమైనది, మానవ పూర్వమైనది కావచ్చు. ఖేదాంత కృతిలో నాయకుడు పోరాడి అంతమున జిజ్ఞాసువు అవుతాడు. వెలుగును చూస్తాడు, జ్ఞానాన్ని సంపాదిస్తాడు. కాని నాశనమైన తరువాత ఆ వెలుగు అతనికి మానసిక శాంతిని చేకూర్చడానికి పనికివస్తుంది. ఖేద ప్రవృత్తితో కూడిన రచనలకు మూలం మనిషిలోని బలహీనత. పోరాటం చివర అతని ఓటమియే అతనిగెలుపు. ఆ గెలుపే మోదాంతం, తాత్త్వికంగా ఆలోచిస్తే. ఆధునిక రచనలలో ఖేదాంతం లేదని వాదించే విమర్శకులూ ఉన్నారు. ప్రాచీన ఖేదాంత కృతులకూ, ఆధునిక ఖేదాంత కృతులకూ అవి కల్గించే స్పందనలో మౌలికమైన భేదం ఉంది. ఆధునిక కృతులలో కేవలం నైరాశ్యతే కనబడుతుందని కొందరు విమర్శకులు స్పష్టం చేశారు.

మోద తాత్త్విక దృష్టి ఖేదాంత దృష్టికంటె పటిష్టమైనది, సమగ్రమైనది, లోతైనది, విస్తృతమైనదికాబట్టి విలువైనది. జీవిత స్థితిని విశదీకరించడానికి ఖేదాన్నీ మోదాన్నీ (అది వ్యాధులనే కాక సుఖ సంతోషాలను కూడా) అవగాహన చేసుకొని జీవితాన్ని రెండింటి కలగలుపుగా చూపించిన రచనలే జీవితానికి, జీవ భావం (సెన్స్ ఆఫ్ లయిఫ్)కి దగ్గరగా ఉంటాయి. గొప్ప రచయితలు రెండింటినీ గణనలోనికి తీసుకొంటారు. హొరేస్ వాల్‌పోల్ ఒకచోట ఇలా అన్నాడు: "ప్రపంచం ఆలోచించేవారికి మోదాంతం, అనుభవించే వారికి ఖేదాంతం."

శేడ ప్రవృత్తినుంచి మోద ప్రవృత్తికి పరిణతిచెందడం మహా కవులలో కనబడుతుంది. డాంటే, ఛాసర్, షేక్స్పియర్ మహాను భావులలో ఈ పరిణతే పరిణామమే ప్రత్యక్షము గమనించారు. డివైన్ కామెడీలో డాంటెని ఇన్ఫెర్నో నుంచి స్వర్గలోకంలో మోదంగా పారడైజ్ లోనికి తీసుకువెళ్ళినది ఈ పరిణతి పరిణామమే. ఛాసర్‌ను ట్రాయిలస్‌నుంచి కాంటర్‌బరీ టేల్స్‌లోనికి, షేక్స్పియర్‌ను టైటస్ ఆండ్రోనికస్‌నుంచి టెంపెస్ట్‌కు తీసుకువెళ్ళినదీ ఇదే క్రమం.

మోదాంత కృతులలో ముఖ్యమైనది జీవితం ఎడల సమంజసమైన అవగాహన. సమంజసమైన దృక్కోణంనుంచి అసందర్భాలను, అసంగతమైన, అసంఘటితమైన, అర్థంలేని, అర్థంకాని ఉన్మాదం కలిగించే తర్కాతీతమైన అనుభవాలూ, సంఘటనలను గుర్తించేదీ దానికి కావలసిన చైతన్యాన్ని మనకు ఇచ్చేదీ మోదాంత తాత్త్వికదృష్టే. ఈ దృష్టి స్వరూప స్వభావాలను నిర్వచించడం కష్టమైనా, ఎవరికి వారు అనుభూతిచెందడం అంత కష్టమైనది కాదు. మోదాంత తాత్త్వికదృష్టి క్షమను, సహనాన్ని, అవగాహనను, సానుభూతినీ, పెంపొందింపజేస్తుంది. మానవనైజం, తద్వారా సులభ గ్రాహ్యమై మనలో ప్రేమనీ, సదవగాహననీ ఇనుమడింపజేస్తుంది. ట్రాజెడీ, కామెడీకంటె లోతైనదన్న నమ్మకం ఒకప్పుడున్నా కళాత్మకమైన మంచి రచనలన్నీ మోదాంతాలేనని చెప్పాడు జోసెఫ్ ఉడ్ క్రచ్.

రచయిత సృజనాత్మక దృష్టిలో ఖేదమోదాలు రెండూ భాగాలే. అవి ఒకదానిలో ఒకటి నిబిడీకృతమైనప్పుడు రచయిత అవగాహనకే వన్నెతెస్తాయి. వాటి మేళవింపు సంపూర్ణమైన జన్మపరమైన (క్యాథలిక్ దృష్టిలో) మానవుని పాటు (ఇన్‌వాల్వ్‌మెంట్) లోని వ్యంగ్యాత్మకతయొక్క చైతన్యాన్ని అవగాహననీ మోదాంతమైన స్థితి అని చెప్పవచ్చునని సుసాన్ లాంగర్ అనే ప్రసిద్ధ మానవశాస్త్రజ్ఞురాలు చెప్పింది. దీనిని ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే ఇలా చెప్పవచ్చు. మోద తాత్త్వికదృష్టి అంటే తెలివితక్కువతనాన్ని తెలివి తక్కువతనంలోనే క్షాళన చేయడం.

సృజనాత్మక రచయితలందరిదీ ఒకటే గమ్యం. అది భావ ప్రకటనద్వారా సంపుటితం చేయబడిన ఒక జీవభావన (హెన్రీజేమ్స్ సెన్స్ ఆఫ్ లయిఫ్ అని చెప్పాడు)ను అందించడమే నవల ఉనికికి ఆటపట్టు, అది జీవితానికి ప్రాతినిధ్యాన్ని వహించగల్గడమే. జీవితానుభూతి (ఫెల్ట్ లయిఫ్ అని సుసాన్ లాంగర్ వాడిన మాట) నవల విలువకు ఆధారం. జీవితంలోను, నవలలోను, ట్రాజిక్ రిథమ్, కామిక్ రిథమ్ ఉంటాయనీ వీటి అంతర్వాహకత్వం, సమ్మేళనంలోనే జీవితావగాహన ఉంటుందని లాంగర్ అభిప్రాయపడింది. ఈ రెండు పొంతన కుదరనివి కావు. **"The fact that the two great rhythms, comic and tragic are radically distinct does not mean that they are each other's opposites or even incompatible forms. Tragedy can rest squarely on a Comic substructure and yet be pure tragedy. This is natural enough for life, from which all rhythms spring, contains both in every mortal organism."**

మానవ జీవితం, ఉనికి (ఎక్సిస్టెన్స్) మోదాంతమన్న విషయం గ్రీన్ సృజనాత్మకమైన దృష్టిలో మౌలిక అంశం. గ్రీన్ స్టాంబూల్ ట్రెయిన్ (1932) అనే నవలకి ఉపోద్ఘాతంగా (ఎపిగ్రాఫ్)గా ఛార్జ్ సంతాయనా మాటలను వాడుకొన్నాడు: "ప్రకృతిలో ప్రతి అంశమూ దాని అవతారంలో ప్రాపంచికం, ఆత్మలో ఎప్పుడూ ఉల్లాసము, ఉనికిలో మోదాంతమూ."

మరో నవలలో ఒక పాత్ర ఇలా చెప్తాడు. "మోదాంతానికి పూర్తి ఇచ్చే ప్రపంచంలో మనం ఉంటే దాన్ని తెలుసుకోవడానికి ఎంత కాలం పడుతుందో ? మహాపురుషుల కథ తెలిసేదాకాను అంత విశ్వాసంగా ఉండగలుగుతారు. వాళ్ళ కథ అంతాన్ని చూడగల్గారు. కాబట్టే మనుషుల వ్యథను సహించుకోలేమే!" తన నవలా జీవితపు ఒక దశలో గ్రీన్ మనుష్యుల వ్యధలను మనసుకు పట్టించుకొన్నా తన పరిణతి చెందిన దశలో ఆ వ్యధలను అవగాహన చేసుకొని వాటి పూర్ణతను సంతరించుకొని పరిణతి చెంది మోదాంత తాత్త్విక దృష్టిని అలవర్చుకొన్నాడు. ఈ దృష్టి జీవితంలోని అనుబంధాలనీ, ఆ సందర్భాలనీ, హాస్యాస్పదాలనీ సృష్టిస్తుంది. గులాబీ ప్రపంచంలో ఎంత భాగమో దానిని తినేకిందనున్న పురుగుకూడా అంతేభాగమనీ, పురుగును ద్వేషించే రచయిత ఖేదాంతాన్ని వ్రాస్తే దాని సహజతని గుర్తించిన రచయిత మోదాంతాన్ని రాస్తాడని మహాకవి కీట్స్ ఒక దగ్గర చెప్పాడు.

మినిస్ట్రీ ఆఫ్ ఫియర్ అనే నవలలో రో అనే పాత్రను గురించి రచయిత ఇలా అనుకొంటాడు. "న్యాయం, శిక్షవంటి భావాలు శిల్పాలలా అతని మనసులో శాశ్వతంగా నిలచి ఉన్నాయి. నాటి పాఠం చివరకు రెమిట్‌గా (ఒక పాత్ర పేరు), వేలాది మంది లాటి రెమిట్‌స్‌గానే మిగులుతుంది. కాని నవ్వు భగవంతుడిలో, సైతాన్‌లోనూ, నమ్మితే అది అంత నవ్వు పుట్టించే విషయంకాదు. ఎందువలననంటే సైతాన్—దేవుడూ కూడా హాస్యాస్పదమైన మనుష్యులని, చేతకాని మనుష్యులని, సామాన్యమైన సంకుచిత స్వభావంగల మనుష్యులని, వారి వారి స్వప్రయోజనాలకు వినియోగించు కున్నారు. దేవుడు ఉపయోగించు కొన్నప్పుడు నువ్వు పేలవంగా ఔదార్యాన్ని గురించి మాట్లాడావు, సైతాను ఉపయోగించుకున్నప్పుడు దౌష్ట్యాన్ని గూర్చి మాట్లాడావు. కాని మూలపదార్థం రెంటిలోనూ ఎల్లప్పుడూ మందమైన, అసహ్యమైన మానవ అల్పత్వమే."

రచనా వ్యాసంగాన్ని గ్రీన్ ఒక రోగ చికిత్సా విధానం (తిరాపీ)గా ఎంచాడు. "రచనలు చేయని, సంగీతం కూర్చని, లేదా చిత్రించని వాళ్ళు మానవ స్థితిలో ఉన్న ఉన్మాదాన్ని, విచారాన్ని, ఘోరభయాన్ని ఎలా తప్పించుకోగలరోనని ఒకొక్కసారి నేను ఆశ్చర్యపడుతూ ఉంటాను" అని గ్రీన్ రాశాడు. స్వీయ రూపకల్పన సంతరించుకున్న ఈ చికిత్స అతనిలోని మాంద్యాన్నీ, ఖేదాంతదృష్టినీ తొలగించింది. జీవితం ఎడల అతని అవగాహనలో ఒక ఆరోగ్యమైన, ఆహ్లాదకరమైన మార్పును తెచ్చింది.

1974 లో 'ఎ బర్న్‌ట్ అవుట్ కేస్' (కలెక్టెడ్ ఎడిషన్)కి ఉపోద్ఘాతం రాస్తూ గ్రీన్ ఇలా అన్నాడు: "ముప్ఫయి ఏళ్ళ క్రితం అనాయిల్ (ఒక స్పానిష్ రచయిత) వ్రాసిన 'లయిఫ్ ఎండ్ డెత్ ఆఫ్ డాన్ క్విక్జోట్' ప్రత్యేకమైన శ్రద్ధ లేకుండానే చదివాను. అది నాలో జ్ఞాపకాలను మిగల్చలేదు. కాని బహుశః నేను అంత తొందరగా మరిచిపోయిన పుస్తకం నా అచేతన మనః కుహరంలో పనిచేసింది. నా చివరి దశలో నేను ఎంతో ఉద్రేకపూర్వకమైన జిజ్ఞాసతో మత శాస్త్ర గ్రంథాలు చదివాను ... "హార్ట్ ఆఫ్ ది మాటర్" నైతిక మత శాస్త్రజ్ఞులను గర్జించేటట్లు చేసింది ... నే వెళుతున్న మార్గం 'ఎ విజిట్ టు మోరిన్' లోను 'ఎ బర్న్‌ట్ అవుట్ కేస్'లోను నాకు తెలియకుండానే నాయకుడు (డాన్ క్విక్జోట్) ఖేద మోద ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడే ఉంటానని అనుకుంటున్నాను. నా మార్క్సిస్టు విమర్శకులలా నా (రచయిత) లాగే నా విశ్వాసం అవిశ్వాసంలో ప్రమేయం చేసుకొంటూ నేను వ్రాసిన అతి స్వల్పమైన పుస్తకంలో కూడా నేను మోదాంతాన్ని సూచినట్లు గ్రహించలేదు..."

ఈ విధంగా మోదాంత స్థితివైపు తన మొగ్గును గ్రీన్ బహిరంగంగా వెలిబుచ్చాడు. కాని ఇంతకుముందే కొంతమంది విమర్శకులు గ్రీన్‌లోని మోదాంత దృష్టిని గ్రహించడం జరిగింది.

కాథలిక్ వర్ల్‌డ్ అనే పత్రికలో సిరియస్ జె. రినాక్ 1957 డిశంబరులో 'గ్రీన్ దృష్టిలో పరిణతి' అన్న వ్యాసంలో ఇట గమనించాడు. "గ్రీన్ పరిణతి ఖేదాంతంలోను అనాగరికంలో లేదు. అది (ఆ పరిణతి) ఖేదాంతం మోదాంతంపై వెలుగు చిమ్ముతూ ఒక ఆనంద దృష్టిని ఇవ్వడంతో సంబంధించినది..." ఎ బర్న్‌ట్ అవుట్ కేసును సమీక్షిస్తూ కెన్యాన్ రివ్యూ (వేసవి 1961) లో ఫిలిప్ స్ట్రాట్‌ఫోర్డ్ అనే అతను గ్రీన్ దృష్టిలోని పరిణతిని గ్రహించాడు. ఈ నవలలో క్వెరీ అనాయి చెందిన పార్కిన్‌సన్ అనే తెలివి తక్కువ ధర్త వేలితో మరగిస్తాడు నవ్వుతూ. అంతు తెలియని ఈ నవ్వులో గ్రీన్ అవగాహన ఒక కొత్త ఎత్తును అందుకొంటుంది. ఈ నవలను సమీక్షిస్తూ స్ట్రాట్‌ఫోర్డ్ ఇలా వ్రాశాడు: "1950 తరువాత గ్రీన్ నవలలలోను, వినోదాలలోను ఒక క్రొత్త మోదాంత దృష్టి అంతకు పూర్వం ఉన్న ఖేదాంత దృష్టిని త్రోసిపుచ్చి దాని స్థానాన్ని ఆక్రమించుకొన్నది. ఇదే దృష్టి ఈ ఆలోచనాపూర్వకమైన (Serious) నవలలో అంతర్వ్యాహకంగా ఉంది."

ది కామెడియన్స్ (1966) నవలకు ఉపక్రమణికగా ఒక వాక్యాన్ని గ్రీన్ ఉపయోగించుకున్నాడు. "దృక్కోణాలు మనతోనే ఉన్నాయి. ఎవడు రాజుగా కనపడితే అతడే రాజు." ఈ నవలలో

బ్రౌన్ (ఒక పాత్ర) ఒకచోట ఇలా అనుకున్నాడు "జీవితం ఒక మోదాంతం — నేను సంసిద్ధుడనై ఎదురుచూచిన ఖేదాంతం కాదు. మనమంతా ఒక హాస్యగానిచే మోదాంతం వంక తరుముబడుతున్నామని నా కనిపిస్తోంది." ఈ మాటల నుదహరిస్తూ గ్రీన్ గురించి డేవిడ్ లాడ్జి ఇలా అంటాడు: "ఈ మాటలని వ్యక్తిగతమైన ఒప్పుకోలుగా (కన్‌ఫెషన్) అర్థం చెప్పకుండా అందులో దైవిక మానవ విలువల ఘర్షణతో కూడిన ఖేదాంతం నుంచి అస్తవ్యస్తమైన, మానవ ప్రవర్తనలో గజిబిజితో కూడిన వ్యంగ్యాత్మకమూ, మోదాంతమూ అయిన మోదతాత్త్విక దృష్టిలోకి పురోభివృద్ధి చెందినట్లు చెప్పే ఒక టీకగా మనము గ్రహించవచ్చును." ఈ రకమైన దృష్టి పరిణామం హార్డీ పంక్తులను గ్రీన్ మరొకచోట ఉపక్రమణికగ వాడుకోవటంలోనూ మనకు కనిపిస్తుంది. 'ది ఆనరరీ కాన్సుల్' (1976), నవలకు ఉపక్రమణికగ హార్డీ మాటలు: "అన్ని విషయాలు ఒకదానిలో ఒకటి కలిసిపోతాయి. మంచి చెడులోకీ, దాతృత్వం న్యాయంలోనికి, మతం రాజకీయంలోనికి." ఈ నవలలోనే ఒక పాత్ర ఇలా అంటాడు: "సామాన్య విశ్వాసానికి విరుద్ధంగా నిజం ఎల్లప్పుడూ నవ్వు పుట్టించేదిగా ఉంటుంది. ఖేదాంతాన్ని భావించుకోవడానికి, కనిపెట్టడానికి ప్రజలు ప్రయాసపడతారు." ఒక చలన చిత్రాన్ని సమీక్షిస్తూ 1936లోనే గ్రీన్ ఇలా వ్రాశాడు: "నిజం ఎప్పుడూ ఖేదాంతం కాదు. ఎందుచేతనంటే మనుషులు అంత ఉదాత్తమైన రీతిలో తయారుచేయబడలేదు. నిజం విచారకరం కావచ్చుగాని, నిజం నవ్వు పుట్టించేది కూడా."

జీవితం ఎడల గ్రీన్ అవగాహనలోను, దృష్టిలోను గమనార్హమైన పురోభివృద్ధీ పరిణతీ ఉన్నాయి. గడచిన గ్రీన్ రచనా జీవితంలో ముఖ్యంగా మూడు దశలు కనపడుతాయి. మొదటి దశలో కేవలం ఖేద దృష్టిలో అంతర్వాహినిగానే మోద తాత్త్వికదృష్టి కనపడుతుంది. 1938లో ప్రచురింపబడిన బ్రయిటన్ రాక్ గ్రీన్ రచనా జీవితంలో మొదటి దశను పరిపూర్తి కావిస్తుంది. ఇందులో ముఖ్య పాత్ర ఒక పదిహేడేళ్ళ 'కుర్రవాడు' (పింకీ) సైతాను మతమైన పాపాన్ని నమ్ముతూ, అనుసరిస్తూ నేను సైతానులోనే నమ్ముతాను అనుకొంటూ (క్రెడోనమ్ శాటానమ్) క్యాథలిక్‌గా మానవపూర్వమైన మౌలికమైన పాపాన్ని (ఒరిజినల్ సిన్) గుర్తుచేసుకొంటూ ఒక ఒప్పుకోలుతో పాపాలను కడిగేసుకోగలనని నమ్ముతూ మొండిధైర్యంతో దేవుని, దశాజ్ఞలనీ ఉల్లంఘించి ఘోర పాప స్థితిలో ఆత్మహత్య చేసుకొంటాడు. ఈ రచనని గ్రీన్ మొదట ఒక వినోదంగా (ఎంటర్‌టెయిన్‌మెంట్) వ్రాసినా అందులో ఉత్పాదన చేయబడ్డ మంచిచెడుల ధ్రువత్వాల బిగువువల్ల ఒక విషాదాంత నవలగా రూపొందడం గ్రీన్‌నే ఆశ్చర్యపరిచింది కాని బ్రయిటెన్ రాక్ ఒక ట్రాజెడీకాదు. ట్రాజెడీ వల్ల జరిగే క్షాళన (కథారిసిస్) ఈనవల చదివిన తరువాత జరుగదు. దీనికి కారణం ఈ రచనలో గ్రీన్ మోదతాత్త్విక దృష్టి పెల్లుబుకుటయేనని చెప్పవచ్చును. విర్రవీగి ఆకాశంలోకి ఎగరాలనుకొన్నమనిషి క్రిందపడి నడుం విరగ్గొట్టుకుంటే అది వ్యక్తికి దుఃఖాంతమైనా చూచేవాళ్ళకది విషాదాంత కృతిగ ఆమోదయోగ్యం కాకపోవచ్చు. (వాడాలని). అంతేకాదు. ఆ కుర్రవాని స్వభావంలోని వేడిగా, తలచి చేస్తున్నాననే పాపం, అతనిలోని క్యాథలిక్ ధర్మాల దృష్ట్యా (అతడు తన బాల్యంలో ఒకసారి మతగురువు నౌకానుని ప్రమాణం చేస్తాడు.) కేవలం అత్యుక్తి (ఎక్సాజరేషన్). ఇది మోద దృష్టిని స్ఫురింపజేసే సాధనాలలో ఒకటి. అతని (పింకీ) పేల రొమ్ము (పీజన్ చెస్ట్) ఇందుకే ఉపయోగిస్తుంది. గ్రీన్‌లోని ప్రధాన పాత్రలలో చాలమందికి ఏదో ఒకవిధమైన శారీరక వైకల్యం ఉండటం జాగ్రత్తగా గమనించదగ్గ విషయం. మానవ స్వభావ వైచిత్ర్యంతో నవ్వు పుట్టించి తద్వారా మనలోని అవగాహనను పెంచే అనేక కీలక సూత్రాలలో ఈ వైకల్య వర్ణనలు ముఖ్యపాత్రను వహిస్తాయి.

రెండవదశ నవలల్లో గ్రీన్ మోద తాత్త్వికదృష్టి అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో ముఖ్యమైనది ది పవర్ ఎండ్ ది గ్లోరీ (1940). ఇందులో తన వ్రతాన్ని ఉల్లంఘించి ఒక స్త్రీతో సంబంధం పెట్టుకొని తండ్రియై మద్యానికి అలవాటుపడిన "మత గురువు" మానవతావాది. అతన్ని పట్టి చంపించాలనే పోలీసు ఉద్యోగి మార్క్సిస్ట్. మార్క్సిస్ట్ భౌతిక వాదానికీ లోపభూయిష్టమైన వ్యక్తిదైనా మతగురువు ఆధ్యాత్మికవాదానికి మధ్య ఘర్షణ ఇందులోని ముఖ్యాంశం. పవర్ (శక్తి) అధికారిదైనా, గ్లోరీ (వైభవం) భగవంతునిది. వీరిద్దరిమధ్యా జరిగిన సంభాషణా, జైలు గదిలో చీకటిలో ఒకజంట మైథున కలాపమూ, అనేకసార్లు మతగురువు తప్పించుకోవడమూ చివరకు ద్రోహం జరగడమూ, మతగురువు చంపబడినా మరొక మతగురువు వివరన ప్రవేశించడమూ ఇందులో హృద్యంగమైన సంఘటనలు. ఈ నవలలో మోదతాత్త్విక దృష్టి ప్రబలంగా ఉంది. ఈ దశలో మిగిలిన నవలలకూ మూడవ దశలోని, మోద తాత్త్వికదృష్టి వెల్లివిరిసిన నాలుగు నవలలకూ మధ్య గ్రీన్ అవగాహనా బలం 1960లో ప్రచురింపబడిన ఎ బర్న్‌ట్ అవుట్ కేస్‌లో స్ఫటికీకరణ (క్రిస్టలయిసేషన్) చెందింది. ప్రతి గొప్ప రచయితలోను స్ఫటికీకరణ జరిగి, అతని దృష్టిలోని అతిముఖ్యమైన విషయం స్పష్టంగా చెప్పబడి, అతని ఆంతరంగిక విశ్వం చదువరులందరికీ స్పష్టమయ్యే క్షణం వస్తుందని గ్రీన్ తను హెన్రీ జేమ్స్ మీద వ్రాసిన వ్యాసంలో చెప్పాడు. ఈ స్ఫటికీకరణ గ్రీన్ నవల ఎ బర్న్‌ట్ అవుట్ కేస్‌లో క్వెర్రీ చనిపోతూ నవ్విన నవ్వులోనూ అతని చివరి మాటలలోనూ ఉంది. "ఇదంతా అసందర్భమో, అసంబద్ధమో లేక..."

గ్రీన్ మోదతాత్త్విక దృష్టి అతని రచనా జీవితపు మూడవ దశలో పూర్తిగ విప్పారి వెలుగు విరజిమ్మేటట్టు వెల్లివిరిసింది. నవ్వు—గాయాన్ని, వ్యథని, కష్టాన్నీ మాన్పగలదు. హాస్యం చిప్పిల్లచేసే జలయంత్రం కామెడీ. నవ్వగలిగే శక్తి మోద ప్రవృత్తి. ఇదిజీవితంలోని నవ్వుపుట్టించే అసంగతమైన, అసంఘటితమైన వస్తువిషయాలపై మన చైతన్యాన్ని నిశితం చేస్తుంది. ట్రాజెడీ ఘర్షణతో సంబంధిస్తే కామెడీ సర్దుబాటునీ, పరిస్థితులకు అలవాటుపడే ధోరణిని అలవర్చుకునేట్టు చేస్తుంది. ఆల్డస్ హక్స్‌లీ వ్రాసినట్లు ట్రాజెడీ

సాక్షికమైన సత్యాన్ని చూస్తే, ఎపిక్ సమగ్రమైన సత్యాన్ని చూపు తోంటుంది. హాక్సలీ, ఎపిక్ గూర్చి చెప్పిన విషయం కామెడీకి అన్వయించవచ్చు. ది కమెడియన్స్ (1966), ది ఆనరరీ కాన్సుల్ (1973), ట్రావెల్స్ విత్ మై ఆంట్ (1969), ది హ్యూమన్ ఫాక్టర్ (1978)లో గ్రీన్ మోద తాత్త్విక దృష్టిని బాహాటంగా చాటి చెప్తున్నాయి. వీటిలో ఖేదంలో మోదం, మోదంలో ఖేదం అంతర్వాహినులై మన అవగాహనా వైశిత్యాన్నిబట్టి లోతైన అను భూతులను అందిస్తూ జీవితం ఎడల అవలంబించవలసినది మోద తాత్త్వికదృష్టియేనని ఒప్పిస్తాయి.

గ్రీన్ నవలలలో మొదటిదశలో ఖేదాంతంలో మోదాంతం పొడ చూపి క్రమంగా సంగమం చెంది మూడవ దశలో విస్తృతమైన మోదాంత దృష్టిగా వెల్లివిరుస్తుంది. ఖేదాంతంకంటె మోదాంత తాత్త్విక దృష్టి పరిణతి చెందినదని నవీన విమర్శకులు తెలుసు కున్నారు. వైలీ సయిఫర్ ఇలా వ్రాశాడు: "ట్రాజెడీ, కామెడీ ఏదో విధంగా బాంధవ్యాన్ని కల్గి ఉన్నాయని లేక కామెడీ ట్రాజెడీ కూడా చెప్పలేని మన పరిస్థితిని గూర్చి చెప్పగలదన్న విషయమూ బహుశః ఆధునిక విమర్శలో కనుగొనబడిన అతిముఖ్య అంశం." మోద తాత్త్వికదృష్టి సహనాన్ని పెంచుతుంది. మనం ఎవరిని చూచి నవ్వు తామో వారిని ద్వేషించం. సోమర్‌సెట్‌మామ్ చెప్పినట్లు "హాస్యం సహిష్ణుత్వాన్ని బోధిస్తుంది. నవ్వేమనిషి ఒక చిరునవ్వుతోనో, ఒక నిట్టూర్పుతోనో అవతల మనిషిని ఖండించకుండా తెగడకుండా ఒక సారి తన భుజాలని ఎగరవేస్తాడు పోనీలే అన్నట్లు. షేక్స్పియర్ వింటర్స్ టేల్ (ఒక కామెడీ)లోని ప్రపంచం హామ్లెట్ (ఒక ట్రాజెడీ)లోని ప్రపంచంకంటె విస్తృతమైనది. ఒకే జీవితంలో ఎలా ఒక భాగస్వామిగా చెడా అంతేనని మోదతాత్త్వికదృష్టి మనకు కనిపింపజేస్తుంది. స్ట్రక్చర్‌ను గురించి చెప్తూ గ్రీన్ ఇలా అన్నాడు:

"ఆయన భావసౌష్ఠవం (సిమెట్రీ ఆఫ్ థాట్) అతని కృతి సమూహానికంతటికీ ఒక వ్యవస్థ (సిస్టమ్) యొక్క ప్రాధాన్యత నిస్తుంది."

గ్రీన్ రచనలలోనుంచి ఓ వ్యవస్థను రూపొందించవచ్చు. సృజ నాత్మక కళాకారునిగా గ్రీన్ రచనలలోని సంఘటితమైన, సృజనాత్మక విశ్వంలోంచి ఈ వ్యవస్థను మోదతాత్త్విక దృష్టిగా గమనించవచ్చు. అతని దృష్టి పరిణతి పరిణామమూ దాని సంపూర్ణ అవగాహనా గ్రీన్ గొప్పతనాన్ని అర్థంచేసుకోవడానికి ఉపయోగపడతాయి. దృష్టి పరిణతివల్ల అతని రచనలలోని కథావస్తువులు (థీమ్స్) పరిణామం చెందిన విషయం సావధానంగా అతని రచనలు చదివినవారికి తేటతెల్ల మౌతుంది. పూర్వదశలోనికి ద్రోహం, నురికి, ఆనందంలేని పశు వాంఛ, క్రమంగా అవగాహనగా, స్నేహంగా, ప్రేమగా మలచబడతాయి. ద్రోహంనుంచి స్నేహంలోనికి, అపజయంనుంచి జయంలోనికి, నిరాశ నుంచి ఆశలోనికి, చీకటినుంచి వెలుగులోనికి గ్రీన్‌లోని మనుషులు (ఎన్ని లోపాలతోనైనా) పరిణతి చెందుతారు. ఈ మార్పు స్పష్టంగా మోదాంతంవంకే. దీనికి కారణం గ్రీన్‌లో పరిణతిచెందిన మోదాంత తాత్త్వికదృష్టియే. ఈ దృష్టి ఉదాత్తమైన భావుకులలో గ్రీన్ స్థానాన్ని నిశ్చయం చేస్తుంది. ద్రష్టగా అతన్ని చిరస్మరణీయుణ్ణి చేస్తుంది.

వైరుధ్యం

శ్రీ కొడవంటి లీలామోహనరావు

గాలీ, నీరూ, తిండీ, గుడ్డా
నాగరికత ఉగ్గుపోస్తే
కుళ్లిన సమాధిపై మొల్చిన
ఎర్రగులాబి
'అంటే'మిటి నాకని
ఫక్కున నవ్వింది.

ఎగిరే రాకెట్లు
అవధులు చెరిపేస్తే
పండువెన్నెలా, పిల్ల తెమ్మెరా
సామ్యవాదం ప్రకటిస్తే
వెలుగుకు నోచుకోని
పట్నవాసపు మురికివాడలు
కుళ్లి కుళ్లి రోదించాయి.

రాచరికపు జాడ్యానికి
నీవిచ్చిన రసగుళికలు
రాజులని కూల్చినా
యుద్ధాల్ని కాదని
అక్కడక్కడ మరఫిరంగులు
భీకరంగా గర్జించాయి.

శ్రీ జెట్టిగుండ రఘునాథ రెడ్డి

రెక్కలు లేని పక్షి

"చదువుకో నాయన్న చదువుకో తండ్రి
చదువుకుంటే నీకు సౌఖ్య మున్నేను..."

తెలుగు వాచకంలోని యీ పాటని చిట్టిరాజుకి చెబుతున్న వాడల్లా టక్కున ఆగిపోయాడు క్రిష్ణమూర్తి, ఎవరో సీకని గట్టిగా అదిమి పట్టేసినట్టు.

చిట్టిరాజు క్రిష్ణమూర్తి వాళ్లపక్కింటి ధర్మరాజు కొడుకు. ఒకటో తరగతి చదువుకుంటున్నాడు. బడి మొహం ఎలాంటిదో చూచి ఎరుగడు ధర్మరాజు. చదువుకోనందువల్లనే తనకి కూలీ నాలీ చేసుకుని బ్రతకాల్సిన గ్రహచారం పట్టిందని అతడికి ఎంత చింతంటే అంత చింత. నాలు గిండ్లు బిచ్చం ఎత్తైనా సరే తన కొడుకని పై చదువుల కెక్కించి, పెద్ద ఉద్యోగంలో పెట్టించాలని అతడి ఆశ. అందుకే చిట్టిరాజుని బళ్ళో వేశాడు ధర్మరాజు. చదివి యింట్లోనే వుండ్లె క్రిష్ణమూర్తి దగ్గరికి రాత్రుళ్ళో ప్రైవేటుకి కూడా పంపిస్తున్నాడు చిట్టిగాణ్ణి.

క్రిష్ణమూర్తి బుర్ర పోటెత్తిన సముద్రంలా సంచలించి పోతోంది ..

చదువుకున్న వాళ్ళకంతా సుఖం ఎక్కడుంది యీ కాలంలో?

సుఖం సంగతి దేవుడెరుగు కనీసం కడుపుకింత కూటిని కూడా సంపాదించుకోలేని దౌర్భాగ్య స్థితి ఏర్పడుతోందే!

మీసాలు గడ్డాలు వొచ్చాక కూడా తల్లిదండ్రుల గుండెలపై కుంపటిలా వుండాల్సిన ఖర్మ పడుతోందే!

చదువుకుంటే సుఖం వుంది. నిజమే! అయితే అది ఎవరికి?

ఉన్నవాళ్ళకే. లేని వాళ్ళకి కానే కాదు.

ఈ పాటని ఆ ఉన్నవాళ్ళకి మాత్రమే ప్రత్యేకించి చెప్పాలి.

అలా కాకుండా అందర్నీ ఒకే గాట్లో కట్టేసినట్టుగా ఉన్న వాళ్ళని లేనివాళ్ళని ఒకటిగా కలిపి చెప్పటం ఎంతవరకు న్యాయం?

లేని వాళ్ళకి లేనిపోని ఆశలు నూరిపెట్టడమే కదా?

"పాఠం చెప్పన్నా!" ఆలోచనల్లో పడిన క్రిష్ణమూర్తిని కదిపి తొందరించాడు చిట్టిగాడు.

పాఠం చెప్పటానికి ఏమాత్రం బుద్ధి కాలేదు కృష్ణమూర్తికి. వాచకం మూసేసి వాడి చేతికిస్తూ "రేపు చెబుతాలే చిట్టీ..." అని, యింటికి పంపించేశాడు.

అప్పటికే రాత్రి పడింది. అనంత భాండాన్ని గుటుక్కున మింగిన రాక్షసుడికి మల్లే చీకటి పిశాచి ఆ పల్లెని మింగి నీళ్ళు తాగేసింది.

గేదెల్లో పితికిన పాలు పొయ్యిమీద పెట్టి పిడకలు రగిల్చింది క్రిష్ణమూర్తి తల్లి తులశమ్మ.

ఓటి సత్తు గిన్నెలో యింత సంగటికుక్కి చిన్నపిల్ల ముందుకి తోసింది. మట్టిమూకుడులో సంగటి వేసుకుని బయటికి వెళ్ళినదల్లా తిరిగి అలాగే లోపలికి వొచ్చింది.

కిరసనాయిలు వొత్తికి అందడం లేదేమో సీసా దీపం గుప్ గుప్ మంటోంది. దాని నోట్లో యిన్ని మంచినీళ్ళు కొట్టి, "సుబ్రంగా అట్లాగే కూర్చొనిపోయావ్... లేయ్ మరి- అన్నం తిందువుగాని..." క్రిష్ణమూర్తిని కేకేసింది తులశమ్మ. అప్పటికది రెండోసారి కాబట్టి ఆమె గొంతుకలో కాస్త విసుగు ధ్వనించకపోలేదు.

"అయ్య తిన్నాడా అమ్మా!" గిన్నె ముందు కూర్చుంటూ అడిగాడు క్రిష్ణమూర్తి.

"మద్దేనం తినిందే అరగలేదంట. వొద్దన్నాడు" అంది, తులశమ్మ.

కుమారుని చదువుకోసం రెక్కలు ముక్కలు చేసుకుని కష్టించడం చేత క్రిష్ణమూర్తి తండ్రి శివయ్యకి గుండెజబ్బు పట్టుకుంది. దానికి తోడు క్రిష్ణమూర్తికి యింకా వుద్యోగం రాలేదనే దిగులు జబ్బు కూడా. ఈ దిగులు జబ్బు అధికమైనప్పుడల్లా అన్నం మానేస్తుంటాడతడు.

తండ్రి దిగులుని తల్చుకుంటుంటే ముద్ద మింగుడు పడలేదు క్రిష్ణమూర్తికి. తల్లి బలవంతంమీద యింత ఎంగిలి పడి లేస్తూ "వొట్టి కడుపుతో ఎట్లా పడుకుంటాడమ్మా, అయ్య? కొంచెం పాలన్నా యిచ్చిరా! ముందే జబ్బు మనిషి" అన్నాడు క్రిష్ణమూర్తి.

"యాడిచ్చి చచ్చేదో! పాలు కూడా వొట్టి పోవాస్తోంది. రెండు లీటర్లు అంటే మట్టుక అవుతోంది. యిట్టైతే ఎట్లా బలికి బట్ట గట్టేదో..." బాధగా నిట్టూర్చి, చట్టిలోని పాలు కొంచెం

గ్లాసులోకి వొంపుకుని, అంతకు అయిదింతల నీళ్ళు కలిపోసి బయట నుంచునిమీద దగ్గరగా పడుకున్న శివయ్య కిచ్చి వొచ్చింది తులశమ్మ.

వొచ్చే పోయే ప్రాణంగా వున్నవాడికి మల్లే వెలుగుతోంది సీసా దీపం. కిరసనాయిలు అయిపోయిందని గొణుక్కుంటూ గబ గబా పక్కలు వేసింది తులశమ్మ.

అంతా గుప్ గుప్‌మంటున్న ఆ కాస్త దీపం వెలుగు కొండెక్కి చీకట్లో కలిసిపోయింది.

చేతిని తలగడగా పెట్టుకుని, చింకి చాపమీద చీకటి దుప్పటి కప్పుకుని పడుకున్న క్రిష్ణమూర్తి, తన చీకటి బ్రతుకుని నెమరేసుకోసాగేడు ...

*　　　*　　　*

చదువుకో నాయన్న చదువుకో తండ్రీ
చదువుకుంటే నీకు సౌఖ్య మబ్బేను ...

—యిదే పాట — ఒకప్పుడు — అంటే చిట్టెరాజంత చిన్నప్పుడు బళ్ళో పంతుళ్ళు చెబుతుంటే చదువుకోవాలని ఎంతో ఉబలాటపడి పోయాడు క్రిష్ణమూర్తి. ఒక్క పంతుళ్ళే కాదు సుమా; తల్లి దండ్రులూ, పెద్దలూ, దేశాధినేతలూ అందరూ 'చక చకా చదువుకునేయ్ — టక టక సౌఖ్యం కొట్టేయొచ్చు' అని ఎన్నెన్నో ఆశలు రేకెత్తించారు.

లక్ష రూపాయలు సార్! ఒక లక్ష రూపాయలు!

ఒక్క రూపాయితో లక్ష రూపాయలు కొట్టేయొచ్చు!

ఒకే ఒక రూపాయి మీది దాడుకుంటే లక్షాధికారి కావొచ్చు!

ఆలసించకండి అదృష్టం జారిపోతుంది! పోయిన అదృష్టం యీ జన్మలో మళ్ళీ రాదు! కొనండి సార్! ... ఆంధ్రా లాటరీ టికెట్స్! కర్నాటక లాటరీ టికెట్స్...తమిళనాడు లాటరీ టికెట్స్...

—లాటరీ టిక్కెట్లు అమ్మేవాడు పిలిచి పిలిచి వూరించి చెబుతున్నాడు.

నీ దగ్గర అర్ధరూపాయి మాత్రమే వుంది. అయినా, లక్షాధికారి అయిపోవాలనే ఆశతో ఎన్నో తంటాలు పడ్డావు. ఆ అర్ధ రూపాయినీ ఎలాగో సంపాదించావు. టికెట్టు కొనుక్కున్నావు. ఇంకేం స్వర్గాన్నే కొనేయొచ్చులే అన్నంత ధీమాగా మురిసిపోతున్నావు. డ్రా ఫలితాలు తెలిశాయి. లక్ష రూపాయల ప్రైజు కాదు గదా, కనీసం కన్సోలేషన్ ప్రైజు కూడా కొట్టలేదు. అప్పుడు నీ మనసెలా వుంటుంది ?

సరిగ్గా దీనికి పోలికగా చెప్పుకోవచ్చు క్రిష్ణమూర్తి బ్రతుకుని.

ఉన్న పొల్లా డబ్బునంతా బంగారం కడ్డీల్లోకి మార్చి భద్రపరచుకున్న షావుకారులా, ఉన్న కాస్తా ఆస్తినీ, తల్లి దండ్రుల కష్టాన్నీ కరగదీసి బియ్యే డిగ్రీ రూపంలోకి తెచ్చుకున్నాడు క్రిష్ణమూర్తి.

కాలేజిలో చదువుకుంటున్న కుమారునికి డబ్బు పంపడం కోసం పొలమేరి కష్టపడుతుండేది క్రిష్ణమూర్తి చదువు అయిపోయేసరికి ఆఖరంగా యిక లేవలేని వయస్సులో ముసలాడై పోయాడు శివయ్య.

విల్లమ్ముల్ని చేతబట్టుకుని అరణ్యంలోకి వేటకి బయల్దేరిన వేటగాడిలా బి. ఏ. డిగ్రీ పుచ్చుకుని ఉద్యోగంకోసం బయటి ప్రపంచంలోకి అడుగెట్టాడు క్రిష్ణమూర్తి.

ఎక్కడెక్కడో గాలిస్తున్నాడు.

ఇంతలో కనిపించి అంతలో మాయమయ్యే మాయలేడిలా, ఐదు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా ఎంతకూ దొరకడం లేదు ఉద్యోగం!

అసలు యింక ఉద్యోగంవచ్చే ప్రాప్తం లేదేమో అన్న బెంగ కూడా యీ మధ్యనే ఒకానొక పరిచయస్తుడు చేసిన హితోపదేశం విన్నాక పట్టుకుంది అతనికి.

బాగా ఆన్సర్ చేశాననుకున్న యింటర్వ్యూల్లో సైతం సెలక్టు కాలేకపోతుండటం పట్ల తీరని వ్యధకి గురియైన క్రిష్ణమూర్తి, అతడి దగ్గర తన గోడునంతా వెళ్ళబోసుకున్నాడు.

"ఈ కాలంలో ఉద్యోగాలకి ఒక్క క్వాలిఫికేషన్ మాత్రమే చాలదు. అదనపు అర్హతలు కూడా వుండాలి." అన్నాడా పరిచయస్తుడు.

"ఏమిటవి ?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"లంచం, రెకమెండేషన్. యివి లేకుండా ఉద్యోగం సంపాదించుకోవాలనుకోవడం ఒట్టి ప్రయాస మాత్రమే!"

"అసలు యింటర్వ్యూలకి హాజరు కావటానికే డబ్బుల్లేదే! యిక లంచం ఎక్కడ నుంచి తేను? రెకమెండేషన్ అంటావా, డబ్బు లేని యీ పేదవాడికి ఎవరు చేస్తారు?" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అయితే యీ ఉద్యోగాల ఆశకి నీళ్ళొదిలి నువ్వు హాయిగా యింటి పట్టునే వుండి పొలం గట్రా దున్నుకోవడం మంచిది." తేల్చి చెప్పేశాడు ఆ పరిచయస్తుడు.

"పొలమా, ఉన్న కాస్తా కూస్తా కూడా ఏనాడో యీ చదువుకే తెగలేశాను." వాపోయాడు క్రిష్ణమూర్తి బిక్కమొహం వేసి.

"ఇంతకీ మీ కులం ?" అడిగాడా పరిచయస్తుడు.

చెప్పాడు క్రిష్ణమూర్తి.

"ఉన్నత కులమేనే! అయితే ప్రభుత్వం చేస్తున్న ప్రత్యేక సహాయానికి కూడా నీవు పనికిరావు. నా మాట విను నేస్తం, ధన బలం లేకున్నా కండ బలం నీకూ వుండనే వుంది. సిగ్గు పడకుండా కూలీ నాలీ చేసుకో" ఉపదేశించాడా పరిచయస్తుడు.

శివయ్య కష్టపడి సంపాదించే రోజులు ఎప్పుడోచెల్లిపోయాయి. కుటుంబ భారం నెత్తి మీద కొచ్చాక నిర్భి నీళ్ళు త్రాగటానికైనా తీరిక లేకుండా చస్తోంది తులశమ్మ. మరి, ఒకరికి నలుగుర్ని పోషిం

చాలి కదా! కోడి కూతతో లేస్తుందావిడ. పాలు పితకడం, మజ్జిగ చేయడం, నెయ్యి కాచడం — యిలాంటి పన్లన్నీ చేసుకునేసరికి తెలతెల్లారిపోతుంది. తర్వాత గబగబా పాల గంప నెత్తిన పెట్టుకుని రెండు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న టౌనుకి పోతుంది. అక్కడ యిల్లిల్లూ తిరిగి అమ్మి, ఏ రోజు నిత్యావసర వస్తువులు ఆరోజు యింటికి తెస్తుంది. ధరలన్నీ చుక్కల లోకంలో దాగుడు మూతలాడుతున్న యీ రోజుల్లో ముష్టి రెండు గేదెల పాల డబ్బు యింత సంసారానికి ఎక్కడ సరిపోతుంది? సరిపోదు. అందుకే ఉపవాసాలతో గడపాల్సిన రోజులు కూడా అప్పుడప్పుడూ వాళ్ళకి ఎదురౌతుంటాయి.

ఇంట్లో యిస్థితిని చూస్తుంటే ఆ సరిపడుతున్న హితోపదేశం అక్షరాలా పాటింపతగినదిగా అన్పించింది క్రిష్ణమూర్తికి.

"హవ్వ, నువ్వా! సేద్యం పన్కి వొస్తావా? నీ మొహం — నీకేమొచ్చని — మడక పట్టడం వొచ్చా? మోట దోలడం వొచ్చా?" తీసి కట్టుగా మాట్లాడారు కొందరు.

"ఇంత చదివింది మట్టి పిసుక్కోడానికేనటయ్యా? ఏదైనా గవర్నమెంటు పని చూసుకోకుండా ఏమిటిదంతా?" మరి కొందరు దెప్పి పొడిచి, మళ్ళీ ఉద్యోగాల మీదికే క్రిష్ణమూర్తిని మళ్ళించారు.

చదువుకున్న నేరానికి యిన్నిన్ని బాధలు పడుతున్న క్రిష్ణమూర్తి చదువుకుంటే సౌఖ్యం అబ్బుతుందని ఎలా చెప్పగలడు?

*　　　*　　　*

... తన అప్రయోజకత్వాన్నీ, నానాటికి చెదలు పట్టిపోతున్న కుటుంబ పరిస్థితినీ తల్చుకుంటున్న క్రిష్ణమూర్తికి కంటిమీద రెప్ప వాలడం లేదు. అర్ధరాత్రి అవుతున్నా పడకమీద అటూ ఇటూ పొర్లుతూనే వున్నాడు.

బయట మంచంమీద పడుకున్న శివయ్య దగ్గు, మూల్గులూ అతడి గుండెకి సమ్మెట పోట్లుగా వున్నాయి.

"ఏం శివన్నా! దగ్గు శానా జాస్తి అయిపోయినట్టుందాదే!" అంటూ ఎవరో వొచ్చి పలకరించారు శివయ్యని.

ఎవరది? — చెవులు రిక్కించాడు క్రిష్ణమూర్తి.

"యాణ్ణించి రావడం కోటేసూ! పేట మంచేనా? యింత రేతిరి దాకా ఆడేం జేస్తుంటివి?" శివయ్య అడిగాడు దగ్గుకుంటూనే.

"అబ్బోనికి యీ పొద్దు యింట్రూ (యింటర్వ్యూ) గదా! ఆడికిపోయుంటిని. ఆడ్నే చీకటైంది. బస్సులు కూడా లేవు. లారీలో పేటకొచ్చి, ఇంటి కొచ్చేసరికి యీ యేల అయిపోయింది" చెప్పాడు కోటేసు.

"పోయిన పని ఏమైంది? పండేగదా?" ఆదుర్దాగా అడిగాడు శివయ్య.

"ఆఁ — ఆఁ! పండే అయ్యింది. రెండు వేలు పోస్తేగానీ సెలట్టు కాలేకపోయాడు. పోతే పోయింది ఎదవ రెండు వేలు. అబ్బోడికి పని మాత్రం ఖాయమైంది" ఏదో కైలాసాన్నే డబ్బుతో కొనేసిన నాడిలా సంబర పడిపోతూ అన్నాడు కోటేసు.

రెండు వేలు అనేసరికి అదిరిపడ్డాడు క్రిష్ణమూర్తి. చిన్న ప్యూను ఉద్యోగానికి రెండు వేలు లంచమా?

కోటేసుకొడుకు గోవిందుడు హైస్కూల్లో క్రిష్ణమూర్తితో పాటు చదువుకున్నవాడే! యేడో తరగతి తప్పిపోవడంతో అక్షరంముక్క అబ్బే యోగంలేదని కొడుకుని బడి మాన్పించేశాడు కోటేసు. మేకల్ని వారానికి తొలిసట్టుగా ఊరిమీద చక్రవడ్డీల మీద పడిన పెట్టుబడి తన పదివేల రూపాయల తోటాన్ని గోవిందుని పంపేటి 'జాగ్రత్తగా కాపాడుకో నాయనా! హాయిగా బతికిపోగలవు' అని హితబోధ చేశాడు కోటేసు. ఏదైనా ఒక ఉద్యోగం వెలగబెట్టాలనే కోరిక యేడాది క్రితమే కల్గింది గోవిందుడికి. ఇప్పటికి ఆకోరిక డబ్బుతో నెరవేరింది.

*　　　*　　　*

"బి. ఏ. చదివానంటున్నావ్, ప్యూన్ ఉద్యోగం చేస్తావా?" క్రిష్ణమూర్తి మాటలని విని వినకుండే ఫక్కుమని నవ్వారు ఆఫీసర్ గారు.

"ఏం చేయమంటారు సార్! అంతకన్నా గత్యంతరంలేదు" చేతులు నలుపుకుంటూ దేబిరించాడు క్రిష్ణమూర్తి.

"లేకపోతే మటుకు? అడిగేవాడికి లేకపోయినా యిచ్చేవాడికన్నా వుండొద్దూ ఇంగితజ్ఞానం!" అంత పెద్ద ఆఫీసరుగారు చిన్న బుచ్చుకున్న మొహంతో కస్సుమన్నారు.

గాలితీసిన ఫుట్‌బాల్ బ్లాడర్‌లా అయిపోయింది క్రిష్ణమూర్తి మొహం. ఏం మాట్లాడాలో తోచక తల్లడిల్లుతున్నాడు క్రిష్ణమూర్తి.

"ఇంత దూరం వొచ్చావు పాపం, అప్లికేషన్ ఒకటి పడేసిపో! వీలుచూసుకుని నీకు తగ్గ వుద్యోగమేదైనావుంటే చూస్తాను" తనలో కస్సు బుస్సులాడే స్వభావమేకాదు, సానుభూతి కూడా లేకపోలేదన్నట్లుగా మాట్లాడి, టింగ్‌మని బెల్ నొక్కారు ఆఫీసర్‌గారు, యిక క్రిష్ణమూర్తిని వెళ్ళిపొమ్మన్నట్లు.

పేడ నీళ్ళు మొహాన కొట్టినట్లైంది క్రిష్ణమూర్తికి. బయటి కొచ్చేశాడు.

యేడో తరగతి ఫెయిల్ అయిన గోవిందునికి దొరికిన ప్యూన్ ఉద్యోగం బి. ఏ. చదివిన తనకి దొరక్కపోదనే ఆశతో, ధీమాగా వొచ్చాడు కృష్ణమూర్తి, గోవిందుడు చేరిన ఆఫీసు దగ్గరికే.

ఆ ఆశకూడా నిరాశే అయ్యింది! బి. ఏ. చదివిన నేరానికి ప్యూన్ పోస్ట్‌కి కూడా పనికిరాని వాడయ్యాడు.

దిక్కూ దరీ లేక ప్రవాహంలో కొట్టుకుపోతున్న చీమలా గిలగిలలాడుతూ బస్‌స్టాప్‌కేసి నడుస్తున్నాడు క్రిష్ణమూర్తి.

రాకెట్‌లా వొస్తున్న ఓ స్కూటర్ షడన్‌గా బ్రేకుపడి తన పక్కన ఆగడంతో తలెత్తి అయోమయంగా చూశాడు క్రిష్ణమూర్తి. శ్రీపతి!

"ఏమోయ్ మూర్తీ! బావున్నావా?" సీటుమీదే ఠీవిగా కూర్చొని, కాళ్ళని రోడ్డుకి తన్నిపట్టి పలకరించాడు, శ్రీపతి.

శ్రీపతి పేరుకు తగ్గట్టు శ్రీపతే! అతడు కాలేజీలో క్రిష్ణమూర్తి క్లాస్‌మేట్. అప్పట్లో అతనికి పొట్టపొడిస్తే ఓ అక్షరం ముక్కైనా వచ్చేది కాదు. అలాంటివాడు అసలు బి. ఏ. లోకి ఎలా వొచ్చి పడ్డాడో ఆ భగవంతునికే ఎరుక! బి. ఏ.లో రెండు మూడు సార్లు ఫెయిల్ కావడంతో ఒక్క ఆ పట్టణంలోని కాలేజీలమీదనేకాదు, రాష్ట్రంలోని మొత్తం కాలేజీలమీదనే అలిగి బయట ఎక్కడోవున్న ఒకానొక రాష్ట్రంలోకి వెళ్ళిపోయాడు. అక్కడ కాలుమీద కాలేసుకుని ముచ్చటగా మూడేళ్ళుండి యిక్కడి కాలేజీలనంతా సవాల్ చేస్తూ ఒకటికి రెండు డిగ్రీలతో తిరిగి వొచ్చాడు.

"ఏదో అలా వున్నాను, నువ్వెలా వున్నావు? ఏం చేస్తున్నావు?" అని, పరామర్శించేడు క్రిష్ణమూర్తి.

"లెక్చరర్‌గా పనిచేస్తున్నానోయ్" అన్నాడు శ్రీపతి.

"ఎక్కడ?" క్రిష్ణమూర్తి ఆశ్చర్యానికి అవధుల్లేవు. అయినా ఆ భావాన్ని ఏమాత్రం బయటికి పొక్కనీకుండా అణచేసుకుని, కుతూహలంగా అడిగేడు.

"ఈ వూళ్ళోనే! ఒన్ యియర్ కావొస్తోంది."

పొట్టపొడిస్తే ఓ అక్షరం ముక్కైనా రానివాడికి డిగ్రీలతో బాటు లెక్చరర్ గిరీ!

చక్కగా చదువుకునే శక్తిసామర్థ్యాలున్న వాడికేమో డిగ్రీలతోబాటు ఉద్యోగాలకీ లాటరీ!

—ఎంతో బాధగా మూల్గింది క్రిష్ణమూర్తి హృదయం.

అంతా డబ్బు మాయబాబూ, డబ్బుమాయ!

డబ్బుతో కొనలేనిది ఏదీ లేదు!

ఉద్యోగాలనే కాదు, చదువుల్నీ అంగట్లో సరుకులా కొనే యొచ్చు!.........

'ఉన్న వాడిదే రాజ్యంరా
లేనివాడి పని పూజ్యంరా'

—ఆరుద్ర పాట చప్పున గుర్తొచ్చింది క్రిష్ణమూర్తికి.

*　　　*　　　*

'అందని పళ్ళు పుల్లన' అని, ఎంతగా ఎగిరి నప్పటికీ లభించని ద్రాక్షపళ్ళని తిట్టిపోసుకుంటూ అభిమానంతో వెళ్ళిపోయింది నక్క.

నక్కకున్నంత అభిమానం సైతం యీ కాలంలో నిరుద్యోగులకి లేకపోవడం చాలా శోచనీయం!

ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయాలనీ, అవినీతులనీ ఓ ప్రక్క తిట్టుకుంటూనే, మరో ప్రక్క 'అన్యధా శరణం నాస్తి' అని ఆ ఉద్యోగాన్వేషకోసం భగీరథ ప్రయత్నం చేస్తూనే వున్నాడు క్రిష్ణమూర్తి.

'నిరుద్యోగ టీచర్లంతా అప్లికేషన్లు వేయుండహో! ఖాళీ యున్నాయొహో!' అంటూ పత్రికా ముఖంగా చాటింపు వేసింది జిల్లా పరిషత్తు కార్యాలయం ఓనాడు.

టౌన్ లైబ్రరీలో పేపరు తిరగేస్తూ ఆ చాటింపు చూసి కూడా, మూడనివాడిలా నిరుత్సాహంగా తిరిగి వొస్తున్నాడు క్రిష్ణమూర్తి.

"ఏమిటయ్యా క్రిష్ణమూర్తీ! యీమధ్య నీ వ్యాసాలేవీ బొత్తిగా పత్రికకి రావడం లేదే! కొంపదీసి రాయడమే మానేశావా ఏమిటి?" అంటూ, బజార్లో కాకతాళీయంగా కన్పించాడు సభాపతి.

సభాపతి జిల్లాలో ఒకానొక ప్రముఖ స్థానిక వారపత్రికాధిపతి.

బి. ఏ. చదువుకునే రోజుల్లో తను స్పెషల్ తెలుగు విద్యార్థి కాబట్టి తెలుగు సాహిత్యంమీదుండే అభిరుచికొద్దీ అప్పుడప్పుడూ సాహిత్య పరమైన వ్యాసాలు రాస్తుండేవాడు క్రిష్ణమూర్తి. వాటినంతా సభాపతి పత్రికకి పంపించేవాడు. ఆ వ్యాసాలు ఎంతో బావున్నాయంటూ తెగ మెచ్చుకుని ప్రచురిస్తుండేవాడు సభాపతి. చదువైనాక కూడా రెండు మూడేళ్ళవరకూ ఒకటి అరా రాసి పంపించేవాడు. అసలిప్పుడు అది కూడా లేదు.

"రాయడానికి కావలసినంత ఏకాగ్రత, మనశ్శాంతి ఎక్కడండీ యీ సుష్టు బ్రతుకులో?" అంటూ బ్రతుకుబాటలో తననేమాత్రం ముందుకు పోనివ్వకుండా చుట్టూరా దట్టంగా అలుముకున్న చీకటి పొదల్లాంటి స్వంత సమస్యల్ని అతడికి ఏకరువు పెట్టాడు క్రిష్ణమూర్తి. సభాపతి పత్రికా సంపాదకుడు. అంచేత జిల్లాస్థాయి అధికార్ల దగ్గర అంతో యింతో పలుకుబడి వుండకపోదు. ఆ ఉద్దేశంతోనే చిట్టచివర్లో పత్రికలో వొచ్చిన జిల్లా పరిషత్తు అడ్వర్టైజ్‌మెంటు విషయం కూడా అతని చెవిలో వేశాడు క్రిష్ణమూర్తి.

క్రిష్ణమూర్తి మాటలని సాంతం విన్నాక చాలా బాధపడ్డాడు సభాపతి. ఒకటి రెండు రచనలతోనే ఆగిపోయిన క్రిష్ణమూర్తి రచనా వ్యాసంగం పట్లకూడా అతనికి తీవ్రమైన ఆందోళన కలుగకపోలేదు. సభాపతి మంచి ఆలోచనాపరుడేకాదు; లౌకిక జ్ఞానం కూడా బాగా వున్నవాడు. ఐదు పది నిముషాలపాటు ఆలోచించాక "ఓ పని చేస్తావా క్రిష్ణమూర్తీ!" అన్నాడు సభాపతి.

"ఏమిటి?"

చెప్పాడు సభాపతి. రామబాణంలాంటిదిది. దీనికిక తిరుగులేదని కూడా అన్నాడు.

గుక్కెడు నీళ్ళైనా లేక కరువు కాటకాలతో అఘోరిస్తున్న రైతు, హఠాత్తుగా ఆకాశమంతటా వానమబ్బులు దట్టంగ క్రమ్ము కుంటే ఎంతగా సంతోషిస్తాడో అంతగా సంతోషపడిపోయాడు క్రిష్ణమూర్తి.

సభాపతి చెప్పినట్లు తు. చ. తప్పకుండా చేశాడు క్రిష్ణమూర్తి. తన రచనలన్నీ తీసుకుని సభాపతితో పాటు వెళ్ళి యింటర్వ్యూకి ముందే సెలక్షన్ కమిటీ మెంబర్లందర్నీ కలిసాడు క్రిష్ణమూర్తి. క్రిష్ణమూర్తి రచనలన్నీ వాళ్ళకి చూపెట్టి—తెలుగు పంతుడుగా యితడు అన్నివిధాలా అర్హుడు. ఆ ఉద్యోగానికి రచయితకన్నా మించిన గొప్ప అభ్యర్థి యింకెవరు వుంటారు? యితనికీ ఈ విషయంలో అన్యాయం జరగకూడదు. ఏలాగైనా ఉద్యోగం యిచ్చి తీరాల్సిందే!—అన్నట్లు గట్టిగా కమిటీ మెంబర్లకి చెప్పి వొచ్చాడు సభాపతి. ఔనౌనంటూ వాళ్ళుకూడా సభాపతితో ఏకీభవించడం క్రిష్ణమూర్తికి ఎక్కడలేని తృప్తినీ, ఆనందాన్నీ కల్గించింది.

మళ్ళీ వొకసారి యింటర్వ్యూలో కమిటీ ముందు తన రచనలన్నీ పెట్టడంతోపాటు, అడిగిన ప్రశ్నల కన్నిటికీ చక్కని సమాధానాలు చెప్పాడు క్రిష్ణమూర్తి.

"ఇక గుండెలమీద చెయ్యి వేసుకుని నిద్రపోవోయ్ క్రిష్ణమూర్తీ! అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాగితం వెతుక్కుంటూ నీ దగ్గరికే వొస్తుంది" అన్నాడు సభాపతి.

ఉద్యోగ లక్ష్మి తన యింటికే వొచ్చి పూలమాల వేసేదాకా ఆగలేకపోయాడు క్రిష్ణమూర్తి. వారం రోజులైనా గడిచాయో లేదో ఆఫీసు దగ్గర్కే ఆ మాలని వేయించుకోవాలనే ఉబలాటంకొద్దీ జిల్లా పరిషత్తు చుట్టూ రోజూ ప్రదక్షిణాలు చేయసాగేడు.

ఒకటిన్నర నెల తర్వాత ఫలితాలు నోటీస్ బోర్డులో వేయబడింది.

సూదుల్లాంటి చూపులతో తన పేరుకోసం వెదుకులాడేడు క్రిష్ణమూర్తి.

లేదు! లేనే లేదు!!

ఉప్పెనలో తన సర్వస్వం కొట్టుకుపోతున్న వాడికిమల్లే "నా పేరు...నా పేరు..." అంటూ విలపిస్తూ అక్కడే కుప్పగా కూలిపోయాడు క్రిష్ణమూర్తి.

ఉద్యోగులందరూ హడావుడిగా పరుగున వొచ్చారక్కడికి. మూర్ఛబోయిన క్రిష్ణమూర్తి మొహాన యిన్ని మంచినీళ్ళు చిలకరించి పైకి లేవనెత్తారు.

క్రిష్ణమూర్తికి యింటిమొహం చూట్టానికి ఏమాత్రం బుద్ధికాలేదు. మతి చలించిన వాడిలా వీధుల్లో పడ్డాడు.

అతడి గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయ్!

సప్త సముద్రాలు పోటెత్తి ఎగిరెగిరి పడుతున్నాయ్!

ఎవరిమీదనో పగ, కోపం, ద్వేషం...

తనమీద తన డిగ్రీమీద అంతులేని అసహ్యం...

ఈ వ్యవస్థ చెదపట్టిన వృక్షంలా అతని కళ్ళముందు నిలబడింది ఎక్కడ చూచినా చెదపురుగులే! అయ్యయ్యో. వృక్షమంతా హరించుకుపోతోందే! కొమ్మ కొమ్మలో, రెమ్మ రెమ్మలో, అణువు అణువులో ఆమూలాగ్రం వ్యాపించిపోయిందే చెద! విశ్వరూపం దాల్చిందే!

ఎవ్వరూ పట్టించుకోవడం లేదేమిటి?

పట్టించుకుని ముందుకొచ్చిన ఒకటి అరా అలా చప్పబడిపోతున్నారేమిటి?...అంతూపొంతూలేని ఆలోచనలతో, ఆవేశంతో వీధుల్లో తిరిగి తిరిగి అలసిపోయాడు క్రిష్ణమూర్తి.

నడినెత్తిన సూర్యుడు విప్లవకారుడిలా నిప్పులు కురిపిస్తున్నాడు.

ఇక కదలటానికి శక్తిలేదు బాబూ—అంటూ నోరు బాదుకున్నాయ్ క్రిష్ణమూర్తి కాళ్ళు. పిండాకూడు లేకపోతే పీడాబోనె—మా మొహాన యిన్ని మంచినీళ్ళైనా కొట్టి పుణ్యం కట్టుకో—అంటూ కడుపులోని ప్రేగులన్నీ ఒక్కసారిగా గోలచేయసాగినై.

ఎదురుగ అల్లంత దూరంలో మున్సిపాలిటీ పార్కు కన్పించేసరికి చకచకా నడిచాడు క్రిష్ణమూర్తి. కొళాయి నీళ్ళని కడుపునిండా పట్టించాక ఓ చెట్టు నీడన కూలబడ్డాడు

"ఎవరు బాబూ నువ్వు?"

పరధ్యానంలో మునిగివున్న క్రిష్ణమూర్తి ఉలిక్కిపడి చూశాడు.

పక్కనే బారెడు దూరంలో కాలుమీద కాలేసుకుని పడుకుని వున్న బిచ్చగాడు!

పిచ్చి నవ్వొకటి క్రిష్ణమూర్తి పెదాలమీద విచ్చుకుంది. "ఎవరైతేనేం గానీ ప్రస్తుతానికి నీలాంటి బిచ్చగాణ్ణే. మనిద్దరం వొకటేలే!" అన్నాడు.

ప్యాంటూ, షర్టూ వేసుకుని చదువుకున్నవాడిలా వున్న అతగాడు తనలాంటివాడే అని తెలిసేసరికి—"ఎట్టా బాబూ! నువ్వూ నాలాంటి బిచ్చగాడివేనా?" అని, క్రిష్ణమూర్తి పుట్టుపూర్వోత్తరాలనంతా ఆసక్తిగా గుచ్చి గుచ్చి అడిగాడు బిచ్చగాడు.

"యిప్పుడు చెప్పు, నీకూ నాకూ తేడా ఏమిటి? కాదంటే నువ్వు యిండ్లచుట్టూ తిరుగుతున్నావు. నేను ఆఫీసులచుట్టూ తిరుగుతున్నాను." తన చరిత్రనంతా చెప్పాక, మునుపటి మాటల్ని సమర్థిస్తూ అన్నాడు క్రిష్ణమూర్తి.

క్రిష్ణమూర్తి విషయమంతా విన్నాక 'మనిద్దరం వొకటేలే' అన్న మాటల్ని తల్చుకుంటుంటే బిచ్చగాడికెందుకో చిన్నతనమేసింది.

ఆ పోలిక అన్యాయంగా కూడా తోచింది. "చూడు బాబూ! యీనా ముష్టిపాత్రతో యిప్పాటలూ తింటున్నానా, ఎంతో హాయిగా వుంటున్నానా, నా వాళ్ళ నెందర్నో లక్షణంగా పోషిస్తున్నాను. మరి నువ్వు ఆ డిగ్రీలో నీ కడుపు కూటిని స్వంతం సంపాదించుకో లేకున్నావే. నీకూ నాకూ పోలికెక్కడ? మనిద్దరం ఎట్లా ఒక టౌతాం?"

బిచ్చగాడి మాటలంకి పుండుమీద కారం చల్లినట్లుగ విల విల్లాడిపోయాడు క్రిష్ణమూర్తి. చదువుకున్న పాపానికి ముష్టివాడి కన్నా హీనమైపోయాడా తను? ఎందుకీ డిగ్రీ? ఎందుకీ వెధవ బతుకు? ఛీ ఛీ!...పది పదిహేను నిమిషంపాటు ఎన్నో తర్జన భర్జనలు జరిగాక చచ్చిపోవాలనే నిర్ణయానికి వొచ్చేశాడు క్రిష్ణమూర్తి.

మెల్లగా కళ్ళెత్తి బిచ్చగాని కేసి చూశాడు. గురక తీస్తూ గాఢ నిద్రలో వున్నాడు. చివుక్కున లేచి చెట్టు కొమ్మకి తాడొకటి వేలాడదీసాడు క్రిష్ణమూర్తి. చెట్లోకి చరచరా ఎక్కిపోయాడు. "బాబూ మా గతేం కావాలి? నీమీద పుట్టెడు ఆశలు పెట్టుకున్నామే! మా కష్టాన్నంతా ధారపోసి నిన్ను చదివించామే! మా కిన్ని గంజినీళ్ళు ఉడిగిన కాలంలో పోస్తావనుకున్నామే! మాకంతా అన్యాయం చేసిపోతావా?" దగ్గుకుంటూ తండ్రీ, గుండెలు బాదుకుంటూ తల్లీ - కళ్ళలో కన్పించారు. అంతే--ఎలా ఎక్కాడో అలానే చెట్టు దిగేశాడు క్రిష్ణమూర్తి.

చదువుకున్న నేరానికి సుఖంగా చచ్చిపోయే యోగం కూడా లేదని డిగ్రీమీద పట పటా పళ్ళు నూరాడు క్రిష్ణమూర్తి.

*　　　*　　　*

గాఢంగా ఒక్క కునుకు తీశాక మెల్లగా వొళ్ళు విరుచుకుంటూ లేచాడు బిచ్చగాడు. పక్కన తడిమి చూసుకున్నాడు. గదా, తన భిక్షాపాత్ర లేదు! మరి అక్కడేముంది? ఎంత జాణతనం ఒలకబోసినా, తన కడుపూ తన వారి కడుపూ నింపలేని వృద్ధ వేశ్య లాగా —డిగ్రీ!

రాత్రి మేల్కొన్న మనస్సు

శ్రీ కె. దినకర్

సామియానాలాగ పరచుకుంది నీలాకాశం
షాండిలీర్ లాగ వెలుగుతోంది తారా నివహం
అగరొత్తుల పొగలాగ అలముకుంది ఎలవెన్నెల
అందం మెరిసిన ఈరాత్రి - ఆనందగాత్రి
నిర్వేదనా శ్రుతుల పదేపదే పలికించిన
నిట్టూర్పుల వీణలు నిదురపోతున్నాయి
ఎదలో మేలుకొన్న ఎలక్ట్రిక్ గిటార్లు
ఆలాపిస్తున్నయి జ్వాలాగీతాలు
జ్ఞాపకాల టేప్‌రికార్డర్‌లోంచి
జాజ్ మ్యూజిక్ మధురంగా వినిపిస్తోంది

గుండెల కొండల్లో ఘనీభవించిన
నిశ్శబ్ద నీహారం కరిగి ప్రవహిస్తోంది
వేయి రసస్రవంతులుగా
కోటి రాగతరంగాలతో
వలపుల తెమ్మెరలకు నయన గవాక్షాల
కలల కర్టెన్లు కదలాడుతున్నాయి
కోరికలే క్రొన్నెత్తుటి
కొవ్వొత్తులై జ్వలిస్తున్నాయి
ఊహల డయాస్‌మీద ఊగుతూ తూగుతూ
కేబరే డేన్సర్‌లాగ గెంతుతోంది మనస్సు.



ఎవరు నువ్వు?

శ్రీ రంధి సోమరాజు

ఎవరండీ తమ రెవరంటే
 క్షణాలమీద ఈలవేస్తూ
ఉషారుగా ఫలానా రావుగారి
రాంబాబు నంటావ్ ...
ఓయ్ పిచ్చివాడా ...
ఆ ఫలానా ఫలానారావు లెవరెవరంటూ
వెనక్కెనక్కెన క్కెళ్ళే గతచరిత్రల
రైలెక్కేస్తే
ఆగేచోటు అంతుచిక్కక
అలసి అలసి సొలసి సొలసి
వూపిరాగ్గేస్తావో ..
కాదు...కాదు...తెలిసింది తెలిసిందంటూ...
ఉఫ్‌న గెంతేసి
చంద్రుడ్లో అడుగేసినంత మహోత్సాహంతో
వొక్క ఉదుటున 'ఈ ఊపిరే నే' నంటావో
నో నో నా
ఈ ప్రాణాధారాన్నంత స్వచ్ఛ సలిల ప్రపంచాన్నంటావో
అహకాదు
సమస్త జీవాధార దివ్య విభూతి; ఈ ధరాతలంబు నంటావో
అబ్బెబ్బే...అదికాదు
మహోన్నత శక్తి సంపన్నుడు విరాట్ స్వరూపుడు సాక్షాత్
విష్ణువు
సూర్యభగవానుడనంటావో ...
కాదు కాదు కానే కాదు
సమస్త విశ్వం నెత్తిమీద వున్నట్టుండీ అసలు లేనే లేని
అంతులేని ఆత్మ; స్వచ్ఛ నీలాకాశం నేనే నంటావో...
కాదు
వీటన్నింటి మొత్తం కలయిక 'నేనే...నేనే...' అంటూ
తన్మయుడవౌతావో ...
వెను వెంటనే కాదు కాదు
ఈ చిలక్కొట్టు ముక్కల అతుకుల బొంతను చింతాక్రాంత
మనస్కుడను
అసలు కానే కాదు
నే కార్బన్ పరమాణు వువ్వెత్తుగా
కాకర పువ్వొత్తై విరిసే
తెల్లని మంచు వెలుగుల వెన్నెల జీవజ్యోతి నంటావో
లేక
సమస్త ప్రకృతీ హృదయతప్త నవజ్ఞానా విర్భూత
విస్తృత వేదాంత సుమ సౌరభ ంమణీయాత్మను
అంతరాత్మను నే నంటావో ...
అయ్యయ్యో
కాదండీ కాదు
ఏమిటో అదేమిటో ఏమీ 'తెలీడం' లేదు
ఇంతకీ యెవర్నేను ?
జల జంతువునా
భూ చరాన్నా
వాయుమండలాధి నేతనా
వాయురహిత నక్షత్రమండలోద్భవానంత శక్తినా ...
చండ ప్రచండ మారుతీ తప్త పీవనోధృతుల
తృటిలో అదరగొట్టే
క్రూర సింహ ఘర్జారవాన్నా
హృదయ స్పర్శామృత వాహినీ వియద్గంగా సుందర
తనూవల్లరినా
చిత్ర విచిత్ర సౌందర్యవారాశినా
గేలం చివర వేలాడే పెను దురాశనా
ఆకలి వొడ్డున పడవకోసం చూసే ఎండిన కన్నీటి బొట్టునా
తంత్రాలతో కుతంత్రాలతో మునిగితేలే
రాచ కార్యాచరణ దక్షుణ్ణా
మెదడు అంచున మెరిసే ఆలోచనల తటిల్లతనా
నిశ్చల సమాధి గత నిశ్శబ్ద రామణీయకతనా
మానవతా పవనాన్నా ...
విశ్వ కిరణ తరంగాల హృదిలో
కదలియాడే వో బుజ్జి వెలుగుల నావనా
సృష్టినా

చివ్వారి అణువునా
ఏమో...ఎవ్వరు నేనెవ్వరు ... ?
అంటూ అనుకుంటూ
నిన్ను నీవే అడుక్కుంటూ
ఉంటావో ...
'ఎవరు...ఎవరు' అనుకుంటూ
'ఎవరు' గానో మిగిలిపోతావో ...
సంబోధన కందని ఆకశానివై
ఎత్తుల కెదిగి పోతావో
అయ్యో
అయ్యో
పాపం ! ఎవరు నువ్వు ?

స్త్రీ !

శ్రీ పరిగొండ కాంతారావు

అనిశ్చిత భావోద్వేగాన
పరవశ నృత్యంచేసే
ఉరుకుల పరుగుల ఝరి
వంపు సొంపుల చైతన్యం;

చిరుగాలికి అల్లల్లాడుతూ
బాలార్క కిరణాలలో
తడిసిపోతూ మెరుస్తున్న
మృదుపల్లవ లాలిత్యం;

సుదూరాన, నిర్మలాకాశాన్ని
తన్మయత్వ విస్మృతిలో
చుంబించిన సాగరం
అలలు అలలుగా తీరానికి
చేర్చుకొనే పులకింతలు;

సృష్టిలో
స్త్రీ
గనుక లేకపోతే
మనకెలా తెలిసేవి ?

జీవితం !

శ్రీ ద్వా. నా. శాస్త్రి

ఈ నాటి
జీవిత కవిత్వంలో
అన్యాయాల అస్పష్టతలూ
అక్రమాల ప్రతీకలూ
నిరాశా నిస్పృహల అనుకరణలూ
ఎక్కడో మిణుకు మిణుకు మంటూ
సుఖాల మినీ కవితలూ చోటు చేసుకుంటున్నాయి.

ఆ రాత్రి!

ఆత్మకథ తొలి పుటల్లో
ఎన్నడో మాయమైపోయిన
దరహాసాన్ని జ్ఞప్తికి తెస్తూ
దిగంతరేఖ జరిగి జరిగి
కడుదూరమైపోయింది !

*　　*　　*

బ్రతుకు బరువుతో
పయనిస్తున్న నౌక
మొండిగా అద్దరివేపు చూడ్డం మానేసి
ఎటో దూసుకుపోతోంది !

*　　*　　*

అలసటగా
ఆకాశం రాల్చిన కన్నీరు
కాటుక కడలిలో కరగిపోతూ
సుళ్లు తిరిగింది !

*　　*　　*

అలస్యంగా ఆకాశా
న్నందుకున్న చంద్రుడి
తెలివి తక్కువ దరహాసం
దిగ్రేఖ వలయాల్లో మెలితిరిగి
ముక్క ముక్కలై మాయమైపోయింది !

*　　*　　*

దిగంతాల విషాదగీతి నన్నుచూచి
నిశ్శబ్దంగా ఆర్భటించింది !

నాలో అలజడి

అంతులేని బాధలకు గురైన
ఎందరివో దీర్ఘ నిశ్వాసాలు
వేడి ఉచ్ఛ్వాసాలుగా మారి
నాలో ప్రవేశిస్తున్నాయి !

అడుగడుగునా,
అంతటా రగులుకున్న
కటిక దారిద్ర్యం తాలూకు మంటలు
నా చిన్ని హృదయాన్ని
పెద్ద అగ్నిపర్వతంగా మారుస్తున్నాయి !

అనుక్షణం ప్రతిస్పందిస్తున్న
ఈ హృదయంతో, నేను కవినైతే,
ఈలోకం తాలూకు చీకట్లనూ, బాధలనూ
ఎక్కడికో — దూర దూరాలకు —
తీసుకుపోయి కుమ్మరించి వద్దును !

ఏడ్చి ఏడ్చి కళ్లు ఎర్రబడి,
వాడిపోయిన ఈలోకం ముఖాన్ని,
కంపిస్తున్న నా చేతుల్లోకి తీసుకొని
ఓదార్పగలిగితే ఎంతబాగుండును ! !

శ్రీ చక్రవర్తి రంగస్వామి

డా॥ వా. వి. మిరాశీ

రెండవ పులకేశి ఆంధ్రదేశాన్ని ఎప్పుడు జయించాడు?

భాండార్కర్ యిన్స్టిట్యూట్‌కు సంబంధించిన 'ఆనల్స్' [సంపు–4 1921–22, పే. 43] అనే పత్రికలో నేను మొట్ట మొదటిసారిగ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి పేరు చదివి వుంటిని. వారు కొంతకాలం నాగ్‌పూర్‌లో వాస్తవ్యులైనట్లు నాకు తెలిసిన పిదప వారిపట్ల నాలో జిజ్ఞాస జనించింది. వారిని గూర్చి 'పంచవార' జార్నల్ – సెప్టెంబర్ 1979 త్రైమాసిక పత్రికలో ప్రొఫెసర్ ది. పం. జోశీగారి దీర్ఘ వ్యాసం ప్రచురించబడింది. అందులో వారికున్న బహుముఖ జ్ఞానంలో ఒక ముఖాన్ని [అంశాన్ని] గూర్చి పేర్కొనబడలేదు. తత్కారణంగా ఆ అంశాన్ని ఆంధ్రులకు తెలియపరచాలని, ఆంధ్రదేశపు ప్రాచీన చరిత్రలో వివాదగ్రస్తమైన ఒక సమస్యను విపులముగా విశదీకరించాలని యీ ప్రస్తుత వ్యాసం వ్రాయుటంలో నా ఉద్దేశ్యం.

కీ. శే. వేంకట లక్ష్మణరావుగారు ఆంధ్రదేశానికి, తెలుగు భాషకు నానా విధాలుగ సేవ చేసిరి. అంతేగాక, ఆంధ్రదేశపు ప్రాచీన చరిత్రను గూర్చి వున్నట్టి జ్ఞానాన్ని వారు యెంతో అంతా పెంపొందించిరి. అది నాటి కాలానుగుణంగా విశేషంగా ఉల్లేఖించదగింది. వారి ద్వారా సంపాదితమైన రెండవ పులకేశికి చెందిన కొప్పరం తామ్ర శాసనం భాండార్కర్ యిన్స్టిట్యూట్ యొక్క 'ఆనల్స్' నాల్గవ ఖండంలో సుమారు 60 సంవత్సరాలకు పూర్వం అనగా క్రీ. శ. 1921 లో ప్రచురించబడింది. నాటి కాలంలో ప్రాచీన భారత చరిత్రను సాధారణంగా బూలర్, కీల్హారన్, ఫ్లీట్ వంటి యూరపు పండితులే పరిశోధించేవారు. డా. రామకృష్ణ గోపాల్ భాండార్కర్, కా. త్రిం. తెలంగ్ లాంటి భారతీయ పండితులు మాత్రమే యిట్టి విషయములో శ్రద్ధ చూపేవారు. మొత్తానికి యిలాంటి భారతీయ విద్వాంసుల సంఖ్య లేశ మాత్రమేనని చెప్పాలి. అంతేగాక, అధ్యయన సాధనాలు కూడా ఆ రోజుల్లో తగినంతా లభ్యంలో లేవు. ఇట్టి సందర్భంలో వేంకట లక్ష్మణరావుగారికి గుంటూరు జిల్లాలోని కొప్పరంలో మూడు రేకుల తామ్ర శాసన మొకటి లభించింది. ప్రాచీన లిపిలో వ్రాయబడి వుండటం వలన సహజంగా అది పఠనా సులభంగా లేదు. అందువలన లక్ష్మణరావుగారు డా. బూలర్, రా. బ. ఓఝా వంటి వారి గ్రంథాలను సేకరించి ప్రాచీన లిపిని అభ్యసించారు. శాసనంలో పేర్కొన్న కాల పరిశీలనకై వారు జ్యోతిశ్శాస్త్రీయ గణితమును అవగాహన చేసుకొని దాన్ని (శాసనాన్ని) గూర్చి ఒక విస్తృత రచన పూర్వోల్లేఖిత పత్రికలో ప్రచురించారు. ఇప్పుడిలాంటి అధ్యయనానికి పరిస్థితి చాల అనుకూలించింది. గత శతాబ్దిలో దేశ, పరదేశ విద్యావేత్తలు వందలాది శాసనాలను అభ్యసించి ప్రాచీన భారత చరిత్రను ఎంతో తేటతెల్లము చేశారు. శాసనాధ్యయన నిమిత్తం అనేకసాధనాలు వెలువడినాయి. కావున నేడు వాటి అధ్యయనం సులభము. ప్రతికూల పరిస్థితిలో కూడా వేంకట లక్ష్మణరావుగారు ఆంధ్రదేశపు ప్రాచీన చారిత్రిక సాధనాలను అతి పట్టుదలతో అధ్యసించి వాటిలోని విశేషాంశాలను వెల్లడించారు. కావున వారెంతో శ్లాఘనీయులు.

పైన పుల్లేఖించిన రచనలో కలకత్తా యూనివర్సిటీకి చెందిన 'జర్నల్ ఆఫ్ లెటర్స్' అనే పత్రికకు మరో తామ్ర శాసనాన్ని వారు ప్రచురణార్థంగా పంపించినట్లు పేర్కొనబడింది. అది వివ్ణుకుండిన వంశపు మాధవవర్మదని తెలిసింది. ఇంకా యిలాంటి రచనలను వారు ప్రచురించి వుండాలి, వాటిని పరిశోధించాలి.

విజాపూర్ జిల్లాలోని 'బదామి' [ప్రాచీన వాతాపి]లో క్రీ. శ. 6వ శతాబ్ది పూర్వార్ధంలో చాళుక్య వంశం ఉదయించింది. ఆ వంశంలోని మహా పరాక్రమశాలి రాజు రెండవ పులకేశి తన రాజ్యాన్ని విస్తరించి నర్మదాకు దక్షిణాన విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు ఆంధ్రదేశమును జయించి అక్కడ తన తమ్ముడయిన విష్ణువర్ధనుని (ఇతనికి 'కుబ్జ విష్ణువర్ధన' అను రెండవ పేరు, 'విషమసిద్ధి' అని బిరుదు ఉండేది.) నియమించెను. ఈ తూర్పు చాళుక్యుల రాజ్యం ఆంధ్ర ప్రదేశంలో 11వ శతాబ్ది తుది వరకు నిలిచింది. ఈ కారణంగా ఆంధ్రదేశాన్ని పాలించిన ప్రాచీన రాజ్యాలలో యీ రాజ్యానికి ఒక మహత్త్వ స్థానమున్నది.

చాళుక్యులు ఆంధ్రలోని వేంగిలో ఏ సంవత్సరం తమ ఆధిపత్యాన్ని స్థాపించిరనేది విద్వాంసులలో తీవ్ర వివాదవిషయంగా తయారయింది. వేంకట లక్ష్మణరావుగారు తను కొప్పరం తామ్ర శాసనాధారంతో అట్టి కాల నిర్ధారణకై ప్రయత్నించిరి. కాని అన్యులకది అంగీకరం కాలేదు. ఇదే విషయాన్ని గూర్చి యిచ్చట చర్చించుకుందాము.

కొప్పరం తామ్రశాసనం చాలతప్పుగా వ్రాసి వేయించబడింది?[1] అందువలన దానిఅర్థానుమానంలో భిన్నాభిప్రాయాలు కలుగుతున్నాయి. ఇతర చాళుక్య రాజుల తామ్ర శాసనాల వలెనే యీ శాసన ప్రారం

భంలో కూడా చాళుక్య వంశ వర్ణన వున్నది. తరువరి ఈ వంశంలో ప్రసిద్ధ రాజగు మొదటి కీర్తివర్మనుని మనుమడు (వాస్తవానికి పుత్రుడు) రెండవ పులకేశి గూర్చి పేర్కొనబడింది. శాసనంలోని సందేశాన్ని అందరికి తెలియపరుస్తున్నట్లు శాసన దాత అందులో పలుకుతున్నాడు. వల్లభుని (అనగా రెండవ పులకేశి) ఉపస్థితిలో తాను శత్రు రాజ్యాలను జయించి వాటిపై తన కుమారుని నియోగించినట్లు కూడ అందులో తరువాత వర్ణించబడింది. 'పృధివీ దువరాజ' పేరు గల ఆజ్ఞప్తుడు[2] (ఉన్నతాధికారి) ఆపస్తంబ శాఖకు చెందిన ఒక బ్రాహ్మణునికి కర్మ రాష్ట్రంలోని ఇబూరి అను పేరుగల గ్రామంలో 800 (నివర్తనాల) క్షేత్రం దాన మిచ్చాడు. తరువాత యీ దాన కాలాన్ని గూర్చి 'ప్రవర్ధమాన — విజయ రాజ్య సంవత్సరే ఏక వింశతి కార్తిక మాసే మహా నవమ్యాం బృహస్పతి వారే ప్రశస్త ముహూర్తే స్వాదత్తి రాజ్ఞప్తిః' అని పేర్కొనబడింది. రచయిత యొక్క సంస్కృత భాషానభిజ్ఞత కారణంగా యీ వాక్యం చాలా తప్పుగా వ్రాయబడింది. ఈ విషయాన్ని గూర్చి ముందు పరిశీలిద్దాము.

ఈ తామ్రశాసనం రెండవ పులకేశి కాలానికి చెందిందని చెప్పటంలో ఎట్టి సందేహంలేదు. ఇకపోతే యీ క్షేత్ర దానమును చేసిన పృధివీదువరాజు అను పేరుగల ఆజ్ఞప్తి ఎవరు? శక సంవత్ 532 (క్రీ. శ. 610–611) లో 'ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సర విసానే' యీ సంవత్సరమున పృథ్వీవల్లభ మహారాజు యొక్క ఆజ్ఞతో దాన మిచ్చే, గోవాకు చెందిన, సత్యాశ్రయ ధ్రువరాజు ఇంద్రవర్మన్ అయివుంటాడని వేంకట లక్ష్మణరావుగారు ప్రతిపాదించారు.[3] 'ధ్రువ రాజ' అనునదే కొప్పరం శాసనంలో 'దువరాజ'గా రూపాంతరమయిందని వారు తలంచి యీ సమీకరణ సూచించారు.

సత్యాశ్రయ ధ్రువరాజు గోవా తామ్ర శాసనాన్ని శక సంవత్ 532 (క్రీ. శ. 610–611)లో యిచ్చాడు. ఆ సంవత్సరం ఒకానొక రాజుయొక్క పరిపాలన కాలపు 20వ సంవత్సరమని యీ శాసనంలో పేర్కొనబడింది. ఆ రాజు (సత్యాశ్రయ ధ్రువరాజు యొక్క చక్రవర్తి) ఎవరనే దాన్ని గూర్చి పండితులు భిన్నాభిప్రాయాలను ప్రతిపాదించారు. అతడు రెండవ పులకేశియొక్క పినతండ్రి మంగలేశ్ (పులకేశి అధికారాన్ని అణచి అతని రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నవాడు) అయి వుంటాడని రామకృష్ణ పంత్ భాండార్కర్ గారి అభిమతం.

పైన వుల్లేఖించిన సంవత్సరం సత్యాశ్రయ ధ్రువరాజుయొక్క పరిపాలన కాలానికి చెందినదేనని ఫ్లీట్‌గారి అభిప్రాయం. ఫ్లీట్‌గారి అభిప్రాయం సముచితం. మాండలిక రాజులు తమ తామ్ర శాసనాలలో పరిపాలన కాలపు సంవత్సరమును రెగ్నల్ యియర్ పేర్కొనునప్పుడు అట్టి సంవత్సరం వారి స్వయ పరిపాలన కాలానిదే అయివుంటుంది. ఇందుకు ఉదాహరణంగా, యిటీవల గుజరాత్‌లో లభించిన తామ్ర శాసనాలలోని కాల వుల్లేఖనాల ద్వారా దీన్ని మేము నిరూపించాము.[4] కావున గోవా తామ్ర శాసనంలోని శక సంవత్ 532 సత్యాశ్రయ ధ్రువరాజు యొక్క పరిపాలన కాలపు 20వ సంవత్సరం, యీ విషయాన్ని గూర్చి శంకించరాదు.

కొప్పరం తామ్ర శాసనంలోని 21వ సంవత్సరం ఏ పరిపాలన కాలపుదనే దాన్ని గూర్చి యిప్పుడు పరిశీలిద్దాము.

కొప్పరం శాసనంలో 'సత్యాశ్రయ ధ్రువరాజ' అనునది 'పృథివీ దువరాజ'గా రూపాంతరమయిందనే వేంకట లక్ష్మణరావుగారి అభిప్రాయాన్ని అనేక విద్యావేత్తలు అంగీకరించటంలేదు. సుప్రసిద్ధ జర్మన్ విద్వాంసుడు హుల్ట్‌శ్‌గారు కొప్పరం తామ్ర శాసనం గూర్చి ఎపిగ్రఫియా ఇండికా 18వ సంపుటి (క్రీ. శ. 1925 – 1926) 257 పుటపై సంపాదకత్వం వహించారు. ఆయన తన రచనలో 'యువరాజ' అను మాట ద్రావిడ భాషలో 'దువరాజ' గా రూపాంతరమయిందని ప్రతిపాదించారు. (తెలుగువారు యీ విషయాన్ని గూర్చి తమఅభిప్రాయాలను వెల్లడించవలెను.) అయితే ఈ తామ్రశాసనాన్ని వేయించిన యువరాజు చాళుక్య వంశీయుడైన విష్ణువర్ధనుడు (రెండవ పులకేశి తమ్ముడు) అయి వుంటాడు. ఇతడు పులకేశి యొక్క 21వ సంవత్సరములో కూడా తన అన్నను ఆశ్రయించి ఉండెను. కావున అట్టి సంవత్సరంలో ఈయబడిన తామ్ర శాసనాలలో అతనిని 'యువరాజ' అని పేర్కొనబడింది.

కొప్పరం తామ్ర శాసనంలో 'కార్తిక (శుక్ల) నవమీ గురువారను' ఉల్లేఖించబడింది. శాసనాల ప్రామాణికత, అప్రామాణికతలను నిర్ణయించుటలో యీ తిథివారాదులు చాలా ఉపయోగిస్తాయి. ప్రస్తుత వివాదగ్రస్తమయిన విషయానికి వీటి సాక్ష్యాలు ఎంతవరకు ఉపయోగిస్తాయో మనం చూద్దాము.

సత్యాశ్రయ ధ్రువరాజుయొక్క పరిపాలన కాలపు 21వ సంవత్సరమున, శక సంవత్ 533 కార్తిక (శుక్ల) నవమీ, గురువారము నాడు కొప్పరం తామ్రశాసనం ఈయబడిందని లక్ష్మణరావుగారి అభిప్రాయం. 533 శక సంవత్సరాన్ని (కరెంట్ యియర్) వర్తమాన సంవత్సరముగా లెక్కిస్తే యీ తిథి 21 అక్టోబరు 611 అవుతుంది. ఈ తేదినాడు గురువారం వస్తుంది. ఈ తిథి వారాదులు తామ్రశాసనంలో నిర్దేశించిన తిథివారాలతో సమన్వయిస్తున్నాయి. [గోవా తామ్రశాసనంలోని సంవత్సరాన్ని కూడా యిట్లే వర్తమాన సంవత్సరంగా పరిగణించాలి.] హుల్ట్‌శ్ అభిప్రాయానుసారంగా రెండవపులకేశి పరిపాలన కాలపు 21వ సంవత్సరమున కార్తిక (శుక్ల) నవమి గురువారంనాడు కొప్పరం శాసనమీయబడింది. స్వ్యాయల్ దొరగారు దీన్నిలా లెక్కించి చూపారు—పులకేశి క్రీ. శ. 610 అక్టోబరు 11వ తేదిన లేదా తదనంతరం గద్దెనెక్కినట్లు అనుమానిస్తే, కొప్పరం శాసనంలోని అతని పరిపాలన కాలపు 21వ సంవత్సరం క్రీ. శ. 631 ,అక్టోబరు 10 (గురువారం) తేదిగా తేలుతుంది.

పై రెండూ అభిప్రాయాలలోని వార నిర్దేశంలో వైపరీత్యము లేదు. అయినచో యీ తామ్రశాసనంలోని క్లిష్ట సమస్య పరిష్కారమయ్యేదెట్లు?

లక్ష్మణరావుగారి అభిప్రాయానుసారంగా శాసన తిథి రెండవ పులకేశియొక్క పరిపాలనా కాలారంభపు మొదటి సంవత్సరం (అనగా క్రీ. శ. 611లో) అవుతుంది. హుల్ట్‌శ్‌గారి ప్రకారంగా అతని పరిపాలనా కాలాంతపు 21వ సంవత్సరం (అనగా క్రీ. శ. 631) అవుతుంది. ఇది వీరిద్దరి అభిప్రాయాలలో వున్న వ్యత్యాసం. ప్రాచీన భారతీయ చరిత్రకారులు హుల్ట్‌శ్‌గారి అభిమతంతో ఏకీభవిస్తున్నారు. ఈ సమస్య పరిష్కరణకు కొప్పరం తామ్రశాసనమును సూక్ష్మంగా పరిశీలించాలి.

క్రీ. శ. 634లో వేయించిన ఐహోళే శాసనంలో రెండవ పులకేశియొక్క సామ్రాజ్య వర్ణన ఉంది. అయితే యిందులో అతని విజయాలను కాలానుక్రమంగా వర్ణించక కాళిదాసుని రఘువంశంలో వలె భౌగోళిక స్థలానుక్రమంగా వర్ణించబడింది. ఉదాహరణకు అతడు యీ క్రింద వివరించిన క్రమములో దక్షిణ భారతంలోని దేశాలను జయించెనని చెప్పబడింది—ఉత్తర కన్నడ, ఉత్తర కర్ణాటకలోని గంగ మరియు ఆలూప ప్రదేశాలు, ఉత్తర కొంకణ్, గుజరాత్, మాళవ, మూడు మహారాష్ట్రలు, దక్షిణ కోసల, కళింగ, ఆంధ్ర మొదలయినవి. అతడు యీ దేశాలను యిదే క్రమములో జయించాడని అనుకోరాదు. కాని, క్రీ. శ. 634కు పూర్వమే యీ దేశాలన్నీ జయించబడెనని మాత్రం మనం చెప్పగలుగుదుము. కావున యీ శాసనం మనకు దోహదపడదు. పులకేశి ఆంధ్రదేశాన్ని ఎప్పుడు జయించాడనే దాన్ని నిర్ణయించటానికి కొప్పరం తామ్రశాసనాన్ని సూక్ష్మంగా అధ్యయనం చేయాలి.

ముందుగా మనము హుల్ట్‌శ్‌గారి అభిప్రాయాన్ని పరిశీలిద్దాం. ఈతని అభిప్రాయానుసారంగా కొప్పరం శాసనమును క్రీ. శ. 631లో రెండవ పులకేశి సమక్షంలో పృథివీ దువరాజు, అనగా ఆతని తమ్ముడు, యువరాజు విష్ణువర్ధనుడు యిచ్చాడు. అందులో అతనిని గూర్చి యీ క్రింది విధముగా వర్ణించబడింది. ‘‘అతడు అనేక యుద్ధాలలో విజయంపొంది ఉండెను, శత్రుమండలాలను (దేశాలను) గెలిచి వాటిపై తన పుత్రుని నియమించి ఉండెను. మరియు అతడు ఆజ్ఞప్తి (రాజుయొక్క ప్రధానాధికారి)గ నుండెను.

పై అభిప్రాయం సంభావ్యమనిపించదు. ప్రస్తుత తామ్ర శాసన వివరణలో శాసనాన్ని వేయించిన యువరాజు పేరు విష్ణువర్ధనుడని పేర్కొనబడలేదు. ఈ కారణంగా యీ శాసనానికి నేను మహత్త్వమివ్వను. అంతేగాక, క్రీ. శ. 631లో విష్ణువర్ధనుడు యువరాజుగాలేడు. క్రీ. శ. రమారమి 615లో పులకేశి అతనిని ఆంధ్రదేశానికి రాజుగా నియోగించి ఉండెను. క్రీ. శ. 632కు చెందిన అతని సొంత చిపురుపల్లి [5] తామ్రశాసనములో అతని ‘మహారాజ’ బిరుదు పేర్కొనబడింది. కావున అతనిని క్రీ. శ. 631లో ‘యువరాజ’ లేక ‘ఆజ్ఞప్తి’ అని ఎట్లనబడును? అతడు అనేక దేశాలను గెలిచి వాటిపై తన కుమారుని అధిపతిగా నియమించి ఉండెను. ఆంధ్రాధిపతియైన విష్ణువర్ధనుని యిలా నియమించటంలోగల ప్రయోజనమేమి ? అదీగాక, ప్రస్తుత తామ్రశాసనములో పులకేశితో అతనికున్న సన్నిహిత సంబంధాన్ని (అతడు అతని సొంత తమ్ముడని) ఉల్లేఖించబడలేదు. హుల్ట్‌శ్‌గారి పూర్వోల్లేఖిత అభిప్రాయాలపై యిలా అనేక ఆక్షేపణాలు సంభవిస్తుంటే అతని అభిప్రాయాలు గ్రాహ్యమనిపించవు.

లక్ష్మణరావుగారి అభిప్రాయానుసారముగా యీ తామ్రశాసనాన్ని పులకేశియొక్క సామంతుడైన సత్యాశ్రయ ధ్రువరాజు క్రీ. శ. 611లో యిచ్చాడు. ఈ అభిప్రాయముపై పై ఆక్షేపణాలు సంభవించవు. ‘ధ్రువరాజ’ అనునది ‘దువరాజ’గా రూపాంతరమగుట అధిక సంభవనీయం. అతనికి చాళుక్యవంశంతో చుట్టరికం ఉండేది. గోవా తామ్రశాసనాన్ని తాను పృథివీ వల్లభ మహారాజు (పులకేశి)యొక్క సమ్మతితో యిస్తున్నట్లు చెప్పబడింది. అట్లే కొప్పరం తామ్ర శాసనములో ‘నేను అతని ఉపస్థితిలో యీ దానం చేస్తున్నా’నని నిర్దేశించబడింది. తదుపరి ‘నా తరువాత నా కుమారుని సదరీ విరోధనం చేయకూడదని అతనికి కూడా నాచే జయించబడిన ప్రదేశాన్ని యిచ్చాను’ అని కూడ స్పష్టంగా ఉల్లేఖించబడింది. అతని ‘ఆజ్ఞప్తి’ (గ్రామాది దానాలను అమలుజరుపు అధికారి) పదవి అతని అధికారానుగుణంగనే ఉన్నది.

అందువలన, కొప్పరం తామ్రశాసనాధారంగా పులకేశి ఆంధ్రదేశాన్ని జయించిన కాలము నిశ్చితంగా తెలుస్తుందనే లక్ష్మణరావుగారి అభిప్రాయం సముచితం. సామంతుడైన సత్యాశ్రయ ధ్రువరాజు తన పరిపాలన ప్రారంభదశలో ఆంధ్రదేశమును జయించి అట్టి విజయ స్మరణార్థంగా పులకేశి సమక్షంలో క్రీ. శ. 611లో క్షేత్రదానం చేశాడు. ఈ సంఘటన పులకేశి గద్దెనెక్కిన వెంటనే సంభవించటంలో అసంభవమేమిలేదు. చాళుక్యుల ముఖ్యపట్టణమగు ‘వాతాపి’ (నేటి ‘బదామి’) బిజాపూర్ జిల్లాలో ఉంది. ఆ జిల్లా ఆంధ్రదేశానికి దూరములో లేదు. ఇదే సందర్భంలో పులకేశి తన తమ్ముడగు విష్ణువర్ధనుని దక్షిణ మహారాష్ట్రకు యువరాజుగా నియమించాడు. అతని ‘సాతారా తామ్రశాసనం’[6] పులకేశియొక్క పరిపాలన కాలపు ఎనిమిదవ సంవత్సరం(క్రీ. శ. 617)లో వ్రాయబడింది. అటుతరువాత పులకేశి ఏదో కారణంగా ఆంధ్రదేశాన్ని సత్యాశ్రయ ధ్రువరాజునుండి లేక అతని వంశస్థులనుండి హస్తగతం చేసుకొని దాన్ని అతడు విష్ణువర్ధనునికి యిచ్చినట్లు కానవస్తుంది. విష్ణువర్ధనుని ‘చిపురుపల్లి’ తామ్రశాసనంలో అతని పరిపాలన కాలపు 18వ సంవత్సరమున శ్రావణ పూర్ణిమనాడు జరిగిన చంద్రగ్రహణమును గూర్చి ఉల్లేఖించబడినది. ఈ చంద్రగ్రహణం క్రీ. శ. 632లో జరిగింది. ఈ కారణంగా విష్ణువర్ధనుని రాజ్యపాలన క్రీ. శ. 615లో ప్రారంభమయిందని బలపడుతుంది. కాని యీ రాజ్యపాలన పూర్తిగా ఆంధ్రదేశంలోనే జరుగలేదు. క్రీ. శ. 615లో అతడు దక్షిణ మహారాష్ట్రకు యువరాజుగా నియమించబడెను, కావున యీ సంవత్సరం మొదలు అతని పరిపాలన సంవత్సరాలు లెక్కించబడెనని భావించాలి.

క్రీ. శ. దాదాపు 611 లో ఆంధ్రదేశంలో విష్ణుకుండినీల రాజ్యము పతనమయిన తరువాత రాజ్యక్రాంతి జరిగిందని యిటీవల లభించిన విష్ణుకుండిన తామ్రశాసనాలద్వారా నేను యితరత్రా చూపించాను.[7]

ఇలా పులకేశి సామంతుడైన సత్యాశ్రయ ధ్రువరాజు క్రీ. శ. 611లో ఆంధ్రదేశాన్ని ప్రథమంగా జయించాడు. ఇచ్చట అతడు ఆరు, ఏడు సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. తరువాత పులకేశి యితనిని తొలగించి తన తమ్ముడయిన విష్ణువర్ధనుని అచ్చట నియమించినట్లు పుష్టి అవుతుంది.

వేంకట లక్ష్మణరావుగారి జన్మ శతాబ్ది సందర్భంలో వారు ప్రతిపాదించిన ఒక అభిప్రాయాన్ని నేను సప్రమాణంగా సమర్థించగలిగితినని సంతోషిస్తున్నాను.

అ ధో జ్ఞా పి క లు

1 'ఈ తామ్రశాసన రచయితకు సంస్కృత భాషాజ్ఞానం అత్యల్పం. అందువలన కొన్ని చోట్లలో ఉల్లేఖించవలసిన విషయాలను వ్యక్తపరచటంలో సందిగ్ధపడ్డాడ'ని హుల్ట్‌జ్ గారి ఉద్దేశం.

2 'ఆజ్ఞప్తి'ని 'దూతక' అని కూడా అంటారు. రాజు యిచ్చిన దానాది విషయాలను అమలు జరుపుట యీతని పని.

3 జర్నల్ ఆఫ్ ది బొంబే బ్రాంచ్ ఆఫ్ ది రాయల్ ఏషియాటిక్ సొసయిటీ, వాల్యూమ్–10, పే–348.

4 'సంశోధన ముక్తావళి' సర–6, పే–88.

5 ఇండియన్ ఆంటిక్వెరీ, వాల్యూమ్–20, పే–15 వగయిరా. ఈ తామ్రశాసన కాలము క్రీ. శ. 632 అని ఫ్లీట్ నిర్ణేశించారు.

6 ఇండియన్ ఆంటిక్వెరీ, వాల్యూమ్–19, పే–303 వగయిరా. ఈ తామ్రశాసన కాలం క్రీ. శ. 615 లేదా 617 అయి వుంటుందని ఫ్లీట్‌గారి అభిప్రాయం. అయితే అందులో ఉల్లేఖించిన రాజ్య సంవత్సరానికి, పులకేశి రాజ్య సంవత్సరానికి సామ్యం కుదరదు. తదానుసారంగా। అది క్రీ. శ. 617–618కి చెంది వుంటుంది. క్రీ. శ 615 లతని యౌవ రాజ్యాభిషేకం జరిగివుంటుంది. అప్పుడతడు మహారాష్ట్రలో వున్నాడు.

7 ఆ శాసనాలలో ఆంధ్రలో విష్ణుకుండిన రాజ్యం క్రీ. శ. దాదాపు 615లో పతనమై వుంటుందని అనుమానించబడింది. ఈ సంఘటన అంతకు నాలుగు సంవత్సరాలకు పూర్వం (క్రీ. శ. 611లో) సంభవించి వుంటుంది.

[డా. వా. వి. మిరాశీగారు పై వ్యాసమును కీ. శే. కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారి జన్మ శతాబ్ది నిమిత్తంగా వ్రాసిరి. ఈ వ్యాసం 'పంచధార' అను మరాఠీ త్రైమాసిక పత్రిక (మార్చ్ 1980)లో ప్రచురించబడెను. ఈ పత్రిక మరాఠీ సాహిత్య పరిషత్, హైదరాబాదు (ఆంధ్రప్రదేశ్) నుండి వెలువడుతున్నది.]

అనువాదం : శ్రీ కావలి రాములు

కా లం తో క య్యం

శ్రీ సూరం శ్రీనివాసులు

జాతి జీవన తీరంలో
 ముత్యాల్లా ప్రకాశింపవలసిన
నా పవిత్ర సంస్కృతి శకలాలను
అజంతా, ఎల్లోరా గుహల్లో సిలువవేశారు
పాలరాళ్ళతో సమాధులుకట్టి
మధ్యలో ప్రదర్శనకు నిలబెట్టారు
ఆగిపోయిన గడియారాన్ని
అందమైన పెట్టెలో పెట్టి
ముళ్ళు చూచుకుంటూనే
మురిసిపోతున్నారు

కళ్ళల్లో వెలుగవలసిన ప్రతిదీపం
గుండెల్లో రగులవలసిన ప్రతిభావం
ఆ సంస్కృతిమూర్తి అందించిన
అభ్యుదయ కళాస్వరూపం
అయినా
దీపాలు కొడిగట్టిపోతున్నా
భావాలక్కడే అణగారిపోతున్నా
కళాస్వరూపంమాత్రం కాలంతో పోటీపడుతోంది
నువ్వుముందో నేనుముందో
తేల్చుకుందాం రమ్మంటోంది.

ఆయన అడుగు జాడలలో ఆంధ్రప్రదేశ్

అది అంత సులభతరంకాదు. ఎందుకంటే ఆయనలాంటి మహా మనిషి ఆయన ఒక్కరే. అయినా, మనకు వీలయినంతవరకు మనం చేస్తున్న కార్యక్రమాల మేరకు ఆయన సిద్ధాంతాలను పాటించ డానికి ప్రయత్నం చేయవచ్చు.

ఆగసు 13న ఈదుల్ ఫితర్ నాడు ముఖ్యమంత్రి హిందువులతో పాటుగా తనతోటి ముస్లిమ్ సోదరులతో చిరస్మరణీయమైన ఈద్ మిలాప్‌లో పాల్గొన్నారు. ఆవిధంగా ఆంధ్రప్రదేశ్ మహాత్ముని అడుగుజాడలలో నడిచింది.

ఆంధ్రప్రదేశ్ సెప్టెంబర్ 23న మళ్లీ అదేవిధంగా చేసి తన ప్రత్యేకతను నిలుపుకుంది. మరెక్కడాలేని విధంగా కేవలం ఒక్క హైదరాబాదులో మాత్రమే 10 లక్షలకు పైగా హిందూ ముస్లిమ్ ప్రజలు కలసి విగ్రహాల నిమజ్జనం నాడు గణేశ్ ఉత్సవాలను అపూర్వమైన రీతిలో జరుపుకున్నారు. ముఖ్యమంత్రి గంటల తరబడి ప్రయాసకు ఓర్చి మరి ఆ సంతోష ఘడియలలో పాలుపంచుకున్నారు. అటువంటి సంఘటన నభూతో నభవిష్యతి.

మనందరం భగవంతుని పిల్లలమని గాంధీజీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మనం ఉడతాభక్తిగా ఆయన సూక్తులను నిజం చేస్తున్నాము.

ఈ సత్సంప్రదాయాన్ని పరిరక్షిద్దాం.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.

No. 31757/Advt./I-C 3/80.

అరణ్యంలో కోలాహలం

ప్రత్యూష

అరణ్యాధిపత్యం కోసం ఆరంభమైంది
  ఖగ మృగాల సంకుల సంరంభం
ఉదర పోషణ మాత్రకై బతికే కాకులు ఒక్కసారిగా బాకాలందుకున్నాయి।
లోకాన్ని కనీసం కన్నెత్తి చూడని
'దంత గోపుర కాపురం' వెలగబెట్టే గూబలు రణభేరీ మోగిస్తున్నాయి
ఇకనైనా పోయిన రాచరికాన్ని దక్కించుకోవాలని సింహం జూలు విదిలిస్తోంది
ప్రతివారూ ప్రోది చేసికుంటున్నారు తమబలం
ఎక్కడ చూదామన్నా అరణ్యమంతా ఒక్కటే కోలాహలం।
పరస్పరం –
కొంగలకు బంగారు పళ్ళెరాల పాయసం
నక్కలకు సన్నమూతి కూజాల పలావు।
చేసిన పాపాలకు పశ్చాత్తాపం ప్రకటిస్తూ
బంగారు కడియం మెరిపిస్తూ చెరువు నీటని చూపిస్తోంది పులి
            బాటసారి బాపనయ్యకు।
అమ్మతోడు।
ఈసారి తప్పక దూరాన సముద్రాన
మీకోసం అందాల పగడాల మేడలు నిర్మించాను
ఒక్కొక్కరినే పదిలంగా మోసుకుపోతానని ఉపన్యాసం
విసరుతోంది గుడ్డి కొక్కిరాయి చేపలకు।
అమృతభాండం తెచ్చిపెట్టు ఈ ఒక్కమాటు
ఒట్టు ! నీకిక దాస్య విముక్తి కల్పిస్తామంటున్నాయి గరుడునితో సర్పాలు –
ఇదే అదనని మతిని తాకట్టుపెట్టిన సింహం,
సందేహంమాని కుందేలు వెంట పరుగులు తీస్తోంది నూతిలో దాగిన సింహాన్ని సంహరించేందుకు।
రండి ! రండి ! ఆదూరాల ఎండమావుల నీళ్ళన్నీ మీపేర పట్టా చేస్తామనగానే
జింకలన్నీ పరుగు లంకించుకున్నాయి
తరిమే డేగ తటాలున చెంత వాలగానే
పారిపోయి; పావురాయి
శిబిలేని పూలవనంవద్ద ఆగిపోయింది
రాబోయే వసంతాలన్నీ మీపేరే వ్రాయించేస్తామని ప్రచారం చేస్తున్నాయి బడుగు పక్షులకి
ఎలాగయినాసరే ! ఈసారి పోయిన రాజ్యం తప్పక
లభించి తీరుతుంది సింహరాజానికి;
రాహుబలం బాగా వుందని గ్రహసంచారాల్ని
రాసిచక్రంగీసి జ్యోతిష్యం చెబుతున్నాయి రామచిలుకలు !

ఏదో నీనోరు తెరిచి ఒక్కసారి ఆలపించు
నీ గాన మాధుర్యంముందు కోకిలస్వరం దిగదుడుపంటోంది నక్క కాకితో।
ఇదంతా తొర్రలోంచి చూస్తోన్న గబ్బిలం తన పంథా ఎంచుకుంటోంది।
పక్షులతో –
నాకు రెండు పక్షాలున్నాయ్। నేను పక్షిని। నేను మీ పక్షమే। అంది
జంతువులతో –
నాకు నాలుగు కాళ్ళున్నాయ్। నేను జంతువుని నేను మీపక్షమే అంది।
ఇదంతా పట్టవి ఎలుక నాలుగు గింజలేరుకు తిందామని కలుగు వెలుపలికొచ్చిందోలేదో
తటాలున –
ముందుగూబా
వెనుక ముంగిసా నిలిచాయి।
వలలో చిక్కిన పిల్లి తెల్లబోయి చూస్తోంది
ఇదంతా పచ్చ పచ్చగా చూస్తోన్న ఊసరవెల్లి రంగు రంగులుగా నవ్వింది
ఏనుగులూ – సింహాలూ
ఎలుగులూ – పులుగులూ
జీబ్రాలూ – జిరాఫీలూ
కోతులు – కొండముచ్చులూ...వేరువేరుగా
ఆవేశ కావేశాల – ఉపన్యాసాలు సాగిస్తున్నాయ్
అందరూ పోటీచేసేవారే
అందరూ ప్రసంగికులే
అలజడి పెచ్చురేగింది
సింహం గర్జించింది –
ఏనుగు ఘీంకరించింది
పెద్దపులి గాండ్రించింది
గాడిద ఓండ్రపెట్టింది
ఎలుగుల గోలలు – నక్కల ఊళలు – అరణ్యమంతా ఉద్రూతలూగింది !
అందరూ పాలకులైతే పాలితులెవ్వరు చెప్మా –
కోకిల పాడుతోంది
అన్నీ అటుచూశాయి
ఇంతలో నక్క అందుకుంది
గద్దా – కోడీ
ఏనుగూ – సింహం
పులి – జింకా
పిల్లి – ఎలుకా
పాము – కప్పా
తోడేలు – మేకా ఏకమయి ఎలయన్స్ కడదామంది
'షెభాష్'

(మిగతా 45వ పేజీలో)

శ్రీ చలపాటి ఆనంద నరసింహులు

కొర్రకోడు - తామ్రశాసనం - పరిశీలన

అనంతపురం జిల్లా, అనంతపురం తాలూకా కొర్రకోడు గ్రామస్థుడైన శ్రీ చిట్రాయరప్పగారి స్వాధీనంలో ప్రస్తుత తామ్రశాసనం కలదు. ఇది వారి పూర్వీకులనుంచి సంక్రమించిందట. ఈ తామ్ర శాసనం శ్రీ చిట్రాయరప్పగారినుంచి పరిశోధన నిమిత్తం పురావస్తు శాఖ, అనంతపురం విభాగంచే గైకొనబడినది. కొర్రకోడు గ్రామం అనంతపురంనుంచి 40 కిలోమీటర్ల దూరాన గలదు. ఈ గ్రామం చేరుటకు బస్సు సౌకర్యంమాత్రం గలదు. ఈ శాసనం ఒకే తామ్ర పలక. రెండువైపుల తెలుగు లిపిలో వ్రాయబడి యున్నది. మొత్తం 66 పంక్తులు కల్గియున్నది. ఇది 19.4 సెం. మీ. పొడవు, 15.4 సెం.మీ. వెడల్పు గలదు. అక్షరములు శుభ్రముగా చెక్కబడి ప్రస్తుత తెలుగు లిపికి దగ్గరగా నున్నందున పరిశోధన సరళముగా నున్నది. భాషా పరిచ్ఛేదములో ముఖ్యమైన భేదములు కానరావు.

శాసన కాలము

ఇది తారీఖుగల శాసనం. ఈ శాసనం శక వరుషంబులు ౧౧౦౯ (1109) జయనామ సంవత్సరము ఆశ్వయుజ శుద్ధ ౧౦ నాడు విజయబుక్కరాయలు రాజ్యం చేయుచున్న సమయంలో నొసంగబడినది. ఈ శాసనకాలం క్రీ. శ. 1187 అక్టోబరు 10వ తేదీకి సరిపోవును. చరిత్ర తెలిసిన ప్రతివారికి ఈ శాసనకాలం చూచిన తక్షణం ఈ తామ్రశాసనం అసంగతముగా గోచరించును. ఏలయన క్రీ. శ. 1187 నాటికి విజయనగర స్థాపన జరుగలేదు. విజయనగర స్థాపన క్రీ. శ. 1336లో జరిగినట్లు లోకవిదితము.[1] కాని జయనామ సంవత్సర కాలాన్ని పరికించిన మనకు మరొక విధముగా విదితమగును. జయనామ సంవత్సరం క్రీ. శ. 1355లో వచ్చినట్లు తెలియుచున్నది. జయనామ కాలం క్రీ. శ. 1355గా తీసుకొన్న విజయనగర రాజులలోని మొదటి బుక్కరాయల కాలానికి యీ శాసనకాలం సరిపోవుచున్నది. అయిన శాసనంలో తెల్పిన విజయ బుక్కరాయలు మొదటి బుక్కరాయలుగా పేర్కొనవచ్చును. ఆ విధముగా చూచిన యీ తామ్రశాసనం సంగతముగా గన్పడుచున్నది. అప్పుడు మనము శాసనకాలాన్ని వ్రాయసగాన్ని తప్పుగా పరిగణించవచ్చును. ఇటువంటి తప్పులు విజయనగర శాసనాలలో కోకొల్లలుగా గాన్పించును.[2]

శాసన విషయం

ఇందు ప్రధానముగా బుక్కరాయలు విజయనగరమును పరిపాలన చేస్తున్నప్పుడు జగదాపిగుత్తి సంబటి తిప్పరాజయ్యగారి స్వాధీనంలోనున్న తరుణంలో చాదుర్గం శ్రీ సింహాద్రినాయుడుగారి ధొరతనం క్రింద నుండెను. శాసన ప్రకారం కురుబయెల్లె దేవజికుమార్లు దేమగొండడు, కరెగొండడు, కెతగొండడు, కంమగొండడు, బుళగొండడు. వీరు సంబటి తిప్పరాజయ్యగారి శలవున నగరసీమ[3] లో నుంచి బండ్లలో చాదుర్గం వచ్చిరి. ఈ బండ్లకు పెద్దయగు బండియల్లనగార్కి చాదుర్గాధిపతియగు శ్రీ సింహాద్రినాయుడు యిచ్చిన దానపత్రమే యిది. దీనిమూలంగా శ్రీ సింహాద్రినాయుడుగారిపాలెంనకు లోబడిన బ్రాంహణపల్లె, రాం నాగ్రం అను రెండు గ్రామాల అధికారం: చాకిరీలు బండియల్లగౌడు చాదుర్గాధిపతినుండి పొందినాడు. పైగా యాదవకులం పోతులగోత్రం వోబలిగాని కుమార్లు ముదనగౌడు, చికనగౌడు. వీరిద్దరికి (రెడ్డిరికం) గ్రామాధిపత్యం, కరణీకం, తక్కిన చాకిరిలకు తగిన వారిని నియమించు యధికారం గూడా బండియల్లనగౌడు చాదుర్గం దొరనుండి పొందినట్లు గూడా విదితమగుచున్నది. పదవులలో నియమించిన వారి జీవనార్థం రొఖ్ఖంనకు బదులుగా పొలాలను విడివిడిగా కేటాయించి యిచ్చినట్లు గూడా గోచరిస్తుంది. ఇది అధికార దానపత్రంగా మనం తీసుకొనవచ్చును. అంతేకాని ఏకభోగ్యంగా గ్రామదానం చేసిన ధర్మశాసనంగా గాదు. అధికారదానం చేయుటకు అనుమతి పొందినవాడు బండి యల్లనగౌడు మాత్రమే.

వివిధ వర్ణస్తులకు కేటాయించిన వుద్యోగములు, వారి గోత్రముల వివరణ యీ శాసనంలో 17 నుంచి 26 పంక్తులలో గానవచ్చుచున్నది. వాటి వివరములు క్రింద కనుబరచినాము:

1 రెడ్డిరికానకు యాదవకులం పోతులగోత్రం వోబిళిగాని కుమార్లు ముదన గౌడు, చికనగౌడు.

2 కరణికానకు నగరశీమకం నడిల తిప్పరసయ్య కొమారుడు రామరసు

3 పురోహితనానకు నరసంభట్లు.

4 కరతనానకు బోళబసవొజు కుమారుడు పవాడి

5 వడ్రంగి తనానకు ముకుందు దొడొజు

6 సరాబు తనానకు సంగోజు కుమారుడు లింగోజు.

7 తలారి తనానకు భోగ్యం గోత్రం యురకామి నాయుని కుమారుడు బిల్లుకామి నాయుడు.

8 కుమ్మరతనానకు శాలివాహన ఖద్రి.

9 చాకలి తనానకు ముతడు

10 మంగళ తనానకు యిమ్మడి దెవొజు

11 బారికి తనానకు లకుమెశ్వరి పెతిగాడు


12 చకారి తనానకు అంకెగోత్రం యరజిగిలి గాని కుమారుడు దాసడు

పైన పేర్కొనబడిన వివిధ వ్యక్తుల సేవలకు నొసంగబడిన భూముల వివరములు—వాటి సరిహద్దులు యీ శాసనంలో 27 నుంచి 38 పంక్తులలో విశదీకరించబడినది.

పై శాసనంనుబట్టి ప్రారంభ దశలోనే విజయనగర చక్రవర్తులు గ్రామ కార్యకలాపాలను సక్రమముగా జరిపించుటకు నూతన పద్ధతి అనగా సొమ్ముకు బదులు భూములను వివిధ వ్యక్తుల సేవలకు వారి జీవనార్థం నొసంగెడివారని తద్వారా ప్రతి ఒక కులంలోనుంచి ఒకనిని ఎన్నికచేసి అతను నిర్వహించవలసిన గ్రామ కార్యాలను అప్పగించెడివారని అర్థమగుచున్నది. దీనినిబట్టి పూర్వకాలంలో కుల భేదము చూపక ప్రతి కులంనకు తగిన ప్రాధాన్యత విజయనగర రాజుల పరిపాలనలో నొసంగబడినదని కూడా విదితమగుచున్నది.

శాసనంలో పేర్కొనబడిన పల్లెల వివరణ

ఈ తామ్రశాసనంలో పేర్కొనబడిన గ్రామములు—నగరశీమ, కురుబలపల్లె, చాదుర్గం, బ్రాంహణపల్లె, రాంనాగ్రం. కాని బ్రాంహణ పల్లె మాత్రం కూడేరు గ్రామముకు దరిదాపున గలదు. ఇది షోత్రియం గ్రామం. మిగిలిన పల్లెల వునికి కానరాదు.



మొదటి ముఖము

శాసనపాఠము

మొదటి ముఖం

1 స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవరు

2 షంబులు ౧౧౦౯ యెండ్లు అగుననెటి జయనామసం। ఆశ్వి

3 జ శు ౧౦ ల్లు శ్రీ మద్రాజాధిరాజ పరమెశ్వర విరప్రతాప

4 విజయబుక్కరాయలు పృధ్వి సామ్రాజ్య యెలుచుండగా జ

5 దాపి గుత్తిదుగంన్ బుసికు చెల్లెరాజ్యం సంబటి లిపరాజయ

6 గారు శలవున నగర శిమలోనుంచి బండ్లతో విచిన కురుబయెల్లె

7 దెవజి కొమాళ్ళు దెవుగొండడు కరెగొండడు తెతగొండడూ

8 కలమగొండడు బుళగొండడు యీ ౫ గురుపన్నుతల్లి కొమాళ్ళున్

9 యాదవకులం పాతులగోత్రం వొబిలిగాని కొమారుడు ముదనగ

10 వుడు। చికనగౌడు యీ వచ్చిన బండ్లకు పెధగౌడు బండియల్ల

11 న గానికి యిచ్చిన దానపత్రం పెధగొళ్ళు గన్కు యీపెంన మాగాణితోపు

12 గ్గ' పాశి గవుళ్ల పెరించ్చినది కురుబలపల్లె తవాన్త యాదవకుల

13 ం తోటి నాయని కొమారుడు సింహాద్రినాయడు చాధుగన్ ధొర

14 తనం చెస్తువుండగా యీ ధొరల సంమతిన బండియగవుడు బ్రాం

రచయితలకి మనవి

రచనలలో ఇంగ్లీషు లిపి అధికంగాఉంటే అచ్చు కూర్పుకి ఇబ్బందిగా ఉంటుంది కనుక 'భారతి'కి తమ రచనలు పంపేవారందరూ వీలయినంత వరకు తెలుగు లిపినే వాడాలని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు.

15 హ్మణపల్లె రామనా(గం యీ రెండు (గ్రామాలు వణితంతు దశ యిచ్చి

16 కటెంచినవాడు బండి యల్లగౌడు యిద్కు యెకిన ఆయ గాడ్ల వివరం

17 రడిరి కానకు యాదవకులం పాతుల గో(త్రం వొబిళిగాని—కొమాలున్ ము

18 పసిగపుడు విక్కనగౌడు కరణీ కానకు నగరశిసుకం నడిల తిప్పరస

19 య్య కొమారుడు రామరసు పౌరోహితుడు నరసంభట్లు కరథనా

20 నకు నగర శిమబోళ బసవొజు కొమారుడు సవాడి వడ్లంగి తనా

21 నకు ముకుందు దొడొజు సరాబు తనానకు సంగొజు కొమా రుడు

22 లింగొజు తలారి తనానకు బోగ్యంగో(త్రం యురకాషి నాయని కొమా

23 రుడు బిల్లు కామినాయుడు కుంమర తనానకు శాలివాహన బ(ద్రి చె

24 పి చాకల తనానకు నగరసిమముదడు మంగళ తనానకు నగర నాడు

25 యిం నుడిదెవొజు బారికి తనానకు లకు యెశ్వరి పెతిగాడు చకా

26 రి తనానకు అంకె గో(త్రం యురజగిలిగాని కొమారుడు దాసడు యి

27 ందుకు మాంన్యస్వాస్తులు యెరమురియాదల వివరం। రెడి మాన్యం

28 (గ్రామానకు వుతరాన వరవంక చెను ౭౦। తటాకంకిందమడి ౭౧ క

29 రణికానికి మాన్యం (గ్రామపంపు చెను ౭౦। తటాకంకింద మడో౧

30 పురోహితానకు తుపుర్ న చెనుమ ౨ తటాకంకింద మడిమ ౨దె

31 వ దాయం పెరుమాళ్లకు తూపుర్ వద్దిమాని చెనుమ౨ పొతు।

రెండవ ముఖం

32 (రాజుకు దాని వత్తునె చెనుమ౨ కంమరత నానకు దక్షణం చె

33 ను మ౧ వడ్లంగి తనానకు తూపున్ న నారవ వంక చెనుమ౧ సరాబు

34 తనానకు తుపున్ చిల్లమాని చెనుమ౧ తలారితనానకు—(గ్రామం నలన

35 టి చెనుమ ౭ తటాకంకిందమడిమ ౭ కుంమరతనానకు తటాకం వు

36 త్తరపు రెవున చెనుమ౧ చాకల తనానకు తటాకం వొబున చెనుమ ౧

37 మంగళతనానకు తుపున్న పాడగుంటె చెనుమ౧ బారికి తనానకు తు

38 పుర్ నెలబండ చెనుమ౧ చకారి తనానకు వుతరం బొంతల—యెరను

39 చెనుమ౭ తటాకంకింద మడిమ౨ దెవదాయం (బంహ్మా దాయం పొ

40 గా నిల్చిన సక్యపాలం సిరువరి పొటొలం సహగాను ౫౭౦ గుటి కట్టి

41 నలిసి వెళి నిదెర్శం చెళిసపొలం ౫౨౭/౦/౦/ యింద్కు సిలానసన్ యిరి

42 గాడి బండన ముషి్ట కొయిలకు యి(గ్రామనకు తూపుర్ న ముగ్గడు

43 శాసనం। దానికి వుతరాన చిదిపి గుట్టవలపటి రాపటి కుయి(గా

44 మనకు ముగడు నెలబండకు ము(ద్రికె / దానికి పరమటి పుట్ట గుం

45 టికి ము(ద్రికె। దానికి పరమటి గుంటికి ము(ద్రికె దానికి పర మటి చి

46 ంనయిరందిపున గుంటికి ము(ద్రికె దానికి పరమటి నెలగుంటికి ము(ద్రికె

47 దానికి పరమటి తటాకం తూపుర్ రెవున (క్రిష్ణ సిలకు ము(ద్రికె। దానికి

48 పరమటి య(రమరిడిన పాతురాయి। దాని పరమటి రాపటి కుయి

49 (గ్రామానకు ముగ్గడు నెలబండకు శాసనం। దానికి దక్షణం బొంతల

50 యెరమున జకుల చెరువుకు రాపటి కుయి (గ్రామాలకు ముగ్గడు

51 పాతురాతికి ము(ద్రికె। దానికి దక్షణం సాలు రాయి దానికి దక్ష

52 ణం జకుల చెరువు భుచలాకు కొగరకు యీ ్రగామాలకు
నల్ల సా

53 గడ చడిసి రాళ్ళబండకు ముగ్గడు శాసనం। దానికి తూపుా
న్రకిష్ణ

54 శిలకు ము్రదికె। దానికి తుపుా సస్వెతశిలకు ము్రదికె।
దానికి తుపున్

55 నయురబెంచ్పురెవున సిలకు ము్రదికె దానికి తూపుాన తోడెళ
సల్ల

56 గటిన గుంటికి ము్రదికె ధానికి తూపుాన అంబళ్ల బండన
ముడు

57 ము్రదికె। దాన్కి పుతరపు కెైయిన సరికి దొణకు ము్రదికె।
దాన్కివు

58 త్తురాన సాలురాయి। యీ సాలు సాలుగాడి బండకు నడు
చునూ

59 యీ మర్యాదున పు్రత పౌ్రత పారం పరియంతరం ఆచం్రదా
కన్ స్తాయి

60 గా అనుభవించుక వుండెదని ్రశీ విరుపాక్షెశ్వరుణి దెవా
లయం

61 ముందు సిలమీద శాసనం వెయించి యీాదవకులం వొబిళి
రెడ్లి కొ

62 పూలున్ మువసగవ్పుడు నకస గవ్పుస గారికి బండియులన
గవ్పుడు కొమా

63 రు పదు యిచ్చె రెడిరికం యిచినామని దొరలు శింహ్యా్రది
నాయుని శలవు

64 న ఆయగాళ్ల సంమతిన ్రవాయించి యిచిన దానప్రతం
యిందు యు

65 పురం అక్షెసణ వెశిన కాశిలో గోహత్యం చెశిన పాపాన బోదు

66 రూ

సూచికలు

1 Robert–Sewell–Forgotten empire–page No. : 1

(A) In the year 1336 AD during the reign of Edward III of England, there occurred in India an event which almost instantaneously changed the political–condition of the entire South. With that date the Volume of ancient history in that tract closes and the modern begins. It is the epoch of transition from the old to the new. This event was the foundation of the city and kingdom of Vijayanagar.

(B) N. RAMESAN · APAs No : 4–Page No: 2

What ever be the theory of the origin of the Vijayanagar empire it seems to be fairly clear that Devaraya (OR) Hari Hara devaraya founded the city of Vijayanagar on the South bank of the river Thungabhadra and opposite to Anagondi about 1336 AD.

2 Bharathi 1980 January, page No : 27.

3 Kunduru Eswara Dutt–Inscriptional glossary page No : 312.

సీమ = రా్రష్ట్ర పరిపాలనా విభాగము.

అ ర ణ్యం లో కో లా హ లం

(41 వ పే జీ త రు వా యి)

అన్న శబ్దంతో అడవంతా ్రపతిధ్వనించింది !
ఉత్తుత్తితా ! ఉత్తుత్తుత్తితా ! తీతువుకూసింది
అంతిమంగా సింహం ఒక్క గర్జన చేసింది
కవాటికలై జంతువులూ పక్షులూ ఒక్కసారిగా కాళ్ళకు బుద్ధిచెప్పాయి !
కొక్కొరోకో మంది కోడికూత
తూరుపు దిశా్రగాన ్రపభాత సంధ్యాకమలం రెక్కలు విచ్చుతోంది !

కొత్త పాళీ

కలం పాతదే ! ...
  ఇంకు ఎప్పుడూ వాడేదే ! ...
రాసేది నేనే ! ...
కాగితమూ ఎప్పటిదే ! ...
మారిందొక్కటే
అదే...ఇదిగో నేనురాస్తున్న కొత్తపాళీ ! ! ...

సమాజం పాతదే !...
ఆశయాలూ...స్లోగన్‌లూ...యుగాలనించీఉన్నవే!...
జీవితమూ అదే !...సమస్యలూ అవే !...
మారవలసిన దొక్కటే ...
అదే...వ్యక్తికున్న ఆలోచన !...
నిశాత ఖడ్గంలాంటి సరికొత్త పాళీలా ... ...!

పునః స్వాస్థ్యం

చెట్లూ పక్షులూ జంతువులూ కీటకాలూ
  అన్నీ అందంగా నవ్వుతూ
తోటుట్టువుల్లా తోచినన్నాళ్ళూ
నేను ఆరోగ్యంగానే ఉన్నాను ! ...
నా నేత్రాలు నిర్మలంగా
ఆత్మానందాన్ని విరజిమ్మే దీపాలై
వాటి స్థానాన్ని కాపాడుకున్నన్నాళ్ళూ
నాలో ఏ కాంప్లికేషనూ వచ్చినట్టు గుర్తులేదు ! !...
కానీ
ఒకనాటి కలలో నేనేదో
ఆకాశమంత ఎత్తు పెరిగిపోయినట్టూ
నా కళ్ళు స్థానాన్ని తప్పి ఆకాశాన్ని మాత్రమే చూడగలుగు
                                        తున్నట్టూ...
కనపడిన క్షణంనించీ
సృష్టిలో ప్రతివస్తువూ ప్రతివాదిలా...ప్రతిరోధిలా
అతి దుర్మార్గంగా నా మార్గాన్ని ప్రతిషేధించే విధిలా
అనిపించసాగింది ! !...అప్పుడే నాలో రుజ ప్రారంభమైంది!

ఓ బుల్లి మిణుగురు వెలుతురులో
ఓ నల్లచీమా పేడపురుగూ
నాలో పెరిగిన దుర్మాంసాన్ని
కోసి...ఆపరేషన్ చేస్తున్నట్టూ...
ఓ ఏనుగు పర్యవేక్షణలో
ఓ సింహం మంత్రం చదువుతూ
నాకు పట్టిన దయ్యాన్ని వదిలిస్తున్నట్టూ...
ఓ పావురం నా భుజంమీద వ్రాలి ప్రేమగా
ధైర్యం చెప్తూంటే...సృష్టిలో జీవరాసులన్నీ
నా కేసే నీళ్ళునిండిన కళ్ళతో చూస్తున్నట్టూ...
మరో కల వచ్చింది !...తక్షణం నారుజ తగ్గింది ! ! ...
'నా ఆరోగ్యం బాగా కాపాడుకుంటే
ఏ పీడకలలూ నన్నేం చేయలేవ'ని
పరామర్శ కొచ్చిన జీవరాసులన్నీ
మరీ మరీ చెప్పి వెళ్ళాయి... ! !

శ్రీ పి. సంపత్కుమారాచార్య

శ్రీ వివినమూర్తి

వంకర చూపులు

మళ్ళీ చలికాలం వచ్చేస్తోంది —

నేలమీదే పడుకుంటారు పిల్లలు —

నిద్రలో వణుకుతారు! చలి భరించలేక ఏడుస్తారు.

మధ్యాహ్నం రెండూ మూడూ మధ్య ఖాళీలో సీత యీ విషయాలు తరచు గుర్తు చేసుకుంటోంది. ఆ రోజు మంచం కింది బట్టల పెట్టె ఆపసోపాలు పడుతూ బయటకు లాగింది.

ఓ చీర ఎప్పుడో ఎంచింది. పైన వేసేది కాస్తంత గట్టిగుడ్డ అయితే నాలుక్కాలాలు వుంటుంది. కట్టు విడుపు చీరలే బయట కూడా వాడుకుంటోంది. అవయినా లెక్కగా మూడే మూడున్నాయి. అందులో ఒకటి తీసి వాడేస్తే...?

ముసలమ్మ దగ్గర పాత బొంత ఉంది. మంచం ఎలాగూ ఉంది గదా! ఆ బొంత పిల్లలకి యివ్వగూడదా—అనుకుంటూంటుంది సీత. అసలే ముసలి ప్రాణం! ఆ పక్కెడకి అప్పీ ముళ్ళే! పోన్లెస్తూ — అంతలోనే సర్దుకుంటూంటుంది.

"సీతా!" అన్న అత్తగారి గొంతు వినిపించగానే —

"వస్తున్నానత్తయ్యా!" అంటూనే వెళ్ళి భుజాన బిందెతో మెట్లు ఎక్కలేకపోయిన చిట్టెమ్మని చూస్తూ "అయ్యయ్యో! మీ కెందుకండీ యీ అవస్థ..." అంటూ దింపింది.

"నువ్వు మాత్రం ఒట్టి మనిషివిటే! ఈ మాయరోగం తగ లడ్డాక యింటెడు చాకిరీ నీపరమేనాయె!" అంటూ సాయంపట్టింది.

"యిహ చాల్లెస్తురూ! యీ పూటకి గడిపేసుకుందాం! తెల్లారగట్ల కుళాయి ఎలాగూ వస్తుంది! చల్ల పొద్దున తెచ్చుకోడం సులువు!"

"సరిలేమరి! ఏనాడు నా మాట పడనిచ్చావు గనక..." నవ్వు.

మంచం వాల్చుకుంది చిట్టెమ్మ!

"తల్లీ! కాస్తంత సాయం పడుదూ! కుక్కిలో... తుస్తున్నానూ!"

నవ్వుల్ని చంపుతూ పక్కెడకి ముళ్ళువేస్తూ బిగించేసరికి గంట పట్టింది. ఇంతలో కిష్టుడులేచి ఊరూవాడా పోగయేటట్టు అరున్నొక్క రాగం అందుకున్నాడు. వాడికి పాలు కలిపి యిచ్చి కాసిన్ని మరమరాలు ముందరపోసింది.

"ఈరోజు కూడా తెములలేదు..." బట్టలపెట్టె మంచం కిందకి తోస్తూ నిట్టూర్చింది సీత.

2

ఆ పని పూర్తవటానికి రెండు నెలలు పట్టింది. ఓ మాదిరి గట్టిచీర తెగించి వాడేసింది. అత్తగారు కూడా ఓ చిరుగుల పంచె యిచ్చారు. నెలలు పైబడుతున్నాయేమో - ఆఖరి రోజులలో వంగి సరిచేస్తూ కుట్టడానికి — మరింత శ్రమ అయింది.

అయితే అయిందిలే! బొంత ఒత్తుగా బావుంది —

ఒత్తి ఒత్తి చూస్తోంది సీత. పిల్లలు అందుమీద పడుకొనే దృశ్యం ఆమె కళ్ళలో కదులుతోంది.

"సీత పిన్నీ! సీత పిన్నీ! మీ ఆడబడుచు..." పక్కింటి అమ్మాయి అరుచుకుంటూ వచ్చింది.

మాగన్నుగా పడుకున్న చిట్టెమ్మ గబుక్కున లేచింది. తల మీద పంచె చెంగు సవరించుకుని వీధిలోకి నడిచింది. రిక్షాను పంపి, మెట్లు ఎక్కుతోంది మాలక్ష్మి.

ఏదో బరువు నెత్తిన ఉన్న అలసట ఆమె ముఖంలో తాండవిస్తూంటుంది. ఓ పిల్లాడు భుజానా, ఓ పిల్ల వెనకనా ఉంటేగాని ఆమె బొమ్మ పూర్తయినట్టు ఉండదు! ఆమె భర్త స్కూల్లో అటెండరు.

వదినా మరదళ్ళు మంచీ చెడ్డా కలబోసుకుంటూ లోపలికి వచ్చారు. యిరుగమ్మల పొరుగమ్మల పలకరింపులతో కాస్సేపు గది నిండింది. కూతురు చిక్కిపోయిందనీ, అల్లుడు అలాంటివాడయాడనీ పదే పదే అంది చిట్టెమ్మ.

"అవును వదినా! యీ బొంత నువ్వే కుట్టావూ?" వదిన గారి ఎనిమిదో నెల గర్భం వంక చూస్తూ మెచ్చుకోలుగా అంది మాలక్ష్మి.

"లేదమ్మా! మీ అమ్మగారు కుట్టారు..." ముడతపెడుతూ అంది.

"అనవే! అనవే! ఇక్కడ శాతికపుల్లతీసి అక్కడ పెట్టటం లేదనేగా నీ వేళాకోళం...!"

"బావుంది! తల్లీ కూతురూ వేళాకోళా లాడుకుంటే చెల్లుతుంది గానీ...ఎంత అయింతయినా కోడలు కోడలే...!"

"వెనకటికి ఎవరో చెప్పార్లేవే ...! అత్తలు పెట్టిన అరళ్ళు అవుపిస్తాయి గానీ ... కోడళ్ళుచేసే కొంటెపనులు అవుపడవుట...!"

మాలక్ష్మి వచ్చినపుడు చిట్టెమ్మలో ఓ విధమయిన మార్పు వస్తుంది. తల్లీకూతురూ ఆసమ్మ బూసమ్మ కబుర్లు చెప్పుకుంటూ గడిపేస్తారు! అంతకు ముందు ఆపాటి యీపాటి సాయంచేసే అత్తగారు — ఉదయం వంట మినహా మరేమీ ముట్టుకోకపోడం — సీతకి కష్టంగా ఉంటుంది. తోటి ఆడది కాలుమీద కాలేసుకుని కూర్చుని అమర్చి పెడుతున్నవన్నీ ఆరగిస్తూ ఎంగిలి కంచాలయినా ఎత్తకపోతే ఆడది పడే బాధ అనుభవించాల్సిందే! అలాంటపుడే సీతకి — యీవిడ ఎప్పుడూ యింతేలెస్తూ — అన్న చిరాకు కలుగుతుంటుంది.

బడి నుంచి వచ్చిన పిల్లల్తో చిల్లో బొల్లోమంటూ కల్సిపోయారు మాలక్ష్మి పిల్లలు. తల్లీ కూతుర్లూ పెద్ద పట్టె మంచం మీద చేరారు.

సరిగా మండని కట్టెలతో వంట చేస్తున్న సీతకి వాళ్ళకబుర్లు వినిన పడుతున్నాయి.

తను గడుసుదిట! ఎందుకట ?

అన్నీ ఒబ్బిడి చేసుకుంటుందిట !

ఆడబడుచు మనసు మంచిదే! తనంటే గురి కూడా! అత్తగారే అన్నీ నేర్పిపెడుతుంది.

సొంత చెల్లెలుకన్న యిదిగా ఒకటికి రెండుమార్లు పని ఒబ్బిడి గూర్చి చెప్పింది. కాఫీలు కలపటానికే గంట తీసుకుంటుంది. అంత సేపూ కుంపటి ముందు కూర్చునే ఉంటుంది! ఓ బియ్యం ఏరుకోడమో, కూర తరుక్కోడమో చెయ్యొచ్చా ? చెయ్యదు! కాఫీ పొడుం డబ్బాతో సహా అన్నీ కుంపటి చుట్టూ ఉంటాయి! తీసిన వస్తువు వెంటనే దాచదు. వంట వేళకి మొత్తం డబ్బాలన్నీ కిందేఉంటాయి! వడుస్తుంటే ఏదో తన్నేస్తుంది! కేజీ సరిపోయేది మరో అరకేజీ అవదా మరి! భర్త వస్తాడు. శుభ్రమైన చీరగట్టుకుని ఎదురెళ్ళిన పాపాన పోలేదు ఒక్కమారయినా. పిల్లలున్నపుడూ అంతే! లేనపుడూ అంతే! ఏబ్రాసికి పనెక్కువ అన్న సామెత ఊరికినే పుట్టలేదు!

ఇవన్నీ మార్చుకోమని చెపితే మాలక్ష్మి ఏమీ అనుకున్నట్టుండదు గానీ, — తన పెంపకాన్ని తప్పు పడుతుందా — అన్నట్టు చిట్టెమ్మలో చిరాకులు పరాకులూ ఎక్కువయి పోతుంటాయి!

3

విజయనగరంలో పెళ్ళిట. భర్త ముందస్తుగా పంపించాడు. మర్రెండు రోజులు ముందుగా బయల్దేరి పుట్టింటిదగ్గర ఉండొచ్చని వచ్చిందిట మాలక్ష్మి. చెల్లెలు అర్ధాంతరపు రాకలో అంతరార్థం తెలిసాక కాస్త తేలికపడ్డాడు రాఘవరావు.

మాధవుడు గడపలోకి అడుగుపెట్టేసరికి అన్నాచెల్లెలూ తల్లీ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాలక్ష్మి వచ్చి పధ్నాలో రోజు. వస్తూనే —

"నివ్వెప్పు డొచ్చావే...?"

చెప్పి —

"అవునుగానీ ఒరే చిన్నన్నయ్యా! వాడికంటే కుదర్దు! నీకేంరా ? ఉత్తరమ్ముక్కయినా రాయవ్వూ! అదేమో మా మరిది ఎంప్లాయిమెంట్ కార్డు వ్యవహారమూయె! అయిందా స్తే తిక్కమనిషి! మీ అన్నలున్నారన్న మాటేగాని ... పిసరంత ఉపయోగం లేదూ అని నా యిదన్నతుంటారు !"

"మొదలెట్టావా తల్లీ ! అక్షింతలు ...! మాస్తుస్తాపుగా ! పది రోజులకి యిదిగో యిదీ యింటి మొహం చూట్టం !"

అతను సినిమా రిప్రజెంటేటివ్ ! అతని సంపాదన అతనికే చాలదు. మాలక్ష్మికి చిన్నన్నయ్య నచ్చడు. వాళ్ళది దగ్గర కానువు. దాంతో ఇద్దరూ చనువుగా తిట్టుకుంటూంటారు !

మాధవుడు లోపలికి వెళ్ళాడు.

"వదిన కుట్టిన కొత్త బొంత చాలా బావుందంటోందిరా అదీ ..."

"కావాలంటే తీసికెళ్ళమనూ ! పాత గుడ్డేగా !"

"పోన్లేరా ! వదిన ఏమనుకుంటుందో ఏవిటో !"

"ఏం ? ఏమనుకుంటుందేవిటి ? దాని అన్నగారి సొమ్ము అది తీసికెళ్ళిందనుకుంటుంది !"

"పోనీ ఓమారు దాన్ని కూడా అడగరాదుట్రా...."

"ఏం మారు భాగ్యమేవి? దాన్ని అడగటం..."

మాధవుడు బట్టలు మార్చుకుని వచ్చి వాళ్ళ సంభాషణలో కలగజేసుకున్నాడు.

"ఏవిటోయ్...? అప్పుడే ఏదో వడకటం మొదలెట్టావ్...?"

మాలక్ష్మి మొహం నయాపైసా అయిపోయింది.

"వాడు చూస్తే ధర్మరాజు! నువ్వేమో యమధర్మరాజు! నీకు బొత్తిగా వేళాపాళా మంచీ చెడ్డా వుండవు వేళాకోళాలకు! అదేం వడికేసుకుందనీ...?"

అన్నగారు కూడా తల్లికి వత్తాసయాడు.

"ఒక్కగానొక్క ఆడపిల్ల! చూస్తూ చూస్తూ అలాంటాడికి కట్టబెట్టాం! దాని ముద్దూ ముచ్చటా చూడ్డవేఁ లేదు! అవసరాలకు అడ్డుపడ్డవూఁ లేదు! ఏదో పాతగుడ్డల బొంతకు...అదీ అవసరం కొద్దీ అడిగితే...! తప్పరా అబ్బాయా!"

అన్నగారు వదినతో చెప్పవని లేదన్నా మాలక్ష్మి ఉండబట్టలేక పోయింది, ఆరోజు సాయంకాలం వదినతో చూచాయగా అంది.

"నాకూ ఓ బొంత కావాలి వదినా?"

సీత నింపాదిగా చెప్పింది —

"ఊహూ, రానిస్తావుగా! ఏమయినా పాత సుద్దులుంటే యిక్కడ పడెయ్యి! నేనూ ఏదో చూస్తాను. అప్పటికి నేనూ తెరిపిన పడి పోతాను! వారం రోజుల్లో బొంత తయారయిపోతుంది."

ఆ ముక్కకి చిట్టెమ్మ తెగగింజుకుంది.

"నేం చెప్పలేదుటే! ఏ ఆడబడుచంటే ఎవత్తెకి పడింది? నువ్వేమో వెర్రిబాగులదానిలా దాని కాళ్ళా వేళ్ళా బడ్డం...! అదేమో అశుద్ధంమీది పురుగుని తీసేసినట్టు తీసెయ్యడం ..." అంది రహస్యంగా.

4

పదకొండయింది. మాధవుడు చప్పుడుకి లేచాడు. మంచం కింది పెట్టె లాగుతోంది మాలక్ష్మి. బొంత అందులోనే వుంది.

"వదిన్ని అడిగావా?"

"లేదు!"

"ఎంచేత?

"అక్కర్లేదంది అమ్మ!"

"ఎందుకందూ? వస్తువ వదినది. అడిగితీసుకోటం మర్యాద. అడక్కుండా తీసుకోటం దొంగతనం!"

"ఏవిట్రా నీ గొడవ!" అంది విసుగ్గా.

"తేరగా దొరికితే అబ్బో! మీ అమ్మ నానమ్మా చేస్తుంది. నిప్పు పట్టుకెళ్ళిపోలావా..." అన్నాడు రాగం తీస్తూ.

— ఆ మాటకి మాలక్ష్మికి పౌరుషం వచ్చింది.

"నేను యింటికి ఆడబడుచుని! ఏంచేసుకుంటున్నానో ఏంటో! రేప్పొద్దుట నీ పెళ్ళాం వస్తుంది! దాన్ని కూడా అడగను! నాక్కావల్సినవి పట్టుకెళ్తా! ఎలా అడ్డొస్తావో చూస్తా!"

నుడిమీదున్న చిట్టెమ్మ వంట గదిలోంచి వచ్చింది.

"ఏవిట్రా! నీ వెధవముండా ధాష్టీకం?"

"అదికాదే! వదిన్ని అడిగావా లేదా చెప్పు!"

"ఎందుకూ? ఏందుకు అడగాలి? అదేం దాని బాబుగారి సొమ్మేట్రా? నేను యింటికి పెద్దదాన్ని! పైగా ఆ బొంతలో నా బంగారం లాంటి పంచె పడింది."

మాధవుడు ఊరుకోలేదు.

సీత వచ్చేసరికి వాదన పోరముంది. పక్కింటి నుంచి అప్పు తెచ్చిన నూనె గిన్నెను వెంగు చాటునుంచి తీసి వంటింట్లో పెట్టి వచ్చింది "వస్తున్నానయ్యా" అని మరిది పిలుపునకు జవాబిస్తూ.

"పన్లు అలా వుంటూనే వుంటాయిగాని వదినా! యింట్లో జరుగుతున్నదేమీ పట్టించుకోపోతే యెలా?"

"ఏం జరిగిందయ్యా?"

మరిది అంటే సీతకి భయం!

అతను ఎప్పుడూ పంజేసే వాళ్ళ గురించి మాట్లాడతాడు! ఆసిడికి అర్థంకాని పుస్తకాలు చదువుతాడు! ఊళ్ళో ఉన్నప్పుడయినా యింటి పట్టున ఉండడు! పనిమనిషి ఉండేప్పుడు దానితో పోట్లాట వస్తే దానికే వత్తాసు! పాకీవాడికి పావలాయేం అర్ధరూపాయ యివ్వ గూడదా లంటాడు! మనకి మాత్రం ఎక్కణ్ణించి వస్తుందయ్యా అంటే మనం తినేదాన్లో ఓ మెతుకు తగ్గించుకోకూడదా అంటాడు!

భూస్వామి ఎవరికీ హక్కు ఉండరాదని చెప్తే తన అర ఎకరం ముక్కా ఎవరో లాగేసుకుంటారని పేద రైతు పడే భయం సీత భయం!

"యిది నీ బొంతే నట్టుకుపోతుందిట! ఊరుకుంటే యీ యిల్లే పట్టుకుపోతుంది మహాతల్లి!"

"దాన్ని కాదనమను."

"అంటుందమ్మా! ఏంజేస్తావ్?"

"అనట ఏమనా! చెప్తా!"

"అను వదినా! ఏంజేస్తుందో యీవిడగారు చూద్దాం!"

సీత పెదవి విప్పలేదు.

క్షణంసేపు చూసి —

"ఏమిరా! అనమనా!" అంది చిట్టెమ్మ వుంటాకొని.

"మా వదిన చాలా మంచిది..."

"ఊరుకోవే! దాన్నే ఉబ్బెయ్యక్కర్లేదు! మొగుడి సొత్తుమీద దానికి ఏపాటి హక్కుందో నీ అన్నగారి సొమ్ముమీద నీకూ ఉంది ఆపాటి హక్కు! పదవే పద! నీ పన్లు చూసుకో! ఎసట్లో బియ్యం మరిగి లగులడుతున్నాయి...!మళ్ళీ అన్నమ్యొచ్చేస్తాడు...!" వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఏడుస్తున్న పిల్లను భుజాన వేసుకొని జోకొడుతూ మాలక్ష్మి కూడా అక్కడనించి కదిలింది. సీత కూడా వెళ్ళిపోబోతుంటే —

"గాలి తీసేసావేంటి వదినా?"

"యిప్పుడేమయిందయ్యా! అది తీసుకోలేదుగా!"

"అద్గదీమాట..." గొంతు పెంచబోయాడు.

"నాయనా! నాయనా! ఊరుకుందూ! ఊరికినే గొడవపెట్టకు! దానికి మాత్రం తెలీదా?"

తడిపిపెట్టిన బట్టల దగ్గరకి సీత వెళ్ళింది.

5

నూతులకి మందులు కొట్టించటం రాఘవరావుపని. పొద్దుటే పోయి పదకొండు గంటలకి వస్తాడు. సాయంకాలం ఓ గంట పని. ఆ తర్వాత సినిమా హాల్లో బుకింగ్ దగ్గర ఉంటాడు.

ఆరోజు అతను రావటం ఆలస్యమయింది. వచ్చేసరికి అత్తగారు సుభద్ర కూడా దిగడారు. నిసుగు మొహంమీద కనబడకుండా పలకరింపులు కానిచ్చేసి, స్నానానికి వెళ్ళాడు. అతను తిరిగి వచ్చేసరికి తల్లీకూతుళ్ళ మధ్య సంభాషణ సాగుతోంది.

"ఏమి యింటా వంటా లేనిలాంటి యిద్దాయి! చెట్టంత మనిషి! వ్వయానా అత్తగారు... అంతదూరం వెళ్ళకొస్తే బెల్లం కొట్టిన రాయిలా వూరుకుంటావా? ముగ్గురు పిల్లల తల్లివి! చిన్న దానివా చితకదానివా? మనిషన్నాక ఒకరికి పెట్టేగుణం ఉండాలి..."

"ఏంటండీ కూతురికి బోధిస్తున్నారూ?"

సుభద్ర చటుక్కున లేచి నుంచుని —

"ఏంలేదు నాయనా! ఎండన బడొచ్చావు! వెళ్ళి భోంచెయ్యి! వదినగారు చూస్తున్నారు..."

అతను గడప దాటుతూండగానే —

"లే! వెళ్ళి అతనికేం కావాలో చూడు! ఎటునుంచి ఎటో వ్చినా దరిద్రపు యిద్దాయి పుట్టింటి నించే వచ్చాయంటాడు..."

రాఘవరావు కంచం ముందు కూర్చున్నాడు.

తల్లి ప్రవర్తనలో తేడా నాలుగు ముద్దలు కడుపులో పడేదాకా అతనికి తెలీలేదు.

ఎండు మావిడి టెంకల పులుసు గరిటతో తిప్పుతూ అతని కంచంలో పోస్తోంది చిట్టెమ్మ. ఆ విసురు అతనికి అర్థమవుతోంది.

"ఏంటే? అందరూ అలా వున్నారూ?"

"ఏమీ లేదు!"

"ఏమీలేకుండా ఎలా వుంటుంది! అక్కడేమో తల్లీకూతురూ గుసగుసలు! యిక్కడ నువ్విలా! అవునూ! అదేదీ?"

"అలా ఎవళ్ళింటికో వెళ్ళుంటుంది."

"దాని ప్రయాణం ...?"

"కన్నతల్లిముండను! దాన్ని యింటో ఓ పూట ఉండమనే హక్కు నాకు లేదుట్రా నాయనా?!"

రాఘవరావు మంచినీళ్ళు తాగాడు.

ఓ సెకను ఆగి —

"అమ్మా! బయట తిరిగేవాడికి యింటో ఏం జరిగిందో ఎలా తెలుస్తుందే...? నువ్వేమో నామీద గయ్ గయ్ మంటావూ...!"

"ఏం జరుగుతుందీ? ఏమీ జరగదు! యీవిడగారేదో మహా పనిమంతురాలయినట్టు అలా వుండూ యిలా వుండూ అన్నీతులు చెప్పడం! అదేమో ఎర్రెద్దు మాలోకంలా వినడం...! యీ బాగోతం ఎప్పుడూ ఉండేదే?"

"అందులో తప్పేం ఉందే...?"

"ఏమీ లేదు! ఏవుంటుంది? దానిమీద యింతో అంతో అభిమానం కడుపులో ఉండేదిసింటనే ఎప్పటికప్పుడు అనుకుంటూనే వున్నా! ఆ పిచ్చిపీనుగ నామాట పట్టిలేదు! యీవేళ బయటపడింది దీని రంగు..."

"... ... ..."

"యింత బతుకూ బతికి యింటెనకాతల చచ్చినట్టు దిక్కు ఓ పెంగుడ్డ పీలిక యిచ్చే హస్తం కూడా లేకపోయె! నాయిగా పెట్టుకునే భాగ్యం ఎలానూ లేదాయె! దోసిలొగ్గి 'అమ్మా! నాయనా!' అన్నిన్నిసార్లు అడుక్కున్నా చెల్లదాయె! సర్లే— అన్నీకు వయు కలిగింది తయారైన! పదినా పదినా అంటూ ఓసారి రెండుసార్లూ కాదు నాలుగుసార్లు అడిగింది అది! 'దాన్నడుక్కోవాల్సిన కర్మ నీకేం వచ్చిందే' అంటే కత్తికాలిప్పిల్లగానె నన్ను కొట్టేసింది! ఇంతాచేస్తే నీ పెళ్ళాం నోట మాటే లేదు. వాళ్ళే అరుచుకుంటారూ...! వాళ్ళే పోతారూ...అని దాని భరోసా! దానికాగుంట చచ్చినాడు వత్తాసు...! 'పోనీ వద్దులేమ్మా!' అంటూనే వుందది! దాని పొగరెంటో వద్దామనే దీని ప్రయాణం వాయిదావేయించాను...!"

"యింతకీ దేని గురించే...?"

"మహా మహా మారు భాగ్యమేంగాదు! బొంత! పాతగుడ్డల బొంత..! మళ్ళా మాన్యాలూ అయితే యింకెంత గింజుకుపోనో మహాతల్లి...!"

"అది పట్టుకెళ్ళొద్దందా?"

"ఎబ్బే! అలా ఎందుకంటుంది? పట్టుకెళ్ళా అని మడత లెట్టి మరీ చంకనెట్టింది..."

"సర్లేస్తూ! అదే యిస్తుంది! ముందు మజ్జిగ పొయ్యి!"

మజ్జిగపోస్తూ గొంతు తగ్గించి —

"పలచబడిపోయింది! ఆవిడొహరు...తయారు..."

"ఏమిట్టి!"

"మామూలే! రోగం! ఆస్పత్రిలో చూపించుకుంటుందిట! పది రూపాయలు బస్సోడికి పారేస్తే మందూ వస్తుంది! మహా నైవేద్యమూ అవుతుంది!"

"దాన్నోమారు రమ్మను..."

సీత వచ్చేసరికి పులుసులో పెంక చీకుతున్నాడు రాఘవరావు. మనిషి సన్నం. అందుమీద పొట్ట పెద్దదిగా అవుపిస్తోంది. అలసటగా వుంది.

"రమ్మన్నార్ట!"

"కూచో..."

నాలుగు ముద్దలు బొక్కాడు.

"మీ అమ్మగారూ...?"

"పైకి అంటం అప్పత్రనే! అత్తగారి ఆరోగ్యం బావులేదు గదా! మనిషి సాయం అవసరమవుతుందేమో తెల్సుకుందామని కడుపులో పుస్తున్నట్టుంది!"

"అమ్మనడగలేక పోయావూ...?"

"... ..."

"మాట్లాడవేం?

"సొంత తల్లే అవనీండి — పై మనిషి మనసే కదూ! ఏదో ఉండబట్టలేక వచ్చింది! చూసింది..! వెళ్ళిపోతుంది..."

"అంతేనా...?"

బుర్ర పైకెత్తి అయోమయంగా చూసి --

"అంతే...?"

"అమ్మని అడగలేదూ అంటే ఏదో వుందన్న మాట!"

"అడిగితేమాత్రం...! బరువు మోసేది మనం! మనం చూసుకోవాలి."

"నిజమే! పెద్దరికం ఉంచలేదని అమ్మయిదవదూ...?"

వెంటనే మాట్లాడలేదు సీత.

"పోన్లెస్తురూ! ఆవిడొహలా అలిచి మనమోహలా తలిస్తే... 'అనవసరంగా రంగం చెడుతుందీ..."

"ఆవిడ ఎప్పుడయినా మరోలా తలిచిందా?"

భర్త గొంతులో భావం తన తల్లిగురించి కాదని ఆమెకి అర్థమౌతూనే వుంది.

"రుజువులూ సాక్ష్యాలూ కావాలని రొక్కిస్తే ఏం చెప్పగలను? మనిషీ మనిషీ అన్నాక వందవస్తాయి! పోలాయి! అవన్నీ పట్టుకు యింట్లోవున్న పెద్దావిడ పిల్లల మంచి చెడ్డలు చూడదని నేను అనుకుంటున్నానా? అలా ఏనాడయినా అన్నానా?"

రాఘవరావు చేతిలో పెంక పారేసి చెయ్యి కడుక్కున్నాడు. గ్లాసులో నీళ్ళు పోసింది సీత...!

ఖాళీగ్లాసు కిందపెడుతూ—

"ఆవిడా చెడ్డది కాదు! నువ్వూ చెడ్డదానివికాదు! యింట్లో జరుగుతున్నదేంటో తెలుసుకోలేని చవట దద్దమ్మను కాను నేను! అది అడిగింది. బుద్ధితక్కువై పోయింది ... పొరపాటయిపోయింది... వూఁ అన్నాను! యిహనెప్పుడూ అన్నని నిన్నడక్కుండా ఏదీ చెయ్యనని చెంపలు వాయించేసుకోమంటావా చెప్పు!"

ఉన్నట్టుండి తుఫానులా మారిపోవటం రాఘవరావు స్వభావం! అంత నిదానమూ ఏమయిపోతుందో అంతుబట్టదు! సీత పెళ్ళయిన కొత్తల్లో ఒకటి రెండుసార్లు జ్వరపడింది కూడా! రాను రాను అలవాటయింది!

"నామాట వినండి! బయట అమ్మకూడా వుంది..."

"ఉంటే...? ఏం? నాకేం...అరుపా ?"

అన్నాడేగాని రాఘవరావు గొంతు కొద్దిగా తగ్గింది.

"మీకు పుణ్యం ఉంటుంది! కొంచెం ఓపిక పట్టండి..."

కోపం అణుచుకోటంతో కణతలు అదురుతున్నాయి! అడుగు పెదవి వణుకుతోంది.

"తిరిగి తిరిగి చచ్చి చచ్చి వస్తాను! దిక్కుమాలిన సెంటంతా యింటోనే! ఎవరి కెవ్వరూ తీసిపోరు..."

రాఘవరావు లేచాడు.

యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ గదిలోనే ఓ వార నాపమీద మాధవుడు పడుకున్నాడు! అతని చేతిలో 'ఆస్తి దాని స్వరూపాలు' పుస్తకం ఉంది. చిట్టెమ్మ గుమ్మం సాదిగటను ఓ చెయ్యినేల నన్ను పెట్టుకొని మరోచెయ్యి గడ్డంకింద చేర్చుకుని కూర్చుంది. సుభద్ర తలుపువారగా నించుంది. సీత వంట గదిలో ఎంగిలికంచం తీస్తోంది.

కాస్సేపు గదిమధ్య పచార్లు చేసాడు రాఘవరావు! బయట నుంచి వచ్చిన మాలక్ష్మికి అక్కడి పరిస్థితి బోధపడలేదు. లోపలికి అడుగు పెడుతూనే పెద్దగొంతుతో—

"ఏమిరా! అన్నయ్యా! యీవేళ రాటం ఆలశ్యమయింది...?"

"ఆ బొంత ఎక్కడుందో చూసి నీ పెట్లో పెట్టుకోవే...!"

"అదేం కుదర్దు!" మాధవుడు లేచి కూర్చున్నాడు.

"యీ విషయంలో జోక్యం చేసుకోకురా!"

"ఏం? ఎందుకుట? కష్టపడింది ఆవిడ...! దానిమీద హక్కు పూర్తిగా ఆవిడదే!"

"నాయన్నాయనా! నువ్వూరుకుందూ...! పరాయోళ్ళకైనా పెట్టుకుంటే పుణ్యమే వస్తుంది...! మంచే మిగుల్తుంది! అలాంటిది సొంత ఆడబడుచు..."

"అవునవును! బొంతకు బదులు బొంతడు పుణ్యం! గుంట వెధవలు రాత్రంతా చలికి వణుకుతూ ఏడుస్తుంటే బస్తాల్తో లారీల్తో మరీ వస్తుంది పుణ్యం...! అదే మిగుల్తుంది!"

"మాధవా! నీ వ్యవహారం శృతిమించుతోంది..."

"వస్తువ ఆవిడది! దానం చేసేది నువ్వు! పట్టుకెళ్ళేది అది! శృతిమించేది నేను...!"

"దాంది దాండంటున్నావు! అసలా బొంతలో దాందేముంది? చిరిగిన చీరముక్కల్లో రెండు! ఆమాత్రం నాదీ వుంది అందులో..."

"వుంది వుంది...! గా...ట్టి పంచె! ఆయిందేమో మాం...చి లుంగీ.! నాదే...మో నిన్నే కుట్టిన చొక్కా! యింకేం? పట్టండి! పంచేద్దాం! అందరం తలోముక్కా తీసేసుకుందాం...!"

"నీ తిక్కా లెక్కా నా దగ్గర కుదరవురా అబ్బాయ్! అయినా చెల్లెలిమీద పగేంటిరా నీకూ...?"

"పగకాదు! న్యాయం! శక్తుందీ...? కాని...కొత్తదే యియ్యి! బొంతేం...ఖర్మ? డన్‌లప్ బెడ్డే యియ్యి!"

"పాత బొంతకే గతిలేదూ! డన్‌లప్ బెడ్డొకటి! మొగుడి సొమ్ము పరాయోళ్ళ పాలవుతుందని—ఆ శక్తి నిజంగా ఉన్నరోజున మాత్రం—మీ వదిన ఊరెట్టేసుకోదా?"

"దానికీ దీనికీ పూటా పెట్టకు! యిది ఆవిడ శ్రమపడి అమర్చుకొన్న వస్తువ! అందుకే ఆవిడ అనుమతి లేకుండా ఆవిడతో ఆలోచించకుండా యిష్టం వచ్చినట్టు చేసే హక్కు నీకు లేదు!"

"యిది నేనూ అదీ కలిసే ఆలోచించాం!"

"అబద్ధం! ఆవిణ్ణే చెప్పమనూ ఆ మాట!"

"నేనేం నీకు జవాబుదారీ కాదు..."

"నువ్వు బెదిరించొచ్చు! తన్నొచ్చు! ఆవిడ ఏంటనుకుంటోందో తెల్సుకోకుండా ఆవిడచేత అబద్ధమాడించొచ్చు! మధ్యలో నాలాంటాడు కలగజేసుకుంటే...నాలుగు వెయ్యొచ్చు! మాటల గారడీతో మభ్యపెట్టొచ్చు! కాని...నిజం...నిజమే!"

"ఏమిట్రా! బోడి నిజం! ఆ మాటకంటూ వస్తే యింటికి పెద్దదాన్ని నేనూ...! ఏం చెప్పటానికయినా చెయ్యటానికయినా హక్కునాదీ...! ఎవడు కాదంటాడో రమ్మనూ...!"

"రైటే ఎవ్వరూ కాదనరు! యింట్లో పిల్లముండలమీదా బొచ్చె రాచ్చిప్పలమీదా అన్నింటిమీదా హక్కు నీదేనమ్మా! శ్రమపడి తయారుచేసుకున్నది ఆవిడకి దక్కకుండా ఆవిడ యిష్టాయిష్టాల ప్రమేయం లేకుండా...లాక్కునే హక్కుమాత్రం నీగ్గాదు వాడిగ్గాదు ఆ భగవంతుడిగ్గూడా లేదుగాక లేదు! అవుతే అలా లాక్కునే హక్కు కూడా న్యాయమేనంటే చట్టమేనంటే..."

"సీతా! సీతా!"

భర్త గావుకేకల్తో గుమ్మం చాటుగా వంటగదిలోవున్న సీత అక్కడికి వచ్చింది.

"ఆ ముష్టిబొంత మాలక్ష్మికి యివ్వటం నీకు యిష్టమేనని నేను అంటున్నాను...అవునా ? కాదా ?"

"అవునసే అంటుంది! నువ్వు అడిగే తీరులో ఆ బొంత యిప్పించెయ్యాలన్న పట్టుదలే వుందిగాని...నిజం తెల్సుకోవాలన్న కోరికలేదు."

"పోన్లెండి! నాగురించి యింత గొడవెందుకూ? ఊరుకోండి" అంది మాలక్ష్మి.

ఎవ్వరూ కాస్సేపు మాట్లాడలేదు

మాధవుడే అన్నాడు.

"యీ విషయం గురించి యింతగొడవ అక్కర్లేదు! నిజానికి మనం అందరం పొరపాటు ఆలోచనలే చేస్తున్నాం! ఆవిడ ఆ బొంతను యిచ్చెయ్యటం...నీమీద గౌరవమంటావు నీవు! యింటి పెద్దరికం నిలబెట్టి తన హక్కును ఒప్పుకోడమంటుంది అమ్మ! పండితవనీ, పుణ్యవనీ అంటారు వాళ్ళ అమ్మగారు! యింటి ఆడబడుచునని ఏదయినా పట్టుకెళ్ళొచ్చనీ అనుకుంటుంది చెల్లి!

కాని...బిడ్డల బాధ చూడలేక, నెలలు నిండుతున్నా, సమయం లేకపోయినా, అలా అలా గారట్లాడుతూనే ఆ బొంతను కుట్టి కొన్నది వదిన! ఆవిడ శ్రమగురించి, ఆవిడ మనసు గురించి మనలో ఒక్కరు ఒక్క నిముసం ఆలోచిస్తే యింత రాద్ధాంత మిన్నాళ్లు జరిగేవి! యింత పట్టుదలలు పెరిగేవి ...!"

ఎవ్వరూ మాట్లాడలేదు!

సీత అంది...

"తీసుకెళ్ళు మాలక్ష్మి నేను మళ్ళీ కుట్టుకుంటాను..."

"యిదీ! యింత జరిగాక..." చిట్టెమ్మగారు అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంకాలం ఎవ్వరూ లేనప్పుడు మరిదితో అంది సీత...

"నువ్వు చెప్పిన హక్కులూ గొడవలూ నాకేం తెలీదు గాని మాధవా...! యీ బొంతను దానికిచ్చెయ్యటం ఓ పెద్ద పనికాదు. యిప్పుడంటే నెలల్నిండిన మనిషిని! రేపు చులాగ్గా ఉన్నపుడు మళ్ళీ ఓ బొంత కుట్టుకోడం పెద్ద లెక్కల్లో పనిగాదు. అయితే...

మనవి అతుకుల బొంతల బతుకులు! పిసరంత ఉన్నా దాని కోసమే కొట్లాటలూ, పుణ్యాలూ, ఏడుపులూ అన్నీను! ఏదయినా ఉబ్బరిస్తున్నదా అన్నదే మనం చూస్తాం! మాలక్ష్మికి యిమ్మ నేసుకోడం సాహసము! పెద్దవాళ్ళంతే వాళ్ళ దారిన ఎలాగో వెళ్ళిపోయింది. దీనికి చెల్లి చెప్పినట్టు చేస్తాను. మీ అమ్మగారు అన్నీ పడుతూనే వచ్చారు! అయ్యో! అదేం పాడుబుద్ధితో అంటున్నారేమో! ఎన్నేళ్ళకోమంటోంది...అని ఆమె అనుకోదు!

యిన్నేళ్ళు బాధపడ్డ పిల్లలు యీ ఒక్క పనికి ఇబ్బందిపడితే పడతార్లే అని యిచ్చేద్దామనుకున్నాను. కాని...దానికి ఎంతెంరావాలి... ఏది నేర్చుకోవాలి...అని మాట వాచా తెలుసు ఇచ్చాను! కానీ..."

అన్ని వాదనలూ ఆ గదిలోనే జరుగుతున్నాయి ప్రస్తుతం!

రాజమరాళి

శ్రీ కె. బాలసుబ్రహ్మణ్యం

చిడత భజనల్లో
  చిత్తకార్తి కుక్కల్లా
కారుకూతలు కూస్తే
కూత కూతా కొత్త పుంతలు తొక్కిందని
సంబరపడిపోయి
చంకలు బాదుకొనే
ముష్కర సంగీత రసాస్వాదనా "తుష్కరులూ"—
నీరో దొరగారి నికార్సైన వారసులూ
ఉన్నంతవరకు ...
రోమ్ తగలడుతూనే ఉంటుంది
అందుకనే
నీరింకిన హరివిల్లు
నీలాంబరంలో
నీరుగారిపోయింది
సప్తస్వర మాలికాలంకృత రాజమరాళి
సజీవ సమాధిలో
తపస్మైపోయింది.

డా. తంగిరాల వెంకట సుబ్బారావు

వీరగాథలు - వారానువర్తనములు

మార్గ సాహిత్యమున ప్రబంధములవలె దేశి సాహిత్యమున వీరగాథలన్నియు నొకే మూసలో తయారయినట్లుండును. ప్రపంచమున ఏ సాహిత్యమును పరిశీలించినను వీరగాథలన్నియు నొకే పద్ధతిలో నున్నట్లు స్పష్టమగును. ఇంచుమించుగ నొకేరకమగు కథా ప్రణాళిక, ఒకేరకమగు వర్ణనలు, అలంకారములు, పదబంధములు నుండును. ఇట్లు వీరగాథలలో తఱచుగా గానవచ్చు సమానాంశము లను 'వీరగాథా వారానువర్తనములు' (బలాడ్ కామన్ ప్లేసెస్) అందురు. నిజమైన వీరగాథలో ఈ వారానువర్తనములు తప్పక యుండి తీరును.

వీరగాథల కథాగమనమును బట్టి రసముల ననుసరించియుగా కొన్ని పడికట్టు పదములు, వాక్యములు, అలంకారములు, ఎదే ఇదే ప్రయోగింపబడుచుండును. వీనిని బట్టి మనము వీరగాథలను అత్యంత సులభముగా పసిగట్టవచ్చును. అసలు వర్ణనలు, అలంకారములు చాల తక్కువ. ఉన్నవి కూడ ఒకే సాంప్రదాయిక పద్ధతి ననుసరించి యుండును. పరస్పర భిన్నములగు వీరగాథలలో సహితము ఈ పడికట్టు పదములు మాత్రము సమానముగనే యుండును. వర్ణనలోను, పాత్ర చిత్రణలోను, నాటకీయ ధోరణిలో సాగు సంభాషణలలోను ఈ సాధారణ ప్రయోగములు దొరలుచునే యుండును.

ఈ పడికట్టు పదములు లేక వారానువర్తనములు ఐరోపా ఖండమువంటి ఒక ఖండములోని వివిధ దేశముల వీరగాథలన్నింటిలోను సమానముగా కానవచ్చును; భారతదేశమువంటి ఒక దేశములోని భిన్న భాషల వీరగాథలయందును సమానముగా కానవచ్చును; ఆంధ్రప్రదేశము వంటి ఒక రాష్ట్రములోని ఒకే భాషలోగల వివిధ వర్గములకు చెందిన వీరగాథలలోను తుల్యముగా గోచరించును. కాని, ఒక ఖండములోని వీరగాథలకన్న ఒక దేశములోని వీరగాథలలోను, ఒక దేశములోని వీరగాథలకన్న ఒకే భాషలోని వీరగాథలలోను ఈ వారానువర్తనముల సామ్యములు ఉత్తరోత్తర సాంద్రతరములై యుండుట గమనింపవచ్చును. ఒక భాషలో గూడ వివిధ వర్గముల గాథలలో ఈ పడికట్టు పదముల సాన్నిహిత్యము ప్రత్యేక పరిశీలనార్హమై యుండును.

తెలుగు వీరగాథా కవిత్వములో ఈ వారానువర్తనములు కొల్లలుగా నున్నవి. ఏ వర్గమునకు చెందినదైనను తెలుగు వీరగాథా ప్రణాళిక ఎప్పుడును ఇట్లుండును:—

మొదట ప్రార్థన యుండును. ఈ ప్రార్థనలో గూడ వినాయకుని ప్రార్థన, శారద ప్రార్థన తప్పకయుండును. వీరగాథా నాయకుని పితృపితామహుల వర్ణనతో, వారుచేసిన అద్భుత కార్యముల ప్రశంసలతో కథ ప్రారంభమగును. నాయకుని తల్లిదండ్రులు సంతానములేక బాధపడుచు 'నోయరాని నోములు' నోచెదరు. ఇటు వారు 'కాశీతీర్థము గంగకు నోమి'నట్లును, 'గంగతీర్థము కాశికినోమి'నట్లును చెప్పుట సాధారణము. పుణ్యక్షేత్రములను దర్శించెదరు. ఏ దేవుడో ఒక ఫలమిచ్చును. ఆ ఫలమును భక్షించుటచే గర్భమువచ్చును. వీరుడు జన్మించును. ఈతడూరకే పుట్టడు. వీపున వింజామరతోను, అరి కాలున 'తామర పద్మము'తోను, [illegible] సామ్రాజ్యముతోను, కన్నుల చింతామణితోను, [illegible] పుట్టును. 'నేటి బ్రాహ్మల'ను పిలిచి జాతకమును చెప్పించెదరు. ఈ బ్రాహ్మణు లెట్టి దైనను శుభమునుచెప్పరు. తండ్రి గండమునో లేక మేనమామల గండమునో చెప్పెదరు. పరశురాముని, కాలభైరవుని, సోమనాథుని, [illegible] కల నాయనారి [illegible] వారు పుట్టినప్పుడిట్లే జరిగినది. తల్లిదండ్రులు బాలుని పరిత్యజించుటో, లేక చంపి ప్రయత్నించుటో చేయుదురు. బాలుడు దైవముచే రక్షింపబడి వేఱొకతావున పెరుగును. ఆ బాలుడు 'ఎంతెంగ పెంతెంగ పెద్దవాడౌను' అగును. తోడి బాలురతో నాటలాడుచుండును. ఏ ఆట ఆడినను ఆడకపోయినను బొంగరాలాట మాత్రము తప్పక ఆడును. ఆ బాలుని బొంగరము (అదేమికర్మమో!) ఎప్పుడును ఒక్క కోమటి స్త్రీకే తగులును. ఆమె బాలుని దూషించును. ఆ దూషణలో వీరుని చనిపోయిన తండ్రి ప్రసక్తియో, లేక చెఱబడ్డ తల్లి ప్రసక్తియో వచ్చును. బాలునిలో శౌర్యము ప్రకోపింపబడును. (ఈ విధమగు బొంగరాలాటలు తెలుగునగల నాలుగు ప్రసిద్ధ వీరగాథా చక్రములలోను వర్ణింపబడినవి. ఎల్లమ్మ కథా చక్రమున పరశురాముని బొంగరాలాట, అంకమ్మ కథాచక్రమున రవద్వేపి రాజు బొంగరాలాట, పల్నాటి వీరకథాచక్రమున బాలచంద్రుని బొంగరాలాట, కాటమరాజు కథాచక్రమున ముమ్మయ్య పోచయ్యల బొంగరాలాట ఒకేతీరుగా వర్ణింపబడినవి. వీనిలో బాల చంద్రుని బొంగరాలాట తక్కిన వానికి మూలమై యుండును. సాధారణ వీరగాథలలో బాలనాగమ్మ కథలోను, లఘువీర గాథలలో 'పడికట్టుపదము'లోను ఇట్టి బొంగరాలాట లున్నవి). ఇట్లు బొంగరాలాటలోని ఉపాలంభనతో రౌద్రప్రకోపము జరిగిన బాలవీరుడు తల్లిదగ్గఱకుబోయి తండ్రిని గూర్చి ప్రశ్నించును. లేదా పెంచుచున్న వారిదగ్గఱకుబోయి తల్లిదండ్రులగూర్చి ప్రశ్నించును. 'చంద్రాయుధమును చేతబట్టి' తల్లిని గాని తండ్రినిగాని బంధించినవారిపై యుద్ధమునకు బోవ నుద్యుక్తుడగును. తల్లి యెప్పుడును మొదట వలదని వారించును. ఎంత చెప్పినను బాలవీరుడు వినడు. "అమ్మా! నీవు పొమ్మన్నా పోతాను, వొద్దన్నా పోతాను" అనును. ఇదే మాటలతో నిట్లనుట ప్రతివీరగాథలోను చూడవచ్చును. ఎట్టకేలకు తల్లి దీవించును: "పగవాని చేయి కింద

గావలెను, నీ జేయి మీదుకావలెను'' అని దీవించును. ఏ వీరగాథలోని తల్లియైనను ఇదే వాక్యములతో దీవించును. కుమారుడు యుద్ధమునకు బోవుచు, తాను మరణించినట్లు తెలిసికొనుటకు కొన్ని ఆనవాళ్ళు చెప్పును. తాను రణమున కూలినచో ఇంటిదగ్గరనున్న గజనిమ్మచెట్టు వాడిపోవుననియు, పగలు చుక్కలు పొడుచుననియు, కలునంది అంకె వేయుననియు జెప్పును. తరువాత వీరుని యుద్ధయాత్రా వర్ణనను గూడ పడికట్టు పదములతోనే సాగును. కథాకాల మెంత ప్రాచీనమైనను సైన్యములో తుపాకులవారు, ఫిరంగులవారు, తురకలు, పచ్చి మాంసమును దినెడి పరాసువారునుందురు. వీరుల యుద్ధవర్ణనలన్నియు నొకే రీతిగా నుండును. ''సలుకుల తవ్వుంటే నల్లశిరసులు రాలుట, పొడుస్తువుంటే పొట్టు పేగులుపడుట, కొడవలావుంటే కొర్ప్య దబ్బులుపడుట'' మున్నగునవి సాధారణము. పిమ్మట వీరుని మరణము లేదా జయము వర్ణితమగును. (సాధారణముగా మరణమే హెచ్చుగా నుండును). ఇంటిదగ్గర వీరుని భార్యకు గాని, తల్లికిగాని ఆ రాత్రి కలవచ్చును. ఆమె ఎటుకతెచోగాని ఇతరులచేగాని అకలము విప్పించుకొనును. పరశురాముని కథలలో ఎల్లమ్మకును, కాటమరాజు కథలలో పెద్దమ్మకును ఇటువంటి ఇట్టి స్వప్నములు వచ్చును. తెల్లవారి కల సలము బాగ వీరపనిత 'సొగుమానము' చేయును. (పల్నాటి వీర కథా చక్రమునను, కాటమరాజు కథాచక్రమునను ఇందుమించు ప్రతి కథలోను వీరపత్ని సహగమనము వర్ణింపబడినది.) ఈ చెప్పిన దానిలో ఒకటి రెండు స్వల్పముగ మార్పులున్నను తెలుగు వీరగాథల కథా ప్రణాళిక ఎల్లప్పుడును ఇట్లేయుండునని చెప్పవచ్చును.

ఇట్లు వీరగాథల కథా ప్రణాళికలోని సామ్యములకు కారణము వానిలో సాధారణముగా నుండెడి 'కథన ఘటకములు' (మోటిఫ్స్). కథా కథనములో అతి ప్రధానమైన ఒక కనిష్ఠాంశమును ఆంగ్లమున 'మోటిఫ్' అందురు. (దీనిని కన్నడములో 'ఆశయ', 'ప్రేరక', 'కథన ఘటక' అని భాషాంతరీకరణము చేసినారు. తెలుగులో దీనికి 'కథన ఘటకము' 'కథన ప్రేరకము' 'మూలాంశము' అను పేర్లను వాడవచ్చును.) ఈ 'మోటిఫ్'నకు కథా గమనమును మార్చగలిగిన శక్తి యుండును. కథను చెప్పువాడు దీనిని మరచుటకు వీలులేదు. ఈ 'కథన ఘటకములు' లేదా 'మూలాంశములు' పైన చెప్పినట్లు బొంగరాలాట వంటి సంఘటనలు కావచ్చును. లేదా సవతితల్లి (బాల నాగమ్మ కథ) పేదరాసి పెద్దమ్మ, కడగొట్టు కొడుకు లేక కూతురు (వీరు సాధారణముగా మూడవవారుగా గాని, ఏడవవారుగా గాని యుందురు), విశేషమైన శక్తులు కలిగిన చిలుక, కుక్క, పాము (ధర్మాంగద చరిత్ర), గుఱ్ఱము (పల్నాటి వీర కథలలో అలరాజు గుఱ్ఱము 'సవరాల జిమ్మడు', పెద్దన్న బాదరాజు గుఱ్ఱము 'కారు బొల్లడు'), కోడిపుంజు (పల్నాటి వీరకథలలోని 'చిట్టిమల్లుడు' 'నల్లమల్లుడు' అను కోడిపుంజులు) మొదలగు పాత్రలు (కారెక్టర్స్) కావచ్చును. లేదా మంత్రదండము, చంద్రాయుధము (బ్రహ్మనాయని నృసింహకుంతము, బాలచంద్రుని సామంతరాగోల, అలరాజు సూర్య భేతాళము), ఎగిరెడి రత్నకంబళి, చెప్పులు, చావురానీయని తులసి వనమాల (బ్రహ్మనాయుడు అలరాజు మెడలో వేసినట్టిది) మొదలగు వస్తువులు కావచ్చును. ఉదాహరణకు ''రాముడు క్రొత్త దుస్తులు ధరించి ఊరికి వెళ్ళెను'' అను వాక్యము సాధారణ వాక్యము. దీనిలో 'మోటిఫ్స్' లేవు. అట్లుకాక, ''బాలనాగమ్మ కొడుకు బాలవర్ధిరాజు గండ భేరుండ పక్షి నెక్కి, ఏడు సముద్రములు దాటి సంజీవి గడ్డలో దిగి, ముంత మామిడి చెట్టు తొఱ్ఱలోనున్న పంచవన్నెల రామచిలుకను పట్టి తెచ్చినాడు'' అను వాక్యములో విశేషాంశములున్నవి. గండభేరుండ పక్షి, ఏడు సముద్రములు దాటుట, సంజీవి గడ్డ, ముంతమామిడి చెట్టు తొఱ్ఱ, పంచవన్నెల రామచిలుక — అనునవి యిందలి కథనఘటకములు. ఇవి వీరగాథలలోకన్న జానపద కథలలో ఇంకను ఎక్కువగా నుండును. ఈ కథన ఘటకములు కథా కథనమునకేకాక ఒక్కొక్కప్పుడు పద ప్రయోగములకు, సంఖ్యలకు సంబంధించి కూడ నుండవచ్చును. అట్టివానిని 'శబ్ద కథన ఘటకములు' (వర్డ్ మోటిఫ్స్) అనియు, 'సంఖ్యా కథన ఘటకములు' (నంబర్ మోటిఫ్స్) అనియు నందురు. కథన ఘటకములు వీరగాథల అంతర స్వరూపము (ఇతివృత్తము) నకు సంబంధించినవి, వారానువర్తనములు బాహ్య స్వరూపము (శైలి, వర్ణనలు) నకు సంబంధించినవి.

వీరగాథల వర్ణనలలో తిట్టు కోపము, శోకము వర్ణింపబడుచుండును. ఈ వర్ణనలు ఏ వీరగాథలో వచ్చినను ఒకే విధముగా నుండును. కోపమును వర్ణించునప్పుడు ''తెల్లని గుడ్లకు తెచ్చె ఎర్రని రంగు'', ''కుడిమీసము మెలివేసి గుడ్లురజేసె'', ''ఎఱ్ఱని గుడ్లకు ఎక్కె కోపములు'', ''పెట పెట పండ్లు పటార్చి కొరికె'', ''అగ్గిమీద గుగ్గిలమాయె'' అను వాక్యములు పదే పదే ఉపయోగింపబడుచుండును. శోకమును వర్ణించునప్పుడు — ''గోడు గోడున ఏడ్చెను'', ''కొండ గొఱ్ఱా గోలపెట్టు'', ''కుడికంటి పుడకాలు కురుల పరిగెత్తు లాగు, ఎడమకంటి పుడకాలు ఏరులై పారె'' ''ఈ కంట కన్నీరు ఆ కంట రాసె'' — అను వాక్యములు ప్రయోగింపబడుచుండును. ఒక్కొక్కప్పుడు కరుణరస వర్ణన మరింత రసవంతముగ జరుగును :

''వల వల కన్నీరు వలపొయ్య సాగె
ముత్యపు కన్నీరు ముక్కంట రాల్చె
పగడపు కన్నీరు పలువరస జారె
నడుము నక్కన విరిగి నేలకు వరిగె''

నవ్వు :— 1. 'అళ్ళున నవ్వి'

2. 'గళ్ళున నవ్వి'

3. 'సిత్తారి నోటిలో సిక్కున నవ్వాడు
బంగారి నోటిలో పక్కున నవ్వాడు'

4. 'చెక్కిట బగాలు చెదరంగ నవ్వెను'

5. 'పుక్కిట విడెము చెదర నవ్వెను'

చూపు :— 'కండ్లజూచి' : ('చూచి' అను ప్రయోగముండవలసిన తావు లందన్నింటను ఇది ప్రయోగింపబడుచుండును.)

సంభాషణ :— వీరుడు మాటాడుచున్నాడని కవి చెప్పునప్పుడు "అప్పుడు (వీరుని పేరు) ఆడె నొక మాట" అను వాక్యము విధిగా నుండును.

ఉదా॥ "అప్పుడు బ్రహ్మన్న ఆడె నొక మాట" (పల్నాటి వీరకథలు)

"అప్పుడు అయితన్న ఆడెనొక మాట" (కాటమరాజు కథలు)

ఇట్లే ఒక వీరుడు ఏదైన విషయమును చెప్పబోవునప్పుడు ముందుగా ఈ క్రింది పడికట్టు వాక్యమును తప్పక ప్రయోగించును :

"వినవయ్య (నాయుడా) విశదంబుగాను"

"వినవయ్య (రాజేంద్ర) విశదంబుగను"

ఈ విధముగు కవి కావ్యములు, సంభాషణ ప్రారంభములు పల్నాటి వీర కథలలోను కాటమరాజు కథలలోను తఱచుగా ప్రత్యక్షమగుచుండును.

విశేషణములను త్రిప్పి చెప్పుట :—

1 "ఎండిదే జాలె — పయిడిదే బొంగరము
పయిడిదే జాలె - ఎండిదే బొంగరము" (చవద్వేని రాజుకథ)

2 "ఎండిదే సుట్టు — పైడిదే తట్టు
పైడిదే సుట్టు - ఎండిదే తట్టు" (అంకమ్మ కథ)

విశేష్యములను త్రిప్పి చెప్పుట :—

1 "కన్నుల జూచి అల్లుని మనసున దీవించెను
మనసున జూచి అల్లుని కన్నుల దీవించెను" (గంగురాజు కథ)

2 "క్షేమానబోయి అల్లుడా! లాభాన రమ్మి
లాభానబోయి అల్లుడా! క్షేమాన రమ్మి" (గంగురాజు కథ)

3 "చుక్కపెయ్య లరువంగ చూడియావుల వేసిరి
చూడియావు లరువంగ చుక్కపెయ్యల వేసిరి
పాడియావు లరువంగ పక్క లేగల వేసిరి
పక్క లేగ లరువంగ పాడియావుల వేసిరి" (జన్నివాడ కథ)

4 "ఎద్దుల జ్ఞానమ్ము ఎర్రయ్యకు దెల్సు
ఎర్రయ్య జ్ఞానమ్ము ఎద్దులకు దెల్సు" (ఆవుల మేపుకథ)

5 "గొడుగుల దప్పించి పడిగల నరికిరి
పడిగల దప్పించి గొడుగుల నరికిరి" (అగుమంచి కథ)

రాత్రి వర్ణన :—

"కలికి కలికి ఏళ గాంధారి ఏళ
రాయి రాయి కరిగే యేళ — మాను మాను వరిగేయేళ
బావుల్లో నీళ్లు నిద్రబొయ్యే యేళ
కొరివి దయ్యాలు కొట్లాడే యేళ
బసవదేవుడు మేత మెయ్యని యేళ
పసిబిడ్డ తనపాలు తాగమరసిన యేళ"

ఎఱుకలసాని వేషము, జంగము వేషము, తెలుగువీర గాథలలో తఱచుగా వచ్చుచుండును. ఇందు ఎఱుకలసాని వేషము స్వభావోక్త్యలంకారములోను, జంగము వేషము బీభత్స రస ప్రధానముగాను వర్ణింపబడుచుండును. ఎఱుకల వేషమును వర్ణించుటకు ముందు ఎఱుకల బుట్ట నల్లుట అతి సహజముగా మనోహరముగ వర్ణింపబడును. పరశురాముని కథలలో గవరమ్మ ఎఱుకల వేషమునుకట్టగ, పరశురాముడామెకు ఎఱుకల బుట్ట నల్లి యిచ్చినాడు :—

"పెద్దకొండకుబోయి రామన్నారాము —పేపరువ్వలుకోసి రామన్నారాము

చిన్న కొండకు బోయి	,,	చిపురువ్వలుకోసి	,,
ఎండి కత్తి తోని	,,	ఎదునొకటి కొట్టాడు	,,
బంగారి గోళ్లతో	,,	బద్దలను జేశాడు	,,
చిత్తారి గోళ్లతో	,,	చీరి పోగెట్టాడు	,,
ఎండలో రువ్వాలు	,,	ఎండ వేసినాడు	,,
మంచులో రువ్వాలు	,,	మాగ వేసినాడు	,,
మంగళోరంనాడు	,,	మగలి నచ్చత్రమున	,,
బుదవోరంనాడు	,,	బుద్దిగల రోజున	,,
బూమి సుదురుగ తవ్వి	,,	బుట్ట మొదలేశాడు	,,
వజ్రాలు పోశాడు	,,	వార అల్లినాడు	,,
ముత్యాలు పోశాడు	,,	మూల అల్లినాడు	,,
ఆరికసి పల్లన్ని	,,	అంచులల్లినాడు	,,
సుగిరినా రేకాలు	,,	గిలక అల్లినాడు	,,
బాలవాళ్లకు తగిన	,,	బంతు అల్లినాడు	,,
సిన్నవాళ్లకు తగిన	,,	సిలక అల్లినాడు	,,
వారవ్వ తాతల్ని	,,	బుట్టపై నేశాడు	,,
ఈతరేకుల బుట్ట	,,	ఇమ్మ గిల్లినాడు	,,
తాటిరేకుల బుట్ట	,,	తామాష గల్లాడు	,,

ఈ యెఱుకల బుట్టను 'కొల్లాపురి బుట్ట' అందురు. ఈ బుట్ట నల్లు వర్ణన వేంకటేశ్వరుని కథలోను, చిన్నమ్మ కథలోను గూడ వచ్చును. ఆ కథలలో గూడ నిట్టి మాటలతోనేయున్నది. ఎఱుకల బుట్ట వర్ణన తరువాత ఎఱుకలసాని వేషవర్ణన ముండును. ఇది యును వాచానువర్తనమే. ఏవీరగాథలోనైనను ఒకేరీతిగా నుండును. ఈ యెఱుకలసాని వర్ణనము యక్షగాన ప్రభావము కావచ్చును.

జంగము వేషము పరశురాముని కథలలోను, మల్లిక దేవమ్మ కథలోను, పర్వతాల మల్లన్న కథలోను, సిరియాళుని కథలోను, ఎల నాగి రెడ్డి కథలోను విపులముగా వర్ణింపబడినది. అన్నింటను ఒకే విధమగు వర్ణనము. శైవ సంబంధమగు కథలలో నిది యెక్కువగా వచ్చుచుండును. సాధారణముగా పరమేశ్వరుడే జంగమవేషము కట్టి నట్లుగా వర్ణింపబడుచుండును ఈ జంగము దుర్భరమగు వాసనతో కుళ్ళి పురుగులోడుచున్న కుష్ఠు రోగిగా వర్ణింపబడుచుండును.

సైన్యవర్ణనలో ఔచిత్యముండదు. అతి ప్రాచీన కథలలో కూడ పచ్చిమాంసమును తిను పరాసువారు, తురకలు ఉన్నట్లుగా చెప్పబడుచుండును. పరశురాముని కథలలో సైన్యవర్ణన చూడుడు :

"వార శిఖలావారు వాజాన బాహూలు
సూనూగు మీసాల సూటికెలమా దొరలు
పచ్చిమాంసం తిన్న పొరాను వారయ్యా
చూపితే పొడిచేటి శూరకత్తులవారు
నరికితే కానారు నల్లతుమ్మ తురకాలు
ఏనుగులు గుఱ్ఱములు పయనమై నారయ్యా"

పల్నాటి వీరకథలలో గూడ తురకలు వర్ణింపబడిరి (కోడిపోరు కథ) క్రీ. శ. 12వ శతాబ్దమున దక్షిణదేశమున ఇంకను తురకలు వ్యాపింపలేదు. కాని యిట్టి వర్ణనలు కథాకాలను నాటివిగాక కవి రచనాకాలము నాటివిగా మనము భావింపవలెను. అట్లే కాటమరాజు కథాకాలమున తుపాకులు, ఫిరంగులు లేకపోయినను ఆ కథలలో వర్ణింపబడినవి. అంకమ్మ కథలలోగూడ తుపాకులు ఫిరంగులు వర్ణింపబడినవి. గంగురాజు కథ (అంకమ్మకథాచక్రము)లోని సైన్య వర్ణన చూడుడు:—

"విన్నుకత్తులవారు వీటెలవారు
పట్టా కత్తులవారు బాణాలవారు
అంబుల తరకాములవారు ఆయుధాల బలాట్లు
ముకుంద బల్లేలవారు మున్నూరుకోట్లు
వీట తుపాకులవారు ఎన్నూరు కోట్లు
మసియాటకాళ్లు గద్దరి బోయలు
దాగి పోట్లాడేటి దండి నాయకులు
పరుని పోట్లాడేటి నాలు మన్నీలు
దాట కత్తులతోను తిరమేటివారు
సొమ్ములున్న వీటెలు ముక్కులకు [illegible]
సాని కత్తులతోను సాగేటివారు
అంబుల తరకాములవారు ఆయుధాలవారు
గోడిగల నెక్కిరి కొందరు వారు
మిన్నంది వచ్చిరి మీసకొక్కేములవారు
ఆకాశమున అడు అలనట్టములు
వాలులు ఎన్నూరు జమూనీలు ఎన్నూరు
పెన్న పెన్న బాణాలు పెద్ద ఫిరంగీలు
అక్షోణి అక్షోణి పన్నెండునవేల చతురంగబలము"

యుద్ధవర్ణన, రణభూమి వర్ణన, వీర బీభత్స రసములలో నొక్కచో, ప్రతి వీరగాథలోను సమానమగు పదవాక్య ప్రయోగములతో నొప్పుచుండును. ఘోటిక ప్రచారమునగల దేసింగురాజు కథలోను, సర్వాయి పాపని కథలోను, నారసింహారెడ్డి కథలోను ఇట్టి సారూప్య వర్ణనలను చూడవచ్చును. జానపద కవి ఒకేరకమగు రూపకములు, ఉపమానములు, ప్రయోగించుచు, ఒకేరకమగు దృశ్యములు వర్ణించుచుండును. వీరుడు సైన్యమున పడదుమికి నఱకుచుండగా 'పెద్ద పులి మెయ్యల దొడ్లో పడినట్లు', 'వెట్టివాడు జొన్నచేను విడగోసినట్లు' ఉపమింపబడుచుండును. తాటికాయలు తరిగినట్లుగా తలలు తరుగుట, యిద్దఱు ముగ్గురనుబట్టి ఒక్క వ్రేటునకే నఱకుట, పాళెగాండ్ల తలలు కొట్టి పందిరి పెట్టుట, గుఱ్ఱకాళ్ల తలలు కొట్టి గుట్టలు పెట్టుట—ఇత్యాది వర్ణనలు యుద్ధవీరమున్న ప్రతి వీరగాథలోను ప్రత్యక్షమగుచుండును. 'నరుకుతవుంటే నల్లశిరసులు రాలుట, కొడుతూవుంటే కొవ్వు దబ్బలు పడుట, పొడుస్తూవుంటే పొట్ట పేగులు పడుట, చీరుతవుంటే చిన్నపేగులు పడుట, అప్పుడు తిన్న పప్పుఅన్నము కుప్పలు తెప్పలగుట, అప్పుడు తాగిన కల్లూ సారాయి వరదలుగా పారుట, ఏనుగ రకతం, పీనుగ రకతం ఏకమగుట'—మున్నగు వర్ణనలు బొబ్బిలి కథ, దేసింగురాజు కథ, సర్వాయి పాపని కథ, నారసింహారెడ్డి కథ, యింకను ఇతర వీరగాథలలోను యుద్ధఘట్టములందు వచ్చు వారానువర్ణనములు. తురక పీనుగ 'పాని! పాని!' అని అరచుట, అరవ పీనుగ 'తణ్ణి! తణ్ణి!' అనుట, వీరుని సైన్యము వారిని హెచ్చరించి కత్తులతో బల్లెములతో పొడుచుట కూడ వీరగాథలలో గానవచ్చు వారానువర్ణనమే! వీరుల ద్వంద్వయుద్ధము "కొదను సింగములు రెండు కొట్లాడినట్లు, మత్తగజములు రెండు పెల్లాడినట్లు, తాడి చెట్లు రెండు తాకాడినట్లు" అను ఉపమానములతో వర్ణింపబడుచుండును.

మరణింపబోవు వీరులకు దుశ్శకునములగుట, వీరమాతలకు వీరపత్నులకు దుస్స్వప్నములు వచ్చుట వారానువర్ణనము. ఈ దుస్స్వప్నములను దివ్యజ్ఞానము కలిగిన ప్రత్యేక వ్యక్తులకు విన్నవించి, వారిచే ఫలితములను విప్పి చెప్పించుకొందురు. ఒక్కొక్కప్పుడు ఎఱుకతచే గూడ చెప్పించుకొందురు. కోడిపోరు కథలో బ్రహ్మనాయుడు తనకు వచ్చిన దుస్స్వప్నము బాలగోపన్నచే చెప్పించుకొనును. పెద్దిరాజు కథలో పెద్దమ్మ కళ్యాణరాజు ద్వారా స్వప్నఫలితము [illegible]. [illegible] కథలో [illegible] కాటమరాజు [illegible] గొల్ల చెప్పించుకొనును. [illegible] కథలో [illegible] కలను ఎఱుకతచే [illegible]. ఈ దుస్స్వప్నములలో కీడు సూచకములుగా ప్రత్యక్షమగును. కొన్ని ప్రత్యేక వస్తువులచేత ప్రతీకలచేత వీరుని మరణింపనున్నట్లుగా సూచింపబడును. ఈ స్వప్నములు ప్రతీకలను కల వనువారు గుర్తించి వ్యాఖ్యానింతురు. పేరంటాండ్ర కథలలో కూడ ఈ దుస్స్వప్నములున్నవి.

వీరగాథలలో కొన్ని వస్తువులపేర్లు పదే పదే వచ్చుచుండును. చంద్రాయుధము, పన్నెండుమెట్ల పైడి కిన్నెర, పన్నెండు ఘంటాయుధాలు, పచ్చల పిడిబాకు, గారుత్మంతము, రవదుప్పటి, కనకపుసెట, మూడువేయిచేసే ముద్దుటుంగరము, పదివేలు చేసే పచ్చల కంఠమాల, భూచక్ర గొడుగు మున్నగునవి. యుద్ధమునకుముందు రణభూమిలో నిరుసైన్యములవారును డేరాలు వేసికొందురు. ఈ డేరాలవర్ణన ప్రతి వీరగాథలోను ఒకేతీరుగా నుండును. ఎండలకు వెండిపట్టు డేరాలెత్తుట, నీడలకు నీలపట్టు డేరాలెత్తుట సాధారణము:

1 "ఎద్దులకు ఎత్తించినారు ఎన్నపట్టు డేరాలు
ఎండలకు ఎత్తించినారు ఎండిపట్టు డేరాలు
నీడలకు ఎత్తించినారు నీలిపట్టు డేరాయి"

(పల్నాటి వీరకథలు

2 ''ఎండలకు ఎత్తించె రాజు ఎండిపట్టు గుడార్లు
నీడలకు ఎత్తించె రాజు నీలిపట్టు గుడార్లు
మంచులకు ఎత్తించె మైనపు జిడ్డి గుడార్లు''
(కాటమరాజు కథలు)

నారసింహారెడ్డి కథవంటి క్రిందటి శతాబ్ది వీరగాథలలో సహితము ఇట్టి వర్ణనమే కానవచ్చును. ఈ డేరాల వర్ణన తెలుగు వీరగాథా కవిత్వమున ప్రస్ఫుటముగా గానవచ్చు వారానువర్తనము.

వీరుడొక ప్రయాణము చేయునప్పుడు మార్గమధ్యమున అనేక గ్రామములను దాటినట్లు చెప్పబడుచుండును. పల్నాటి వీరకథలలో బ్రహ్మనాయుడు మండాదినుండి గురజాలకు వచ్చునప్పుడు మార్గమధ్యమున గల ఊళ్ల పేళ్లన్నియు వరుస క్రమమున వర్ణింపబడినవి. అట్లే బ్రహ్మనాయుడు గురజాలనుండి తిరిగి మండాది కేగునప్పుడు సహితము మార్గములోని గ్రామముల పేళ్లను చెప్పుట వీరగాథాకవి మఱచిపోడు. అలరాజు మేడపినుండి గురజాలకు వచ్చినప్పుడును ఇట్లే మార్గములోని గ్రామముల పేళ్లన్నియు చెప్పబడినవి. ఇట్లే కాటమరాజు కథలలో నల్లసిద్ధిరాజు సైన్యము నెల్లూరునుండి ఎఱ్ఱగడ్డపాడునకు ఏయే గ్రామములు దాటివచ్చినదో స్పష్టముగా వర్ణింపబడినవి. బొబ్బిలి కథలో బుస్సీ సైన్యము హైదరాబాదునుండి బొబ్బిలికి వచ్చుట, విజయరామరాజు విజయనగరమునుండి రాజమహేంద్రవరమునకు వచ్చుట యిదే రీతిలో వర్ణింపబడినవి. మార్గమధ్యమున గల గ్రామములను వరుస తప్పకుండ వర్ణించుట వీరగాథల వారాను వర్తనములలో ముఖ్యమైనది. మఱికొన్ని వీరగాథలలో నాయకుడు ఒక గ్రామమునుండి మఱియొక గ్రామమునకు గాక ఒకే నగరములో వివిధ సందర్భములను, బంగారు మొగసాలలు, ఇత్తడి మొగసాలలు, కంచు మొగసాలలు, వివిధ వర్ణములవారి వాడలు దాటి వెడలినట్లు వర్ణింపబడుచుండును. చిన్నమ్మ కథలోను, ఎలనాగిరెడ్డి కథలోను ఇట్టి వర్ణనలు చూడవచ్చును. వీరుడు అరణ్యమున పయనించునప్పుడు చీమలు దూఱని చిట్టడవిని, కాకులు దూఱని కాఱడవిని, గ్రద్దలు దూరని పెద్దయడవిని దాటినట్లు వర్ణించుట వారానువర్తనము. ఈ ప్రయాణములకుముందు వీరుడెప్పుడును ''ఎంచిన ఎల్ల గుఱ్ఱము'' నెక్కుచుండును !

వీరునితోనున్న సేవకుల పేళ్లు, సంగాతకాండ్ర పేళ్లు వరుసగా నేకరువు పెట్టుట వీరగాథలలోని మఱియొక వారానువర్తనము. నల్ల సోమనాద్రి కథలోను, రాజారామేశ్వరరావు కథలోను, కుంటి పుల్లారెడ్డి కథలోను ఇట్టి జాబితాలను చూడవచ్చును. పల్నాటి వీర కథలలో గూడ మలిదేవుని సభలోని వీరులపేళ్లు, వీరవాశములపేళ్లు, నలగామని కొలువులోని రెడ్లపేళ్లు వరుసగా పదే పదే చెప్పబడినవి. ఇది యితిహాసలక్షణము. (మహా భారతాదులగు ఇతిహాసములలో మునుల పేళ్లును ఇట్టివే). మనుష్యులేకాక జంతువుల ప్రసక్తి వచ్చినప్పుడు కూడ ఇట్లు పట్టిక నిచ్చుట వీరగాథలలో గానవచ్చుచున్నది. పల్నాటి వీర కథాచక్రమున 'మందపోటుకథ'లోను, కాటమరాజు కథా చక్రమున 'ఆవులమేపు కథ'లోను, 'ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట'లోను ఆవుల ముద్దుపేళ్లు వరుసగా జెప్పబడినవి. 'ఆవులమేపు కథ'లో ఎన్నియో వచ్చుగడ్డి పేళ్లు చెప్పబడినవి. 'జన్నివాడకథ'లో పెక్కు వరివంగడముల పేళ్లు ఈయబడినవి. మొత్తముమీద జాబితాల నిచ్చుట ఇతిహాస లక్షణముగా జెప్పవలెను. వీరగాథ గేయరూపమున నున్న చిన్న యితిహాసము లేదా ఇతిహాస రూపముననున్న పెద్దగేయము కదా !

సంఖ్యావాచకములలో ఏడు శబ్దముపై జానపదులకు మోజు. 'ఏడేడు పధ్నాలుగు లోకాలు', ఏడడుగు లెదురెళ్లింది', 'ఏడుగడియల లోన ఏకాంతమాడేను', 'ఎడలేక ఏడేళ్లు బ్రతికాడంటే'—మున్నగు ప్రయోగములు కొల్లలుగా నున్నవి. అన్నదమ్ము లెక్కువగా ఏడుగురే యుందురు. నాయకుడెప్పుడును ఏడవవాడుగ నుండును. ''పెద్దవాడు పెద్దిరెడ్డి, చిన్నవాడు చెన్నారెడ్డి, నడిపివాడు నారాయణరెడ్డి'' ఇత్యాదిగా యతిప్రాసలు పాటించుచు నొక ప్రత్యేక పద్ధతిలో అన్నదమ్ముల పేళ్లు చెప్పబడుచుండును. ముగ్గురన్నదమ్ములున్నప్పుడు పై రీతిగా చెప్పబడును. ఏడుగురన్నదమ్ము లున్నప్పుడు—పెద్దవాని పేరు 'అందరికి పెద్దవాడు' అను విశేషణముతో ముందు చెప్పి, 'అతనికన్న చిన్నవాడు' అను విశేషణముతో తరువాతి ఐదుగురిపేళ్లు చెప్పి, ఆఖరి వానిని చెప్పునప్పుడు 'అందరికి చిన్నవాడు' అను విశేషణమును వాడుట పరిపాటి. కాటమరాజు కథాచక్రమున పల్లవారి ఏడుగురన్నదమ్ముల వర్ణన ఈ రీతిలోనే సాగినది. నల్ల సోమనాద్రి కథలో 'పాగ పుల్లారెడ్డి' అన్నదమ్ములును, రాజారామేశ్వరరావు కథలో 'అప్పరాలరెడ్ల' వర్ణన, ఎలనాగిరెడ్డి కథలో నాయకుని అన్న దమ్ముల వర్ణన యిట్టివే. వేంకటేశ్వరుని కథలో ఆతని అన్నదమ్ముల వర్ణన యిట్లుండును :

''అందరికి పెద్దోడు పెన్నోబలేశు
ఆయనకు చిన్నోడు చిన ఓబలేశు
ఇద్దరికి చిన్నోడు కదిరి నరసింహా
ముగ్గురికి చిన్నోడు గనమద్దులేటి సామి
నలుగురికి చిన్నోడు పెంచల్ నరసింహా
అయిదుమందికి చిన్నోడు గోయిందరాజ సామి
అందరికీ చిన్నవాడు సిరి యెంకటరమణ''

ఏడు సంఖ్య తరువాత మూడు, తొమ్మిది, నూటయొకటి సంఖ్యావాచకము లెక్కువగా నుపయోగింపబడుచుండును.

వీరగాథలలో కొన్ని పట్టణముల పేళ్లు చాల తఱచుగా వచ్చుచుండును : 'వాలుగొండపట్నము', 'వాలిగొండ—సలిగొండ', 'కల్యాణపురిపట్నము', 'దేవగిరిపట్నము', ఓరుగంటిపట్నము',—మున్నగు పేళ్లు సాధారణముగా వినబడుచుండును. 'పగలు చూచిన పట్నము మల్లె పూచినట్లు'ను 'రేయి చూచిన పట్నము రేల పూచినట్లు'ను ఉన్నదనుట సాధారణము. కొన్ని వీరగాథలలో ఈ పట్టణ వర్ణనము కొంచెము భిన్నముగా నున్నది : ''ప్రొద్దుపోయి చూచిన పొన్నపూచినట్లు, జాముపోయి చూచిన జాజిపూచినట్లు''కలదని వర్ణింపబడినది.

వీరుని శౌర్యమును వర్ణించుచు 'అదురుగుండె లేనివాడు', 'అదురు పిక్కలేనివాడు', 'పిరికికండ లేనివాడు', 'ఉక్కుతునక'

మున్నగు వాక్యము లుపయోగింపబడుచుండును. వీరుడు రెడ్డికులము నకు జెందిన వాడగుచో 'రెడ్డికాదు బంగారపు కడ్డీ !' 'రెడ్డికాదు వరాల ముడ్డి !', 'రెడ్డీ ! నీ పేరే బంగారపు కడ్డీ !' అను వాక్యము లతో వర్ణింపబడును. తెగించి యుద్ధమున దుముకు వీరులు, జీవి తము బుద్బుదప్రాయమను ధోరణిలో వేదాంతపు మాటలను జెప్పుట వీరగాథలలో గానవచ్చుచున్నది. యుద్ధమునకేగు బాలచంద్రుడు తల్లికి వేదాంతమును బోధించును. గండురేఖాంబ తన కూతురు మాంచా లకు వేదాంతము నుపదేశించి, బాలచంద్రుని యుద్ధమునకు బంపు నట్లు చేసినది. బొబ్బిలివీరులు "దాను రాను లనంతకాలాల రాజ్యము ఏలేమా?, యుగములు జగములు గిలంతకాలము భూములు ఏలేమా?" అని మాటిమాటికిని అనుచుందురు. ఇట్లే నారసింహారెడ్డి కథలో :

ఈ పొద్దిదియ రేపు తదియ నరుని ప్రాణమోయి
నీటిమీదను బుగ్గతోటిదీ నరాశరీరమ్ము
ఏలబోయి ఈ ప్రాపంచంలో మరల ఏలబోము
పుట్టబోయి పసి తల్లి కడుపునా మళ్ళీ పుట్టేమా ?"

అను పాదములు పదే పదే వచ్చుచుండును. కాటి పుల్లారెడ్డి కథలో గూడ ఇట్టి తెగింపు పలుకులున్నవి : "చచ్చేది ఒకనాడు బతికేది ఒకనాడు, చచ్చి బతికినగాని పేరు నిల్వాలె". వీరుడు ఆత్మహత్య చేసికొని దలచినప్పుడు చంద్రాయుధమును పైకెగురవేసి 'ఎదు రొమ్ము ఒడ్డెను.' ఇది పెక్కు వీరగాథలలో గానవచ్చుచున్నది. పైనుండి వచ్చెడి చంద్రాయుధమును భగవంతుడు పట్టుకొని అపు చేయును.

వీరునకు గొప్ప చిత్తస్థైర్యమున్నట్లుగా వీరగాథలన్నిట గానవచ్చుచున్నది. పోరాటములయందు గాయములైనను, ఒక ప్రక్క బంధుమిత్రులు నశించిపోవుచున్నను వీరుడు చలించక నిశ్చింతగా ధైర్యముతోనుండి బలాసి కొలువు పగడసాల నాడుచున్నట్లుగా వర్ణింపబడును. పల్నాటి యుద్ధములో బ్రహ్మనాయుడు, కాటమరాజు కథలలో కాటమరాజు ఇట్లే వర్ణింపబడిరి. కాటమరాజు పద్మరాఘవునితో బంగారు తమకముపై కూర్చుండి పగడసాల నాడు చుండును. (చిన్నపరెడ్డి కథలో అతడు ఊళ్లను కొల్లగొట్టి, పోలీసులను తన్ని, యింటికి వచ్చి నిశ్చింతగా చీట్లపేక ఆడు చుండును. గజదొంగలగు మియాసాబ్, పండుగ శాయన్నమున్నగువారు దోపిడులు, హత్యలు చేసివచ్చి, పానుగంటి ఖిల్లామీద నిశ్చింతగా, పండుకొనినట్లు చెప్పబడును. మరుట్ల చిన్నమల్లేశుని పాటవంటి వీరగాథానికలలో గూడ నిట్టి చిత్తస్థైర్యము వర్ణింపబడినది. వీరులకు పిక్కలలో తాయెత్తులున్నట్లును, ఆ తాయెత్తులు పెరికి నప్పుడు కాని వారికి మరణము రానట్లును చెప్పబడుచుండుటయు వీర గాథల వారానువర్తనమే : (ఉదా॥ సదాశివరెడ్డి కథ, పండుగ శాయన్న కథ).

'పాలు అన్నము తినుట', 'పైడి గిన్నెలో పాలు తాగుట — ఎండి గిన్నెలో ఎన్న తినుట' వీరుల భోగైశ్వర్యములకు చిహ్నములుగా వర్ణింపబడుచుండును. స్త్రీల స్నాన వర్ణన, అలంకరణ వర్ణన పెక్కు వీర గాథలలో కానవచ్చుచున్నది. అన్నింటను ఒకే తీరుగ నుండును ఈ వర్ణనము : 'ఎండి కడవలతో ఏన్నీళ్లు పెట్టి, పైడి కడవలతో సన్నీళ్లు పెట్టి, ఏన్నీళ్లు సన్నీళ్లు ఏకములుజేసి, నిమ్మల నీడల క్రింద, జాలారు బండెక్కి జలకము లాడుట' వీర గాథలలో వర్ణింపబడు చుండును. స్త్రీలు వస్తువులన్నియు నలంకరించుకొని 'నిలువు టద్ద ములో నీడలు చూసు'కొందురు.

వీర గాథలలోని కథయు, వర్ణనలును, 'అభివర్ధిత పునరుక్తి' (ఇంక్రిమెంటల్ రిపెటిషన్) తో సాగుచుండును. ఇది ముక్తపద గ్రస్తము వంటిది. ఇది వీరగాథల ముఖ్య లక్షణములలో నొకటి. ఒక వీరుడు యుద్ధమునకు సిద్ధమగునప్పుడు అభివర్ధిత పునరుక్తితో వర్ణన ఈ క్రింది విధముగా సాగును :—

"కాశమీదను కాశ హనుమంత కాశ
హనుమంత కాశపై రేవంత ముళ్ళు
రేవంత ముళ్ళపై పింజముల దండ
పింజముల దండపై బిసరు కురివేరు
బిసరు కురివేరుపై బిగువైన బాకు"

వీరుడు రణ రంగమునకు పోయి, మరణించిన తన తండ్రిని బ్రతి కించుకొని, ఆతనిని తన వీపున కట్టుకొని యుద్ధముచేసి, శత్రువు లను జంపి తండ్రి పగ తీర్చినట్లుగా వీర గాథలలో వర్ణింపబడు చుండును. పరశురాముని కథలలో పరశురాముడు జమదగ్నిని నడ్డికి కట్టుకొని కార్తవీర్య రాజులతో యుద్ధము చేసినాడు. పెద్దిరాజు కథలో కాటమరాజు కూడ ఇట్లే పెద్దిరాజును నడ్డికి గట్టుకొని నలకేతు రాజుతో పోరినాడు.

వీరుడు తపస్సు చేయునప్పుడు 'శిరము క్రిందికి, సిరి పాదములు పైకి' పెట్టి తపస్సు చేయును. పరశురాముడు లేక ధనపతులు (వీరుని తలిదండ్రులు) 'కాశి తీర్థము గంగాజలము, గయ తీర్థము కాశికి పోవుట' యటయే గాక, 'రాతి రాతికి మొక్కుట, గుంట గుంటకు మునుగుట, పెండ్లిండ్లులేని బ్రాహ్మణులకు పెండ్లిండ్లు చేయించుట, వడుగులు లేని బ్రాహ్మణులకు వడుగులు చేయించుట, ఉగ్గులేని బాలురకు ఉగ్గు దానము, పాలులేని బాలురకు పాలు దానము చేయుట' వీర గాథ లలో వారానువర్తనమగు వర్ణనము.

అలంకారములలో ఉపమాలంకారమే హెచ్చుగా ప్రయోగింప బడుచుండును. ఈ యుపమానములు పల్లె ప్రజలకు చిక్కలి పరిచి తములైనవిగా నుండును. కొన్ని ప్రాంతీయములగు ఉపమానములును నాడబడుచుండును. తెలుగు భాషలోని సిసలైన సామెతలు, జాతీయ ములు, పలుకుబడులు వీరగాథా కవిత్వమున అడుగడుగునను దొరలు చుండును. నిఘంటువులకెక్కని అపూర్వమగు దేశి పదజాలమెంతయో వీరగాథలలో మూలుగుచున్నది.

ఇట్లు వీరగాథా కవిత్వ మంతటికిని వర్తించు వారాను వర్తన ములే గాక, ఒక్కొక్క వర్గమునందు ప్రత్యేకముగా గానగు వారాను వర్తనములును కొన్ని గలవు. అనగా శక్తి కథలన్నింటికిని ప్రత్యేక

మగునవి, పల్నాటి వీర కథాచక్రమునకు పరిమితమైనవి, కాటమరాజు కథా చక్రమునకు పరిమితమైనవి, బొబ్బిలి వరుస కథలలో కానవచ్చునవి, వీర గాథనికలలో గోచరించునవి కొన్ని కలవు.

ఏ శక్తియైనను ఈశ్వరుని పుత్రికగనే చెప్పబడును. ఆమె ఈశ్వరుని చెమట బిందువు నుండి పుట్టినట్లుగా వర్ణింపబడును. (ఒక్క ఎల్లమ్మ మాత్రము పుట్టలో పుట్టినది). ఈ శక్తి రాక్షసులను జంపుటలో తన తండ్రికి తోడ్పడును. ఎల్లమ్మ తన తండ్రి గిరిరాజునకును, పోలేరమ్మ చౌడమ్మలు ఈశ్వరునకును సహాయము చేసినట్లు చెప్పబడెను. అంకమ్మ గంగురాజునకు యుద్ధములలో సహాయకారి యయ్యెను. రాక్షస సంహారము, ముఖ్యముగా రక్తబీజుల సంహారము శక్తి చేయును. శక్తి యుద్ధమున కేగునప్పుడు ఆమె తమ్ముడు పోతురాజు ఎప్పుడును వెంబడి నుండును. అమ్మవారి స్నాన వర్ణన, అలంకరణ వర్ణన రమణీయముగా జేయబడును. అమ్మవారి భోజన పరాక్రమము మాత్రము అతి మానుషముగా వర్ణింపబడును.

పల్నాటి వీర కథా చక్రమున ప్రధాన వీరుడు బ్రహ్మనాయుడు. ఆతని వర్ణన యేకథలో వచ్చినను ఈ క్రింది విధముగనే ఉండును:—

"విద్యల యందున వీరు డుండునను
అను నొక్క ఖ్యాతియు నతడుండువాడు
పది మూడుకోట్ల ధనము పది గొన్నవాడు
ఏడాకలె లోకులు సొరది గనువాడు
మూడామడ ముప్పుల ముందు గనువాడు
వేదాల వేదాంతము ఎరిగినవాడు
పాయక పరుగులు పరగ గనువాడు
పోడక కలలే పోట్లువాడు
... ...
పది వాక్కు శ్రుత వాక్కు కలిగినవాడు
పొమ్మన్నవారికి పోకలు గలుగు
రమ్మన్నవారికి రాకలు గలుగు"
(— కారెంపూడి తాళపత్ర గ్రంథము, ఆకులు 67, 105)

పెద్దన్న బాగరాజు వర్ణన పల్నాటి వీర కథలలో నెచ్చట వచ్చినను ఈ క్రింది విధముగా నుండును:—

"విద్యలకు పెద్ద విలు విద్యలకు పెద్ద
చదువులకు పెద్దయు శాస్త్రమునకు పెద్ద
నీలమ్మకును పెద్ద ఆ చెలువును ఇపుడు
అరువైయార్గురు వీరు లందరికి పెద్ద"

పల్నాటి వీర కథలలో నాగమ్మ వర్ణనయు నిట్టి వారానువర్తనమే:

"నీమామీద జామాకట్టి, జామామీద నీమాగట్టి
కాలు విజాయి కవాయి గట్టు
మూడుమూళ్ల రవికె ముద్దు భాభలిగ తొడిగి
ఏనుగు తొండాములావు జడ ఎన్నుయీపున వేసి
ఏడు సానలు తీసిన పుక్కు సానాకత్తి బుజాన బెట్టి
వుజార్న పెరాయిస్తు వున్నాది మంత్రి నాయకురాలు"

కన్నమనేని వర్ణన యెచ్చట వచ్చినను "అరుమూళ్ల కంచు టరిగె, పన్నెండుమూళ్ల భైరవకత్తి" పట్టుకొచ్చినట్లుగా చెప్పబడుచుండును.

పల్నాటి వీర కథలలో వలెనే కాటమరాజు కథలలో గూడా కొన్ని ప్రత్యేకములగు వారాను వర్తనములున్నవి. ప్రార్థనలో సాధారణముగా "శ్రీ జాహ్నవి గంగ చిత్తమున దలంచి" అను వాక్యము వచ్చుచుండును. ఆవులను పేరు పేరున పిలుచుట పెక్కు కథలలో గలదు. పాలు పితుకునప్పుడు 'తొలిచుక్క పొడవంగ దొరావుల బిలికి, మలిచుక్క పొడవంగ మైలావుల బిలికి' అని వర్ణింపబడుచుండును. సందర్భము వచ్చినప్పుడెల్ల కాటమరాజు వంశవర్ణన చేయబడినది. విష్ణువు నుండి కాటమరాజు వఱకును గల తరములు చెప్పబడినవి. కాటమరాజుయొక్క ఆలమంద విస్తారమైనదని చెప్పుటకు పదే పదే "కుదురు ఆరామడ, కదులు పన్నెండామడ" అనియు, "కుదిరితే ఆరామడ, చెదిరితే పన్నెండామడ" అనియు చెప్పబడుచుండును. ఏళ్ళ పేర్లు విశేష్యములను పరస్పరము మార్చి, త్రిప్పి చెప్పుట కాటమరాజు కథలలో నెక్కువగా గానవగును.

గంగ వర్ణన కాటమరాజు కథ లన్నింటను ఒకే విధముగా నున్నది. పన్నెండు చేతుల భాగీరథి గంగ పన్నెండు భద్రాయుధములతో భయంకరముగా వర్ణింపబడుచుండును. పెద్దిరాజు కథకు సంబంధించిన ఒక వ్రాత ప్రతిలో గంగ వర్ణన యిట్లున్నది:

"పన్నెండు చేతుల భద్రాయుధములు
అసురుల మర్దించు అంబు నొకచేత
దుష్టుల మర్దించు దుడ్డు నొకచేత
శూలము నొకచేత సింగిణొక చేత
కరవాల మొకచేత కత్తి నొకచేత
శంఖము నొకచేత చక్ర మొకచేత
పరశు శూలధారిణి హరినీలవేణి
సరిసగ అరిలన్ని సరిచేసికొనియు"

యుద్ధములో యాదవ వీరులు మరణించినప్పుడు ఈ గంగ యాదవ కాంతలకు కలలో ప్రత్యక్షమై కీడును తెలియజేయును. పెద్దిరాజు కథలోను, అగుమంచి కథలోను ఇట్లు జరిగినది.

వీరగాథా కవిత్వములో ఒక విచిత్రమగు వారానువర్తనమున్నది. ఒక పని ఒక వ్యక్తికి చెప్పగా అతడా పనిని వెంటనే చేసినట్లుగా వీర గాథలలో నుండదు. ఎందఱినో అడుగగా, వారందఱును తిరస్కరించినట్లును, కడకొక ప్రత్యేక వ్యక్తిని అడిగినట్లును, అతడాపని చేసినట్లును చెప్పబడును. అగుమంచికథలో ఆమెకు తలంటు పోయవలసి వచ్చెను. ఆమె తల్లియగు సిరిదేవి తన ఏడుగురు కోడండ్రను వరుసగా ఒక్కొక్కరినే పిలిచి అగుమంచికి తలంట వలసినదిగా కోరును. వారెవ్వరును సమ్మతింపరు. కడకు సిరిగిరమ్మ (పోచయ్య భార్య, అగుమంచి కోడలు) ఆమెకు తలంటుటకు అంగీకరించును. సిరిదేవి కోరు మాటలు, కోడండ్రు తిరస్కరించు మాటలు ఒకే మూసలో పోసినట్లుండును. ఈ యేడు సంభాషణలను వీరగాథా కవి పునరుక్తి దోషమునకు వెఱవక ఒకే విధముగా రచించెను. ఇదియొక వారాను

వర్తనము. పల్నాటి వీరకథలలో బాలచంద్రుడు కూడ ఇట్టి పనినే చేయును సంగడీలతో యుద్ధమునకు బోవుచు, అనపోతును వెనుకకు బంపు నెపముతో మాంచాలనుండి తన ముద్దుటుంగరమును గొని తెమ్మని వెంటనే అనపోతును కోరడు. మొదట ఒకసంగడీని గోరును. అతడంగీకరింపకపోగా మఱియొకనిని గోరును. ఇట్లు ఆర్గురు సంగడీలను గోరి కడకు అనపోతును గోరును. అతడంగీకరించును.

బొబ్బిలి యుద్ధ కథలో బుస్సీదొర మజిలీలు చేయుచు రాజమహేంద్రవరము వచ్చునప్పుడు, ప్రతియొక్క మజిలీలోను ఆప్రాంతపు జమీందారులను భయపెట్టి కప్పములు గొనుట ఒకే రీతిగానుండును. ప్రతియొక్క మజిలీ యందును బుస్సీ యిట్లనును :

"దివాణమంటే గడన లేదుగా జమీందార్లకేమి
కరకర కరకర జాబులు వ్రాయి లక్ష్మన్న నీవు"

అప్పుడు దుబాసి లక్ష్మన్న ఆ ప్రాంతపు జమీందారునకు ఈ క్రింది విధముగా జాబు వ్రాయును :

"కూర్చుంటే కూర్చున్న లాగున భేటికి రావాలె
నిలుచుంటే నిలుచున్నలాగున భేటికి రావాలె"

ప్రతియొక్క మజిలీలోను, ప్రతియొక్క జమీందారునకును యిట్టే జాబు వ్రాయును. ఆ జమీందారు 'కట్న కానుకల'తో వచ్చినప్పుడు బుస్సీకి సలాము చేయుట, బుస్సీ తిరిగి సలాము చేయుట ఒకే విధముగా వర్ణింపబడును :

"సలాం నీకూ సలాం నీకూ బూసీ దొరగారు
సలామనగానే సలామన్నడూ బూసీ దొరగారు"

ఏ మజిలీలో జమీందారు వచ్చి సందర్శించినను పై వాక్యములే పునరుక్తము చేయబడును.

వీరుడు పుట్టినప్పుడు వీపున పంజాముల, అరికాలున 'తామర పద్మము' ఉన్నట్లు వర్ణింపబడుచుండును. బొబ్బిలి కథలోను, గాంధారి కథలోను ఇట్టి వర్ణనలున్నవి. తెలంగాణా వీరగాథలలో వీరుడు వేంకటేశ్వరుని వరముచేత పుట్టెననియు, పుట్టుతిరువణి కలవాడనియు, అయిదు రేఖలు కలవాడనియు వర్ణింపబడుచుండును.

ఆపదమొక్కులు మొక్కుట బొబ్బిలి వరుస కథలలో సామాన్యముగా గానవచ్చు చుండును. జగిపతిరాజు కథలోను, నల్ల సోమనాద్రి కథలోను, రాజారామేశ్వరరావు కథలోను, ఇట్టి వర్ణనలు విపులముగా నున్నవి. వీరుడు బాలుడుగా నున్నప్పుడే గొప్ప శౌర్యమును ప్రదర్శించినట్లుగా బొబ్బిలి వరుస కథలలో గానవగును. ఆ బాలుడు తిను బండారములను వదలి కత్తిని పట్టుకొనినట్లు చెప్పుట యీ కథలలో సాధారణము. బొబ్బిలి కథలో వెంకటరావు, రాణీ శంకరమ్మ కథలో సదాశివరెడ్డి యిట్లు చేసినట్లు చెప్పబడినది. వీరుడు నిద్రించుచుండగా 'నాగసర్పము' తన పడగలతో గొడుగు పట్టుట కూడ వారానువర్తనమే. సర్వాయి పాపని కథలోను, నల్ల సోమనాద్రి కథలోను ఇట్టి వర్ణనలు గలవు.

తెలంగాణా వీరగాథలలో హైందవ వీరుడు మహమ్మదీయ వీరుని తిట్టునప్పుడును, మహమ్మదీయ వీరుడు హైందవ వీరుని (ముఖ్యముగా రెడ్డివీరుని) తిట్టునప్పుడును ఒకే విధమగు మాటలు ప్రయోగింపబడుచుండును.

మహమ్మదీయ వీరుని తిట్టుట :

"వినరా తురకవాడ !
గొడ్డకోసె మదరచోద !
అడుక్కుతినే ఫకీరువాడ !"

రెడ్డివీరుని తిట్టుట :

"ఎద్దుముడ్ల పొడిచే కాపు కొడుకు
ఏటి మడులు దున్నే కాపు కొడుకు
అంబలిదుత్త ఆగేవాడు
నాకు సమము రాబోయినాడ !"

బొబ్బిలి వరుస కథలలో పేరంటాండ్ర కథలదొక ప్రత్యేక వర్గము. ఇవన్నియు కరుణరస ప్రధానములు. ఈ పేరంటాండ్ర కథలలో కొన్ని ప్రత్యేక వారాను వర్తనములున్నవి. పేరంటాలునకు చిన్నతనమునందే తల్లిదండ్రులు చనిపోవుదురు. అన్నయో లేక పెదతండ్రియో పెంచును. అత్తవారు ఈమెను మిక్కిలిగా హింసింతురు. చివట భర్త చనిపోగా ఈమె 'సాగుమానము' చేయుట, లేదా యీమె శీలమును శంకించి భర్త హత్య చేయుట జరుగును. సాగుమానమే హెచ్చుగా నుండును. పేరంటాలు సహగమనము చేయుటకై ప్రభుత్వమును కోరగా మొదట నిరాకరింపబడుట, పై యధికారి కలలో పేరంటాలు కనబడి తనకు అనుమతి నీయవలసినదిగా కోరుట, తన మాహాత్మ్యమును చూపుట అన్ని కథలలోను గలవు. కామమ్మ కథ, నారాయణమ్మ కథ, రంగమ్మ కథలలో ఇట్టి సన్నివేశము లున్నవి. పుట్టింటికడ నున్న పేరంటాలునకు మగని చావు వార్త చెప్పుట (భర్త మరణ వార్త) అన్ని పేరంటాండ్ర కథలలోను గలదు. పేరంటాలు భర్త కీడును గూర్చి ముందుగా దుస్స్వప్నము గనుటయు వారానువర్తనమే. (ఎఱుకమ్మ కథ, నారాయణమ్మ కథ). భర్త చనిపోయిన వార్త వినగానే ప్రతియొక్క పేరంటాలును ఫక్కున నవ్వును. (ఏడ్చినట్లుగా ఏ పేరంటాలు కథలోను లేదు). సహగమనము చేయుటకు ముందుగూడ పేరంటాలు ఫక్కున నవ్వుట, దొంగతనములు చెప్పుట, సత్యములను జూపుట, పిల్లలులేని వారికి పిల్లలను ప్రసాదించుట, ఆ పుట్టబోవువారికి తన పేరు పెట్టుడని చెప్పుట, అగ్నిలో దుముకుటకు ముందు నిమ్మపండ్లు మంటలలో వేయుట, మంటలలోబడి పేరంటాలు బంగారు ప్రతిమయగుట, ఆమె భర్త వెండి ప్రతిమ యగుట — ప్రతి గాథలోను వచ్చు వారానువర్తనములు. బొబ్బిలి వరుస కథలన్నింటికిని యుద్ధవర్ణనాది వారానువర్తనములలో బొబ్బిలికథ మూలమైనట్లే యీ పేరంటాండ్ర కథలన్నింటికిని కామమ్మకథ మూలమని నా యభిప్రాయము. కామమ్మ కథలోని సంఘటనలే అన్ని పేరంటాండ్ర కథలలోను అనుకరింపబడినవి.

వీరగాథానిక (లఘువీర గాథ) లలో బలవన్మరణము చెందిన వీరునకై పరితపించుట సాధారణమగు నితివృత్తము. వీరుడు మిక్కిలి

అందగాడనియు, అతడలంకరించుకొని కట్టవమీద పోవుచుండగా 'కలకశేరు' (కదిరితేరు)గా కనబడుటయు నొక వారానువర్తనము :

> ''శేరు శేదూ యెండి ఎురుగుల్ — చేతులాకూ బెట్టుకోని
> కట్టవమింవా బోతవుంటే — కలకటేరను కొంటిర కొడుకా!''
> (గుత్తాల గోపిరెడ్డి పాట)

> ''నీలికోటూ దొడుక్కోని — నిల్వు సెత్రీ బట్టుకోనీ
> కట్టవిఁందా బోతవుంటే — కదిరితేరనుకొంటి కొడుకా !''
> (మానందిరెడ్డి పాట)

వీరుడు హత్య చేయుబడగా ఇంటిలో దిక్కులేక 'కాకి శోకమాయె' నని చెప్పుట వేఱొక వారానువర్తనము. ఈ 'కాకి శోకము' (= ఒక కాకి చనిపోయినప్పుడు తక్కిన కాకులు అఱచుటవంటి హృదయ విదారక మైన శోకము కావలెను) ప్రతి లఘు వీర గాథలోను తప్పక యుండి తీరును.

> ''యింటిలో మగదిక్కులేక — యెద్దులిడిసే దిక్కులేక
> సాకిరేవూ బండ్లకాడా — కాకిశోకం జేసెనన్నా''
> (విరూపాక్షరెడ్డి పాట)

> ''నూరుగాండ్లా యెద్దులంటా — నూటిమంది సేద్యగాళ్ళు
> కాడిగట్టే దిక్కులేకా — కాకి శోకామాయెరా''
> (మానందిరెడ్డి పాట)

వీర గాథానికలలో చనిపోయిన వీరుని 'కొడుకా !' యని సంబోధించుచు దుఃఖించినట్లుగా పాడుట సాధారణము. ''కొడుకా! మానందిరెడ్డి !'' ''కొడుకా ! యొనక్రూపాక్షిరెడ్డి !'' మున్నగు పునరావృత్తులుగల పాటలు ఉదాహరణములు. వీరుని చంపబోవునప్పుడు అతడు ప్రతిమాలుట, డబ్బు నిచ్చెదననుట, ఎంత ప్రతిమాలినను శత్రువులు వినకుండుట, అతడు చేమెత్తి హంతకులకు మ్రొక్కబోగా వారు చేతిని ముందు నఱకివేయుట వీర గాథానికలలో చాల తఱచుగా వర్ణింపబడుచుండును. హత్య చేయుబడుటకు ముందు వీరుఁడు బయలుదేఱగా ఎవరో తుమ్మిరనుట, జోడు క్రరి పిట్టలు శకునమైన నవుట వర్ణింపబడుచుండును. రాయలసీమ లఘువీర గాథలలో 'పండబెట్టి గొంతు కోసిరి' 'కర కర గొంతు కోసిరి', 'పండబెట్టి ప్రాణం తీసిరి', 'క్యూచ్చోబెట్టి గొంతుకోసిరి' అను వాక్యములు పదేపదే వచ్చుచుండును. తెలంగాణా లఘు వీరగాథలలో 'కారిన నెత్తురును కడవలకు బట్టుట, చిట్లిన నెత్తురును సీసాలకు బట్టుట, గొడ్డళ్ళు నూరుకొని గొంగట్లో పెట్టుకొనుట, కత్తులునూరుకొని కడుపుల్లో పెట్టుకొనుట' మిక్కిలి తఱచుగా వర్ణింపబడుచుండును. ఈ జానపద లఘు వీరగాథలలో భార్యాభర్తల శృంగారము బహు సున్నితముగా వర్ణింపబడును. భార్యభర్తలిరువురును —

> ''ఆకునా కాసేపు ఆటలాడేరు
> సున్నాన కాసేపు జూద మాడేరు
> సోకనా కాసేపు సొద్దుల్లు పోయె''

ఈ వర్ణనయు వారానువర్తనమే. వాసుదేవునిపాట, రంగసాని పాట మున్నగు వానిలో నిదే రీతి వర్ణనలున్నవి.

వీరగాథా కవిత్వములో ప్రధాన లక్షణముగానున్న యీ వారాను వర్తనములు గాథాకారులకు మిక్కిలి ఉపయోగకరములుగా నున్నవి. గాథా గానము చేయువారందఱును నిరక్షర కుక్షులే. అయినను వీరిలో ఒక్కొక్కరికి ముప్పది నలుబది వీరగాథలు అవలీలగా వచ్చును. దీనికి కారణము కవి సమయముల వంటి వీరగాథల వారానువర్తనములే. వీరగాథలలో కథా కథనమునను, పాత్రల నామముల విషయమునను ఈషద్భేదమే కాని, తక్కిన వర్ణనలు, అలంకారములు, పదజాలము మున్నగు అంశములు అన్ని కథలకును ఒకే తీరులో నుండుటచే విద్యాగంధములేని వృత్తిగాయకులు వీనిని సులభముగా జ్ఞప్తియుంచుకొని పాడగలుగుచున్నారు.

పాశ్చాత్య దేశముల వీరగాథలలో కూడ ఈ వారానువర్తనములు హెచ్చుగా నుండును. ఇంగ్లండు వీరగాథలలోను, స్కాట్లండు వీరగాథలలోను పరిసరము లెప్పుడును పచ్చని అరణ్యములుగా పంట చేలుగా వర్ణింపబడుచుండును. దుస్తులు, గుఱ్ఱపు జీనులు, ఆభరణములు మున్నగునవి ఆకుపచ్చ, ఎరుపు, నీలము, బంగారు రంగులలో నున్నట్లు వర్ణింపబడుచుండును. ప్రకృతి వర్ణన లసలే ఉండవు. వెన్నెల—ఎండ వంటివి మాత్రమే కానవచ్చును. సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనలుండవు. ఆటు పోటులును వీరగాథా కవుల దృష్టిని పెద్దగా ఆకర్షించలేదు. ఉపమానములు చాల తక్కువ. ఉన్నవి కూడ మిక్కిలి సంక్షిప్తముగా నుండును. ఉదాహరణమునకు ''షీట్ యాజ్ వైట్ యాజ్ స్నో'' అను మాత్రమే ఉండును. కవి స్వీయ ప్రతిభను చూపుటకై ఎక్కడను వర్ణించడు. వీ వర్ణనయైనను నిరలంకృతముగా సహజముగా పలుచగా నుండును. రూప కావ్యాలంకారము లుండవు. పాత్రోక్తులను కూడ సహజముగా పదికట్టు పదములతోనే సాగును.

ఇట్లు సర్వసాధారణ వర్ణన (వారానువర్తనము) లుండుటచే వివిధ వీరగాథలలోని పాత్రలన్నియును ఒకే రకముగా, ఒకదాని కొకటి 'కార్బను కాపీల' వలె నుండునని తలంపరాదు. అలంకారములు, వర్ణనలు తక్కువగా నున్నను, వీరగాథలలోని ఉత్సాహోద్రేకము, శైలిలోని సహజ సారళ్యము, ప్రత్యక్షీకరణము — వీనిని రసవంతములుగా నుంచుచున్నవి.

వీరగాథలలో ధ్వని, వక్రోక్తి మున్నగు అలంకారము లుండవు సరికదా, ఇతివృత్తము ప్రాంతీయ సంఘటనకు సంబంధించి యుండుటచే ఎంత త్రిప్పి చెప్పినను పామరు లందఱికిని సులభముగా నర్థమగుచుండును. శైలీ సారళ్యముతో, సాధారణ ప్రయోగములతో (=వారానువర్తనములతో), సహజ సుందరముగా సాగు పరిశుద్ధ రచనలు వీరగాథలు.

ఆనందగజపతీంద్రుల దుర్గాస్తుతి

[విజయనగర సంస్థానాధీశ్వరుడైన ఆనందగజపతి పూసపాటి వంశీకుడు. వీరి కులదైవము బెజవాడ కనకదుర్గ. ఆ దుర్గాదేవిని పూజించి అంగడియలు కనకవర్షం కురిపించిన మాధవవర్మ వీరి మూలపురుషుడు. ఆనందగజపతి ప్రతి దేవీ నవరాత్రములలో రహస్యోక్త ప్రకారం దేవీ విగ్రహాన్ని పూజిస్తూ ఉండేవారు. 1884 సంవత్సరం నవరాత్రులలో రోజుకొక శ్లోకం చొప్పున 10 శ్లోకాలు దేవికి సమర్పించారు. ఆ శ్లోకాలకు శ్రీహరి యాజ్ఞి చొప్పున మండ లక్ష్మీకామశాస్త్రులు తెలుగు పద్యాలు రాశారు. శ్లోకాలు, పద్యాలు ఉన్నవి ఉన్నట్లు ఎత్తి రాయటంవల్ల దోషాలు అట్లాగే ఉండిపోయాయి.]

యదూరో యత్న్రయం భువన జననీ మస్మిసతిరా
మదంభః రోభిజ్ఞాం జ్ఞపయతు సుధీరం తరతమాం
సదూరాభిర్వాచాం ఫణితి భిరతో గీర్వతుమే
నచేద్గీతిర్మాతుః ప్రణత జనతా హ్వాస రసికా. 1

జనని నుతింప నేసుకి విచార మొకింతయు లేని దంభమున్
గాంక యదూర వాక్యముల కోవిదు డెవ్వడు విన్నవించులో
ననుగుము సర్వమున్ దెలియునంద తనూభవ కట్లుగాని త
ప్పునత జనావ బోధ పరంబగు నీ స్తుతి గీతిగానిదోన్.

ప్రాచాంరీతః పౌనరుక్త్య పదాత్రి
పత్యాశిష్యాచార్య మాత్సర్యధుర్యా
తస్మాదస్తు క్షాంతి శీలా యతస్త్వం
త్వత్పుంబోధ్యం స్తోత్ర మన్యాపదేశః 2

స్తుతి ప్రాచీనుల రీతినైన పునరుక్త్యస్తేయమై దోషమై
వ్యతరంబైన నెపంగుగాదె గురుశిష్యాచార్య మాత్సర్యధు
ర్యత నట్లౌటను క్షాంతిశీలవగు నీ కన్యాపదేశంబుగన్
సతతాస్మద్రచిత స్తవంబిది భవత్పుంబోధ్యమై యొప్పుతన్.

మరందం తేపీత్వా పదజలజజం వృత్తి శిశవః
పదన్యాసాన్ లబ్ధ్వా సపది చ విచిత్రాంశ చరతా
అదృష్ట్వాంత శ్శత్రూన్ బహిరపి విధావంతి బహుళ
స్సుమాతుస్త్వస్యం చేజ్జగతి పిబతాం కిం న సులభం. 3

జనని భవత్పదాంబురుహజాత మరందము వృత్తి బాలకుల్
గొని యపుడె పదంబులను గూర్చుచు నద్భుత ఖేదరత్వమున్
గని బహుభంగి లోనరులుగానక పై పరుగెత్తె సుష్కరం
బనగలదే సుమాతృక పయస్సు ధనానెడువారికి భువిన్

జీర్ణైర్భూత పత్రైర్గణైశ్చ బహుభిర్బద్ధస్య కామాది భి
స్త్వ ద్ధ్యానామృత పానపీనవపుషో మాద్యద్విహంగాత్మనః
చిద్యాదాత్రి ముముక్షతస్త్వ బలాదుజ్జృంభమాణస్యమే
బంధానాం దళతాం రసాజనని తేస్తోత్రాణి సర్వాణ్యపి. 4

విద్యాదాయిని జీర్ణభూతపట సంవీతుండనై బంధకా
మాద్యానేక గుణంబులన్ దవిలి త్వద్ధ్యానామృతాప్యాయితిన్
మాద్యత్కీరము మాడ్కి మోక్షపదవిన్ గాంక్షించి త్వచ్ఛక్తి మ
త్సద్యోజృంభణమొందు నాదు నిగళధ్వంసాధారంబుల్.

అగ్రేస్థితం యదభిపూజయితుం నిశాభి
ర్మాలిన్య సంభవభియావిధుతాని పశ్చాత్
ఏతాని పుష్పవదనుగ్రహ మండలాని
తత్పుంతతం హసతుమే హ్యకయోంధకారం. 5

సుముఖమునుండు దేనికిదిశాయువతుల్ ప్రతిపూజసేయ ని
త్యము మదిసత్వ సంభవ భయాకులతన్ వెనువెన్కఁజిమ్మనా
సుమనివహమ్ములో యనఁగ శోభిలు నీ గృహతారలట్టు తే
జము హృదయాంధకారమును సంతతమున్ హరియించుగావుతన్.

ఇయం నాస్త్యస్తీతిత్వయి చ వివదం తే బహువిధం
మమత్వేషాబుద్ధిర్జగదుభయ పక్షేప్యనదితి
కథం యద్యామోదస్తదుపగతయేహ్యస్తు కుసుమం
నచేత్కాస్వేచ్ఛాయాం పరలగతి నిర్గంధకుసుమం. 6

కలదిది లేదటంచును వికారపు వాదములెన్నొ నీ పయిన్
గలవెటులైన నీ జగమగాంతు నసత్తుగ నెట్లనన్ సుగం
ధిలమగు పువ్వు నెల్లరుఱు దీయు తదీయ సువాస నాశన
ట్టులను నగంధమైన నెవరున్ స్మరియింపరుగాదె యుద్ధరన్.

మాతః పిబామితవ మోక్షసుధార్ణవాంత
ర్వ్యాప్తాంఘ్రి పద్మమకరందకణాంక దాచిత్
యాచేస ముక్తిమపి తత్కిముతాన్య కామ్యం
యత్పద్మయోర్జనని హేతుఫలే స్వకీయే. 7

మొనసి యొకప్పు నీదయిన మోక్షసుధార్ణవ మధ్యభాసనాం
ఘ్రినలిన యుగ్మసంభవ మరీచి మరంద కణంబు గ్రోలి కో
రను మతిముక్తినైన నితరంబగు కామ్యము నెంచనేల యో
జనని ఫలంబు హేతువు నిజంబుగ నీ పద పద్మమేగదా!

సమాప్తౌప్యానం త్వయిజననీ
కల్యాణ సుగుణైరపారం
సంసారం వ్యసనయ మదీయస్యమమవా
ఇతి బ్రహ్మాదీనామపి జయతి సంప్రార్థన మహోద్వ్యనంతా
యోగాత్మ్యానునిశమపి గాయామ్యపభిదాం. 8

నిజకల్యాణ గుణావళితో ముగిసెగా నీ యంద నందత్వమీ
యజముఖ్యుల్ తుదలేని సంసృతిని బాయన్ దేవి మాకైనను
ద్భుజనాధీనులకైన జేయు మనుచున్ ధ్యానంత్య నిర్యుక్తినిన్
భజియింతున్ గటవేడెదన్ నిను సదాపర్యస్త భేదత్రయున్.

యదాధీస్త్యాం పశ్యేజ్జనని ససమాధిర్నతు
జగద్య దాన్యత్పశ్యేన్నా సఖయ భవతీం పశ్యతితః
ప్రబోధే గాత్రే వానఖిలు దుమయోస్ఫూర్తి
ఘటనా కథం కిం కా ప్రార్థ్యాకురుచరణ మాసందశరణం. 9

ఒంది సమాధి నిన్ను జగమొందదు బుద్ధిజగమ్ము నందికన్
బొందదు గాన రాత్రిని ప్రబోధమునైన భవద్యుగాప్తి చూ
పందుట దుష్కరం బెటుల ప్రార్థ్యము ప్రార్థయితవ్యమెద్ది యా
నంద నికాసమూల చరణంబుగ నీ చరణంబు చేయుమా!

వాఙ్మనసాతీత త్వేప్యం బినత ప్రార్థనా రవైక్లేష్టః
సాచే మ్మార్తా సాక్షాద్భవసితవేయం తుఃకీద్భుబుద్ధి 10

అనివాఙ్మనస రూపోన్నతనైనన్ భక్తకాను నానిందోద్వ
జితమయ్యెనంట సాక్షాద్గత వైఖటు నీదు బుద్ధి గతిమెట్టిదొకో.

-ı0ı0ı0ı0ı0ı— —

కలగూరగంప

సరళగతి శాస్త్రము

m ద్రవ్యరాశి (mass) గల వస్తువు స్థిరంగా ఉంది. దాని గురించి యోచించవలసిన అవసరంలేదు. కాని, బాహ్యబలం (force) దానిమీద పనిచేస్తే ఆ వస్తువు కదలడం మొదలు పెడుతుంది. కదలగానే రెండు కొత్త రాశులను గుర్తించవలసి వస్తుంది. అవి దూరం (s), కాలం (t). వాటి నిష్పత్తి s/tని వడి (speed) అంటారు. వస్తువు ఋజు రేఖామార్గంలో పోతూంటే ఆ నిష్పత్తిని వేగం (Velocity) అంటారు. అది V.

వేగం సమ (Uniform) వేగం కావచ్చు, అసమ వేగం కావచ్చు. సమాన కాలాలలో సమాన దూరాలు గమించినప్పుడు సమ వేగం అవుతుంది. అసమ వేగం మరో భావానికి దారితీస్తుంది. వేగంలో 1 సెకనుకి కలిగే మార్పును గణిస్తే వచ్చేది త్వరణం (acceleration): అందులో సమత్వరణం, అసమత్వరణం ఉండ వచ్చు.

m ద్రవ్యరాశి v వేగంతో గమిస్తే వాటి లబ్ధం (mv) ద్రవ్య వేగం (momentum) అవుతుంది. వస్తువేగం మారితే ద్రవ్యవేగం మారుతుంది. ఒక సెకనులో ద్రవ్యవేగంలో కలిగే మార్పు దానిపై పనిచేసే బలానికి అనులోమానుపాతంలో ఉంటుంది. వేగంలో మార్పు రేటు త్వరణం కాబట్టి ద్రవ్యరాశిని త్వరణంతో గుణిస్తే బలం (F) వస్తుంది. దానినే

$$F = ma$$

తో సూచిస్తారు. ఈ విధంగా బలాన్ని కొలవవచ్చు.

బలంతోబాటు ప్రతిబలం, చర్య (action)తో బాటు ప్రతి చర్య (reaction) జనిస్తాయి. చర్య ప్రతిచర్య సమానంగాను వ్యతి రేకంగాను ఉంటాయి. ఈ భావం కొన్ని నిత్యత్వ సూత్రాలకు ఆధారమయింది.

F బలం కొంతదూరం జరిగితే పని, W, (work) జరిగిం దంటారు. బలం ప్రవర్తిస్తూన్న దిశలోనే వస్తువు S దూరం గమించేటప్పుడు


$$W = F \times S$$

అవుతుంది. పనిజరిగేరేటును సామర్థ్యం (power, P) అంటారు. t కాలంలో w పని జరిగితే

$$P = W / t$$

అవుతుంది.

పని చేయడానికి అవసరమైన దార్ఢ్యత (Capacity)ను శక్తి (energy) అంటారు. శక్తి రెండు విధాలు — స్థితిజ (potential) శక్తి, గతిజ (Kinetic) శక్తి. ఒక వస్తువుకి స్థితివల్ల ప్రాప్తించేది స్థితిజశక్తి, గమనంవల్ల ప్రాప్తించేది గతిజ శక్తి, శక్తి ఒక రకంనుండి మరో రకంలోనికి పరివర్తనం కాగలదే కాని శక్తి నాశంకాదు. ఈ భావాన్ని శక్తి నిత్యత్వ నియమం (law of Conservation of energy) అంటారు. ఈ నియమం స్వేచ్ఛగా క్రిందపడుతూన్న రాయి విషయంలో నిరూపించవచ్చు.



m ద్రవ్యరాశిగల ఒక రాయి A వద్ద స్థిరంగా ఉంది, స్వేచ్ఛగా క్రిందకు పడగలదు. పటం 1లో B భూమి. భూతలంనుండి A ఎత్తు h. అంటే AB=h. A వద్ద రాయి స్థిరంగా ఉంది కనుక దానికి గతిజశక్తి లేదు. దాని శక్తి అంతా స్థితిజరూపంలోనే ఉంది. అది స్వేచ్ఛగా పడేటప్పుడు g త్వరణంతో పడుతుంది. దాని బరువు mg. బరువొక బలం. ఆ బలం తన దిశలోనే h దూరం గమిస్తుంది కాబట్టి

దాని శక్తి = mgh

A వద్ద మొత్తం శక్తి = mgh

రాయి స్వేచ్ఛగా పడుతూ Bని తాకేటప్పుడు దాని శక్తి అంతా గతిజ రూపంలోనే ఉంటుంది. Bవద్ద స్థితిజశక్తి లేదు. Aవద్ద రాయివేగం సున్నా, B వద్ద v అయితే

B వద్ద గతిజశక్తి $= \frac{1}{2} mv^2$

ఈ సందర్భంలో $v^2 = 2gh$ అని నిరూపించవచ్చు.

కాగా,

A వద్ద మొత్తం శక్తి = mgh

B వద్ద మొత్తం శక్తి $= \frac{1}{2} mv^2$

$$mgh = \frac{1}{2} mv^2$$

కాబట్టి రాయిశక్తి రూపాంతరం చెందినా మొత్తం పరి మాణం మారలేదు.

A B మార్గంలో C బిందువువద్ద శక్తి గణిస్తే :

$$AC = x$$

C వద్ద రాయి భూమికి ఎత్తుగా ఉంది, దానికి వేగమూ ఉంది. కాబట్టి దానికి స్థితిజశక్తి గతిజ శక్తి కూడా ఉన్నాయి.

C వద్ద రాయి ఎత్తు $= h - x$

కాబట్టి C వద్ద స్థితిజశక్తి $= mg(h-x)$

$= mgh - mgx$

C వద్ద రాయివేగం v_1 అయితే

దాని గతిజశక్తి $= \frac{1}{2} m v_1^2$

కాని $\frac{1}{2} m v_1^2 = mgx$

కాబట్టి C వద్ద మొత్తం శక్తి $= mgh - mgx + \frac{1}{2} m v_1^2$

$= mgh - mgx + mgx$

$= mgh$

ఈ సమీకరణంలో మరో విశేషం కనిపిస్తుంది. రాయి క్రింద పడుతూండగా దాని స్థితిజ శక్తి తగ్గుతూ ఉంటుంది, గతిజశక్తి పెరుగుతూ ఉంటుంది. అంటే, తగ్గిన స్థితిజశక్తి గతిజశక్తిగా రూపాంతరం చెందుతూ, తుదకు B వద్ద శక్తి అంతా గతిజరూపంలో ఉంటుంది.

రాయి క్రిందపడుతూండగా ఏ క్షణంలోనైనా దానిమొత్తం శక్తి విలువ మారదు. కాని, రూపాంతరం చెందుతుంది.

శ్రీ వసంతరావు వేంకటరావు

నాకు తెలిసిన కుటుంబరావుగారు

19–8–80 తేదీగల దినపత్రికను పేపరు కుర్రాడు గడపలో వేసేదాకా కుటుంబరావుగారి మరణవార్త నాకు తెలియకపోవడం ఎంత అదృష్టం! ఆ ముందురోజు నమ్మడానికి మనసు ఇష్టపడని ఆ వార్తని రేడియోలో చెప్పారట. (కొ.కు. 17–8–80 రాత్రి మరణించారు) పనుల తొందర్లో రేడియో వినకపోవడం ఎంత అదృష్టం! తీరా నమ్మరాని ఆ వార్త చాలా సడెన్‌గా చదివినపుడు ఆషాక్ తట్టుకోవడం కష్టమైపోతోంది. కుటుంబరావుగారు — మరి లేరా !?

1970 ఫిబ్రవరిలో విశాఖలో శ్రీశ్రీ షష్టిపూర్తి సభల్లో కుటుంబరావుగారిని — మొదటిసారీ ఆఖరిసారీ కూడా కలిసి మాట్లాడాను. ఆ రెండు మూడు రోజుల పరిచయం కేవలం ఒక అభిమాన పాఠకుడిగా మాత్రమే కాదు. ఎన్నో సంశయాలు తీర్చుకునేవాడిగా నాకు మిగిలిపోయింది. ఆయనకు ఇదంతా రొటీన్ అయివుంటుంది. వెంటనే మర్చిపోయి వుంటారు.

కుటుంబరావుగారు అంతకు ముందే ఆంధ్రజ్యోతి వారపత్రిక పేజీల్లో ప్రచురించిన "బ్రాహ్మణులు" అనే వ్యాసపరంపరను చిన్న పుస్తక రూపంగా (బుక్స్ అండ్ బుక్స్, విజయనగరం — వారి ప్రచురణగా) ప్రచురిస్తాను, అనుమతించండి, తృణమో పణమో పారితోషికం పంపడానిక్కూడా ప్రయత్నిస్తాను—అని 73లో గావును ఆయనకి రాశాను. చాలా త్వరలోనే సమాధానం వచ్చింది. "బ్రాహ్మణులు మీరు ప్రచురించుకోవచ్చును. నాకేమీ పంపనవసరం లేదు" అని. అయితే నేనా పుస్తకం అచ్చువెయ్యనే లేకపోయాను.

మళ్ళీ రెండేళ్ళుపోయాక చిన్న పుస్తక రూపంలో అచ్చయిన నా రచన నొకదాన్ని పంపి అభిప్రాయం రాయుమని కోరాను. తిరుగుటపాలో ప్రోత్సాహకరమైన సమాధానంతో క్లుప్తమైనకార్డు వచ్చింది.

78 డిసెంబర్‌లో ఆయనకి ఉత్తరం రాశాను. అవగాహన (ప్రచురణ: బుక్స్ అండ్ బుక్స్, విజయనగరం—1) కు రచన పంపమని. వివిధ సాహిత్య ధోరణులు అనే పేరులో ఆయన వ్యాసం నాకు 79 జనవరి ఒకటవ తేదీన అందింది. (దాన్ని నూతన సంవత్సర కానుకగా భావించుకున్నాను.)

ఆ తరువాత మళ్ళీ అవగాహన–2కు కళలు అనే పెద్దవ్యాసం పంపించారు. అప్పట్లోనే అంటే 79 నవంబర్‌లో నేను శ్రీరంగం నారాయణబాబు గురించి సుదీర్ఘమైన వ్యాసం తయారుచేసి ప్రచురిస్తున్న సందర్భంలో మీకు నారాయణబాబుతోగల పరిచయాన్ని తెలియజేయండని, అముద్రిత రచనలుగాని, అతని ఉత్తరాలుగాని ఏమన్నావుంటే పంపండని రాసినపుడు—కుటుంబరావుగారు ఇలా సమాధానం (10–11–79 తేదీగల ఉత్తరం) రాశారు:

"శ్రీరంగం నారాయణబాబును ఎప్పుడూ నేను నలుగురిలో కలిశానేగాని మా యిద్దరికీ వ్యక్తిగతమైన చనువులేదు. అందుచేత ఆయనకు సంబంధించిన ఎనెక్‌డోట్‌స్ కూడా నాకేమీ తెలీవు. కవిత్వం గురించి నేను ఎప్పుడూ పెద్దగా పట్టించుకోలేదు. నాదగ్గిర అతనిది ఏ పుస్తకమూ ఎన్నడూలేదు. మామధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరగలేదు."

ఇది వ్యక్తిగత ఉత్తరమే అయినా చర్చించుకోవలసిన అంశాలు చాలా కనిపించాయి నాకు. కుటుంబరావుగారికి నారాయణబాబుమీద గౌరవభావం ఉంది (చూ॥ సాహిత్యంలో విప్లవోద్యమం = పేజీ 74) ఆ భావం నారాయణబాబు ఉపన్యాసాలు విన్నాక కలిగిందా? నారాయణబాబుని గురించి ఇతరులు చెప్పుకోవడం వినడంవల్ల కలిగిందా? ఆ గౌరవం కొ. కు అరసంలోంచి పూర్తిగా తప్పుకుని విరసం ముఖ్యుల్లో ఒకరైనాక కూడా (71 అక్టోబర్‌లో పై పుస్తకం వెలువడింది) అలాగే మిగిలివున్న దెందుచేత? అప్పటి కప్పుడే నారాయణబాబుకుగల ప్రగతి నిరోధక ధోరణి, అనారోగ్య రాజకీయ దృక్పథం, కవిత్వంలో అస్పష్టతలగురించి పత్రికల్లో అనేకమంది సాహితీపరులు చర్చిస్తూనే వున్నారు గదా [70, 71 ప్రాంతాల్లో సృజన, తెలుగు వెలుగు, విశాలాంధ్ర వారపత్రిక వగైరాల్లో చెలరేగిన శ్రీ శ్రీ — నారాయణబాబులపై తగువు.] మరొక విషయం. కుటుంబరావుగారు కవిత్వం గురించి ఎప్పుడూ పెద్దగా పట్టించుకోకపోవడానికి కారణం ఏమిటి? లేక పట్టించుకున్న దాఖలాలు ఆయన రచనలో ఎక్కడయినా వున్నాయా?

కొద్దివెలల క్రితం అవగాహన–3లో ప్రచురణార్థం "సాహిత్య ప్రయోజనంలేని రచన గొప్పగా ఉండగలదా?" అని చర్చిస్తూ ఒక వ్యాసం రాసి పంపించారు [ప్రస్తుతం అచ్చులో వుంది].

పై వివరాలన్నీ ఇంత వివరంగా ఎందుకు రాశానంటే ఆయన విరసం ముఖ్యుల్లో ఒకరయి వుండికూడా — అభ్యుదయ, ప్రగతిశీల, విప్లవ దృక్పథం అనే అర్థాలు కూడా స్పష్టంగా తెలిసివుండి కూడా — ఎవరడిగినా రచనలు పంపేవారు. ఈ సందర్భంలో జాం పాల్ సార్త్ర్ మాటలు నేననేకమార్లు జ్ఞాపకం తెచ్చుకుంటూ వుంటాను. "నా పేరును వాళ్లని వాడుకోనిస్తాను — వాళ్లకు రచనలు పంపి సహకరిస్తాను" అన్నాడు సార్త్ర్ ఒకసారి. ఈ పని అక్షరాలాచేసి చూపిస్తున్న తెలుగు రచయితల్లో కుటుంబరావుగారి పేరు తరవాతనే మరెవరి పేరయినా చెప్పాలి.

ఇక్కడ మరొక సంగతి.

సర్క్యులేషన్ ఒకనూదిరిగా బాగావున్న ఒకటి రెండు పత్రికలతో పాటు — చాలా తక్కువ సర్క్యులేషన్‌వున్న హేతువాద, వామపక్ష పత్రికలు చాలా వాటిలో ఆయన రచనలు అందినమట్టుకు చదవడమే కాదు — దాచి వుంచుకుని మననం చేసుకుంటూ నా అవగాహనా శక్తిని, నా మానసిక పరిధిని పెంచుకోవడం అలవాటుచేసుకున్నాను — ముఖ్యంగా 70 తరువాత. 'సాహిత్యంలో విప్లవోద్యమం' [సృజన ప్రచురణ — '71, అక్టోబర్] అనే చిన్న పుస్తకం నాలోనే కాదు చాలామంది మస్తిష్కాలలో తెరలు తొలగించింది. దీన్ని నేనొక మార్గదర్శక గ్రంథంగానేకాక, రచయితలు తప్పక అధ్యయనం చెయ్యవలసిన గ్రంథంగా తలుస్తాను.

ఆంధ్రజ్యోతిలోనూ, జయశ్రీ సరోవరా పత్రికల్లోనూ వచ్చిన వ్యాసాలు — బ్రాహ్మణులు, ఆటవిక దశలో ఆడది, మూఢాచారాలు, వేదాలలో ఏమున్నది, మాయదారి దేవుడు — వగైరా 10 చిన్న చిన్న పుస్తకాలు [సమత ప్రచురణ, విజయవాడ—1] కూడ నా మనసులోని మరికొన్ని పొరలు తొలగించాయి. ఇలా వుండగా — అతీంద్రియ శక్తుల్ని పరిశీలించడం మానేసి, మార్క్సిస్టు దృక్పథం గలవారమనుకోవడం ఆత్మవంచన అని ఆయన ఒకసారి రాసినప్పుడు మళ్లీ నన్ను మరికొన్ని అనుమానాలు చుట్టుముట్టాయి. ఉత్తరాలు రాసి వ్యక్తిగత సమాధానాలు ఆశిస్తూ ఆయన్ని వేధించడంకంటె ఆయన రాసిన, రాస్తున్న వ్యాసాల్ని జాగ్రత్తగా చదవడం మంచిదన్న ఉద్దేశంతో నా చదువు కొనసాగించాను.

ఇటీవల టి. ఎస్. ఎలియట్ కవితలు కొన్ని చదువుతూ ఎంతో ఆనందం పొందుతూ, మళ్లీ కొంత అసంతృప్తికి లోనౌతున్న దశలో ఈ దిగువ ప్రశ్న కుటుంబరావుగారికి పంపడం ఆయన వెంటనే సమాధానం రాయడం జరిగింది. ఆ విధమైన సమాధానం వస్తుందని ముందుగానే ఊహించినా నాలోవున్న సంశయాన్ని పోగొట్టుకోవడం కోసమే నేనా ఉత్తరం రాశాను.

నా ప్రశ్న : హేతువాదిగా భౌతికవాదిగా క్రమంగా దృక్పథం మారుతున్నప్పుడు అంతకుముందు చదివిన అతి గొప్ప రచనలనేవి మరోసారి చదివితే అయిష్టంగా కనపడతాయెందుకు? ఉదా॥ ఎలియట్ రచించిన వేస్ట్‌లాండ్, ఫోర్ క్వార్టెట్స్ మొ॥ రచనలు దాదాపు 15, 16 ఏళ్ల క్రితం విద్యార్థి దశలో ఉన్నప్పుడు సాహిత్యంపై మత ప్రభావం, సాహిత్యప్రయోజనం తెలియని రోజుల్లో చదివినప్పుడు ఎంతో గొప్పగా ఉండేవి. ఇప్పుడు ఆ రచనల్లోని కవితా శక్తికి ముగ్ధుణ్ణయి మరోసారి చదవబోతే — అయిష్టంగా కనబడుతున్నాయెందుకు ? పూర్వపు ఆనందం పొందలేకపోతున్నానెందుచేత ? [31—7—80]

కుటుంబరావుగారి సమాధానం : మీ ప్రశ్నకు నేను ఎలా సమాధానం చెప్పగలను? మీ అనుభవాన్ని మీరే విశ్లేషించుకోవాలి. ఏనాడో కాలేజీలో చదివిన షేక్స్పియర్ నిజంగా అంత గొప్పగా రాశాడా అని ముప్ఫై ఏళ్ల తరవాత మళ్లీ చదివితే మరింత గొప్పగా రాసినట్టు అనిపించింది. ఇది నా అనుభవం [4—8—80].

నాలో వలెనే చాలామంది మనసులలో సంశయం ఉండవచ్చునని అది పై సమాధానంవల్ల తీరవచ్చునని [కొంతవరకైనా] నేనాశిస్తాను. ఈ రకంగా వెంటనే సమాధానంరాసే ఒక మహానుభావుడి మరణవార్త నాకెంతో భరించరానిదిగా వుంది. అయినా ఇది అపరిహార్యమైన నిజం. అనేకమంది వామపక్ష మేధావులవలె, తన రాజకీయ భావాల పరిధికి ఒందని వారిపట్ల వ్యతిరేకభావం గాని, చిన్నచూపుగాని ఆయనెపుడు చూపలేదు. ఆయన వ్యక్తిగానే కాదు — రచయితగా కూడా — "తూకం తప్పని మనిషి" ఏవిధమైన ఇన్‌హిబిషన్స్‌కీ లోనుకాకుండా చాలా స్పష్టంగా మాట్లాడే—రాసే—మనిషి. సన్మానాలకూ సభలకూ కూడా వీలయినంత దూరంగావున్న మనిషి. ఆయనతోగల కొద్దిపాటి పరిచయాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తూ ఉంటూ వారి స్మృతికి వినమ్రంగా అశ్రుతర్పణం సమర్పిస్తున్నాను.

శ్రీ మానేపల్లి సత్యనారాయణ

పఉమచరియ

జైన సంస్కృతీ పరంపరలో అఱువది ముగ్గురు 'శలాక పురుషులు'గ గుర్తింపబడి కొండాడబడి ఉన్నారు. అందు ౨౪ తీర్థంకరులు, ౧౨ చక్రవర్తులు, ౯ బలదేవులు, ౯ వాసుదేవులు, ౯ ప్రతివాసుదేవులు. జైన సాహిత్య స్రవంతిలో 'త్రిషష్ఠిశలాక పురుష' చరితలు, పురాణములు శతదళ పద్మములుగా ఎన్నియో విప్పారినవి. కొన్ని కాలగర్భములో నశించినవి. కొన్ని నేటికిని నిలిచి సారస్వత రసికులకు మనోమోదమును మబ్బన చూఱలు అందించుచున్నవి.[1]

ఇట్టి చరితలలో మనకు లభించు తొలిగ్రంథము 'పఉమచరియ'. విమలసూరి ప్రణీతము. ఎనిమిదవ—బాలదేవ పద్మ, వాసుదేవ లక్ష్మణ, ప్రతి వాసుదేవ రావణ —వృత్తాంతమే ఈ పద్మచరిత్ర. ఈ బలదేవ పద్ముడు ఎవరోకాదు మహర్షి వాల్మీకి దాశరథీరాముడు. జైన సాహిత్యంలో రాముని 'పద్మ' అని సంబోధించుట పరిపాటి.

క్రీస్తుశకము ఒకటవ శతకములోఉన్న విమలసూరి ప్రణీతమైన 'పఉమచరియ' శౌరసేనీ భాషలో వ్రాయబడిన తొట్టతొలి జైన రామాయణము. మొట్టమొదటి ప్రాకృత కావ్యము కూడ.[2]

జినసేనుని అభిప్రాయము ప్రకారము పురాణములో విశ్వము, దేశము, రాజధాని, రాజ్యము, తీర్థము, దానము, తపము, పుణ్యపాపము—లు విధిగా వర్ణించబడవలెను.[3] విమలసూరి ఇవియేగాక, ధర్మ, అర్థ, కామ, మోక్షములను కూడ చేర్చి 'పురాణ పద్ధతి'లోనే 'పఉమచరియ'ను తీర్చిదిద్దినాడు.

ఏడు 'అధికారము'లను నూట పదునెనిమిది 'ఉద్దేశము'లతో బంధించి, ౮౬౫౧ గాథలుగ 'పఉమచరియ'ను విస్తరించినాడు. వాల్మీకివలె ఏకాండమునకు సంబంధించిన కథ ఆ కాండమునకే పరిమితముచేయక, 'అధికార వ్యాప్తి' చేసెను. ఇందులోని ఏడు అధికారముల పేర్లు ౧. స్థితి ౨. వంశోత్పత్తి ౩. ప్రస్థానము ౪. రణం ౫. లవ —అంకుశ ఉత్పత్తి ౬. నిర్వాణం ౭. అనేక భవములు.

దశరథునికి నలుగురు భార్యలు. వారు అపరాజితా, కైకేయీ, సుమిత్రా, సుప్రభా. పెద్ద కొడుకు పేరు పద్మ (శ్రీరామ). వాల్మీకి కృతరామాయణ పాత్రలకంటె, విమలసూరి రచనలోని పాత్రలు మానవ సహజమగు ప్రకృతికి అద్దంపట్టు విధంగా ఉన్నవి. వానరులు కోతులుకారు. ఒక తెగ. కోతి వారి చిహ్నం. రావణునకు తల ఒకటే. సీత జనకునికి విదేహ వలన జన్మించినది. కుంభకర్ణుడు ధార్మికుడు. ఇంద్రుడు విద్యాధరులు అనబడు ఒక నరుల తెగకు నాయకుడు మాత్రమే. సుగ్రీవ, వాలి, హనుమంతుడు—వీరి జననము లందు అలౌకిక, అద్భుత విషయములు లేనేలేవు. రాక్షసులు వికృత రూపులు, దారుణ చిత్తులుకారు, యుద్ధమును ప్రేమించు ఒక నర జాతిగ వర్ణించబడినారు. రావణుని సంహరించినది పద్మడు కాడు, లక్ష్మణుడు.

పఉమచరియ—చక్కని రమణీయ కావ్యము. జైనమత సంబంధి ప్రాసంగిక విషయములను వదలిపెట్టితిమేని, వాల్మీకి రామాయణమునకు సరియైన జోడి విమలసూరి రమణీయ రచన. అలతి అలతి పదములతో, విరళములగు దేశ్యపదములతో 'పఉమచరియ' హుషారుగ సాగిన రసోత్తరంగిత రచన. విమలసూరి వర్ణనానైపుణ్యమును పరిశీలిద్దాం. వర్షర్తువు వర్ణన ఇది.

ధవళ బళాగా ధజవడ
విజ్జులదా కణగ బంధ కచ్ఛా జ।
ఇంద్దాయుధ కయభూసా
ఝురంత ణవ సళిళ దాణ ఒఘా॥

వర్షాకాలపు ఘనాఘనమును ఏనుగుగ ఉత్ప్రేక్షించబడినది. ధవల బలాకములు ధ్వజపటములు. శంపాలతలు బంగారు బంధ కక్ష్యములు, ఇన్ద్రధనుస్సు రంగురంగుల ఆభరణములు, ఓడికలై పారు దానవారి వర్షజలములు. చక్కని రూపకము.[4]

విమల సూరికి అభిమాన అలంకారములు ఉపమా, రూపకం, ఉత్ప్రేక్ష, నిదర్శనా. సమకాలీన లోకోక్తులు పెక్కులు ప్రయోగించెను. అందందు నీతిగాథలు చాల చోటు చేసికొన్నవి. ఒక్క గాథను చవిచూడండి.

వాలగ్గ కోడి మత్తం
దోసం పెక్ఖసి పరస్స అదిసిగ్ఘం।
మందర మత్తం పి జణో
ణ జ పెక్ఖసి అత్తణో దోసో॥

౧౧౩—౪౦. ౫.

విమలసూరి రచని అనన్తర సంస్కృత — ప్రాకృత కవులకు కావ్యనిర్మాణ మహాపథంలో పాథేయం అయినది. ప్రవరసేన నిర్మితి 'దసముహవహో'ను, విమలసూరి కృతిని తలనాత్మక పరిశీలన చేసిన క్రొత్త విషయాలు తెలుస్తని.

/ ఇతి శివమ్ /

పాదసూచికలు

౧ ౨౪ తీర్థంకరుల జీవిత చరిత్రలు వేరువేరుగ వర్ణింపబడినవి. ఇట్టి వాటిని 'పురాణములు' అందురు. కలిసికట్టుగ వివరించబడినచో అట్టివి 'మహాపురాణములు'. కాని హేమచన్ద్రాచార్యుడు తన కృతిని 'త్రిషష్టి శలాక పురుష చరిత' అని వాకొనెను.

౨ 'పఉమచరియ'లోని భాష శౌరసేని. కాని వ్రాయసకాండ్ర చేతిలోబడి భ్రష్టభ్రష్టమయి చాల మార్పులుపొంది, హేమచన్ద్రుని ప్రాకృత వ్యాకరణ ప్రభావమునకు లోనయినది. కాని శౌరసేనీ భాషా స్వరూపము అటనట గోచరించుటచేత హెర్మెన్ జాకోబి 'జైనమహారాష్ట్రీ' అని భాషకు నామకరణము చేసెను. పిదప ఆ పదమే వాడుకలోనికి వచ్చి అవిచారపూర్వకముగ నేడు వాడబడుచున్నది. ప్రవరసేనుని 'దసముహవహో' భాష కూడ శౌరసేనియే. వ్రాత ప్రతులలోని పాఠములకు, ముద్రిత ప్రతులలోని పాఠములకు చాలచోట్ల వ్యత్యాసము మున్నది. ప్రస్తుతము నేను ప్రవరసేనుని రమణీయ రచనను పరిష్కరించుచున్నాను.

౩ చూడు 'ఆదిపురాణము ౪—౩. మరియు పుష్పదన్తుని మహాపురాణము ౨౦—౧—౪, ౫

౪ పోల్చునది — ఋతుసంహారమ్ ౨. ౧.
ససీక రామ్బోధర మత్త కుఞ్జర
స్తడిత్పతాకోఽశని శబ్ద మర్దలః।
సమాగతో రాజవదుద్ధతద్యుతి
ర్ఘ నాగమః కామిజనప్రియః ప్రియే॥

౫ పోల్చుము—
ఖల పర్షప మాత్రాణి
పర ఛిద్రాణి పశ్యతి।
ఆత్మనో బిల్వ మాత్రాణి
పశ్యన్నపి న పశ్యతి॥

ఆకర గ్రంథములు

౧ విమలసూరి--'పఉమచరియ'
సం॥ డాక్టర్ హెర్మన్ జాకోబి
భావనగరం—౧౯౧౪

౨ "Critical study of the Paumacariyam"
Dr. K. R. Chandra

౩ ప్రాకృత వ్యాకరణం—
హేమచన్ద్రాచార్య
సం॥ శ్రీ పరశురామ వైద్య
పూణె — ౧౯౨౮

౪ హరివంశ పురాణం
పుష్పదన్త కృతం
సం॥ డాక్టర్ లుడ్విగ్ ఆల్ఫ్ డోర్ఫ్
హాంబర్గు —౧౯౩౬
(జర్మనీలో)

౫ దసముహవహో -మహారాష్ట్ర
లో వ్రాయబడినదా?
(మదీయ అముద్రిత వ్యాసము)

శ్రీ ఇప్పగుంట సాయిబాబా

సూరిగారి అలవం

పాల్కురికి సోమన, నన్నిచోడుడు, తిక్కన, శ్రీనాథుడు మున్నగువారి కావ్యాల్లో తమిళ కన్నడ పదాలు గోచరించటం సర్వజన విదితం. సోమన కన్నడ దేశానికీ, తిక్కన తమిళ ప్రాంతానికీ సమీపస్థులు. సోమన, నన్నిచోడుడు జానుతెనుగు ప్రచారానికి నడుము కట్టుకున్నట్టివారు. కనుక వారి పదబంధాలపై సంస్కృతంకన్న తమిళ కన్నడముల ప్రభావం పడటం సహజం. ఇక శ్రీనాథుడు దేశసంచారి కావడంవల్లనూ, పదౌచితీ ధురంధరుడు కావడంవల్లనూ కొన్ని తమిళ కన్నడ పదాలు ఎడనెడ గ్రహించాడు.

వారి తరువాత, వారికంటె ఎక్కువగా తమిళ పదాలు స్వీకరించిన మహనీయుడు చిన్నయసూరి. తెలుగు వచన రచనకు ఒక కొత్త పంథాను ఏర్పరచిన చిన్నయసూరి బాలురకు సుబోధకంగా ఉండాలనే లక్ష్యంతో నీతి చంద్రికను విరచించాడు. అందులోని తెలుగు తరువాతి తరాలవారికి క్రొత్త వరవడిని చూపింది. అట్టి సుబోధమైన తెనుగును సృష్టించడంలో సూరి పెక్కు తమిళ పదాలను స్వీకరించాడు. ఇక్కడ తమిళ పదాలు అనడంలో పరభాషా పదాలు అని అర్థం కాదు. తమిళంలో విరివిగా వాడబడుతూ తెలుగులో మారుమూలనున్న పదాలు అని తాత్పర్యం. ఇంకా వివరించాలంటే తమిళనాడులోని తెలుగు ప్రజలు వాడే పదాలు.

చిన్నయసూరి చెంగల్పట్టు జిల్లాలోని పెరుంబుదూరులో జన్మించాడు. మద్రాసులోనే ఉద్యోగ జీవితం అంతా గడిపాడు. ఒకవిధంగా చెప్పాలంటే చిన్నయసూరి రాష్ట్రేతరాంధ్రుడు. ఆయన సంస్కృతాంధ్ర ద్రవిడ భాషలు క్షుణ్ణంగా తెలిసినవాడు. అట్టియెడ సులభశైలిని తెలుగులో గ్రంథరచన చెయ్యదలచిన సందర్భంలో ఆంధ్రీకృత ద్రావిడ పదసముదాయం దొరలక తప్పలేదు. అదీగాక సూరి తన రచనకు క్రమానుగత ప్రౌఢిని అలవరచాలనే ఉద్దేశ్యంతో మొదటి అధ్యాయమైన మిత్రలాభాన్ని మిక్కిలి సులభశైలిలో విరచించాడు. అందువల్ల ముఖ్యంగా మిత్రలాభంలోనే ఆయనకు సహజమైన దక్షిణాంధ్ర పదాలు దొర్లాయి. సూరిగారి అరవడం అనడంలో ఉద్దేశ్యం ఇదే.

నీతి చంద్రికలో తమిళవాక్య నిర్మాణచ్ఛాయలు ఎడనెడ పొడసూపుతాయి. మచ్చుకు ఈ క్రింది వాక్యం గమనించండి.

"అది యెట్లు మృగమునకు నీతో స్నేహము రాగా రాగా వర్ధిల్లుచున్నది?" ఈ వాక్యంలో "అదియెట్లు" అనేది తెలుగు పలుకుబడికి దూరం. "అదెప్పుడి?" అనే పదాలకు అనువాదం అని వెంటనే అనిపిస్తుంది. ఈ రెండూ "తత్కథమ్?"కు అనువాదాలు అంటే చెప్పేదేమీలేదు.

"మాఱు" పదం "ఎదురు" అనే అర్థంలో ప్రయోగించడం తెలుగు భాషలో మిక్కిలి అరుదు. తమిళంలో ఇది సర్వసాధారణం. "నీకు మాఱులేదు గనుక నోటికి వచ్చినట్లు వదరుచున్నావు"వంటి వాక్యాల్లో సూరి తమిళ సంప్రదాయాన్ని అనుకరించడం గమనించవచ్చు.

చిన్నయసూరి 'వలెను' అనే పదానికి బదులు 'వలసినది' అని ప్రయోగించడం కూడ తమిళ ప్రభావం వల్లనే. 'శెయ్యవేండియదు' (చేయవలెను) అన్నట్లుగానే సూరి ప్రయోగాల్లో తమిళవాసన కనిపిస్తుంది. ఉదా:— "గృహమునకు వచ్చినవాని కాతిథ్యము చేయవలసినది"; "వృద్ధునిమాట వినవలసినది". ఇప్పటికీ తెలుగువారు ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఈ 'వలసినది' విరివిగా ప్రయోగిస్తూనే ఉన్నారు.

భవిష్యత్కాల క్రియారూపాలకు బదులుగా వర్తమాన కాల క్రియారూపాలు తరచుగా ఉపయోగింపబడ్డాయి నీతిచంద్రికలో. "నేను నీకా పొలము చూపుచున్నాను". ఇట్టి ప్రయోగాలు కేవలం తమిళభాషా ప్రభావం వల్లనే. 'కాట్టుగిఱేన్', 'శెయ్‌గిఱేన్' అనే పదాలకివి అనువాదాలు మాత్రమే.

'తలచు' పదానికి బదులు 'ఎంచు' (ఎణ్ణు) ఉపయోగించడం కూడా నీతిచంద్రిక యందలి మిత్రలాభంలో చూడగలం. "ఎవ్వరో పరులు వచ్చుచున్నారని యెంచుకొని"; "భయములేదని యెంచుకొనుచు"; "మృగము చచ్చినదని యెంచుకొని" — ఇట్టి ప్రయోగాలు కోకొల్లలు. ఇది తమిళనాడులోని తెలుగే. ఎన్నిక (ఎణ్ణిక్కై) అనడం కూడా తమిళ ప్రభావమే. "వీడు పరుడని ఎన్నిక లఘుబుద్ధులకు".

"ఒన్రుమ్ ఇల్లై" (ఒకటీ లేదు=ఏమీలేదు) అనడంలో తెలుగులో తమిళఛాయ గోచరింపకపోలేదు. కాని అరుదు. నీతి చంద్రికలో

ఈ ప్రయోగం విరివిగ చూడగలం. ''సీకొక యడ్డంకిలేదు''; ''నీతోడి సంగతికంటె నాకు లాభమొకటిలేదు.''

'ఆమె' అనడానికి బదులు 'ఆ యమ్మ' (అంద అమ్మ) అనడం తమిళ నుడికారం ప్రభావమే. ''అని చెప్పి యా యమ్మ నూవులు కడిగి దంచి యెండబోసెను''.

అరవ భాషలో తత్సమ పదాల పాలు చాలా తక్కువ. అయినప్పటికీ కొన్ని పదాలుమాత్రం విరివిగా చెలామణీ అవుతున్నాయి. అలాంటివాటిలో ''శీఘ్రం'' కూడా ఒకటి. ఇది మిత్రలాభంలో తఱచు కనబడుతుంది.

''మృగము శీఘ్రముగాలేచి పరుగెత్తెను''; ''మనము కడు శీఘ్రముగా పోవలెను'' ఇత్యాదులు.

ఇక ఆంధ్ర నైఘంటికసదాళి తమిళంలో విరివిగా వాడబడే 'ఉలివు'వంటి పదాలు నీతిచంద్రికలో కోకొల్లలు.

ఇట్లు సూరి జనశిరోమణి అయిన చిన్నయసూరి తన రచనలో అరవం మిళాయించి తెలుగుభాషకు ఒక వింత సొబగును సంతరించి ధన్యత నొందినాడు.

శ్రీ పులిచెర్ల సుబ్బారావు

సాహిత్యానికి చేటు కాలం

'సీడలు లేని శ్రీశ్రీ' లేఖలో టి. ఎల్. ప్రసక్తి ఉన్నందుకు 'నా ప్రసక్తి తీసుకురావడమెందుకు? స్వీయ ఘోషలో ఇరికించడం తప్పు!' అంటూ టి. ఎల్. ఒక విసురు విసిరారు. సాహిత్య విషయాలపై చర్చ చేయబూనడం టి. ఎల్. అన్నట్లు స్వీయ ఘోషకాదు. అంతా సాహిత్య ఘోషే. అతను కొంత చెప్పకపోతే, నేనూ ఏదో కొంత చెప్పవలసిన అవసరం ఉండేది కాదు.

సార్వజనీనమైన విషయం ప్రస్తావించే సమయంలో ఎవరి వ్యక్తిత్వమూ చర్చనీయాంశం కాగూడదు. 'విమర్శ వేదిక' సమీక్షలో గ్రంథకర్త అద్దేపల్లిని ప్రతిఘటిస్తూ టి. ఎల్. తన ఆచార్యత్వం బలవంతముగా నిలబెట్టుకొనడానికి ప్రయత్నించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆధునికత కేవలం కాలవాచి కాదని, సమకాలీను లందరు ఆధునిక కవులు కారని ఏవేవో వింగడించారు. వాస్తవానికి ఇలా చెప్పే హక్కు మాత్రం ప్రత్యేకించి ఇతడికి ఎక్కడుంది? చెప్పే హక్కు సాహిత్యంలో ఎవరికి వారు పొందుతుంటారు. అది కాదనడానికి ఎవరికీ హక్కులేదు.

లేఖలో ఒక హెచ్చరిక కన్పించినదన్నారు. సాహిత్య సమీక్షకులు గ్రహించవలసినంతగా గ్రహించలేదన్న బాధ మాత్రమే ఉండి సూచించాను. ఇది నా ఒక్కడి బాధ కాదు. సగటు పాఠకులందరి బాధ. ఈ సునిశిత విషయాన్ని గ్రహించి సాహిత్య విమర్శలను, సమీక్షలకు బయల్వెడాలి.

వాస్తవానికి అతని సమీక్షతో నాకు ఎటువంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధం లేదు. కాని సాహిత్య విమర్శలు ఉత్తర ప్రత్యుత్తరాలు వంటివి కాదుగదా! సాహిత్య పరమైన అంశాలు సాహితీ సుగతు లందరికీ సంబంధించినవి. 'విమర్శ వేదిక' పై సమీక్ష వ్రాయవలసిన అవసరం అతని కెంత తీవ్రమైనదో, అంతటి తీవ్రమైన అవసరం నాకూ ఉంది. ఆ సమీక్షలో గురజాడను, శ్రీశ్రీని కేవలం దురభిమానంతో సమర్థించే దృష్టితో ఒక పాత ఫక్కీవి బోలిన ఒక పేలవమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇందుకోసమే యుగే యుగే, సినీవాలి, తెలంగాణా మొదలైన కావ్యాలను ప్రస్తావించవలసి వచ్చినది. ''ఎవడైతే అంతకు ముందున్న సంప్రదాయాన్ని కాదని క్రొత్తదారి త్రొక్కుతాడో వాడు ఆధునికుడు''అని సెలవిచ్చారు. ''సంప్రదాయానికి ఎదురు తిరిగి నూతన విలువలను సృష్టించి సమూలమైన, సజీవమైన మార్పును ప్రవేశపెట్టాలి'' అని కొన్ని ఉత్సాహ జనిత సిద్ధాంతాలు చేసారు. కాని ఈతడు అత్యాధునికుడిగా అభివర్ణించిన, కీర్తిస్తున్న శ్రీ శ్రీ కూడా సంప్రదాయాన్ని అధిగమించి పోలేదని ఆయన కవిత్వావిమర్శకులే చెప్పారు. శ్రీశ్రీ కవిత్వంలోని ప్రతీకలను; ఆధునిక ఆంధ్ర కవిత్వము — సంప్రదాయము — ప్రయోగాలు మున్నగు గ్రంథాలను అవలోకిస్తే అవగాహనకు అందుతుంది. [illegible] అను భూతి దేశకాలాల మాలిన్యం ఎంత తక్కువగా స్పృశించగలిగితే అతని రచన అంత శాశ్వతమవుతుంది. కవితా సామగ్రి విషయంలో విప్లవం కోరుతున్న శ్రీశ్రీ అబ్బాలనీ, వల్లించడాన్ని [నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను] వదులుకోలేకపోయాడు.

సాంప్రదాయ వివేచనం, మార్పులు, విలువలు అనే మాటల కంటే స్థూలమైన భౌతిక స్వరూపం నుంచి అవలోకించిన తాత్విక బిందువు వంటి సాహిత్యాన్ని నిలపడానికి, ప్రజానుభూతుల్ని పంచి పెట్టడానికి మరికొంతమంది మహత్తరమైన సాహిత్యప్రక్రియవేపట్టి కవిత్వానికి కవి సృష్టి చేయగలిగారని — ''నా అవగాహనకు అందిన విషయాలు'' అందిస్తూ టి. ఎల్. మహాశయుడు తమ స్థాయికి తగ్గ సద్విమర్శనలుచేసి చక్కని సాహిత్య సృజనకు దోహదమివ్వాలని కోరడంలో అనుచితమేమీ లేదు.

ఒక్క శ్రీశ్రీని మినహాయించి మరే తెలుగు కవీ ఇతనికి నచ్చడేమో! 'నగరంలో వాన' విషయ ప్రస్తావనలో ''కదులాడుతున్నట్లు —పలుకుతున్నట్లు'' ఇక్కడ అంత్య ప్రాసలో ''ఏ మహాశిల్పం దాగి ఉందో నాకు బోధపడటం లేదు'' అని తన అనభిజ్ఞతను అనవసరంగా చాటుకున్నాడు. 'విమర్శ వేదిక' 148వ పేజీలో స్పష్టంగా గ్రంథకర్త వివరించాడు. ''వచన కవితలో లయను సాధించే సూక్ష్మ మార్గాల్లో ప్రత్యేకమైన మార్గం. ఆ లయ ఎక్కడా స్పష్టంగా కనబడకుండా ఉండటం, భావంలో కరగిపోవడం ఈ రచనలో నేర్పరితనం'' అంటూ గ్రంథకర్త వివరించినప్పటికి ఈతని దృష్టికి దొరకలేదు. ఈ సందర్భంలో 'మహాశిల్పం' అన్వేషణా కుతూహలం ఈతనికెందుకు కలిగిందో అనూహ్యం. అప్రస్తుతమైనప్పటికీ ఒక విషయం చెప్పుకోవచ్చును. వచన కవితలో సన్నని లయాత్మకమైన ప్రాసలు వస్తున్నాయి. వెనుకటి చరణాంత ప్రాసలే కాకుండా—ఒక భావంచెప్పే

టప్పుడు ఆ మొత్తం భావాన్నంతా పెట్టుకొని, ఒక తూగు రప్పించుకోవడానికి సన్నని ప్రాస వాడుకుంటారు. ఆది — ఆ ఆశయం, ఆ పరిచ్ఛేదం అంతా ఆవరించి ఉంటుంది గాబట్టి దానిని పరిచ్ఛేదప్రాస అనవచ్చు.

చరణాంత ప్రాసలో అయితే— "అందుకే వ్రాస్తున్నానొక గీతి, చేస్తున్నా నొక హేతి" అని ప్రాసత్వం చిక్కగా కనపడవచ్చు గాని పరిచ్ఛేద ప్రాసలో భావాన్నంతా ఆశ్రయించి ఉండటం వలన 'అంత చిక్కదనం' ఉండదు. ఒక్క తూగు మాత్రమే అక్కడకావాలి. 'నగరంలో వాన' విషయంలో గ్రంథకర్త విపులంగా "ఈ ఆరుపంక్తుల్లో ఒక లయ వుంది. మొదటి మూడు పంక్తుల్ని ఒక భాగంగా, తర్వాతి మూడు పంక్తుల్ని ఒక భాగంగా తీసుకోవాలి. రెండింటిలో రెండో పంక్తుల చివర సామ్యం ఉంది" అని వివరించినప్పటికీ ఈతను తన ఆచార్యత్వం నిలబెట్టుకోవడానికి విఫలయత్నాలు చేసినట్లు అవగత మవుతున్నది. ఈ మాదిరి సూక్ష్మభేదాలు విమర్శక మహాశయులు గమనించాలి.

"వెనక జన్మములోన అనే గేయంలో ఉన్న ఆధ్యాత్మిక అనుభూతిని బాగా విశదీకరించారు" అంటూ ఒక బెస్ట్ కాంప్లిమెంట్ పారేశారు. "వెనక జన్మములోన విహరమోనంటే, సిగ్గొచ్చి నవ్వింది సిలక నా వంకి—" అనే పదాలతో ఆధ్యాత్మికత ఎక్కడ గలదో నాకు బోధపడలేదు. గ్రంథకర్త "పూర్వజన్మ ప్రస్తావన కేవలం, విలాసంలో అంతర్భవించి, సిగ్గు, సిలక — అనే పదాలతో భూలోకంలో నిలిచి ఉంది" [72 పేజీ] అని వివరించుకున్నారు. ఆధ్యాత్మికత పదమే వాడలేదు. మరి ఈతను ఆధ్యాత్మికమని ఏ విధంగా నిర్ధారించారో తెలియకున్నది. ఆధ్యాత్మిక తాత్విక కవిత్వాలు తెలుగులో చాలా తక్కువ. బ్రహ్మం, వేమన ఇంకా కొన్ని తత్వాలలో తప్పితే మరి మన సాహిత్యంలోలేవు. 'వెనకజన్మ' అనే పదాలు వచ్చి ఉండే వాటిని ఆధ్యాత్మికత అనుకోవలసి వస్తే తాత్త్వికవిషయాలలో అనభిజ్ఞులుగా ఉండిపోతాం. వెనకజన్మ, స్వర్గ నరకాలు, పాప పుణ్యాలు — ఆధ్యాత్మిక విషయాలు కావు. మత ధార్మిక విషయాలకు సంబంధించిన మన నమ్మకాలు లేక దూరస్థమైన అనుభూతులు. ఒక అనంత ప్రియుణ్ణి గూర్చి అనంత ప్రేయసి వేదన చెందితే ఆధ్యాత్మికతతో ముడిపెట్టడానికి అవకాశము ఉంటుంది. ఆత్మల ప్రేమకు ఆధ్యాత్మికతను జోడించనవసరంలేదు.

ఫిబ్రవరి '80 భారతిలో ప్రచురింపజేసిన ఒక పరిశోధనా వ్యాసంలో శ్రీశ్రీని ఉదహరిస్తూ అభ్యుదయ కవిత్వం నాలుగు దశాబ్దాలు తెలుగు సాహిత్యాన్ని ఏలిందని సెలవిచ్చారు. ఇటువంటి రోకటి పాట అభిప్రాయాలు కొంతకాలం నుండి ప్రచారం అవుతున్నాయి. అందువలననే యుగే యుగే, మంటలు మానవుడు, మధూలిక, నగరంలో వాన మొదలైన కావ్యాల్ని ఉదహరిస్తూ అవి అభ్యుదయ కవిత్వాన్ని ప్రక్కకు నెట్టివేసి శ్రీశ్రీ నీడల నుంచి తప్పుకున్న సాహిత్యం అని, దానిని చైతన్యవాదంగా వ్యవహరించుకోవచ్చునని తెలియజేయడంలో అప్రస్తుతము, అకారణము లేదు. అవసరం కూడా నని బలీయంగా అనిపించింది. ఎందువలనంటే అభ్యుదయ కవిత్వం ప్రారంభమైన రెండు దశాబ్దాలకే దాని భేరీ భాంకృతులమధ్య సన్నని క్లారినెట్‌ల, మురళీ మనోహర ధ్వనులు వినదించడం ప్రారంభించినాయి. సాధారణ పాఠకులకు విపరీత ధ్వనుల చాటున సరళస్వరాలు వినపడలేదు. తెలంగాణ, నావాస్తా, సిసీనాలి మొదలైన అనేకానేక కావ్యస్వరాలు వ్యక్తిత్వంగల స్వరాలుగా సూక్ష్మజ్ఞాన వచోధనులైన విమర్శకాగ్రేసరులకు ఎందుకు వినబడలేదో అన్న బాధతోనే ఆ ప్రసంగం ఎత్తుకోవలసివచ్చినది. ఫలానా కావ్యం నేను చర్చించలేదు, ఫలానా వారి కావ్యం నాకంట పడలేదు అనడం ఒక్క కమిట్‌మెంట్ సమీక్షకులకే చెల్లుబాటు అవగలదు. వాస్తవానికి గత రెండున్నర దశాబ్దాలలో వెలువడిన వివిధ కవితా ప్రయోగ ప్రక్రియా విశేషాలను తిలకించే ఓర్పు, చర్చించే సహృదయత, ఆలోచించే మేధ మన విమర్శకులకు ఉన్నట్లయితే ఆంధ్ర సాహిత్యం ఇంత నేలబారుతనంగా; ఇంత రోడ్డు రోలరు పద్ధతిలో ఉండేది కాదు. అర్థంలో ఒక శబ్దానికి అర్థమేమిటో, ఏ భావస్ఫూర్తి రూఢమైనదో అనే సాధారణ జ్ఞానం కూడా లేని కొంతమంది విమర్శకులు సాహిత్యాన్ని కల్లోలపరచడం విచారణీయం.

"సామాజికజీవితంలో అనివార్యముగా సంభవించే ప్రతిమార్పు ఆనాటి కవిత్వానికి ఇతివృత్తమవుతున్నదని చెప్పడానికి తెలుగుసాహిత్య చరిత్ర యావత్తూ సాక్ష్యంగా నిలబడుతుంది." అని టి. ఎల్. ఆహ్లాదకరంగా సెలవిస్తారు. తెలుగు సాహిత్యంలో వాస్తవానికి ఆనాటి జీవితంలో వచ్చిన మార్పును ఇతివృత్తంగా తీసుకున్న కావ్యం ఒక్కటీ లేదు. 'ఇతివృత్తం' అంటే కథావస్తువు. మరి టి. ఎల్. ఏం అనుకున్నారో! పురాణ కవులనుండి ప్రబంధ కవుల వరకు అందరూ ప్రాచీన ఇతివృత్తాలను తీసుకొని కావ్యాలను వ్రాసినవారే కాని, అప్పటి సమకాలీన మార్పులను, సమస్యలను కథా వస్తువులుగా తీసుకొని కావ్యాలు ఎవరూ వ్రాయలేదు. కళాపూర్ణోదయం కూడా కల్పితేతివృత్త కావ్యమేగాని, సమకాలీన కథా కావ్యం కాదు. చాటువుల్లో ఏవో కొన్ని క్వాచిత్కముగా రెండు మూడు దొరుకుతాయేగాని ఈ మహానుభావుడు అన్నట్లు తెలుగు సాహిత్యం "యావత్తూ" సాక్ష్యంగా నిలబడుతుందనడం ఆతని సాహిత్య గ్రంథావలోకనా ఏభిజ్ఞతను మాత్రమే తెలుపుతుంది.

మరో విషయం — కవులు, కావ్యాల పేర్లు ఉండి, ఆ రచన మీద దానికి సంబంధించే వ్రాయాలనే నియమం లేదు. ఒక దృష్టి కోణం వేత్తై, మరొక దృష్టి కోణంతో విభేదించినప్పుడు — దానిని గూర్చి చెప్పవలసిన అంశాలు ఉన్నప్పుడు ఎక్కడైనా, ఎప్పుడైనా చెప్పవచ్చును. దీనిని సాహిత్య విషయంగా పరిగణించరా ?

రంగుటద్దాలు ధరించని సాహిత్య విమర్శకులు, సమీక్షకులు తెలుగు సాహిత్య పరిధులలోకి మరింతమంది ప్రవేశించాలని ఆశించడంలో దుర్భ్రమలేదు, దురాశా కాదు. కమిటెడ్ రచయితలు, కమిటెడ్ పత్రికలు ఉండటంలో ఆత్మహత్యా సదృశం కాదుగాని, కమిటెడ్ విమర్శకులు, సమీక్షకులు చెలామణి అయితే సాహిత్యానికే చేటుకాలం ప్రాప్తించవచ్చు.

శ్రీ వా స వ్య

'ఆధ్యాత్మిక దృక్కోణంనుంచి-చలం' పరిశీలన

మే, 1980 'భారతి'లో చెంచయ్యగారు, నిఖిలేశ్వర్ 'ఆనందమే పరమావధిగా జీవించిన చలం' అంటూ రాసిన వ్యాసంపై కౌంటర్‌గా 'ఆధ్యాత్మిక దృక్కోణంనుంచి-చలం' అంటూ ఓ వ్యాసం రాశారు. దానిలోని నిజాయిజాల పరిశీలన ఎంతో అవసరం. చలం రమణాశ్రమం వెళ్ళిన తర్వాత చేసిన రచనలు చాలా 'ఉత్తమశ్రేణి కథా రచనలు', వాటిలోనే 'సాహితీ విలువలు'న్నాయి, చలం 'ఆత్మకు తృప్తిని కూడా యివ్వగలిగిన' రచనలు అవి. ఇంకా 'చలంగారు రమణాశ్రమం చేరింతర్వాత, యువతరం అతడికంటే ముందుకెళ్ళలేదు' అంటూ కొన్ని ఉదాహరణలు, యింకా కొన్ని విషయాలు తన వ్యాసంలో చెంచయ్యగారు పేర్కొన్నారు. వాటిని కాస్త విమర్శనా యుతంగా పరిశీలిద్దాం.

చలం గురించి—శృంగార సాహిత్య సృష్టికర్త అనో, వట్టి ఆధ్యాత్మిక వాది అనో, అభివృద్ధి నిరోధకుడనో, స్త్రీ స్వాతంత్ర్య పరిరక్షకుడనో, మార్క్సిస్టు వ్యతిరేకి అనో ఎన్నో రకాల అభిప్రాయాలు వెలిబుచ్చారన్నారు. అవన్నీ పాక్షిక సత్యాలుమాత్రమే. నిఖిలేశ్వర్‌గారు చలంగారిమీద తన అండర్‌స్టాండింగ్‌ని చలంగారి స్వంత మాటల్లోనే నిరూపించారు. 'చలంగారు ఆనాడలా ఎందువల్ల తన గుండెల్లో మంటల్లా తలరేగుతున్న భావాల్ని సమాజంపై చెరగగలిగారు? ప్రపంచ వ్యాప్తంగా పీడితులు పీడకుల చేతుల్లో అప్పుడూ ల్లా నలిగిపోతుంటే బానిసకొక బానిసలాగా స్త్రీ సమాజంలో అధో వస్తువుగా అణచబడుతూంటే స్పందించి కలంద్వారా వాళ్ళ కన్నీళ్ళు నెత్తురుగా చిలికించింది చలం. ఇది కాదనలేని సత్యం. సాహిత్యపరంగా చలం సృష్టిని పరికిస్తే, ఆంధ్ర సాహిత్య ప్రపంచం నించి అతని సాహిత్యం మినహాయిస్తే ఒక గొప్ప భావ ప్రభంజనాన్ని మినహాయించినట్లు—అంతమాత్రాన అతను సాహిత్యపరంగా వెలిబుచ్చిన భావాలన్నీ మనం ఒప్పుకున్నట్లుకాదు. ఇక్కడ చెంచయ్యగారి వ్యాస పరిధినిబట్టి మాత్రమే వైరుధ్యాలని పరిశీలించాలని ఈ వ్యాసకర్త ఉద్దేశం.

చలం రమణాశ్రమం చేరింతర్వాత ఎంతో ఎదిగారంటారు శ్రీ చెంచయ్య. రమణాశ్రమానికి చేరకముందే చలం భావాలలో ఈ అతీత విషయాల గోల ఉండేది. అయితే మరీ ముదరలేదు. రమణాశ్రమం చేరింతర్వాత వెనుకబాటు ఆలోచనలు, అలౌకిక విషయాలు విపరీతంగా ఒంటికి రాసుకుని, వ్యక్తిగత భ్రాంతుల్ని సమాజానికి అన్వయించబోయి చాలాసార్లు దెబ్బతిని, ''ఈ ఆధ్యాత్మికమార్గంలో ప్రవేశించాక విశ్వాసంతో పని చెయ్యాలి. అక్కడ ప్రశ్నలకు తావుం డదు—ఒకే జిజ్ఞాస వాంఛతో సాధన చేయడం తప్పించి. అయినా ఈ పాత్‌లో ప్రవేశించాక మళ్ళీ వెనక్కిపోయే ప్రసక్తి లేదు — సీక్ ది ఎన్‌డ్ ఆఫ్ యిట్'' అంటారు చలం,—

('రమణాశ్రమంలో చలంతో మూడు గంటలు' 'ఆంధ్రప్రభ' 14–3–'65, నిఖిలేశ్వర్)—తనన్నీతానే సమర్థించుకోలేక.

దీన్నిబట్టి ఆధ్యాత్మికదృష్టిలో అని ఎప్పుడైతే చలం అన్నారో దాన్ని 'విశ్వాసం'తోనే నమ్మాలి కానీ; రేషనల్ థింకింగ్‌తో కావని [అంటే రీసన్ వద్దు. 'నమ్మ' అనే గుడ్డివిశ్వాసం]. అక్కడ ప్రశ్నలకు తావుండదు—'రమణ' చెప్పిందే వేదం, చూసిందే స్వర్గం [అని అర్థం చెప్పుకోవాలి]. 'ఒకే జిజ్ఞాసా వాంఛతో' అంటే 'ఏదో ఉంది' అనేది ముందుగానే మెదడులో పులుముకుని సాధన చెయ్యాలన్నమాట! గతంలోని భావాలు తిరిగి చూసుకునే ప్రసక్తే లేదన్నమాట!

1937 నాటికే 'రమణ' ఫోల్డ్‌లో కొచ్చిన చలంగారు అతని గత భావ ప్రభంజనాన్ని, ఆలోచనా దీపికల్ని రద్దంతైనా వ్యతిరేకించలేదనడానికి నిదర్శనం, ''నేనేనాడూ చలం సృష్టించిన సాహిత్యాన్ని, జీవించిన జీవితాన్ని నిరాకరించలేదు. నేను రాసిన పుస్తకాల్లో అచ్చు తప్పులు తప్ప ఒక్క అక్షరంనుక్క మార్చను...'' [1–3–'68 నిఖిలేశ్వర్‌గారికి చలంగారు రాసిన ఉత్తరంనించి] అంటే దీనర్థం ఆనాడు స్త్రీ ఎలా బానిసకొక బానిసలాగుండేదో ఈనాడూ అలాగే వుందనీ, భావాల్లో, చరిత్రలో, సమాజంలో అలానే వుందనేది ఉపన్యసించలేని స్థితి. అంటే కొత్తగా ఉన్నా రమణాశ్రమానికి వెళ్ళేంతర్వాత తననీ, అంతకుముందు తననీ వేరు వేరు వ్యక్తులుగా చెప్పటం యిక్కడ కనిపిస్తుంది. దీన్ని కూడా సంపూర్ణ జాగ్రత్తగా పరిశీలించాలి, అంటే ఆధ్యాత్మికతనుంచి తనని వేరుపరచుకుంటున్నాడేమో! మొదట చెప్పిన భావాల వేగానికి ఈనాడతను 'ఆధ్యాత్మిక ఆలోచన' అన్నది అందుకోలేకపోయినాడేమో! ఆనాడే అంత దూరం ఆలోచించి రాలేకపోయి నాడేమో! అతను ఈనాటి స్థితికి రావడానికి, ఆనాటి సమకాలీన విమర్శకులు, కథకులు, రచయితలు అతన్ని సరైన రీతిలో విమర్శించి నిర్మాణాత్మక త్రోవలో పెట్టివుంటే అతని సాహిత్యం వేరు విధంగా ఉండేదేమో! అంటే యివన్నీ అతన్ని సానుభూతితో అర్థం చేసుకుంటే తోచే వీచికలు.

చలంగారు రమణాశ్రమానికి వెళ్ళినా, వెళ్ళకపోయినా యువతరమనేది మున్ముందుకు పయనిస్తూనే వుంటుంది. ఒకతరం వెనక పడేకొద్దీ, మరోతరం రెట్టించిన సామాజిక స్ఫూర్తితోముందుకు దూకుతుంది. అయితే ఆ సామాజికస్ఫూర్తి రావటానికి మొదటితరం కూడా దోహదం చెయ్యడం అనేది సహజంగా జరుగుతుంది. చలం గారి కర్థంకాని భావాల్ని, సిద్ధాంతాల్ని కూడా అర్థం చేసుకుంటూ మున్ముందుకు పోతూనేవుంది. ఆధ్యాత్మికన దులనకపోవచ్చు కానీ ప్రపంచమనేది మార్పుకు లోనవడం సహజం. అలాగే యువతరం కొత్త కొత్త భావాలతో ప్రగతివేపు ప్రయాణించడమూ సహజమే. చలంగారు ఆశ్రమంలోంచి తన స్వార్థ ఆధ్యాత్మిక ఆనందాన్ని చూసుకున్నారు తప్పితే ఆంధ్రదేశం గురించి ఆలోచించారా? తన వ్యక్తిగత అనుభవాన్వేషణలో పడి గిలగిల లాడేరు తప్పితే ఒక నిశ్చిత అభిప్రాయంతో సమాజంగూర్చి ఆలోచించేరా?—అయినా అతనికి తెలుసు యువతరం దారీతెన్నూలేని సమాజాన్ని గతానుభవ పునాదులతో ఎర్రటికళ్ళు కాగడాలుగా శోధిస్తూన్నదని—దానిలో యత్నంగానే ''...నాలోని చలం గంతులేస్తున్నాడు. నేను మీ పక్కవొచ్చి నిలబడి, మీ ఉత్సాహంలో, ధీరత్వంలో నేనూ జాయిన్ కాగలిగిన వయసులో,

స్థితిలోలేని అనే దిగులు'' అంటాడు [11–2–'68లో నిఖిలేశ్వర్‌కి ఉత్తరంలో]. అంటే ఒక అన్వేషణలోవున్న యువకులతో తను కలవలేక పోయాననే, తను యువకుడ్ని కాలేకపోయాననే అన్న బాధ [వాళ్ళ భావాలతో ఏకీభవించడానికి, వాళ్ళ ఆచరణలో భాగం పంచుకోడానికి]. అంటే తన [ఆధ్యాత్మికవాద]తరం ఎంత వెనకబడివున్నదో చెప్పకోవడమన్నమాట! చలం 'తెలుగు దేశానికి దూరంగా' పారిపోయినా యువతరం మాత్రం అతని బాధని, ఆవేదనని, ఆక్రోశాన్నీ సానుభూతితో పరిశీలిస్తూ, పరికిస్తూ అవసరమైనంతవరకు భాగం పంచుతుంటూనే వుంది, అనవసరమైన పనసంతా పక్కకునెట్టి సరయిన అంచనావేసే పరంగా ముందుకు పోతూనేవుంది.

చెంచయ్యగారు ఈ విషయంలో దిగంబరకవుల్ని ఉదాహృతిగా పేర్కొన్నారు. అవును, ఏ సిద్ధాంతానికీ పరిమితం కాకుండా విశృంఖలంగా రాయటంవల్ల వాళ్ళ కవిత్వం సాహిత్య సరోవరంలో రాయి విసరినట్లు కల్లోలం చేయగల్గింది. కానీ ఒక సిద్ధాంత అవగాహన తర్వాత, 'కమిట్' అయిన తర్వాత వాళ్ళలో ఒక సంఘదృక్పథంతో వాళ్ళు ముందుకు పోతున్నవాళ్ళే. చిన్న విభేదాలువున్నా వాళ్ళ అంతిమ లక్ష్యం ఒక్కటే. ఇక చెంచయ్యగారి మిత్రులు 'మహాస్వప్న' వ్యక్తిగత బలహీనతలవల్ల దూరమైపోయ్యారు. దాన్నిబట్టి అసలు భౌతికవాద సిద్ధాంతావగాహననే తప్పపట్టడం తన వాదనకి బలం సరికాదుకదా, ఈడె పోటే అవుతుంది.

''కేవలం భౌతిక దృక్పథమునుంచి రచనలు చేసిన పాశ్చాత్య దేశాలకు చెందిన రచయితలు ఎందరు, ఆత్మశాంతికి దూరమై... ఎందరు ఆత్మహత్యలకు పాల్పడలేదు?'' అని ప్రశ్నించారు. వాళ్ళ అశాంతికి కారణమేమిటి ? వాళ్ళ సమాజంలోని భౌతిక మానసిక వికారాలకు సంబంధించిన స్థితిగతుల పూర్వాపరాలేమిటి? అన్నప్రశ్నలు వేసి జవాబులు రాబట్టుకోకుండానే వాళ్ళ చావులకి, పలాయనాలకి ఆధ్యాత్మికవాదం కొరవడటమే అనటం గుడ్డితనం. యంత్రనాగరికత పెచ్చుమీరి పెట్టుబడిదారీ దేశాలుగా మారినచోట, పెట్టుబడిదారీతనం పెచ్చుమీరి సామ్రాజ్యవాద దేశాలుగా మారినచోట, ఆయుధాల పోటీ, సిద్ధాంతాలపోటీ, దోపిడీల్లో పోటీ యిలా పోటీలు ఉధృతమవుతున్న దశలో దిక్కూ మొక్కూ తెలీక సరయిన శాస్త్రీయ దృష్టిలేక తమ సమస్యలకు పరిష్కారం అన్వేషించే మానసిక స్థైర్యంలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడి వుండవొచ్చు. అంతమాత్రాన వాళ్ళకి ఆధ్యాత్మికత కొరవడినట్లేనా? అందరికీ బుర్రలు చెడినట్లేనా ? నిరుద్యోగులయినవాళ్ళు మూఢత్వం పెచ్చుమీరిన ఈ దేశంలో జుత్తు పెంచి, గోచీలుపెట్టి దేవుళ్ళుగా చెలామణి అయ్యి భౌతిక చింతన మాయ, భౌతిక అవసరాలు మాయ, ఆకలిమాయ, యుద్ధాలుమాయ, సమస్తం మాయ అంటో 'తత్వోపదేశం' చేస్తారు. కానీ వాళ్ళే ఆ భౌతిక అవసరాలని మినహాయించుకోలేరు. వీళ్ళని ఏ శాస్త్రీయ పరిజ్ఞానమున్న డాక్టర్లచేతనో పరీక్ష చేయించండి ఆధ్యాత్మికత ముసుగు తొలగుతుందో లేదో తెలుస్తుంది.

ప్రజల్ని అన్నిరకాలుగా పీడిస్తూ, మతం మత్తును నూరి పోస్తూ దోపిడీచేస్తోన్న నాయకమ్మన్యులూ, ధనవంతులూ, భూస్వాములూ వగైరాల చేతి చలవవల్ల పెంచి పోషించబడే రామకృష్ణమిషన్ లాంటి సంస్థలు ఆధ్యాత్మికత పేరుతో తరతరాలుగా చేసిన, చేస్తోన్న ఊడిగాన్ని ఎంతో అందమైన 'ఆధ్యాత్మికత, కర్మ'లాంటి పదాల మరుగున దాచి అశేష శ్రామికజన సందోహానికి తీరని ద్రోహాన్ని చేస్తోన్నారు. ఇది కొంత ఆలస్యమైనా గ్రహించే రోజుకు జనం ఎదుగుతారు మరి! చెంచయ్యగారి వ్యాసంలోని నిజానిజాల్ని, చలంని ఆధ్యాత్మికవాదిగా నిర్ధారించటంలో చేసిన తప్పటడుగుల్ని ఎత్తి చూపటం మాత్రమే ఈ వ్యాసకర్త ఉద్దేశం.

శ్రీ ఏయన్. నాగేశ్వర రావు

శ్రీ బ్రహ్మానంద, శిశు సంబోధనా చక్రం

జూలై 'భారతి'లో డా. హెచ్. యస్. బ్రహ్మానందగారి ''శిశుసంబోధనాచక్రం'' చదివి ఇది చదువుడు.

1. శిశుభాషలో ''అ'' అనే అక్షరంతో మొదలుపెట్టి రూపాంతరములు పొందిన అనేక పదములు ఇచ్చినారు శ్రీ బ్రహ్మానందగారు. ప్రతిభాషలోను వర్ణమాల ''అ'' తోడనే మొదలిడు చుండగా అక్షర అను వర్ణసూచకపదము, ఆల్ఫబెట్ అను పదము వర్ణమాలలోని మొదటి శబ్దమునే కలిగియుండగా, శిశుభాష ''అ''తో ప్రారంభమగునను వారి వాదమున కాధారము కానుపించదు. పిల్లలకు అంకెలు నేర్పు చట్రమునకు అబాకస్ అని అందురు.

2. భాష శిశువులనుండి పుట్టునా లేక పెద్దవారినుండి పుట్టునా అను ప్రాతిపదిక ప్రశ్నకు వారు సదుత్తరము చెప్పవలెను కాని ''ఢిల్లీకి దారైనా తల్లికి కొడుకే'' అను సామెత చెప్పట యుక్తి అగును కాని శాస్త్రము కాజాలదు.

3. తెలుగు భాషకు శిశుభాషచక్రం, చట్రం వగైరా ఇచ్చినారు. సంస్కృతి భాషకు ఇవ్వగలరా ? సంస్కృతములో శిశుసంబోధనా శబ్దము ''అంబ'' ఒకటి నాకు తెలియును. ఇది కూడ జగన్మాతకు ప్రాపర్ నౌన్ అయి తరువాత ప్రతిమాతకు కామన్ నౌన్ అయినది.

నేను వ్రాసిన ప్రతిసారియు ''ఇంకొక క్రొత్త విషయము తెలియవచ్చినది'' అని వ్రాయు శ్రీ బ్రహ్మానందగారు ఈసారి ఏమి వ్రాసెదరో అని వేచియున్నాను.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

లేఖలు

వికటకవి

జూన్ 1980 'భారతి' సంచిక చూసి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. కవితగ అచ్చువేసిన 'వికటకవి' (పేజీ 34) డాక్టర్ తంగిరాల గారు శ్రమించి చేసిన రచన చదివి వారిని ఎలా అభినందించాలో తెలియుటలేదు. ఇలాంటి రచనలు ఎంతో శ్రద్ధతో వేస్తున్నారు కను

కనే ఆచార్య తల్లోజు [కలగూర గంపలో]వారి ఆరోపణలు—వాటిపై చర్చలు [అవసరమో, అనవసరమో పెద్దలు మీకే తెలియాలి.]

బహుశః తెలుగులో డాక్టరేట్ పట్టాను పొంది, విశేషముగ సాహిత్య కృషిని సలిపినవారు మీ పత్రికద్వారా మాలాంటి వారికి తెలిసిన విషయాలు చూడండి ... ...

'ఆరుద్ర బఫూన్ కవి
దాశరథి సర్కార్ కవి
సినారె సినిమా కవి ... ...'

ఇది కేవలం ఈర్ష్యలో వ్రాసిన కవిత. [వేశారు కనుక అను కుంటున్నాను] — లేకపోతే ఆరుద్ర రచనలు, దాశరథి కవిత్వము, సినారె సాహిత్య విశిష్టత తెలియకకాదు. అలా వ్రాసి డాక్టర్ తంగిరాల, దాశరథి, సినారె, ఆరుద్రలా సాహితీ చరిత్రలో నిలిస్తే సంతోషం.

ప్రతిభగల కవి ఏ వర్గం వాడయితేనేమి ?

ప్రశాంత సాహితీ వాతావరణాన్ని నెలకొల్పవలసిన 'భారతి' సాహిత్య మాసపత్రిక బాధ్యతను సంపాదకులు గుర్తుంచుకోవాలి.

శ్రీ సంగిరెడ్డి వెంకటరంగారెడ్డి
హైదరాబాదు

ఒక ఫ్యాషన్

శ్రీశ్రీని రచ్చకీడ్వడం యీ మధ్య ఒక ఫ్యాషన్‌గా తయారయింది. ఒక విధంగా ఆలోచిస్తే విమర్శింపబడడం, దూషింపబడడం కూడా ఒక గొప్పే. 'కవి సార్వభౌమ' శ్రీపాద వారిని, ఆ మాటకొస్తే తిరుపతి వేంకటకవులను యివాళ ఎంతమంది చర్చిస్తున్నారు ?

ఇకపోతే 'మహాకవి' విషయం. రమేష్‌బాబుగారు విప్లవం తెచ్చినవాడు మహాకవి అని తీర్మానించుకుని, ఆ తర్వాత రాయప్రోలు విప్లవం, విశ్వనాథ విప్లవం అంటూ రాసుకొచ్చారు. విప్లవం మరీ అంత తేలికా ? ప్రతి క్రొత్త మార్గం మార్పు కాదు. ప్రతి మార్పు విప్లవం కాదు. పురాణ యుగంనుండి ప్రబంధ యుగం రావడం విప్లవ మనడానికి, పురాణ యుగమంటూ ఎక్కడుంది ? మనం పురాణ యుగమనేది, నిజంగా అనువాద యుగం కాదూ ? తప్పటడుగులు వేసే చిన్నారి పరుగు నేర్వడం కాలానుగుణంగా రాక తప్పని మార్పు. అందులో విప్లవాంశలేదు.

మరి శ్రీశ్రీని మహాకవి అని ఎందుకంటున్నాం ? ఆనాడు జాతీయ భావాలు దేశమంతా పెల్లుబికి, ప్రతి కవీ 'ప్రబోధ' గీతాలు రాసే సమయంలో, ఆ భావాలతో తనూ ప్రభావితుడైనా — ఆ ప్రభావాన్ని దాటి కొత్త పుంతలు తొక్కినవాడు శ్రీశ్రీ. రవీంద్రుడు లేకపోతే, రామ్మోహన్‌రాయ్ లేకపోతే, కృష్ణశాస్త్రి, రాయప్రోలు వుండేవారు కారేమో. కవిత్వంలోగానీ, భావాల్లోగానీ వారు తీసుకు వచ్చిన మార్పు తాత్కాలికమైనది. శ్రీశ్రీ భావ విప్లవమన్నది, వ్యవస్థలో విప్లవానికి ముడిపడి వున్నదని గ్రహించినవాడు. వ్యవస్థపై తుపాకిని ఎక్కుపెట్టినవాడు. అందుకే యివాళ రాయప్రోలు, కృష్ణశాస్త్రి మూలబడ్డా, 1920–30 కాలంలో శ్రీశ్రీ రాసిన గేయాలు మనల్ని ఉత్తేజితులను చేయగలుగుతున్నాయి. ఈ కొలబద్దతో చూస్తే తెలుగులో ఎన్ని విప్లవాలున్నాయి ? ఎంతమంది మహాకవులున్నారు ?

రెండే విప్లవాలు—యిద్దరే మహాకవులు. తెలుగును కావ్య నిర్మాణానికి వుపయోగించడం ఒకటవ విప్లవం. ప్రజల బాధలను కవిత్వం ద్వారా ప్రతిబింబింపడం రెండవ విప్లవం. నన్నయ, శ్రీశ్రీ యిద్దరే మన మహాకవులు.

ప్రియదర్శి
అనంతపురం

ఎలా చెప్పగలం ?

జూన్ 'భారతి' 80 సంచికలో నా లేఖ చూసి శ్రీ బెడిద రాజేశ్వర్ సెప్టెంబరు 80 సంచికలో ఒక లేఖ ప్రకటించారు. అది దశాంశ పద్ధతిలో ఉంది. వారి ఆలోచనలకి అనువైనవి మాత్రమే సంగ్రహించి సమాధానం వ్రాయాలనే తాపత్రయం వెలిబుచ్చారు. ఆ లేఖాంతంలో వారే వ్రాసినట్లు సాహితీ మిత్రులు తల్లోజు, రాజేశ్వర్ గార్ల లేఖలు, నా లేఖా పరిశీలిస్తే నా లేఖలోని వాస్తవం తప్పక వెల్లడవుతుంది.

ఇంక వారి దశాంశాలకు సమాధానం :—

1. విషయాన్నిచెప్పడం, సూచించడం "భారతి" "కలగూర గంప" విలువని కాపాడేధోరణిలో ఉండాలి. "మొత్తుకోవడం"అంటే అవహేళన చెయ్యడం కాదా ?

2. బోధించే విధానం మృదువుగా ఉండాలి ! సంస్కారం ఉట్టిపడేలా ఉండాలి !

3. కోపమూ, ఎక్కసమూ లేకపోతే ఆ సంస్కృతం ఊసే ఎత్తవలసిన పనిలేదు.

4. అర్థంకాని భాష అంటూ ఉంటుందా ? "ప్రపంచంలో ఏదీ మనిషికి అర్థం కానిది లేదు. ఉన్నా అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు, కృతార్థుడౌతున్నాడు" అని తాము చెప్పినది భాషా విషయంలో కుదరదా ? ఏ భాషకయినా "అర్థంకాని భాష" అన్న లేబిల్ ఉందా ? ఎవరికి అర్థం కాకపోవడం ? వ్రాసే తమకా ? చదివే పాఠకులకా ?

5. సామాన్య పాఠకుడంటే చదవడం, వ్రాయడం, వచ్చినవాడు. ముఖ్యంగా కవిత్వం అంటే అభిరుచికలవాడు. కృషిచేసి తన విజ్ఞానం, స్థాయి పెంచుకోవాలనుకునేవాడు.

6. కవిత్వ రచనలో పరిణతి కలవారు తమ రచనా రీతి ఏ "ఫారమ్"లో ఉన్నా పాఠకుల్ని ఆకట్టుకో గలుగుతారు. వచన కవితలో శ్రీ శ్రీ మొదలు తిలక్ వరకు ఇటీవల శేషేంద్ర మొదలైనవారు చెయ్యి తిరిగిన విన్యాణం ప్రదర్శించి మెప్పు పొందారు. వాళ్ల రచనలలోనూ, ఉదాత్త రచన లేకపోవచ్చు. ఉండవచ్చు. వాటిని పరి

శీలించిన తర్వాత ఇటీవల వచ్చే, వెలువడే రచనలు నాసి తగ్గి ఉన్నాయన్న, ఉంటున్నాయన్న భావాన్ని సూచించడమే నా వాక్యాలలో భావం. పాత 'భారతు'ల సంపాదకీయాలు పరికిస్తే, రచనల గురించి వారి అభిప్రాయం ఏమిటో తెలుస్తుంది. ఇక్కడ ''దమ్మ'' ప్రసక్తి అనవసరం. వచన కవుల రచనల్ని గురించి ''ప్రజామిత్ర'', ఆంధ్రప్రభవంటి పత్రికలలో ఎప్పుడో వ్యాసాలు ప్రకటించాను. తమకున్న లక్షణాలే ఎదుటివారి కుంటాయనుకోవడం పొరపాటు—విజ్ఞత కాదు.

7. నా ''నిజాయతీ'' గురించి మీరు వేలెత్తి చూపక్కర్లేదు. రచనల మూలంగా పరిచయమున్న ''భారతి'' సంపాదకులకి, 'భారతి' పాఠకులకి, సాహితీమిత్రులకి తెలుసు. ఇంక మీ ''నిజాయతీ'' గురించి నా కనవసరం. అది అందరికీ తెలుస్తుంది.

8. ఎవరి బురద వారికి అత్తరువు. తాము భ్రమపడుతూ ఎదుటివారు కూడా భ్రమ పడుతున్నారనుకోవడం ''పచ్చ కామెర్ల రోగి'' తంతవుతుంది. తిల్లోజు వారి తరఫున నేను వకాల్తా పుచ్చుకోలేదు. కేవలం 'భారతి' పాఠకుడుగా నా అభిప్రాయం సూచించాను. నచ్చడం, నచ్చకపోవడం, గ్రహించే వారి మనస్తత్త్వాన్ని బట్టి ఉంటుంది. ''లోకోభిన్న రుచిః'' అని కదా!

9. 'భారతి' ''కలగూర గంప'' స్థలం చాలా విలువైంది కాబట్టి జాగ్రత్తగా వ్రాయండి అని సూచించడం.

10. ''కెపాసిటీ, మనుషుల్నిబట్టి ఉంటుంది'' అన్నది అక్షరాలా నిజం. సాహితీ మిత్రులకి లేఖల్ని వ్రాయుడని అర్థిస్తూ (లేఖల్ని) అని సూచించడం తప్పు. నేను వ్రాసినది ఒకే లేఖ.

దాడి చెయ్యడం, పొడవడం వంటి పదాలు వాడడానికి తగిన స్థలం ఇది కాదు. ఆ ధోరణి నాకు లేదు. నా లేఖలో (ఇదివరకు జూన్‌లో, ఇప్పుడు వ్రాస్తున్న ఈ లేఖలో) మన భావాన్ని ఎలా సూచించాలన్న విషయమే ప్రధానమన్న దాన్ని శ్రీ రాజేశ్వర్ గ్రహిస్తారని ఆశిస్తున్నాను. ఇంతటితో దీనికి స్వస్తి.

శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు
నూజివీడు

మినీ కవిత

సెప్టెంబరు 80 'భారతి'లో జింబోగారు డా॥ మురళీధర్ గారి మినీకవితపై రాసేరు.

మురళీధర్‌గారు మినీకవితను ''ఛలోక్తుల పైపులోను, అనుప్రాస, చమత్కారం, ఒక వ్యంగ్యోక్తి'' వగైరా సందర్శించేరు.

జింబోగారు — సైజబట్టి కాదని, చివరి మలుపు, క్లుప్తత, సెటైర్ ప్రాణం వంటిదని — రాసేరు.

వ్యంగ్య చిత్రీకరణ (సెటైర్) మినీ కవితకి ప్రాణం వంటిది అంటూనే

[1] సమాజానందస్వామి (దేవిప్రియ)
[2] టుమ్రీలు (నిష్కల వెంకటరావు)
[3] చిత్రోక్తులు (శ్రీ రమణ)

లను మినీకవితలు కావంటున్నారు! పై మూడిటి ''ధ్యేయం ప్రయోజనం వేరు'' అన్నారు కాని ఆ వేరు ఏమిటో చెప్పలేదు.

నా దృష్టిలో మినీకవితకి ప్రాణంపోసి నిలబెట్టే వాటిలో పై మూడు వున్నాయి. అసలే మినీ కవిత అందులో వేరులు పాకుతే పీఠాధిపతులు మినీ కవితలని మింగి వేసే ప్రమాదమున్నది.

శ్రీ రావి ఎన్. అవధాని
శ్రీరామ్‌నగర్.

నా సమాధానం

1980 జూన్ 'భారతి' (కలగూరగంప)లో ప్రచురింపబడిన నా లేఖకు చంద్రగారు, గడిహోళం అంజయ్యగారు (సెప్టెంబరు — భారతి—కలగూరగంప) వ్రాసిన విమర్శలకు నా జవాబు.

'ఒక ఫాక్ట్‌ని ఎవరికి తోచిన విధంగా వారివారి కోణాల్లో దర్శించి రాసుకోవచ్చు' నన్నది ఎల్లరు నంగీకరించు చున్న విషయమే. అభివ్యక్తిలో అధిక సామ్యముండుట వలనను, ఆ భావమే 'పునర్జన్మ' అను నామకరణమునకు ప్రేరణ కల్గించుట వలనను నేనిట్లు వ్రాయ వలసి వచ్చినది. చంద్రగారికి నే చెప్పదలచిన విషయమింతే.

''ఒక రాలిన గింజను మట్టిలో పూడ్చిపెడితే దానికి అంత్యక్రియలు చేసినట్టు కాదు. దాని ప్రాణం భూమిని చీల్చుకుని బయటకు వస్తుంది. కొమ్మలు రెమ్మలు ధరించి పూస్తుంది. కాస్తుంది. రంగుల తుఫానులు వీస్తుంది.

రాలే ఆకు భూమిలో ఐక్యం అవుతుంది. మృతజీవుల శరీరాల ఎరువులో నుంచే నవజీవం రెండాకులు తొడుక్కొని బయటకువచ్చి బ్రతుకు పండుగలో పాల్గొంటుంది''—అన్నవి శేషేంద్రగారి వాక్యాలు.

''నేను మట్టిక్రింద పాతిపెట్టబడి మొలుస్తున్న చేతుల కాళ్ళ వాడ్ని'' అన్నవి శివారెడ్డిగారి వాక్యాలు. ఇద్దరి భావము ఒకటే ఆయినప్పటికిని దానిని ఉపయోగించుకొనిన సందర్భము వేరు. మలచుకొన్న తీరు వేరు. కాన ఒకరికి మరొకరిది అనుసరణమనుట సమంజసము కాదని నా యుద్దేశ్యము. గుడిహోళం అంజయ్యగార్కి నా సమాధాన మిది.

'ఈ మధ్యనే సాహిత్యం చదవడం మొదలు పెట్టిన వారులా గుంది' అని నా విషయమై చంద్రగారి సందేహం. 'గుంటూరు శేషేంద్రశర్మగారిని 'గుంటూరి శేషేంద్ర శర్మ'గా వ్యవహరించుటను బట్టి నా జ్ఞానము శంకింపదగినది కాదా ?

'సగము దెలిసి మాట్లాడుట సముచితము గాద'ని అంజయ్యగారి విమర్శ. అసలు ఏమీ తెలియదనలేదు. అందుకు సంతోషము.

ఈ సాహిత్య విషయక లేఖలలో వ్యక్తిగత విమర్శలకు అధిక ప్రాధాన్యము నిచ్చుచుండుట కొందఱకు పరిపాటియైనది. ఇది శోచనీయము.

పెన్నా శి రా కృ
హైదరాబాదు

గ్రంథ విమర్శలు

దాశరథీశ లింగస్తోత్ర సుధా

[ప్రణేత—శ్రీ ముత్యంపేట సాంబారాధ్యశాస్త్రి. సిద్దిపేట—502103. డెమ్మీ 28 పుటలు. (పీఠికాభిప్రాయాదులు కాక) వెల 2 రూ.]

మల్లికార్జున పండితారాధ్యుల వంశానికి చెందిన రచయిత సంస్కృతాంధ్రాలలో విద్వాంసులు. బాగా కవిత్వం చెప్పగలవారు. గొప్ప శివభక్తులు. ఈయన రచించిన ముద్రితా ముద్రిత గ్రంథము లనుబట్టి వీరికి దైవభక్తి ఎక్కువ అని తెలియగలదు.

ఈ చిన్న పుస్తకంలో దాశరథీశ లింగస్తోత్రంతోపాటు సంక్షిప్త శివపూజా శ్లోకాలు, శివభజన, సర్వపాప నిర్వాపక ద్వాదశ జ్యోతిర్లింగ స్తుతి, బెజవాడ కనకదుర్గాదేవీ శ్లోకరత్నమాల, నవగ్రహశ్లోక మణిమాల ఉన్నవి. ఈ పుస్తకంలోని స్తోత్రాలలో కనకదుర్గాదేవి స్తోత్ర శ్లోకాలు, వాని తాత్పర్యం ఎక్కువ పుటలను ఆక్రమించాయి. తక్కిన వాటికి తాత్పర్యం ఇవ్వబడలేదు.

ద్వాదశజ్యోతిర్లింగాల స్తోత్రం నడుమ భారతదేశంలో ద్వాదశ లింగాలు ఏవేవో, ఎక్కడెక్కడ ఉన్నాయో పటం వేసి చూపబడినవి. దాశరథీలింగస్తోత్రం దోధక వృత్తాల్లో నడిచింది. ప్రతివృత్తంలోనూ ఉత్తర భాగం

"నిర్మలనిశ్చల నిస్తుల భక్త్యా
స్వామి సదాహృది మామకలింగం"

అని ఉన్నది. పూర్వభాగం మాత్రం మారుతూ ఉంటుంది.

శివభజన "రఘుపతిరాఘవ రాజారాం, పతిత పావన సీతారాం" అనే వరుసలో నడిచింది.

చివరి 7 పేజీలలో గ్రంథముద్రణకు ధనసహాయం చేసినవారి పేర్లు, గ్రంథకర్తగారి ముద్రితా ముద్రితగ్రంథముల పట్టిక వారి "భక్తి పీయూష" గ్రంథంలోని ఒక సీసపద్యం (మచ్చునకేమో) ఇయ్యబడినవి.

శైలి సాధారణం. శ్లోకాలు సులభమైన పదాలతో నడిచాయి.

మచ్చునకు ఉదాహరణలు—

(1) దాశరథీశలింగ స్తోత్రంనుంచి—

శ్లో. జన్మజరా మృతి హారక లింగం
మన్మథగర్వ విదారక లింగం,
నిర్మల నిశ్చల నిస్తుల భక్త్యా
స్వామి సదా హృది మామకలింగమ్.

(2) ద్వాదశ జ్యోతిర్లింగ స్తుతినుండి—

శ్లో. మహాకాళం దయావాలం
కాల కాలం మహాబలమ్,
ప్రాప్తావంతీ స్థలం నౌమి
మమ మృత్యు వినష్టయే.

(3) కనకదుర్గాదేవీ శ్లోక రత్నమాలనుండి—

శ్లో. భర్గప్రియా కనకదుర్గా జగత్త్రయ
సర్గాదికర్మ సుషమా
దౌర్గత్య సంహృతి నిసర్గాచ నిష్కలుష
మార్గావనీ భగవతీ,
భర్గ ప్రదా సదప వర్గప్రదా! త్రిదశ
మార్గాతిశాయి బెజవా
దుర్గస్థితా! దురిత దుర్గాణి మే హరతు
గర్గాది సంయమి నుతా!

తా. "జగములన్నింటిని బుట్టించుట మున్నగు పనుల నైదింటిని చేయునదియు, సాటిలేనిదియు, దుర్గతుల నశింపజేయు స్వభావము కలదియు, నుతించువారిని పోషించునదియు, షడ్గుణైశ్వర్యములు కలదియు, తేజస్సును, మోక్షము నొసంగునదియు, స్వర్గమును మీరు బెజవాడ కోటయందున్నదియు, గర్గాది మునుల నుతుల గొన్నదియునై యొప్పిన కనకదుర్గాదేవి, నా దురితములను కోటలను పెకల్చివేయును గాక!"

పయి శ్లోకములను బట్టియు, తాత్పర్యమునుబట్టియు రచన ఎలా సాగినదో స్పష్టమవుతూ ఉన్నది.

ముద్రణ బాగులేదు. అచ్చు తప్పులు బాగా కానవస్తున్నవి.

"ఆంగీరస"

బైబిలు బండారం

[రచయిత—ఎన్. వి. బ్రహ్మం. వెల: ఆరురూపాయలు. ప్రచురణ: మనీషా విద్యావిహార్, చీరాల—523155.]

ఒక దశలో మానవుని విశ్వాసాలు ఒకవిధంగా ఉంటాయి. పరిసరాలను మానవుడు అర్థం చేసుకున్న కొలదీ విశ్వాసాలు మారవచ్చు. ప్రకృతినుంచి గ్రహించిన గుణపాఠాల ప్రభావంవల్ల విశ్వాసాలు మారకపోగా మరింత ధృవపడే అవకాశం కూడా వుంటుందని హేతువాదులలో చాలా మంది అంగీకరించకపోవచ్చు. కానీ వాస్తవంలో మాత్రం విశ్వాసాలు మారవనీ, దేశ కాల పరిస్థితులనుబట్టి మారే

అభిప్రాయాలను విశ్వాసాలని నిర్వచించరాదనీ ఒక భౌతిక శాస్త్రవేత్త అభిప్రాయం. ఎవరి అభిప్రాయాలు ఎలావున్నా మానవ పరిణామానికి కొన్ని విశ్వాసాలు మూలం అవుతున్నాయి. తప్పుడు నమ్మకాలను అనుభవంలో మానవుడు విస్మరిస్తూనే వున్నాడు. ఇలాంటి విశ్వాసాలనూ, నైతిక విలువలనూ అనుభవం ప్రాతిపదికన అనుశీలించడం హేతువాది లక్షణం అవుతుందా కాదా ?

హేతువాదం పేరుతో యీనాడు మానవ విలువలను విస్మరించి ప్రతిరచననూ విమర్శిస్తున్న కారణాన కాలపరిణామగతినీ, గతి తార్కిక దృష్టినీ విస్మరించి మేము అనుసరించుచున్నదే హేతువాద వైఖరి అని ప్రతి రచయిత వాదిస్తున్న కారణంచేత యీ గ్రంథ విమర్శకు ఇంత ప్రాతిపదికను రూపొందించడం అవసరమయినది. అట్లా అని బైబిలులో వున్న ప్రతి అక్షరాన్నీ యీ రచయిత సమర్థించుతున్నట్లు భావించరాదు. మానవ పరిణామం పూర్తి అయినదా? సైన్సు అలా చెపుతున్నదా? మానవరిలో అసంపూర్ణత వుంటే మానవులు చేసే పనులలో అసంబద్ధాలూ, అవివేకంవంటి లోపాలుండడం అసహజమా? అది అలావుండగా ఒక విషయం అసంబద్ధం, అసంగతం, అవివేకమయినదని నిర్ణయించేముందు ఒక ప్రాతిపదికను రాగ ద్వేషాల కతీతంగా నిర్ధరించుకోవాలి. అలాంటి ప్రాతిపదికగా యీనాడు తెలుగుదేశంలో చలామణి అవుతున్న 'హేతువాదం' ఎంతవరకూ ఉపయోగపడుతుంది ?

మతగ్రంథాలలోకూడా శాస్త్రీయదృష్టి, కార్యకరణ సంబంధం వుంటుందని చాలామంది అంగీకరిస్తారు. అలా కాదు. 'సైన్సు' పరీక్షలకు నిలబడనిది హేతువాదం కాజాలదని మరే ఉపపత్తులూ చూపించకుండా వాదించితే అదిమాత్రం ఒకమతం కాకుండాపోతుందా?

'అవిశ్వాసి' అయిన యీ రచయిత విశ్వాసాలమయం అయిన బైబిలును సమదృష్టితో విమర్శించడం సాధ్యం అని ఎలా అనగలం? హేతువాదిని అని యీ రచయిత అంటున్నారు. కాబట్టి ఆయన మతవాద వ్యతిరేకికావడం అర్థమయ్యేసంగతే. అయితే మత గ్రంథాలలోని హేతువాదానికీ యీ రచయిత చెబుతున్న హేతువాదానికీ తేడాయేమిటో వివరించివుంటే "వ్యతిరేకత", "ద్వేషం" అని యీ రచయిత వాడిన మాటలు సులభంగా అర్థమయి వుండేవి. రాగద్వేషాలకు అతీతంగా యీ రచయిత యీ పుస్తకాన్ని వ్రాయగలిగారా ?

ప్రతి వ్యక్తికీ మతస్వేచ్ఛ వుండాలనికోరే యీ రచయిత 'బైబిల్'లోని లొసుగులను ఉదహరించడంద్వారా మానవ సమాజానికి చేస్తున్న మేలు ఏమిటి? మానవాభివృద్ధికి ఆయన యేవిధంగా దోహద పడగలిగారు? యుక్తివాదంతో కాకుండా తర్కబద్ధంగా యీ పుస్తకం వ్రాసివుంటే ఇంకా బాగుండేది. ఈ పుస్తకంలో అవతారిక, అసంబద్ధాలు అనే ప్రధాన భాగాలున్నాయి. అవతారిక అనే భాగంలో యీ రచయిత చాలా విషయాలు చర్చించారు. క్రయిస్తవులందరకూ ఆ విషయాలు తెలుసు. యోహానా కథ, బహుదేవతావాదం వంటివన్నీ క్రయిస్తవులందరకూ తెలిసినవే. అయినా మనశ్శాంతి, పూరట కోసం బైబిలును క్రయిస్తవులే కాదు చాలామంది చదువుతారు. బహుదేవతావాదం మానవాళికి మేలుచేసిందా ? కీడు చేసిందా? యుద్ధాలూ, రక్తపాతం బహుదేవతావాదంవల్లనే సంభవించినవా? మరే కారణాలూ లేవా? శాస్త్రీయదృష్టి తన ప్రాతిపది అని వాదించే యీ రచయిత 'బహుత్వం'వల్ల మానవాళికి ప్రయోజనం కలిగిందని అంగీకరించలేదా? ఎవరి అంతస్తుకు తగినట్లు వారు దైవాన్ని మానవుడు ఆరాధించడం మానవ పరిణామానికి దోహదపరచలేదా?

మంచి చెడ్డలను పరస్పరం సాపేక్షాలుగా కాక ద్వంద్వాలుగా మతం పరిగణిస్తుంది అని యీ రచయిత అన్నారు. తత్వశాస్త్రం ప్రకారం సాపేక్షాలూ, ద్వంద్వాలు అనే మాటలకు అర్థం యేమిటి? ఇలాంటి కారణాలవల్ల యీ పుస్తకమంతా యుక్తివాదంగానే కానీ హేతువాదయుతంగా కనిపించదు విజ్ఞులకు. తప్పో ఒప్పో మానవులందరకూ కొన్ని విశ్వాసాలుంటాయి. వాటివల్ల మానవాళిలో ఎక్కువమందికి ప్రయోజనం చేకూరకపోతే అవి అంతరించిపోతాయి. విశ్వాసాలవల్ల మానవాళికి మేలు జరిగిందా, కీడు జరిగిందా అనే దృష్టితో యీ పుస్తకాన్ని చదివితే ఏమవుతుంది?

శ్రీ వి. ఎస్. అవధాని

ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్ వారి అయిదు పుస్తకాలు

మానవ నాగరికత

[మూలం : యం. యన్. రాయ్. అనువాదం : బి. యస్. యల్. హనుమంతరావు. డెమ్మీసైజు—116 పుటలు. వెల : 8 రూపాయలు.]

యం. యన్. రాయ్ రచించిన ఫ్రమ్ శావేజరీ టు సివిలిజేషన్ అనే వ్యాస సంపుటానికి ఇది బి. యస్. యల్. హనుమంతరావుగారి అనువాదం. యం. యన్. రాయ్ జగత్ ప్రసిద్ధులు. ఈ తరం తెలుగు చారిత్రికులలో శ్రీ బి. యస్. యల్. గారు ప్రసిద్ధులు. అనేక చారిత్రిక గ్రంథాలద్వారా ఆయన సుపరిచితులు. ఉత్తమ చారిత్రోపన్యాసకులుగా విద్యార్థులకు తెలుసు. శ్రీ బి. యస్. యల్. అనువాదం సరళసుందరంగా సాగింది. అనువాదం అనే ఆలోచన ఎక్కడా రాదు. అనువాద విధానం ఆదర్శప్రాయంగా ఉంది.

ఎటొచ్చీ మూలమే బాగాలేదు. రచనలో ఒక వరసా వావీ లేదు కలగా పులగంగా ఉంది.

"ఈ వ్యాస సంపుటం వ్రాయడం ఒక విచిత్ర సంఘటన. ఇది యుద్ధ కాలంలో తయారైంది. అయినంతమాత్రాన అంతచవక బారుదిమాత్రం కాదని చెప్పడానికి సాహసిస్తాను"—అని ముందు

మాటలో ఉంది. ఇది చవకబారుది కాదేమోకాని, ఉత్తమ గ్రంథం మాత్రం కాదని పుస్తకం చదివిన తరువాత అనిపిస్తుంది. పత్రికా రచనతో భుక్తి గడుపుకోవడానికి రాయ్‌గారు ప్రయత్నిస్తున్నరోజుల్లో యుద్ధంవచ్చి పన్నుయుండే ప్రమాదం వచ్చింది. సంపాదకుల కోరిక మేరకు రాజకీయేతరమైన రచనలేమైనా వేద్దామని ప్రయత్నించి, పాశ్చాత్య ప్రపంచం సాధించిన ఆధ్యాత్మిక విజయాలు మనవాళ్ళు తెలుసుకోవాలనే ఉద్దేశంతో, ఐరోపా చరిత్రను దృష్టిలో పెట్టుకొని రాయ్‌గారు ఈ వ్యాస సంపుటిని రచించినట్లు తెలుస్తోంది.

విజ్ఞాన శాస్త్రవేత్తలు మానవాభ్యుదయంకోసం శ్రమించి అనేక నూతన విషయాలు కనిపెట్టడం, క్రయిస్తవ మతాలు, మతాధికారులూ, శాస్త్రవేత్తలను హింసించడం చివరకు విజ్ఞాన శాస్త్రవేత్తలే విజయం సాధించడం ఈ పుస్తకంలో రచయిత చెప్పదలిచిన ముఖ్యవిషయంగా గోచరిస్తుంది. శాస్త్రంముందు మతం ఓడిపోయిందని సారాంశం. అయితే ఇంకా పూర్తిగా ప్రపంచం నాగరికదశలో ప్రవేశించలేదనే సాహసోపేతమైన సూచనను రచయిత చేయడం గమనార్హం. పూర్తి నాగరికత అంటే మతం అనేది భూమిమీదనుండి పూర్తిగా తుడిచిపెట్టుకొనిపోవడం అని రచయిత ఉద్దేశంగా భావించవచ్చు. కొన్ని వాక్యాలు వివాదాస్పదంగా ఉన్నాయి.

''నిరాడంబరత్వం నాగరికత అనిపించుకోదు.'' (17వ పుట) నాగరికతను నిర్వచించడం కష్టం. కేవలం 'నగర సంబంధమైనదే నాగరికత' కాదు—ఈనాడు. అర్థం విశాలమైంది. నాగరికత దుస్తులకే పరిమితంకాదు. ఆ దుస్తుల వెనుకఉన్న భావశక్తికీ, సభ్యుల హృదయానికీకూడా వర్తిస్తుంది. ఖరీదైన బట్టలు ధరించి, ఆధునిక యంత్రసామగ్రి నుపయోగించి మారణహోమం చేసేవారు నాగరకులా? అనాగరకులా? అని అనుమానమొస్తుంది. అనారోగ్యకరమైన ప్రదేశాల్లో జీపన్నూ, కేడీలూ, రౌడీలూ తాగుబోతులమధ్య భయంభయంగా బ్రతుకుతూ, మన వాతావరణానికి సరిపడని దుస్తులు ధరిస్తూ, వాతావరణ కాలుష్యాంధకారంలో కొట్టుమిట్టాడుతూ ఇదే నాగరికత అనే భ్రాంతిలో బ్రతుకుతున్న మనం 'నిరాడంబరత్వం నాగరికత అనిపించుకోదు' అనుకోవడం సహజం కాబట్టి రాయ్‌గారు ఇలా రాయడం గూడా సహజమేనేమో!

ఇలాగే ''సోమరిపోతు విలాస సమాజంపై తిరుగుబాటుకు బుద్ధుడు నాయకత్వం వహించాడు'' అంటారు రాయ్. (16వపుట) తిరుగుబాటుకు నాయకత్వం వహించిన బుద్ధుడు కష్టజీవా? అని సామాన్యులకు సందేహంవస్తుంది. పైపెచ్చు పెద్ద సోమరిగదా! ఆయన శిష్యులు గురువును మించినవారు. సన్యాసుల్నీ, ధ్యానంతో కాలక్షేపం చేసేవారినీ రాయ్‌గారు మొనగాళ్ళుగా భావించడం ఆశ్చర్యకరం.

నాస్తికత్వం-నాస్తితత్వం

[రచన : రావిపూడి వెంకటాద్రి. డెమ్మీసైజు 160 పుటలు వెల : 12 రూపాయలు].

దైవాన్నీ మతాన్నీ మూఢ నమ్మకాలను నిరోధించడానికి, నిజమైన నాస్తికత్వమంటే ఏమిటో స్పష్టంచేయడంకోసం ప్రముఖ హేతువాది శ్రీ రావిపూడి వెంకటాద్రిగారు ఈ పుస్తకం వ్రాశారు. తెలుగు నాస్తికుల్లో ప్రసిద్ధుడు అనుకునే గోరా. గోరా నిజమైన నాస్తికుడు కాదనీ, ఆయన ఆలోచన అసమగ్రమూ, అతార్కికమూ, అశాస్త్రీయమూ అని నిరూపించడమే ఈ నాస్తికత్వం—నాస్తితత్వం అనే ఈ పుస్తక ప్రధాన ధ్యేయం. గోరా నాస్తికుడు కాదంటే చాలా మందికి ''కోపమూ, ఆశ్చర్యమూ కలుగుతాయి'' నిజమే! వెంకటాద్రిగారు, గోరాగారు నిసలైన నాస్తికుడు కాదని ఈ పుస్తకంలో సహేతుకంగా నిరూపించారు. శిలాయుగ సంస్కృతిని గోరా ప్రచారం చేశారని ఈ రచయిత నమ్మకం. వారిది ప్రాకృత మాయావాద నాస్తిక్యం అని స్పష్టీకరించారు. ఈ పుస్తకాన్నిబట్టి గోరా ఉద్దేశాలు ఇవిగా తెలుస్తాయి.

గోరా శిలాయుగ సంస్కృతినే మానవవాదంగా ప్రచురపర్చారు. మాయావాద శంకరుడూ, భావవాద బెర్కిలీ చేసినవాదాన్నే నాస్తిక గోరాగారు చేశారు. మనిషిని విశ్వంలో భాగం కాకుండా చేశారు. ఆయన ఉద్దేశం సందేంద్రియాలకు అందనవన్నీ అసత్యాలే. సిద్ధాంతాలు నాస్తి. సంశ పొరంపర్యాన్ని అంగీకరించరు. ఆయనది అది మధ్యాంతరహితమైన నాస్తికత్వం. భౌతికవాదం తెలియదు. కార్యకారణ సమ్బంధ తత్వమూ తెలియదు. ఆయన కుటుంబీకులు రాజ్యాంగ నిపుణులను బలపరిచారు. గోరా పూలమొక్కలను పీకడం క్రమశిక్షణ రహితమైన ఆలోచనల ఫలితం. హేతువాదం అనైతికతకు దారితీస్తుందని ఆయన వాదం సంకుచిత మనస్తత్వం. ప్రజలను భయపెట్టి నీతిని కాపాడవచ్చునని ఆయన నమ్మకం. నాస్తికత్వం గోరాకు ఒక వ్యాపకమేగాని శాస్త్రీయ అవగాహన ఫలితంకాదు. గోరాకు విజ్ఞానమంటే గిట్టదు. భౌతిక మానవవాదం, నాస్తికత అభివృద్ధే నాగరికత అట. కమ్యూనిజంమీదా మార్క్సిజంమీదా గోరా అన్యాయమైన నిందార్పణచేశారు. నాస్తికునికి గతంలో సమ్మతం లేదు. గోరా ఫాసిస్టు పోకడలుగల వ్యక్తి. బంగ్లా ప్రభుత్వ నియంతృత్వాన్ని సమర్థించారు. గోరాది పోలీసు నీతి. వివ్వలపడి లైంగిక సంబంధాలు కావాలంటారు.

వెంకటాద్రిగారు గోరాగారి భావాలన్నిటిని సాధ్యమైనంత వరకు ఖండించారు. సహేతుకంగా అవి తప్పులని నిరూపించ ప్రయత్నించారు. ఈ వాదోపవాదాలు పఠితలకు ఆసక్తి గొల్పుతాయి. అనుమానాలు రేకెత్తిస్తాయి. నాస్తికుల్లోనూ ఎంతటి తీవ్రభేదాభిప్రాయాలున్నాయో ఈ గ్రంథం తేటతెల్లం చేస్తుంది.

హేతువాదమంటే ?

[రచన : ఎం. వి. రామమూర్తి. డెమ్మీసైజు 68 పుటలు. వెల : 4రూపాయలు.]

ఎం. వి. రామమూర్తిగారు హేతువాదమంటే ఏమిటో ఈ చిన్ని పుస్తకంలో నలభై ఒక్క శీర్షికల్లో తెలియజెప్పారు. ఎక్కువ భాగం శీర్షికలు ''హేతువాదికి తాత్విక ప్రాతిపదిక ఉన్నదా ?'' మొద

లైన ప్రశ్నలరూపంలో వున్నాయి. ఆ ప్రశ్నలకు చక్కని సమాధానాలూ ఉన్నాయి. యం. యన్. రాయ్ భావాలను ఆసరాగా తీసుకొని, ఆవేశాలకు ఉద్రేకాలకు లోనుగాని పద్ధతిలో ఈ రచన సాగించారు. ఇది సమగ్రం కాదని ముందుగా చెప్పుకున్నారు.

పుస్తకంలో ఉన్న కొన్ని విషయాలు రచయిత స్థాయికి తగిన విధంగా లేవు. సమగ్రంగా ఆలోచించకుండా నిర్ణయాలకు వచ్చినట్లు అనిపిస్తోంది. ఉదాహరణకు తద్దినాల సంగతి (42వపుట) తద్దినం అనేది బ్రాహ్మణులు పన్నిన పన్నాగం అనీ, సమాజాన్ని మోసం చేసి దోచుకుతినే ఉద్దేశ్యంతో బ్రాహ్మణులు చేసిన కుట్రే తద్దినం అనీ కొందరు పొరబడుతుంటారు. హేతువాదులు కూడా ఈ విషయంలో తమ మేధాశక్తిని విలక్షణ్యకు తగిలించి వచ్చి వాళ్ళకు వంత పాడటం ఎంతగా ఉంది. తద్దినాలు పెట్టుకోవడం, ఆ సమయంలో బ్రాహ్మణుల్ని పిలిచి వాళ్ళను మేపడం వంటివి చాలా తక్కువ కులాల్లో మాత్రమే ఆచారంగా ఉంది. ఉదాహరణకు ఈ సమీక్షకుడి (బ్రాహ్మణేతర) కుటుంబంలో తద్దినాలు పెట్టే అలవాటు లేదు. ఒకవేళ కొన్ని కుటుంబాల వాళ్ళు తద్దినాలు జరిపినా బ్రాహ్మణులను మాత్రం పిలవరు. చచ్చిపోయిన వాళ్ళ పేర బట్టలు పెడతారు. ఆ బట్టలు బతికి ఉన్నవాళ్ళు కట్టుకుంటారు. నష్టం లేదు. పెద్దల పేరుతో చక్కగా భోజనాలు చేస్తారు. పంచముల సంగతి సరేసరి. తద్దినాలకు బ్రాహ్మణుల్ని పిలిచి, వాళ్ళను సంతోష పెట్టేవాళ్ళు బ్రాహ్మణులే! వాళ్ళ కులాన్ని వాళ్ళే దోచుకోవాలని కుట్రపన్నారా బ్రాహ్మణులు. ఇది హేతువాదానికి నిలుస్తుందా? కోర్టుల్లో లాయర్లు, బళ్ళల్లో పంతుళ్ళూ మాటలు చెప్పి డబ్బు సంపాదించడం లేదా? అట్లాగే ఈ బ్రాహ్మలూ తమ సమయాన్ని మంత్రాలు చదవడానికి వినియోగించి పొట్ట పోసుకుంటున్నారు. తప్పు లేదు. అసలు ఈ ఆచారమే అనవసరం అంటే అది వేరే సంగతి. ఇది "బ్రాహ్మణులు పన్నిన పన్నాగం, మంత్రాంగం మాత్రం" కాదు. కొన్ని కులాల వాళ్ళు తమ సంతృప్తి కోసం ఏర్పరచుకున్న సంప్రదాయం.

"కులాలు మతాలు దేవుళ్ళను స్ఫురింపజేసే పేర్లను హేతువాదులు విడనాడటం మంచిది" అని సలహా యిచ్చిన రచయిత తన పేరును విడనాడలేదు. ఈ చిన్ని పొత్తమును వ్రాయించిన శ్రీమతి మల్లాది వెంకట సుబ్బమ్మ, వ్రాత ప్రతిని చదివి అమూల్యమైన సలహా లిచ్చిన సర్వశ్రీ రావిపూడి వెంకటాద్రి, కొల్లా సుబ్బారావులు కూడా తమ పేరులను విడనాడలేదు. ఇతరులకు చెప్పడానికేనా నీతులు ?

చివరలో ఇచ్చిన 'హేతువాదులకు ఒక కార్యక్రమం' హేతువాదులకు పనికి వస్తుంది. అయితే కొన్ని సవరణలు. రేడియో, టెలివిజనులలో మత వాసనను తొలగించి, హేతువాద దృష్టిగల ప్రాసంగికులను ఆ స్థానంలో పెట్టే బదులు హేతువాదుల'క్కూడా' సమాన స్థానం ఇవ్వడం బాగుంటుంది. బాగోగులు ప్రజలే నిర్ణయించుకుంటారు. ఏ మతమూ మానవజాతిని నాశనం చేయాలని పుట్టలేదు. ఆయా సమయాలకూ ప్రదేశాలకూ అనుగుణంగా ఆయా మతాలు పుట్టాయి. కాలం గడిచే కొద్దీ మూఢ విశ్వాసాలు జొరబడ్డాయి. ఒక్కసారిగా మతాలను ధ్వంసం చేసే బదులు వాటిని సంస్కరించడం మంచిది. మతాల్లో నేటికీ నిలిచిన మంచితనాన్ని గుర్తించడం మంచిది. ఈనాటి అవసరం హేతువాదమే, నాస్తికత్వమే అయితే — సహజంగా అదే అభివృద్ధి చెందుతుంది. భూమ్మీద ఏది ఉత్తమమో అదే నిలుస్తుందనిగా విజ్ఞానశాస్త్రం ఘోషిస్తోంది. ప్రకృతిలో సహజంగా జరగవలసిన దానిని మనం బలవంతంగా చేస్తే దుష్పరిణామాలు ఎదురుకాగలవు!

ఎమర్జన్సీలో జైలు అనుభవాలు

[రచన : ఎం. వి. రామమూర్తి. డెమ్మీ సైజు 47 పుటలు, వెల : 3 రూపాయలు.]

జైలు అనుభవాలను గురించి తెలుగులో ఎక్కువ పుస్తకాలు లేవు. ఎమర్జన్సీ కాలంలో స్మగ్లర్ల కంటే మేధావులే ఎక్కువగా

జైళ్లలో పడ్డారంటారు. అందులో ఎం. వి. రామమూర్తిగారొకరు. సత్యదృష్టితో తన జైలు అనుభవాలను యథాతథంగా చిత్రీకరించారు. జైలు జీవితాన్ని ఇంత నిష్పక్షపాత బుద్ధిలో చిత్రీకరించిన పుస్తకాలు బహుస్వల్పం. "సి క్లాసు ఖైదీకి ఉన్న ఇబ్బందులు, అటనికి కల్గే కష్టాలు డెటెన్యూలకు ఉండవు. కనుక డెటెన్యూగా నా అనుభవాన్ని వ్రాసేటప్పుడు అంత కష్టమయంగా చిత్రించడం సహేతుకం గాదేమోనని భావన చేశాను" అని 'మనలో మాట'లో రచయిత చెప్పారు.

ఇందులో ఆసక్తిదాయకమైన అనేక విషయాలను పొందుపరిచారు. సాంబారులో ఉల్లిపాయలు వేయించి వేయలేదని ఒక జైల్లో తగాదా వచ్చిందట! జైలుకు పోయినా మనవారు కలిసి ఉండలేక పోవటం మొదలైన విషయాలు గూడా పర్శించబడినవి. దాంపత్య జీవితం గడపడానికి డిటెన్యూలను అనుమతి నివ్వాలని రిట్ పిటిషన్ దాఖలు చేయడం వంటివి కూడా చదవడానికి సరదాగా ఉంటాయి.

తల్లే పిల్లను చంపితే

[రచన: మల్లాది వెంకట సుబ్బమ్మ. డెమ్మీ సైజు 64 పుటలు, వెల: రూ. 3–50 పై. ప్రైవతులకు: ప్రజాస్వామ్య ప్రచురణలు (ప్రై) లిమిటెడ్, 9, ఎం. ఐ. జి. హెచ్. కాలనీ, మెహదీపట్నం, హైదరాబాదు–500028. సోల్‌డిస్ట్రిబ్యూటర్సు: సరళా పబ్లికేషన్స్, తెనాలి.]

ప్రముఖ మహిళోద్యమ కార్యకర్త మల్లాది వెంకట సుబ్బమ్మ గారు ఈ గ్రంథకర్త. ఆమె వివిధ పత్రికల్లో వ్రాసిన వ్యాసాలు ఈ సంపుటిరూపంలో వెలువడ్డాయి. ప్రస్తుతి కర్తవ్యం, అనోహలు, ప్రజాస్వామ్యం, ముగ్గురు సోదరులలో ఒకరికే పెండ్లి, తల్లే పిల్లల్ని హత్య చేస్తేనీతికి స్థానముంటుందా, కుటుంబ సంక్షేమం—ప్రబోధం— పారితోషికం, ప్రబోధం, 'సాంఘిక సంస్కరణలు, తాత్విక విప్లవం, కులతత్వ నిర్మూలనం, హేతువాదం, శాసనాల సంకెళ్లు, ఏది అశ్లీలం? రచయిత్రుల బాధ్యత, రచనలలో ఆధునికత అడుగంటి పోతున్నదా? అనే శీర్షిక లిందులో ఉన్నాయి.

మదర్ థెరిస్సాను గూర్చి సుబ్బమ్మగారు చేసిన విమర్శ సహేతుకంగా ఉంది. థెరిస్సా గర్భస్రావాన్ని వ్యతిరేకించింది. థెరిస్సా సందేశం స్త్రీ జాతిని నిర్వీర్యం చేసి 16 వ శతాబ్దంలో పడవేస్తుందని సుబ్బమ్మగారు వ్యాఖ్యానించారు. అత్యుత్తమమైన భావాలను వెల్లడించే ఈ వ్యాసం గ్రంథానికి పేరుగా కూడా ఉండటం బాగుంది. అనుభవానికీ, తర్కానికీ నిలవని థెరిస్సా భావాలు స్త్రీల జీవితాలకు గొడ్డలి పెట్టువంటివని రచయిత్రి నొక్కి చెప్పారు.

ఆవేశం వలన రచయిత్రి 'ఏది అశ్లీలం' అనే వ్యాసం సరిగా వ్రాయలేకపోయారు. [illegible] ఎలుకలు మెడలో వేసుకొంగా! సెక్సుకు అత్యధిక ప్రాధాన్యం [illegible] చేసి ఇంకా చెప్పాలంటే ప్రాచీన శిల్పుల [illegible] గూడా [illegible] ఎంత [illegible] లేదు సెక్సుకు ప్రాధాన్య మిచ్చిన ప్రాచీన సాహిత్యాన్ని, దేవాలయాలనూ రచయిత్రి విడుతున్నారో పొగుడుతున్నారో అర్థం కావడం లేదు "ఇతర దేశాలలో హైస్కూలు దశ నుండి బాల బాలికలకు పాఠ్య భాగాలలో సెక్సు పై విధిగా బోధిస్తారు" అనడం గూడా సరికాదు. తక్కువ దేశాల్లో మాత్రమే ఈ బోధన జరుగుతోంది. ఈ విషయంలో మనకు తగ్గట్టుగా మనం ప్రవర్తించాలి. వాతలు పెట్టుకోనవసరం లేదు. మన దేశంలో స్త్రీ పురుష సంబంధాలు సెక్సు విద్య బోధించే దేశాల్లో కంటే మెరుగ్గా ఉన్నాయనడంలో సందేహం లేదు.

ప్రకృతి సహజంగా జరిగే లైంగిక ప్రక్రియను ప్రత్యేక శిక్షణ అవసరం లేదు.

ఈ పుస్తకం అట్టమీది బొమ్మ సొంపుగా లేదు. పుస్తకానికి దానిక రకపు ఆకారన్నిచ్చే బొమ్మ వేయించుకొనే బదులు మిగిలిన ప్రజాస్వామ్య ప్రచురణలవలె నిరాడంబరపు అట్టు తగిలిస్తే బావుండేది!

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.

BHARATI October 7th, 1980 Regd. No. H/VJ-70

